ఉ॥ దేవకుమారరూపు వర•దీప్య దలంకరణాభిరాము, సీ
తావిభు, నాదునందనుని, • ఛాయఁగ వచ్చెడువానిఁ జూచి లో
భావనచేసి పొంగిపడు•వాఁడ, సమక్షము చూచినంతనే
యౌవన మప్పుడే యొదవి•నట్లగు నాకు ననర్థకారిణీ. ౭౯॥

దేవకుమారరూపున్ = మన్మథునివంటి సుందరుని, వర = శ్రేష్ఠములైన ప్రకాశించు భూషణములచే నలంకరింపఁబడిన వానిని, అనర్థకారిణీ=కీడు చేయుదానా, దేవకుమారున్=(౧) నారాయణుని కుమారుఁడు (౨) దేవుఁడు=క్రీడించు స్వభావము గలవాఁడు, కుమారున్=మన్మథుని– కుమారోవాసుతేస్కందే యని నానా॥ర॥.

తాత్పర్యము

లోకులు నిన్ను ఛీ కొట్టనీ ఛా కొట్టనీ. థూ థూ యననీ నాస్థితి చెప్పెద విను– మన్మథువలె సహజ సౌందర్యముగలవాఁడు, బంగారునకు వాసన యబ్బినట్లు సౌందర్యమునకుఁ దోడు శ్రేష్ఠములైన దగద్ధగాయమానములైన యలంకారములచేఁ బ్రకాశించువాఁడు, అతిరూపవతీ సీతా యన్నట్లు అయోనిజయైన సీతకు భర్తయైనవాఁడు, నాకుసంతోషము కలిగించుకొడుకైనవాఁడు, ఇట్టివాఁడు, నాసమీపమునకు వచ్చుచుండఁగా దూరమునందే చూచినంత మాత్రముననే యిట్టివాఁడు నాకుఁ బుత్రుఁడాయెఁగదా యని సంతోషాతిశయముచేఁ బొంగిపడుచుందును. ఎదురుగావచ్చి నిలిచెనేని నాకు వార్ధకమువలన వచ్చిన దుర్బలత్వములోనైన వెచ్చటికిఁబోవునో యప్పుడే నాకు మరల యౌవన ముదయించినట్లు జవసత్త్వంబులు కలుగును. ఇట్టి నాకెంతకీడు కలిగింపఁ జూచుచున్నదానవే.

కం॥ రవి లేకయు,వర్షింపఁగఁ, బవిపాణియు లేక జగము•వర్తిల్లు, మహా
టవి కేగురాముఁ గనుఁగొని,
యువిదా! ప్రాణములతోడ•నుండునె యొకఁడున్. ౮౦॥

లేకయు=లేక ఇది వ్యతిరేక క్త్వార్థకము కళ–పవిపాణి=పర్జన్యుఁడు, లేకయు=లేకపోయినను అనుటచే రాత్రులందు సాక్షాత్సూర్యుఁడు లేకున్నను ఆయన తేజస్సు చంద్రనక్షత్రాగ్నులయందుండును.

తాత్పర్యము

సూర్యుఁడు లేకపోయినను జగము వర్తిల్లును. రాత్రులందు సూర్యుఁడు గలఁడా? అమాత్రమున లోకవ్యాపారము నిలిచెనా? వర్షము కురియించుటకు నింద్రుఁడు లేకున్నను జగము నమయదు. గొప్పకఱవులు వచ్చినను లోకము నమయలేదు. కాని యరణ్యమునకేగు శ్రీరామచంద్రునిఁజూచి మనుష్యుఁడగువాఁడు ప్రాణము ధరించియుండునా? ఉండినను జీవచ్ఛవమైయుండునుగాక.

చం॥ అకట మదీయ నాశనప - రాత్మిక సైఁపఁగ రానిశత్రువున్
ప్రకటతరాపమృత్యుగతిఁ - బాపిని నిన్నిలు సేర నిచ్చితిన్,
వికటచరిత్ర! క్రూరవిష - భీకరభూరిభుజంగి నంకభా
గకలితఁ జేసినట్లు నినుఁ - గైకొని వచ్చితి నిట్లు చచ్చితిన్. ౩౮౭

అకట=హాకష్టమ్యొక్క తద్భవము=అయ్యో, మదీయ....రాత్మికన్=నన్ను నాశము చేయుటయందాసక్తిగలదాని నిన్ను, అపమృత్యు=అకాలమృత్యు దేవత, వికటచరిత్ర=విరుద్ధపు భయంకరమగునడవడిగలదానా, క్రూర... భుజంగిన్=తీవ్రమైన విషముచే భయంకరమైన పెద్దయాఁడు పామును. అంకభాగకలితన్=తొడమీఁదఁ జేర్చిన దానిని, చచ్చితిన్=అత్యంత సమీప భవిష్యదర్థంబున భూతము. ఒక విషయము. సమీప భవిష్యత్కార్యంబున జరుగుట నిశ్చయమేని యది జరిగినట్లే చెప్పబడును. "మదర్థే త్యక్తజీవితాః" నాకొఱకై ప్రాణములు విడిచిరి అనికదా దుర్యోధనుఁడు యుద్ధారంభదినమందే చెప్పెను. భగవద్గీత ౧-౯.

తాత్పర్యము

అయ్యో! నానాశనమం దాసక్తిగల సహింపరాని శత్రువును నాయపమృత్యువువలెఁ బాపాత్మురాలగు నిన్ను నాయింటిలోఁ బ్రవేశపెట్టితిని. లోకవిరుద్ధపు నడవడిగలదానా! తీవ్రమైన విషముచే భయంకరమగు నాఁడుపామును దొడమీఁదఁ జేర్చి లాలించినట్లు నిన్ను నమ్మి దగ్గఱచేర్చి యిట్లు నాశముకానున్నవాఁడను.

ఉ॥ రాముని నన్ను లక్ష్మణుఁ ది - రస్కృతి చేసి, పురంబు రాష్ట్రమున్
భూమిఁ గలట్టిబాంధవుల - పొంగడఁగన్ వధియించి, యేలనీ
యీమహి నీతనూభవుఁ డె - యీవును నావగవారిడెందముల్
కామిని! యోలలార్పుమ య - గాధమహాసుఖవారిరాశిలోన్. ౩౮౮

తిరస్కృతి=ధిక్కరించి, పొంగు=సంతోషమునముబ్బ, అగాధ......రాశిలోన్=లోఁతు తెలియరాని మహాసుఖమను సముద్రములో, ఓలలార్పుము=ఓలలయని సంతోషముతోఁ గ్రీడింపఁజేయుము. "ఓలోలాంబక యోల యోల యన నోలోలంచు మేలంబునన్"- వసు.

తాత్పర్యము

శ్రీరామచంద్రుని నన్ను లక్ష్మణుఁగాదని ధిక్కరించి యయోధ్యాపురమందు కోసలదేశమందు నింకను నాస్వాధీనమందుఁగల యితరభూములందు నాకను కూలురుగనుండు బాంధవుల సంతోషాతిశయ మడఁగిపోవునట్లు వారిని వధియించి నీకొడుకే యీరాజ్యమంతయు నేలనిమ్ము. నీవో నాశత్రువుల హృదయములను మహాసుఖసముద్రమునందు నోలలాడింపుము.

చం॥ కటికిమనంబుదాన! వినుఁ క్షారము దుర్వ్రణమందుఁ గూర్చిన
ట్లటమట నన్నుఁ బెట్టుదువె? యక్కసునం బతి యంచుఁ జూడ కీ
గుటగుటలా! ధరాస్థలిని గూలెడిఁ గా కెటు లుండ నోపెడిన్
గుటిలమనస్క! త్వద్రదన కూటము వే యొక వేయితున్కలై. ౩౮౯

కటికి=దయలేని, క్షారము=ఉప్పు- కారము, దుర్వ్రణమందున్=చెడ్డపుండు నందు, అక్కసునన్=విరోధముచే, గుటగుటలా=కుచ్ఛితపుమాటలా పెద్దతీకపు మాటలా, త్వద్రదనకూటము=నీనోటిపండ్ల సమూహము- క్షారలవణ వర్జనంచ యనియుండుటచే క్షారమునకుఁ గారమనియు నర్థముగలదు.

తాత్పర్యము

జంతువుల గొంతులు కఱకఱకోయు దయలేని బోయవానివంటిదానా! స్వభావముగానే మహాతీవ్రవేదన కలిగించు పుంటియందు నుప్పు మిరపకాయపొడి పోసినట్లు నన్ను నీవు పోటుమాటలచే బాధపెట్టవచ్చునా. అయ్యో! వీఁడు నాకు భర్తగదా వీనితో నిట్లు పలుకవచ్చునా యని యాలోచింపక విరోధబుద్ధితో నిట్టి కఠినోక్తు లాడెదవా? మోసబుద్ధిగలదానా? యిట్టి యనరానిమాటలాడెడి నీనోటి పండ్లన్నియు వేయితున్కలై వెంటనే రాలిపోవును గాని యెట్లునిలువనేర్చును.

ఉ॥ ఆడఁడు కీడువల్కు నొకఁ డైన, న దెవ్వరి నైన నొవ్వఁగా
నాడఁడు, పెద్దవారి కెదు రాడఁడు, సద్గుణ మొక్కఁ డేనియున్
వీడఁడు, నా సుతుండు రఘువీరుఁడు, సర్వహితుండు, వాని దూ
ఱాడఁగ నీకు నాల్క యెటు లాడెడి నొక్కొ గయాళిజంతరో? ౩౯౦

నొవ్వఁగా=నొప్పితగులునట్లు, దూఱాడఁగ=నిందింపఁగ, గయాళి జంతరో = తెంపరిక త్తెవగు గయ్యాళీ.

తాత్పర్యము

నాకొడుకు శ్రీరామచంద్రుఁడు నీవలె నెవ్వరినైనఁ గీడుమాటయనఁడు. ఎవరిమనస్సు నొప్పింపఁడు. పెద్దలు చెప్పినదానికి బదులు చెప్పఁడు. మంచి గుణములందొకటియైనఁ యనుష్ఠింపక వదలఁడు. అందరకు మేలుగోరువాఁడు. అట్టివానిని నిందింప నోసిగయ్యాళీ నీకునోరెట్లాడెనే.

ఉ॥ చచ్చెద వేని చావుము, భృశంబుగ మండెద వేని మండుమీ,
హెచ్చగుతాపముం గొనెద వేనియుఁ గొ, మ్మొకవేయితున్కలై
కచ్చుల దూఁకుమీ పెనునగంబుననుండి ధరిత్రి, నంతె గా
కిచ్చగఁ జేయఁ జాల భవదిష్టము కేకయరాజపాంసనీ! ౩౯౧

భృశంబుగన్=మిక్కిలి, కచ్చులు=కచ్చు+అలు=నీ పొగరు సమయునట్లు, కేకయరాజపాంసనీ=కేకయరాజవంశము చెఱుపఁ బుట్టినదానా.

తాత్పర్యము

కేకయరాజవంశపాంసనీ! నేనేమో నిండుమనస్సుతో నీకోరిక నెఱవేర్పఁ జాలను. చచ్చెదవా చావుము నిప్పులలోదూఁకి కాలెదవా కాలుము. అటుగాక యేడ్చుచుఁ బరితాపపడియెదవా పడుము. నీకండక్రొవ్వు పొగరు సమయునట్లు కొండమీఁదనెక్కి క్రిందదూఁకి వేయితునకలై పొమ్ము. నీ యిష్టమెటులైన నాశము గమ్ము. పర్యవసాన మింతయే.

చం॥ క్షురశితధారనా మిగులఁ•గ్రూర, వసత్ప్రియవాక్య వెప్పుడున్,
ఖరతరదుష్టచిత్తవు, ని•కారవిధిన్ స్వకులోపహంత్రివిన్,
గర మిల నామనో౽రమవు, • గ్రాఁచెదవా యిటు మూలముట్టుగ
న్విరసత నామనం ? బసతి • నీ విఁకఁ జచ్చుటె మేలు చూడఁగన్. ౩౮౨

క్షురశితధారనాన్=మంగలకత్తియొక్క పదునైన యంచవన్నట్లు, అసత్ప్రియ వాక్యవు=మిగుల నప్రియవాక్యములే మాటలాడుదానవు, ఖరతర=మిక్కిలి కఠిన మైన, దుష్టచిత్తవు=చెడుమనస్సుగలదానవు, నికారవిధిన్=మోసవిధమున, స్వకు లోపహంత్రివి=తనవంశమునే నాశముచేయుదానవు, కరము=మిక్కిలి, మనో౽ రమవు=మనస్సునకు నప్రియమైనదానవు, గ్రాఁచెదవా = తపింపఁజేసెదవా- ప్రాణబంధనంహి సోమ్యమన యను శ్రుతి దీనికిఁ బ్రమాణము.

తాత్పర్యము

నేను నీ భార్యను. నేను జీవించియుండినఁగదా నావలన నీవు సుఖపడుదువు. నన్నుఁ జావుమనెదవేల యందువా- మంగలకత్తివాదరకంటె మిక్కిలి క్రూరముగాఁ గోయుదానవు ఎప్పుడు నీనోర నొకరికి నప్రియమైన వాక్కులే వచ్చుచుండును. మిక్కిలి కఠినము దుష్టమునైన మనస్సుగలదానవు వంచనచేఁ దనకులమును నాశముచేయుదానవు. నామనస్సునకు నప్రియురాలవు. విరసము లాడి నా మనస్సున సంతోషమనునది వేళ్ళతోడఁ బీఁకివైచి నన్నుఁ గాల్చెదవా. ఇట్టిదానవు నీవెక్కడి భార్యవు. నేనెక్కడి భర్తను. కావున నీవు బ్రదికియుండిన నాకు దుఃఖమే కాని సంతోషము లవమైనలేదు. కావున నీవు చచ్చుటే నాకు క్షేమము.

తరలము. వనజలోచన! కానసంబుల•పాలుగాఁగ సుతుండు నే
మనుటె కల్ల నిజంబు, సౌఖ్యము•మాట యేటికె చెప్పఁగా?
మనితిఁబో పని యేమి నీవు? సు•మాళి నౌదునె? విప్రియం
బును ఘటింపకు నీదు కాళ్ళకు•మ్రొక్కెదన్ మఱి మ్రొక్కెదన్. ౩౮౩

మనుటె=బ్రదుకుటయే, మనితిఁబో=ఒకవేళ బ్రదికితిననుకో, సుమాళి = సంతోషముగలవాఁడు తలమునకు - నభరసజజగములు - ౧౨-వ యక్షరము

యతి, వనజలోచన=కమలములవంటి కన్నులుగలదానా, ఇది ముఖప్రీతిమాట. మదిరాక్షిచెవులు తొమ్మిదిలెక్కలనరాదు అను పద్యంబున నప్పకవి హరిమధ్య కాళ్ళుగుళ్ళనఁగఁగాదని చెప్పుటచే నిచటఁ గాళ్ళని ప్రయోగించుట యనౌచిత్య మని సందేహింపరాదు. అది స్తుతియందు శృంగారరసవర్ణనమందే యుచితము గాని సర్వత్ర గాదు. కలహంసకాళ్ళఁ దవులకమున్న యని వసుచరిత్రకర్త ప్రయోగింపలేదా?

### తాత్పర్యము

కోపము పట్టఁజాలక తిట్టి, తిట్టుటవలనఁ గార్యము సాధ్యముగాదని మరల మెత్తనిమాటలాడుచున్నాఁడు. కమలాక్షీ! నాకొడుకు అడవులపాలాయెనా నేను జీవించుట యసత్యము. ఇఁక నీతో నేనేమి సౌఖ్యము పడఁగలను. ఒకవేళ బ్రదికితిఁబో శోకమున మునిఁగియుందునేకాని సంతోషముకలవాఁడ నగుదునా? అప్పుడు నీతో నాకేమిపని? కాఁబట్టి నాకు నప్రియకారము చేయకుము. నీకాళ్ళకు మ్రొక్కెదను. మఱిమఱి మ్రొక్కెదను.

చం॥ అని యిటు భూమిపాలకుఁడు•హా యని యేడ్చు చనాథునట్టులై
తనమతిమేర మీఱి చను•తత్సతిచేతికిఁ జిక్కి మ్రుక్కి తా
వనితప్రసారితాంఘ్రులను•వ్రాలియుఁ దాఁకక, రోగపీడితుం
డనఁ బడియెన్ ధరాతలము•నందు మహార్తి వినష్టచిత్తుఁడై. ౩౬౪

వనిత=ఆకైకయొక్క, ప్రసారిత=చాఁపఁబడిన, అంఘ్రులను=పాదములను దీనివలనఁ గైక హాయిగా కాళ్లుచాఁచుకొనియుండినదని యేర్పడుచున్నది. మహార్తి=మిగులబాధచే, వినష్టచిత్తుఁడై=మనస్సుచెదరినవాఁడై- కాళ్ళమీఁదఁ బడునంతలో మూర్ఛమునుంచుటచేఁ దాఁకక నేలఁబడెననికాని ఆయన తాఁకునంతలో నామెకాళ్ళు ముడుచుకొనుటచేఁ దాఁకలేకపోయెననికాని యెంచవలయును.

### తాత్పర్యము

ఈప్రకారముచెప్పి దశరథుఁడు దిక్కులేనివానివలె నయ్యో యని యేడ్చుచుఁ దనయిష్టము నతిక్రమించిపోవు నాకైకచేతికిఁజిక్కి మ్రుక్కి యదిచాఁచిన పాదములమీఁదఁ బడియును దాఁకక రోగబాధచే చెడుబాధపడువానివలె స్మృతి తప్పి భూమిమీఁదఁబడెను.

### ౧౩-వ సర్గము.

సీ॥ పుణ్యాంతమున స్వర్గ•మునసుండి త్రెళ్ళుయు, యాతినా ననుచిత•రీతి దీవ
గతి నేలఁబడియుండు•క్ష్మావల్లభునిఁ బరా,ననుభూత తాదృగ్వ్య•సనునిఁగాంచి
వెఱ పొకింతయు లేక • వెఱపెట్టుచు ననర్థ,రూప యసిద్ధార్థ•పాప మనక
మునుపటివరము లే•ముగుద దాఁ గోరుచుఁ దనపెనిమిటిఁ జూచి•తలఁకకనియె

ఆ॥ నేను సత్యవాది•నేదృఢవ్రతుఁడ న,టంచు నిన్ను నీవ•యాడుకొనెదు
నావరంబు లిడ్లొ•నప్పకయే బుఱ,పాతకుఁడవు గాఁగ•భ్రాంతిపడితొ. ౩౬౫

త్రెళ్ళు=పడు, యయాతినాన్=యయాతియో యనునట్లు, యయాతి యను రాజు గొప్ప తపస్సులు దానధర్మములుచేసి స్వర్గమునకుఁబోయెను. అప్పుడిం ద్రుఁడు రాజా! నీవేమి పుణ్యముచేసి యింతస్వర్గసుఖము ననుభవింపవచ్చితివని యడిగెను. నేను మహాఋషులకంటె వ్రతులకంటె గొప్ప తపస్సుచేసితిని. నేను జేసినతపస్సులోఁ గొంచెముభాగమైన నీఋష్యాదులు చేసినవారుకారని గర్వించి పలికెను. నీవు గర్వివి కావున నిచ్చటనుండఁదగవు. మరల భూలోకమునకుఁ బొమ్మని యింద్రుఁడు క్రిందఁద్రోచెను. అతఁడు క్రిందఁబడుచు సాధుసాంగ త్యము లేనిదోషమున నిట్లయితిని. సాధువులలోఁబుట్ట ననుగ్రహింపుమని వేఁడెను (౧౩౦౪-వ పద్యము చూడు). పురా=పూర్వమందు, అననుభూత= అనుభవింపఁబడని, తాదృక్=అటువంటి, వ్యసని=వ్యసనముగలవానిని, అనర్థ రూప=రూపముకొన్న కీడు, అసిద్ధార్థ=నెఱవేఱని కోరికగలది.

## తాత్పర్యము

స్వకృతాపరాధమునఁ దాను జేసిన పుణ్యము క్షయింపఁగా స్వర్గమునుండి భూమిమీఁదఁబడు యయాతిమహారాజువలెఁ దగని విధముగా శోకతప్తుఁడయి నేలఁబడియుండువానిని,ఇంతకు ముందెన్నఁడు నిట్టిదుఃఖ మనుభవింపనివానిని, చూచి మగనిభయముగాని లోకాపవాదభయముగాని పాపభయముగాని కొంచె మైనను లేక యోయిరాజా! నీవు మాటతప్పితివా నరకము ప్రాప్తించును. లోక మున ననత్యవాదివని యపకీర్తి వచ్చును. కృతఘ్నుఁడు మోసగాఁడను పేరు వచ్చును. జాగ్రత్త అంతేకాదు. నేనిచ్చటనే మరణించెదను.నామృతికి నీవు కారణ మగుటచే స్త్రీహత్యయేకాదు భార్యాహత్యయు వచ్చునని యిట్లు బెదరించుచు ననర్థమే రూపముగాఁగొని యింకను దనకోరిక నెఱవేఱని యాపాపిని పాపమని తలఁపక మునుపటివరములె మరలమరలఁ గోరుచు నిచ్చెదవా లేదాయని గద్దిం చుచు భర్తను జూచి చలింపక రాజా! నేను సత్యవాదిని, పట్టినవ్రతము విడుచు వాఁడను గాను. అని నిన్ను నీవే పొగడుకొనుచుంటివే యిదియా నీ సత్యసంధ త్వము దృఢవ్రతత్వము. నావరములు నెఱవేర్పక నాకు ఋణస్థుఁడవై చావ భ్రాంతిపడితివేమో.అది భ్రాంతియే నావరము లిచ్చువఱకు నిన్నుఁ జావనీయను.

మ॥ అని తన్నాడఁగఁ గైక యాజియును మూ॰ర్ఛాయుక్తుఁడై మూర్తమున్
గనుచుం దాని సరోషవేగమున నే॰గ న్మీను లోకాంతరం
బును రాముండు మహాటవీస్థలికి నం॰పూర్ణేష వై యుండుమీ;
నను ఛీ ఛీ యన వేల్పు లోచెనఁటిదా॰నా! యెట్లు సైరింతు నే. ౩౯౬

ఆజి=దశరథుఁడు, మూర్ఛాయుక్తుఁడై=మూర్ఛకు స్వాధీనపడినవాఁడై, మూర్తము=ముహూర్తకాలము- అల్పకాలము, సంపూర్ణేషవు=నెఱవేఱిన కోరిక గలదానవు, సైరింతునే=ఓర్చుకొనియుందునే.

అని కైక యీప్రకారము పలుకఁగా దశరథుఁడు కొంచెము సేపు మూర్ఛలో మునిఁగియుండి లేచి రోషాతిశయముచే దానిని జూచి నేను మరణించి పరలోకమునకుఁబోఁగా శ్రీరామచంద్రుఁ డడవికిఁబోఁగా నీకోరిక పూర్ణముగా నెఱవేర్చు కొన్నదానవై యుండుము. నీవెట్లులైన నగుదువుగాక. పరలోక మేగినచోట దేవతలు ఛీ ఛీ భార్యాదాసుఁడు వచ్చెనని ఛీకొట్టిన నెట్లు విని సహించి యుండ నేర్తునే.

సీ॥ కైకేయికొఱకుఁగాఁ•గానకంపితి నన,సత్య మయ్యెను నద•సత్య మగును
గానక కానక•ఘనతపంబులఁ గన్న, ననఘుశ్రీరాముఁ బో•కార్తు నెట్లు?
శూరుండు సుకృతహ•స్తుఁడు జితక్రోధుండు,క్షమకు మాఱటరూపు•చారుకమల
పత్రలోచనుఁడు ను•త్పలదళశ్యాముఁడు, దీర్ఘబాహుండును•దివ్యమూర్తి
తే॥ రాము నభిరాము విక్రమ•ధాము నెట్లు,దండకాటవి కనుతు ను•ద్దండవృత్తిఁ
గరము సుకవాసిశోకంబు•తెరువు గానఁ
దార్తి గొనుచుండఁజూడనె•ట్లోర్తుఁజెపుమ. ౩౯౭

కానకున్=అడవికి, పోకార్తున్=పోఁగొట్టుకొందును, సుకృతహస్తుఁడు = చక్కఁగా గుఱిగొట్టఁగలవాఁడు, మాఱట రూపు=రెండవ స్వరూపము, చారుకమల పత్రలోచనుఁడు=మనోహరమగు తామరరేకులవంటి కన్నులుగలవాఁడు, ఉత్పలదళశ్యాముఁడు=కలువ రేకులవలె నల్లనివాఁడు, సుకవాసి=సుఖముగా జీవించినవాఁడు.

తాత్పర్యము

ఏల నిష్కారణముగా శ్రీరామచంద్రు నడవికిఁ బంపితివని దేవతలడిగిన కైకేయి కిచ్చిన వరములప్రకారము పంపితినని నీవు చెప్పలేవా యందువేమో. అది సత్యమే యయినను ముందు సభలోఁ బదుగురు వినునట్లు చెప్పినమాట యే యేటఁబోయినట్లు? ముందుగాఁ జెప్పినది నెఱవేర్పకుండుట సత్యహానిగదా. ముందు కైకకు వరము లిచ్చితినిగదా యంటివేని యవి యప్పుడు నిర్దిష్టములు కాలేదు. కావున వానినెట్లు పాటించితివనిన నేమి చెప్పుదును ? వారడుగుదురో యడుగరో యది యట్లుండనిమ్ము. ఎన్నో గొప్పతపస్సులు చేసి లేక లేక దీర్ఘకాలమునకుఁ గన్న పుణ్యాత్ముని శ్రీరామచంద్రమూర్తిని నెట్లు విడనాడుదునే? తపసులు ధారవోసి,కొడుకో కొడుకో యని కలవరించి కొడుకును గనుట యడవి పాలు సేయుటకా? శ్రీరాముఁడో సామాన్యుఁడు కాఁడు. శూరుఁడు, గుఱిదప్పక బాణప్రయోగముచేయు సమర్థుఁడు. అట్టి నాకంటె బలవంతుని నేనేమని నిష్కారణముగా బలవంతముగా నడవులకుఁ బొమ్మనఁ గలను? క్రోధము జయించినవాఁడు. ఓర్పునందు భూమికిఁ బ్రతిరూపమైనవాఁడు, తామర రేకులవంటి కన్నులు నల్లకలువ రేకులవంటి చాయగలవాఁడు. మోఁకాలినంట బాహువులు గలవాఁడు. దేవతాకారము గలవాఁడు. ఇట్టి శ్రీరాముని, సుందరకాముని,విక్రమ

ధాముని, గుణనిస్పృముని, నెట్లు నన్నెవ్వఁడనెడు వారు లేరని యడవికిఁ బంపు దును. మిక్కిలి సుఖముగా జీవించినవాఁడు. శోకమెట్టిదో యెఱుంగఁడు. అట్టి వాఁడు తొలుదొల్తనే యింతటి దుఃఖమనుభవింప నెట్లు చూసి సహింపఁగలను? నీవే చెప్పుము.అది సాధ్యమా? నీకొడుకున కాగతి వచ్చిన నీవు సహింపఁగలవా?

కం॥ వ్యసనానర్హుని రాముని, వ్యసనంబుల ముంప కుండ•నందితి నేనిన్
వెస దేహాంతరలబ్ధిని, ననమాననుఖంబు గల్గు•నాకంబుననేన్. ౩౮

వ్యసనానర్హునిన్=వ్యసన పడఁదగనివానిని, దేహాంతర లబ్ధిని = వేఱొక దేహము పొందితినేని, నాకము=స్వర్గము.

### తాత్పర్యము

వ్యసనపడ నోగ్యుఁడు కాని శ్రీరామచంద్రమూర్తిని వ్యసనములలో ముంపక వేఱొక దేహము నందఁగలిగితినా స్వర్గమందును నాకు విశేష సుఖము గలదు. ఆయనను వ్యసనమున ముంచితినా నాకు స్వర్గమందును సుఖములేదు.

తే॥ అకట! పాపాత్మురాల! ద•యావిహీను,రాల! నాప్రియపుత్రు శ్రీ•రాముఁగోమ
లాంగునిటు బాధపఱిచి యీ•యవని నిత్య,
పరిభవ మకీర్తి నా కిడఁ•బాలుపడితె. ౩౯

కోమలాంగున్ = మృదువైన దేహము గలవానిని, నిత్యపరిభవము = శాశ్వతమైన యవమానము.

### తాత్పర్యము

పాపాత్మురాలా! దయలేనిదానా! నాప్రియకుమారుని సుకుమారుని నీరీతి బాధపెట్టి నాకు లోకమున శాశ్వతముగా నవమానము అపకీర్తి సంపాదించి యియ్య దావరించితివా.

తే॥ అనుచు నీరీతి విలపించు•చును నితాంత,
మును గలంకువపడుఁచిత్త•మునఁ దపించు
చుండ నాఁడేఁడు నీరజా•ప్తుండు దొర,గిల్లెఁ దోడ్తోన రేయియుఁ•గెరలెజగతి.

కలంకువ=కలఁత, నీరజాప్తుండు=సూర్యుండు, దొరగిల్లె=ఎఱ్ఱనాయెను- అస్తమించెను, తోడ్తోన=వెంటనే, కెరలెన్=వ్యాపించెను.

### తాత్పర్యము

దశరథుఁ డీరీతి విలపించుచు స్థిరచిత్తము లేక కొంతసేపు ధర్మపక్షము నను, కొంతసేపు శ్రీరామపక్షమునను బలుకుచు మిక్కిలి కలఁతపడు చిత్తముతోఁ దపించుచుండఁగా సూర్యుఁ డస్తమించెను. లోకమును రేయి ముంచెను. చీఁకటులు వ్యాపించెను.

ఇప్పుడు సూర్యాస్తమాయె నని చెప్పుటచేఁ గైకేయీ దశరథ సంవాదము సాయంకాలమున జరిగెను. ఇది- చైత్రశుద్ధ చతుర్థీ దివసము.

చం॥ కడుకొని మింటఁజందురుఁడు • గాయుచు నుండెను రాత్రి యామయుం
దుడుగనిదుఃఖవేగమున • నోటమి యేడ్చుచు నుంట జేనికిన్
గడుఁగడుమాసరం బగుచుఁ • గన్పడె, నాతఁడు వేఁడియూర్పుల్
విడుచుచుఁ జూడ్కులం గగన • వీథిని నిల్పి వచించె నేడ్చుచున్. ౪౦౧

కడుకొని=అతిశయించి, మింటన్=ఆకాశమందు, త్రియామ=రాత్రి-త్రియామా క్షణదాక్షపాయని యమరుఁడు. వాస్తవ రాత్రికాలము మూఁడు జాములే. సూర్యాస్తమయానంతరము అరజాము, సూర్యోదయమునకు ముందర జాము పగటిలోఁ జేరుచున్నది. త్రియామ = మూఁడుజాములుగలది, ఓటమి = సారహీనమై, మాసరము=దీర్ఘము. "మాసరములైన మధుమాసవాసరములు" అని ప్రయోగము, గగనవీథి=ఆకాశమార్గము.

తాత్పర్యము

చంద్రమండలము నిర్మలమై యాకాశమునఁ బ్రకాశించెను. వదలని దుఃఖాతిశయముచే నత్తువచెడి యేడ్చుచుండు రాజున కారాతిరి మూఁడు జాములు గలదేయైనను మిక్కిలి దీర్ఘమై యెన్నిజాములో కలదిగాఁ దోఁచెను. దశరథుఁడు వేఁడి నిట్టూర్పులు విడుచుచు నాకాశమును జూచి యేడ్చుచు నిట్లనియెను.

ఉ॥ అంజలిచేసి మ్రొక్కెద ద • యామతిఁ జూడుము నన్నుఁ దెల్లవా
ఱం జనఁబోకు చుక్కలనె • ఱాగయి సేఁత నెసంగురాతిరీ!
నెంజిలిపెట్టు నీచెనఁటి • నిర్దయ కైక మొగంబు చూచుటై
నం జనుఁగాన వేగ మయి • నం దెలవాఱుము లేచి పోయెదన్. ౪౦౨

చుక్కల నెఱాగయి సేఁత నెసంగు=నక్షత్రములచే నిండుగ నలంకరింపఁబడిన, నెంజిలి=మనస్తాపము ఆకాశము చుక్కలు గలదిగాఁ జెప్పుటచేఁ జంద్రుఁ డస్తమించె నని యెఱుఁగనగు.

తాత్పర్యము

చుక్కలచే నిండుగ నలంకరింపఁబడి ప్రకాశించు నోరాత్రీ నీకుఁ జేతులు మోడ్చి నమస్కరించెదను. నన్ను దయఁజూడుము. తెల్లవాఱఁబోకుము. తెల్లవాఱితివా నలువురి మొగము నేనేమని చూతును. శ్రీరామునెట్లు కానకుఁ బంపుదును. అటుగాదేని శీఘ్రముగఁ దెల్లవాఱుము. నన్ను బాధించు నీకైక ముఖము చూపుటయైనఁ దప్పిపోవును. లేచిపోయెదను.

కం॥అని పలికియుఁ గైకయిమో,మును బొడఁగని హస్తయుగము • మోడిచి వనజా
క్షిని సుప్రసన్నఁ జేయఁగ, వినయోక్తుల నిట్లు వేఁడు • విభులాధవుఁడున్.

మోడిచి=ముకుళించి, సుప్రసన్నన్=అనుగ్రహము గలదానిఁగా, విభులాధవుఁడు=పుడమిఱేఁడు - రాజు.

తాత్పర్యము

అని యిట్లు పలికి మరల( గైకముఖము(జూచి రెండుచేతులు జోడించి యామెను బ్రసన్నురాలిని జేయుతలంపున సవినయముగ రాజిట్లనెను.

—• దశరథుఁడు కైకను బ్రార్థించుట. •—

ఉ॥ దీనుఁడ, మంచివాఁడఁ ద్వద•ధీనుఁడఁ, జావఁగ నున్నవాఁడ, నో
మానిని! నీకు భర్తను? క్ష•మాపతినిం గద, యొగ్గి దోసిలిన్
మానము వీడి వేఁడెదను•మన్నన సేయుమ, యొంటిగాదు నేఁ
డానిఖిలావనీజనస•మక్షమునం గద బాస చేసితిన్. ౪౦॥

త్వదధీనుఁడన్=నీకు వశపడిన వాఁడను, నిఖిలావనీజనసమక్షమునన్ = సమస్త భూజనులయెదుట.

తాత్పర్యము

నిర్భాగ్యుండను. మంచివాఁడను నీకు స్వాధీనపడినవాఁడను, నేఁడో రేపో చావనున్నవాఁడను. నీకుభర్తను.భూమికంతయు రాజునుగదా.ఇట్టి నేను రెండు చేతులు జోడించి అభిమానము వదలి నిన్నుఁ బ్రార్థించెదను. నన్ను మన్నింపుము. శ్రీరామునకు రేపు పట్టాభిషేకము చేసెదను. భూమి జనులందఱు విను చుండఁ బ్రతిజ్ఞచేసితినిగాని నీకుఁ జేసినట్లు రహస్యముగఁగాదు.

కం॥ ఏలీల దానిఁ ద్రోయుదు, బాలా! కరుణాత్మురాల•పరమసుశీలా!
యాలింపుము నానుడి నన్, జాలిం బెట్టకు దయుం బ్ర•సాదింపు సఖీ! ౪౧॥

ఏలీలన్ = ఏవిధముగ.

తాత్పర్యము

అట్టి ప్రమాణమును నేనేమని త్రోసిపుచ్చుదును. త్రోచిపుచ్చితినేని నన్ను లోకులేమందురు. బాలా! దయాలోలా! మంచినడవడిగలదానా! నామాట వినుము. నన్ను వ్యసన పెట్టకుము. దయచే శాంతపడి ప్రసన్నురాల వగుము.

సీ॥ నీయిచ్చు రాజ్యంబె•నిత్య మౌఁగావుత,శమియింపు నారామ•చంద్రు దేవి?
పరమసత్కీర్తియుఁ•బ్రాపించు నీకిల, నిది రామునకు నాకు•నెల్లజనుల
కును భరతునకును•గురువుల కెల్లను, సమ్మతం బిది యని•బాలి పుట్ట
నడలు రక్తాక్షు శుద్ధాత్ముని నశ్రుపూ,ర్ణాక్షునిఁ బతిని మేఁ•లాడ కున్నఁ
ఆ॥ బ్రియ నసుష్ఠభావఁ • బెంకెను బ్రతికూల, వచనఁ జూచి సుతుని•వననివాస
మందు కన్న నిలిపి•యన నేర కేమియు, శోకమునను బడియె•శోషమొంది.
౪౨॥

రక్తాక్ష=ఎఱ్ఱనికన్నులుగలవానిని, శుద్ధాత్మునిన్=నిర్మల మనస్సుగల వానిని, అశ్రుపూర్ణాక్షుని=నీళ్ళచే నిండిన కన్నులుగల వానిని.

తాత్పర్యము

దేవీ! రాజ్యము శ్రీరామునకు నీవేయిమ్ము. నాపెత్తనము వలదు. నీవిచ్చినదే నిత్యమైయుండుఁగాక. శ్రీరామచంద్రుపైఁ గోపముమానుము. క్షమింపుము దీనివలన నీకెంతోకీర్తిగలదు. అట్లుచేసితివేని రామునకు నాకేకాక సమస్తజనులకు భరతునకు కులగురువులకు సందఱకు సంతోషకరమైనదగును. అని మనస్సుకరఁగునట్లు దుఃఖించుచు నట్టి దుఃఖముచేఁ గన్నులెఱ్ఱనై నీళ్ళచేనిండిన వానిని నిర్మలమైన మనస్సుగలవానిని దన పెనిమిటిని జూచి మంచిమాట చెప్పకుండఁగా నంతవఱకుఁ దనయందుఁ బ్రీతి గలిగి చెడుతలంపులేకుండియు మూర్ఖురాలగు కైక నే నంగీకరింపను. శ్రీరాముఁడు వనవాసమునకుఁ బోవలసినవాఁడే. భరతుఁడు యువరాజు కావలసినవాఁడే. ఇవి తప్పవు అని విరుద్ధపు మాటలాడుదానిని జూచి యిఁక శ్రీరాముని నడవికిఁ బంపక తప్పదని నిశ్చయించుకొని యేమియు ననలేరక రాజు శోకముచే మూర్ఛపోయెను.

కం॥ ఏర్చెడివంత నలంగుచు,
మూర్ఛచుఁ బడియుండి నృపతి యుదయము కాఁగన్
బేర్చి ప్రతిబోధకాళి యొ,నర్చెడిగీతంబు లాఁపి నలగుడువడఁగన్. ౪౦౩

ఏర్చెడి=దహించెడి, వంతన్=వ్యసనముచే, ప్రతిబోధకాళి=ఉదయమున నిద్రలేపువారల సమూహము, నలగుడు=చిక్కు.

తాత్పర్యము

దహించుచున్న వ్యసనముచే నలఁగుచు నూర్పులు పుచ్చుచుఁబడియుండి యుదయముకాఁగానే తన్నువాడుక ప్రకారము నిద్రలేపగీతములు పాడువారిని గీతములు పాడవలదని నిలిపి వెలుపలఁ బోవుటకు నచటనే యుండుటకుఁ దోఁపక కళవళ పెడుచుండఁగా.

—— ౧౪-వ సర్గము. దశరథునకు సత్యంబు కైక బోధించుట. ——

సీ॥ పుత్రశోకంబున భూతలంబునఁ ద్రెళ్ళి,పడి మూర్ఛల నలంగు పతిని జూచి
హాహాత్మ రా లిట్లు పలుకు నోపృథివీశ? బాస చేసియును ని ప్పాట దానిఁ
జలుపక పాపి వై చనఁ జూచెదవే యిట్లు ధరణిఁ బొర్లుచు? నేల తప్పవిడుతు
దిటముగా లేలెమ్ము తీర్పుము వరములు, తలంపుమీ నీవింత ధర్మవిధము
తే॥ ధార్మికులు సత్యమే పర ధర్మ మనరె, నీవు ధర్మంబ చలుపఁగ నేను సత్య
మూఁతగాఁబుట్టువఱిచెద నూరకేల,సత్య మెడవఁగ వలవని జాలిపడెదు.

బాస=ప్రమాణము. అప్పాటన్=ఈవిధముగ, దిటముగా=ధైర్యముతో-దృఢగాత్రుఁడవై, ఎడవఁగన్=తప్పఁ ద్రోయుటకు, వలవనిజాలి=అవశ్యములేని వ్యసనము.

హంతి జాతావజాతాంశ్చ, హిరణ్యార్థే నృతంవదన్
సర్వంభూమ్యనృతే హంతి, మాస్మభూమ్య నృతం వదీః. మను. ౮-౯౯

బంగారు నిమిత్తమై యసత్య మాడిన నదిపుట్టిన బిడ్డలను పుట్టఁబోవు బిడ్డలను జంపును. భూమివిషయమై యనృతమాడిన నది సర్వమును జంపును. కావున భూమివిషయమై యసత్యమాడవలదు.

తాత్పర్యము

పుత్రశోకముచే భూమిమీఁదఁబడి మూర్ఛమునఁగుచు లేచుచు నలఁగుచున్న మగనిఁజూచి యాపాప మనస్కయగు కైక యిట్లనియెను. ఓయిరాజా ప్రమాణముచేసియు దానినీవిధముగ వగలేడ్పులచే నేలఁ బొరలుటచేఁ దప్పింపఁ జూచి పాపాత్ముఁడవై పోయి చావఁజూచెదవా? ఇది నీకుఁదగదు. నేనేల వానిని దప్పిపోవఁ జేయుదును?దృఢగాత్రుఁడవై లేలెమ్ము.నావరములు నెఱవేర్పుము. ధర్మవిధ మాలోచింపుము. చేసిన ప్రమాణము దీర్చుట ధర్మమో తీర్పకుండుట ధర్మమో యోజింపుము. ధర్మాత్ములందఱు సత్యమే శ్రేష్ఠమైన ధర్మమనరా? నేను నిన్నుఁజేయరాని యధర్మకార్యముఁ జేయుమని కోరలేదు. నేను నీకు సహధర్మచారిణిని గావున నీవు ధర్మము చేయుటకై సత్యమాధారముగఁగొని నిన్ను బలవంత పెట్టుచున్నాను. ఏల నిష్కారణముగ సత్యముదప్పఁ జేయ ననావశ్యకమైన వ్యసనమునఁగుందెదవు. సత్యము నిలుపుకొన నింతయేడుపేల ? ఆఁడుదాననైన నేను బోధించినను గ్రహింపలేని నీవేమి మగవాఁడవు ? ఏమి రాజవు? తనకుఁ దెలియక యొకరు చెప్పినను విననివాని లోకులేమందురు.

కం॥ తనమాటఁ బట్టి కాదే, మును శైబ్యుఁడు తనదుదేహ♦మును డేగకుఁగాఁ
గొను మని యిడి వెసఁ జూఱఁ,గొనె నుత్తమ మైనగతిని♦గువలయనాథా.

తాత్పర్యము ౪౦౯

రాజా! తన మాట నిలుపుకొనుటకై కదా పూర్వము శైబ్యుఁడు తన దేహమును గోసి డేగకునిచ్చి యుత్తమ గతులు పొందెను. అట్లు నేను నిన్నేమైనఁ జేయుమంటినా? (చూ. ప. ౩౩౭)

కం॥ అందునకై కాదే తన,కుం దానముఁ గనులు వేఁడి♦కొనువిప్రునకున్
గుందక యిచ్చె నలర్కుఁడు నందితదివిజుండు తనదు♦నయనయుగంబున్.

అందునకై =ఆప్రకారము తన మాట నిలుపుకొనుటకై, నందితదివిజుండు =సంతోషపెట్టఁబడిన దేవతలుగల వాఁడు.

తాత్పర్యము

శైబ్యునివలెఁ దనమాట నిలుపుకొనుటకే కదా అలర్కుఁడు తన కన్నులు దానముగా నిమ్మని కోరిన బ్రాహ్మణునకు వ్యసనపడక రెండుకన్నులు తీసి యిచ్చి దేవతల సంతోషింపఁ జేసెను.

కం॥ జలనిధి ధరణిని ముంపఁగఁ, దలఁచిన నడ్డంబు గలదె? తనమర్యాదన్
దలఁచి కదా వేలావని, వల నొప్పఁగ దాఁట కుండు♦న్వల్పంబై నన్!౪౧౧

జలనిధి=సముద్రము, ధరణిని=భూమిని, వేలావని=చెలియలికట్ట ప్రదేశము. ౪-వ పాదంబునం బ్రాదియతి.

తాత్పర్యము

సముద్రుండు భూమిని దన జలములచే ముంచి వేయందలంచిన నెవ్వరడ్డము రాంగలరు. తన మేర తలంచిగదా కొంచెమైనను జెలియలికట్ట దాంటి రాకున్నాండు.

ఉ॥ సత్య మొకండె బ్రహ్మమగు•సత్యమునంద వసించు ధర్మముల్
సత్యమ యక్షయంబు లయి•చాగెడి యాగమకోటు లన్నియున్
సత్య మొకంటనే కలుగు•శాశ్వత మైనపదంబు, గావునన్
సత్యముం బట్టుమీ మది నె•సంగిన నించుక ధర్మచింతయున్. ౪౧౨

తాత్పర్యము

రాజా! పరబ్రహ్మమనంగానేది? సత్య మేకదా.సత్యం పరంబ్రహ్మ.సత్యపరం ధీమహియన వినలేదా?ధర్మములకన్నిటికి స్థానమేది?సత్యముకాదా?అక్షయవేద సమూహములన్నియు నేవి? సత్యముకాదా.శాశ్వత పదము మోక్షస్థానము దేనిచేం గలుగుచున్నది? ఒక సత్యము చేతనేకదా.కావున నీకుం గొంచెమైనను ధర్మవిచారముండెనేని సత్యమునే గ్రహింపుము.తుచ్ఛపామరత్వముపై మనస్సు పెట్టకుము.

ఆ॥ ఇంతయేని ధర్మ•చింత నీమది నున్న, సఫలముగను జేయు•క్ష్మాతలేంద్ర
నీవొసంగి నట్టి•యావరద్వయమును,దప్పం బలుక నొప్పు•దానంగాను.౪౧౩

తాత్పర్యము

ధర్మము తప్పరాదని నాలోచన నీకుం గొంచెమైన నుండెనారాజా నీవిచ్చిన రెండువరములను ఫలవంతములం జేయుము. ధర్మముతో నాకుం బనిలేదందువా పోనిమ్ము. అంతియకాని యుపాయములచేం దప్పించుకొనం జూచిన నేను సమ్మతించుదానం గాను. ధర్మమైన విడుము. శ్రీరామునైన విడుము.

కం॥ దాంటమి ధర్మము మేలని, దూంటి యిటుల్ పలుకు దానం•దూర్ణమ వని కి
నాంటన పంపుము రాముని, మూంటికి ముమ్మాటి కిదియు•మూర్ఖత రాజా.

దూంటి=నొక్కి, తూర్ణమ=త్వరగా. ౪౧౪

తాత్పర్యము

నీమేలుగోరి ధర్మమునకు హాని కలిగించుట సరిగాదని నొక్కినొక్కి చెప్పుచున్నదానను. శ్రీరాముని నీనాండే యడవికిం బంపుము.మూంటికి ముమ్మాటికిం జెప్పుచున్నదానను. ఇదియే నామూర్ఖత్వము.

కం॥ నాతోం జేసిన బాసను, వే తీర్పక యుందు వేని • విను నాపలుకున్
నీతోడు నీవు చూడంగం, బాతుం బ్రాణముల నిచటం•బడి యని కినుకన్.

పాతున్=వదలంజేయుదును- చువర్ణంబుతోడి దుగ్ధకారంబు తకారంబగు, పాచుదురు=పాతురు- పాయునట్లుచేయుదురు.'తుష్ణపాతురు సుమతుల్'మహాభార.

ఇట్టులే త్రోచుదురు=త్రోతురు, అని యెఱుంగవలయును. మవర్ణపూర్వకమైనది లేదు గనుక పాయుదురు త్రోయుదురు అనునవి పాతురు త్రోతురుఅనికానేరవు.

తాత్పర్యము

నాకు నీవుచేసినప్రమాణ మీతత్క్షణమే నెఱవేర్పకపోయితివేని సావధానముగ నేను జెప్పెడిమాట విను. ఏమో చెప్పినదానవని తలఁపకుము. నీవుసాక్షిగ నీపాదములమీఁదఁబడి ప్రాణములఁ బోఁ జేయుదును. అని కోపముతో.

ఉ॥ జంకొకయింత లేక యిటు•జంకెన లాడెదు కైకకున్ స్వనా
శంకరదాన మిచ్చి బలి•చాడ్పున సూనృత పాశబద్ధుఁడై
బింకము దక్కి చిక్కి మది•బెగ్గిలి వెల్వెలఁబాఱుమోముతో
నంకిలిఁ గాఁడిగండ్లకును•నంతరమందలియెద్దనం గొనెన్. ౪౧౬

జంకు=శంక-బిడియము, జంకెనలు=బెదరింపుమాటలు, స్వనాశంకరదానము=తన్నునాశముచేయు దానము, సూనృత=సత్యమనెడు, పాశ=త్రాళ్ళచే, బద్ధుఁడై=కట్టఁబడినవాఁడై, బింకము=పౌరుషము, బెగ్గిలి=బెదరి, వెలవెల=తెల్లన, కాఁడిగండ్లకును=బండికాఁడికి కంటికి, అంతరమందలి=నడిమి అంకిలిన్=కలఁతను, వామనుఁడు బలిచక్రవర్తిని మూఁడడుగులభూమిని దానమడిగెను, ఆయనయు నిచ్చెను. అది యాయనచెడుటకే కారణమయ్యెను. అట్టులే దశరథుఁడు తానిచ్చిన వరములు తననాశమునకే కారణమయ్యెను. శివుఁడు వృకాసురునకు వరమిచ్చినట్లు.

తాత్పర్యము

కొంచెమైనను జంకక బెదరింపుఁబలుకు లాడెడి యాకైకకుఁ దననాశమునకుఁ గారణమైన దానముచేసిన బలిచక్రవర్తివలె సత్యపాశబద్ధుఁడై దశరథుఁడు పౌరుషముమాని శ్రీరాముని నడవికిఁ బంపనందునా సత్యహాని. పైంపెదనందునా తనకుఁ బ్రాణహాని యని యాలోచించి యెటుచేయుటకుఁ దోఁపక కాఁడికి బండికంటికి నడుమఁ జిక్కుకొన్న యెద్దువలెఁ గలఁతచెందెను.

—•దశరథుఁడు కైకను విడనాడుట.•—

ఉ॥ భూవరుఁ డెట్టకేని ధృతిఁ•బూని, సతిం గని రోసి, యీసుమై
నావలిమోము నై యనె, హు•తాశనుమ్రోలను మంత్రసంస్కృతిన్
బావనరీతిఁ గైకొనిన•పాణితలంబును నిన్ను మద్భవున్
నీవలనన్ జనించుటను•నీసుతు వీడితి నేను దుర్మతీ. ౪౧౭

ధృతి=ధైర్యము, ఎట్టకేని=అతికష్టముపై, రోసి=అసహ్యించుకొని, ఈసుమై=కోపముచే, హుతాశను మ్రోలను=అగ్నియెదుట, మంత్రసంస్కృతిన్=మంత్రములచే సంస్కరించి పావనరీతి=పవిత్రమైనరీతిగ, శాస్త్రపద్ధతిని, మద్భవున్=నాకు జనించినవానిని, దుర్మతీ=చెడుమనస్సుగలదానా.

## తాత్పర్యము

అధర్మమున జీవించుటకంటె ధర్మమునఁ బ్రాణముబోవుటే శ్రేష్ఠమని నిశ్చయించుకొన్నవాఁడై యిట్టి పాపాత్మురాలి ముఖ మింకఁ జూడరాదని కైకతనకు వెనుకప్రక్క యగునట్లు తిరిగి యిట్లనెను. చెఱుబుద్ధిగలదానా! అగ్నిహోత్రము నెదుట మంత్రములచే సంస్కరింపఁబడి పవిత్రమైన విధముగా నేను గ్రహించిన నీపాణితలమును, నాకుమారుఁడై నను నీయందుఁ బుట్టినవాఁడగుటచే నీకొడుకునుగూడ విడిచితిని.

దశరథుఁడు కైకనింత ఘోరముగ శపించెఁగదాయిది యాక్రోశముచేఁ జెప్పినమాటయా బెదరింపా లేక శాస్త్రీయమైన శిక్షయా యని సందేహము.

ఇది యాక్రోశముచేఁ జెప్పినమాటగాదు. బెదరింపుమాటగాదు. పరమార్థబుద్ధితో శపించినమాటయే. ఏలన: రామచంద్రమూర్తి యరణ్యమునకుఁ బోవఁ జూచి దశరథుఁడు కౌసల్యగృహమునకుఁ బోవునపుడు (వ. ౧౧౪౩). "కేవలార్థపరవుక్లిష్టధర్మవు నీవు। గాన నగ్నిసాక్షికముగఁ గొనిన, తావకీనకరముఁ దద్దయు విడిచితి।నిందు నూర్ధ్వలోకమందుఁగూడ"ననుమాటలే మరలఁజెప్పెను. కావున దశరథుఁడు వాస్తవముగ శపించినవాఁడే. లంకలో శ్రీరామచంద్రమూర్తి దశరథుని "కరుణఁదలఁపు కైక భరతులందు గొడుకుతోడ నిన్ను విడిచితినంటివి తొలుత శాప మదియుఁ దొలఁగుఁగాక" యుద్ధ ౨౩౬- వ.వ. నిట్లు కోరెను. అటయిన నింతఘోరశిక్షకుఁ గైక యర్హురాలా? కాదు. ఏలన: "శ్లో॥ ధర్మవిఘ్నకరీభార్యా, మసతీం చాతికోపనామ్। త్యజేద్ధర్మస్యరక్షార్థం। సద్యై వాప్రియవాదినామ్" అనికదా శాస్త్రము చెప్పుచున్నది. అనఁగా ధర్మమునకు విఘ్నముచేయునదియు, నసతియు, మిగులఁ గోపము కలదియు,సర్వదా ప్రియమ్ములు, పలుకునదియునగు భార్యను ధర్మరక్షార్థము వదలిపెట్టవలయును. ఇందొకదోషమైనఁ గైకయందు లేదు. ఎట్లన:- ఆమెచేసిన యుపకారమునకు బ్రత్యుపకారముగ రాజు దానై వరముల నిచ్చెదననెను తన యిష్టము వచ్చినపుడు తనయిష్టమైనవానిని గోరవచ్చునని కైక యాయన యనుమతి పొంది యుండెను. అవి యామె యిపుడు కోరెను ఇది దోషమా? అసతియనఁగా అంకుటాలు. జారిణి. "పుంశ్చలీ ధర్షిణీ బంధ క్యసతీ కులటేత్వరీ" అని యమరుఁడు. అట్టి దోషప్రవర్తి యామెయందులేదు. ఇఁక మూఁడవది అతికోపము. ఈగుణమున్నట్టు దశరథుఁడు చెప్పలేదు. భర్తపైఁ గోపించుభార్య వదలిపెట్టఁ దగినదే కాని సవతులమీఁద, సేవికలమీఁద గోపించుదానిని వదలిపెట్టుమని శాస్త్రములేదు. గనుకనే సీతాదేవియే శ్రీరామచంద్రమూర్తిని "రామ! జామాత పురుషవిగ్రహము గొన్న। స్త్రీ యటంచును దలఁపఁడే చిత్తమునమ॥ నన్ను జాయాజీవునిపోలికి। మాయురె యన్యులకోసంగ మదినెంచెదవే" అని యిట్లు కోపముచే నిందించెను. ఇవి తిట్లుగాక దీవనలా? శ్రీరామచంద్రమూర్తి యేల

యీమెను వదలలేదు? కౌసల్య దశరథునిజూచి "చం॥ సవతికి నీవు దక్కినసుం జాఁగఱ గొట్టుట నీవు గల్గియున్। ధవుఁడవు లేనివాఁడ వీఁక నాసుతునిన్ వనిఁ ద్రోచితీవనా। కెవరును లేరు చుట్టములు నేగెదఁగానల కన్నచో మగం। డవు మనియుంటఁబోల దిటునాశము చేసితి నన్ను నన్నిటన్ "మగఁడవైన నీవున్న వాఁడవుకావు. చచ్చినవాఁడవు కావు. నీవు బ్రదికియుండుటచే నాకిందుసుఖము లేదు. శ్రీరామునివెంట నుండుటకు లేదు. నీవు చచ్చిన నాప్రాణము సుఖ పడును. అనెను. నీవలనఁ జెడినదానను నేనొకతనే కాదు. "చం॥ హతమయి పోయె నీవలన, జ్ఞాతల మీవును మంత్రులెల్లరున్ హతులిఁక నేను నాసుతుఁడు నాశనమైతిమి పౌరులందఱున్ హతులు" అనెను. ఇవి తిట్లు గాక దీవనలా?

ద్రౌపది భీమసేనుని "ఉత్తిష్ఠోత్తిష్ఠ కింశేషే, భీమసేన మృతోయథా నామృతస్యహి పాపీయాన్ భార్యా మాలభ్య జీవతి। భ్రాతరంచ విగర్హస్వ జ్యేష్ఠం దుర్ద్యూతదేవినమ్। యాస్మాస్మికర్మణాప్రాప్తా దుఃఖమే తదనంతరమ్॥ భీమసేనా। పీనుఁగువలె నిట్లుపడి నిద్రించుచున్నావేమి? లేలే. ఎవఁడుచేసిన కార్యమువలన నాకీకష్టమువచ్చెనో యట్టి చెడుజూదగాని మీయన్నను నిందిం పుము అనెను. ఇట్టులే శకుంతల దుష్యంతుని సభలోనే తిట్టెను. దుష్యంతుఁడు భీముఁడు ధర్మరాజు పెండ్లాలను వదలిరా. వారికంటెఁ గైక యేమియెక్కువ కోపించెను? ఇఁక నాలవది అప్రియవాదిని. ప్రమాణము జేసియుఁ దా నిచ్చెద ననినదాని నియ్యకపోవుటచేఁ గఠినముగ మాటలాడెను గాని యంతకు ముందె న్నఁడు కైక యట్లు అప్రియమాడినదిలేదు. "ఇంతకును బూర్వమెన్నఁడే నింతయైన, నప్రియంబైన ననుచితమైన ననవు" దశరథుఁడే (ప. ౩౧౯). చెప్పెనుగదా.

మీఁది శాస్త్రవాక్యము సర్వదా యప్రియములు పలుకుదానిని వదలు మనుచున్నది కాని విశేషణకారణమున నప్రియమొకసారి పలికినంతన వదలు మనలేదుకదా. ఇట్లుండ నుభయలోకములందును వదలుట న్యాయ్యముగాదు.

"అదుష్టాం, వినతాం భార్యాం, యౌవనేయః పరిత్యజేత్, స ప్తజన్మ భవేత్ స్త్రీత్వం వైధవ్యంచ పునఃపునః॥ ఎవఁడు దుష్టురాలుగాని భార్యను వినయముగల దానిని యౌవనమందు వదలునో వాఁ డేడుజన్మములు స్త్రీయై పుట్టి జన్మజన్మమందు విధవయగుచుండును. కావున దశరథుఁడు చేసినది సరి యైన కార్యముగాదు. అని పూర్వపక్షము.

ఈపూర్వపక్షము సరిగాదు ముందుచెప్పిన నాలుగు దోషములు కైక యందుఁ గలవు.

౧. కైక స్వధర్మమందు నిలిచినదికాదు. మగనిని నాయన ధర్మమందు నిలువఁ జేసినదికాదు. ఎట్లన :-

కైక స్వధర్మము పాతివ్రత్యము భర్తననుసరించి చరించు వ్రతముగలది పతివ్రత. "పతిసేవైన వ్రతమస్యా ఇతి పతివ్రతా" పతిసేవయే వ్రతముగాఁ గలది పతివ్రత. (గురు. బా. ప్ర.)

భారతమునఁ గపోతీయోపాఖ్యానంబునఁ గపోతి.

"నసాస్త్రీ త్యభిమంతవ్యా, యస్యాం భర్తా నతుష్యతి
తుష్టే భర్తరినారీణాం, తుష్టా స్స్యుస్సర్వదేవతాః
అగ్నిసాక్షిక మిత్యేవ భర్తావై దైవతం పరమ్
దావాగ్ని నేవనిర్దగ్ధా, సపుష్ప స బకాలతా
భస్మీభవతు సానారీ, యస్యాంభర్తానతుష్యతి
విసృజ్యధన సర్వస్వం, భర్తావై శరణం స్త్రియాః
నకార్య మిహ మేనాథ, జీవితేన త్వయావినా
మితం దదాతిహి పితా, మితం భ్రాతా మితం సుతః
అమితస్యహిదాతారం భర్తారం కానపూజయేత్
నాస్తిభర్తృ సమో నాథో, నాస్తి భర్తృసమం సుఖమ్
విసృజ్య ధనసర్వస్వం, భర్తావై శరణం స్త్రియాః
పరుషాణ్యపి చోక్తాయా। దృష్టా దుష్టేనచక్షుషా
సుప్రసన్నముఖీ భర్తుర్యానారీ సా పతివ్రతా
నకామేషు నభోగేషు, నైశ్వర్యే నసుఖే తథా
స్పృహాయస్యా యథాపత్యౌ. సానారీ ధర్మభాగినీ
పతిచిత్తా పతి హితా సాపతివ్రతభాగినీ

ఏస్త్రీనడవడివిషయమున భర్త సంతోషింపఁడో యది భార్యయని యభిమానింపఁదగదు ఏభార్యవిషయమున భర్త సంతోషించునో దానివిషయమున దేవతలును సంతోషింతురు. అగ్నిసాక్షిక వివాహమునఁ దన్నుఁగైకొన్నవాఁడే తనకు దైవతము. ఎవతె విషయమున భర్త సంతోషింపఁడో యది కాఱుచిచ్చుచేతఁ బూలు కాయలతోఁరాలిన చెట్టువలె దగ్ధమగునుగాక. ధనము సర్వము విడిచి స్త్రీకి భర్తయే శరణము. నాథా నీవులేక నాకీప్రాణములతో నేమిపని. తండ్రి, తోడఁబుట్టువు, కొడుకు మితముగ నిత్తురు. అమితముగనిచ్చువాఁడు భర్తయే. "అట్టిభర్తను నెవతె పూజింపదు? స్త్రీకి భర్తతో సమానముగు దిక్కుగాని సుఖముగాని లేదు. ధనమంతయు వదలి భర్తయే శరణముగా నెంచవలెను. భర్తపరుషములాడినను గోపదృష్టి చూచినను ఏభార్య తాను ప్రసన్నముఖియై యుండునో యది పతివ్రత. భర్తయందుండు ప్రేమకంటెఁ గామమందుఁ గాని భోగమందుఁగాని యైశ్వర్యమందుఁ గాని సుఖమందుఁగాని యెక్కువ ప్రేమలేదో యది ధర్మభాగిని. పతిచిత్తమే తనచిత్తముగను పతిహితమే తనకు హితముగను నెంచునది పతివ్రత. ఇది స్త్రీస్వధర్మము. ఇదిపతి

వ్రతాలక్షణము. ఇట్టి స్వధర్మమున నిలువక పతివ్రతగాని స్త్రీవిషయమున తారతమ్యం బిట్లు చెప్పఁబడెను. "కామాద్ద్వేషాన్మత్సరాద్వా భర్తారం యావమన్యతే సాసప్తజన్మకం యావ, న్నారకీస్యాన్న సంశయః॥ జీవితేనాపి నారీన, భర్తారం వంచయేత్తథా। క్రిమియోని శతంగత్వా, పుల్కసీ జాయతేతతః॥ కామముచేఁగాని ద్వేషముచేఁగాని మాత్సర్యముచేఁగాని భర్తనెవతె యవమానించునో యది యేడు జన్మములు నరకముపాలగును. తనప్రాణము పోవునట్లుండినను భర్తను వంచనచేయరాదు. అట్లుచేసిన స్త్రీ నూఱుజన్మములు క్రిమిగాఁబుట్టి యావల మాలదిగాఁ బుట్టును.

ఈ ప్రమాణములచేఁ గైకేయి స్వధర్మమందు నిలచినదికాదు. పతివ్రతయుఁగాదు. ఇంకుతనమొకటి లేకపోఁగానే స్త్రీ పతివ్రత యనిపించుకొనఁబడదు. కావుననే దశరథుఁడు నీవసతివని కైకను దూషించెను. తనధర్మమందుఁదాను నిలువకుండుటయేగాక కామరోష మాత్సర్యవశయై భర్తకు ధర్మహాని గలిగించెను. ఎట్లన:- రాజ్యమునకు జ్యేష్ఠపుత్రుఁడగు శ్రీరామచంద్రమూర్తి యర్హుఁడని మంథర కైక యిరువురు నంగీకరించినవిషయమె. "కం॥ అనఘా యిక్ష్వాకులలోఁ। దనయుఁడు జ్యేష్ఠుండు రాజ్యతంత్రము దీర్పన్। జనుఁ గులధర్మము విడువక కొనుమీ రాష్ట్రంబు నేలుకొనుమీ ప్రజలన్॥ అని వసిష్ఠుఁడు వంశమర్యాద యనియును జెప్పెను. "ఉ॥ మాకులమందు జ్యేష్ఠుఁడ క్షమాభరమెల్ల భరింపసోదరుల్। ప్రాకట భక్తిచే జనకు భంగిని నాతని గొల్చుటొప్పు న। స్తోకపు ధర్మ మీతెఱఁగు దోఁపదొ నీకిది యెల్లరాజులున్। జేకొను చుంద్రు మీయెడ విశేషముగాఁ గొనియాడఁగాఁబడున్" అని భరతునివాక్యము "జ్యేష్ఠఏవతు గృహ్ణీయా త్పిత్ర్యం ధనమశేషతః। శేషాస్తముపజీవేయు ర్యథైవపితరంతథా॥ విభక్తముగాని వంశమందుఁ బెద్దకొడుకు ధర్మముందుండువాఁడగునేని తండ్రి సర్వస్వము పెద్దకొడుకుదే. తక్కినవా రతనిఁ దండ్రినిఁ గొలిచినట్లు గొలువవలయును.

ఈవిధముగా శాస్త్రము లోకాచారము వంశాచారము ఈమూఁటిచేఁ శ్రీరామచంద్రమూర్తికే రాజ్యమువచ్చుట ధర్మయుక్తము. అట్టి ధర్మమునకు నైశ్వర్య కామముచే, సవతియందలి క్రోధముచే ధనలోభముచే విఘ్నమాపాదించెను. అట్టైన వరములగతి యేమియందురా? పూర్వధర్మమునకు విరుద్ధమైన యుత్తమధర్మము ధర్మముగాదు. ధర్మమునకు ధర్మము విరోధింపరాదు ముందుపూనిన ధర్మమే జరగవలయును కావునఁ గైకవరము కులాగత శాస్త్రీయ ధర్మమునకు విరోధము. దశరథుఁడు ముందు సభలోఁజెప్పినమాటకు విరోధము కావున నది ధర్మమనరాదు. అదియునుగాక నిష్కారణముగ నిరపరాధిని శ్రీరామచంద్రమూర్తిని నాయన చావుగోరి యడవులపాలు చేసెను. ఇది "హా జగడాలమారి కయికా! నెఱవేఱెనుగా త్వదీప్సితం। భోజగజంత వంశ కలశోదధి చంద్రుఁడు గ్రుంకె వంశసద్బీజము పాడుచేసితి" వని సీతాదేవి

దుఃఖించుటచే నెఱుఁగనగు. యుద్ధ. ౬౭౪. "కం॥ సీతాకారణముగనే। వీతానుఁడవైన నీవు వేవురికరుగన్। జేతము రంజిలఁ గామాన్వీత యగుచు భరతు మాత విలసిల్లుఁగదా" అరణ్య. ౯౯౪ అని శ్రీరామునివాక్యము. ఇది వారి యూహామాత్రముగాదు. మంథర కైకతో "శ్రీరాముఁడు కానలోవన విరామత నొందు నిజంబు చూడుమీ" యనెను. అయో. ౨౩౫-౫౫. ఇంతకంటె దురుద్దేశము వేఱొకఁ డుండునా? కులఘ్ని-పతిఘ్ని సుతఘ్నియగు నిల్లాలు పతివ్రతయన నెవరికైన నోరెట్లాడును?

కైక కోపనయగునా కాదా విచారింతము:—కోపనయనఁగా కోపస్వభావము గలది. కోపశీలా కోపనా యని గురుబాల ప్రబోధిక. సీత, కౌసల్య, ద్రౌపది భర్తలపైఁ గోపించుట కామక్రోధ లోభములచేఁగాదు. సహధర్మచారిణియైన తన స్వధర్మమునకు శ్రీరామచంద్రమూర్తి విఘ్నము కలిగించి తన శ్రేయస్సునకు హాని గలిగింపఁ జూచుటచే సీత గోపించెను. ఇది ధర్మ్యమైన కోపము. ప్రణయకోపము దోషయుక్తమైనది కాదు. ఇట్టులే యెవరైనను దమ స్వధర్మమునకు హానిగలిగింపఁ జూచిరేని వారిపైఁగోపింపవచ్చును. ఇఁకఁ గౌసల్యయో. తనయొంటికొడుకు, కులముద్ధరింపవలసినవాఁడు, తనకు నీళ్ళు విడువవలసినవాఁడు; ఇట్టి పరలోక సాధన భూతమైనవానిని నిష్కారణముగఁ గాముక వాక్యమునుబట్టి రెండులోకముల భ్రష్టురాలిని జేసినపుడు అట్టి కామాతురుఁడైన మగనిపైఁ గోపించుట తప్పా? ఇఁక ద్రౌపదియో తన్నుఁ గీచకుఁడు చెఱుచుటకుఁ గంకణము గట్టుకొనియున్నాఁడు. రాజయో వాని కనుకూల. ఇట్టి చోట నేవురుమగలుండియు నొకరైనఁ దనశీలము కాపాడరేని యా మగలుండియుఁ జచ్చినవారేకదా? తాను బలాత్కారముగ నొకనిచేఁ జెడుట తనకే గాక పాండవులకును శ్రేయోహానికదా? అటువంటి సమయమునఁ దనమాన సంరక్షణము చేయుమని మగనిపైఁ గోపించుట దోషమా? కాదు.

మగఁడు తన కనుకూలుఁడుగనుండి తన యిష్టప్రకారమాడుచుఁ గోపింపఁ గారణము లేనపుడు కోపింపకుండుట శాంతిలక్షణముగాదు కోపకారణము గలిగినను కోపింపకుండుట శాంతిలక్షణము.

కం॥ మటమటలాడెడిమోమును। చిటచిటమని కసరికొట్టు చీఁదఱపలుకుల్। కుటిలగుణంబును గలయా। పటుమాయల కైకమోముఁ బరికింపుబిటో. యని కౌసల్య వాక్యము సాక్ష్యము. ఇవి సవతిమాటలు కావున నీ సాక్ష్యమంగీకార్యము గాదందు రేని" ఉ॥ ఏపెమహాపరాధము మునీశ్వరప్రాణముమీఁదఁదెచ్చెని। ష్పాపులకన్నదమ్ములకుఁ బార్థివు స్వర్గతుఁ జేసెనట్టిదొ। పాపిని మూఢచిత్తఖల భామిని నిష్ఠురశీల శాత్య సం। ప్రాపిత భోగదుస్సుభగమానిని కైకయి యిద్దియే సుమీ" భామిని=కోపన. అయో ౨౧౧౪ గీ॥ ఆర్యరూపిణియైన యనార్య యదయ। పాపనిశ్చయ నాదు సంతాపమునకు, మూలకారమైనట్టి మూర్ఖురాలు, నన్నుఁగన్నదిగా నెంచు నన్ను తాథ్య, ౨౧౧౯- అను భరతుని

వాక్యములే సాక్ష్యము ఇది యన్నను నడవులపాలు చేసెనను కోపముతోఁజెప్పిన మాటలందమా యనిన. గీ॥ ఆత్మకామ సదాచండి యతుల కోప. శీలయును భ్రాజమానిని చెనఁటినాదు। తల్లి కేవ్యాధి లేదుకదా"యనితన్నుఁ బిలువవచ్చిన దూతల భరతుఁడడిగెను. అప్పటికి నయోధ్యావృత్తాంతము భరతుఁడెఱుఁగఁడు. దీనివలనఁగైక కోపస్వభావయనుటయందు సందేహములేదు.

మగని యనుగ్రహము సంపాదించుకొను తలంపుతో మగని నిర్బంధించి నను, మంత్ర తంత్రములు మందులుఁ మ్రాకులు మాయోపాయములు చేసి నను నదియు ననతియే. "భారతమున నరణ్యపర్వమున సత్యాద్రౌపదీ సంవాదము చూడుఁడు'—గీ॥ సాధువై నవాని సత్పథ నిరతునిఁ। దీరనాపదలను గూరఁజేయు। ధర్మ హానియగుట తప్పక తెగఁగాల్చు। శక్రుతేజమైన వజ్రగమున అయో. ౧౧౧౧౮- అను మహామాత్య వచనమువలన శ్రీరామచంద్రమూర్తి నడవికిఁ బంపుట మహాపాపకార్యము. ఇట్టి పాపకార్యమునకుఁదగిన ప్రాయశ్చిత్తము పెట్టుకొనకున్న నాశమగుట నిశ్చయము. దానికిఁ గారణమైన కైకను వదలుటయే శాస్త్రీయ ప్రాయశ్చిత్తము. "శ్లో॥ పరిత్యాజ్యా త్వయా భార్యా, భర్తృవచనలంఘనీ। తత్రదోషోన చాస్తీతి, త్వంహి వేత్థ యథాతథమ్॥ సర్వలక్షణయుక్తాపి యాతు భర్తృవ్యతిక్రమమ్। కరోతిసాపరిత్యాజ్యా, ఏషధర్మస్సనాతనః. బ్రాహ్మపురాణము. భర్తమాటను నతిక్రమించు భార్యను వదలిపెట్టవలయును. అట్లు వదలుటయందు దోషముఃలేదు. సమస్త లక్షణములు సరిగానున్నను భర్తనతిక్రమించిపోవు దానిని వదలవలెను. ఇది సనాతన ధర్మము. "అధోలోకమున కరుగునీకుం జెకుఱదు సలోకసుఖము సిద్ధము పతితోన్, అని కదా భరతుఁడు చెప్పెను. కావున దశరథుఁడు కైక విడనాడుట యందే దోషములేదు.

ఉ॥ రాతిరి దీఱె, వేకువయుఁ•రాఁ దొడఁ గెం, దనయాభిషేకకా
 ర్యాతతరక్తిమై గురుచ•యంబులు నన్నిఁకఁ దీవరించు, వి
 ఖ్యాతముగాఁగ రాముని త•దర్థము గూర్చినవస్తుకోటిచేఁ
 బ్రేతము కౌర్ధ్వ దైహికముఁ•బ్రీతిని రాముఁడె సల్పుఁగాపుతన్. ౪౧౮

తన యాభిషేక కార్యతతరక్తిమైన్=నాకుమారుఁడు రాముని నభిషేకకార్యమందలి యతిశయించిన ప్రేమచే,గురుచయంబులు=గురువుల సమూహములు—మంత్రిపురోహితాదులు, తీవరించున్=తొందరపెట్టును, విఖ్యాతముగాఁగన్=ప్రసిద్ధముగ నందఱకుఁ దెలియునట్లు, రాముని తదర్థము = శ్రీరాముని కొఱకు, ప్రేతము=పీనుఁగు, ఔర్ధ్వదైహికముః=దేహమువిడిచిన పిమ్మటఁ ప్రేతములకై చేయవలసిన కార్యములు, సత్త్వాస్తునారకాః ప్రేతాః॥ అమరుఁడు ఈదేహమును విడిచినపిమ్మట నరకమునకుఁబోవు పాపజీవులకుఁ బ్రేతములనిపేరు.నిష్కారణముగ

శ్రీరామచంద్రమూర్తిని నరణ్యములపాలుచేసిన తనకు నరకప్రాప్తి తప్పదని దశరథు నభిప్రాయమని యేర్పడుచున్నది.

ప్రేతముకున్=ఉకారఋకారంబులకు 'కు' షష్ఠీపరమగుచో నగామంబు తఱచుగనగు సు.వ్యా. తత్సమ. ౪౮. సూ. ప్రకారము ప్రేతమునకున్ అని యుండవలెను. అగమసూత్రమని త్యమగుటను, తఱచుగినగునని సూత్రమున నుండుటను నిషధేంద్రుబచ్చుకున్ అని నైషధంబున శ్రీనాథుండును, సంగరంబనినసుత్సవముకే గెడిక్రియసని నాచసనోమనయు, వంతుకు ననియు నిట్టి మహాకవిప్రయోగములుండుటచే నిది దోషముగాదు. దీర్ఘపువర్ణము మీఁద నకారాగమము నిత్యము "కాలకంఠుని శిరసుపూ గగనగంగ" యను శ్రీనాథుని ప్రయోగమువలన పూవుశబ్దపర్యాయము పూయనిశబ్దముగలదు. అది ప్రథమావిభక్తియందే ప్రయోజ్యము. కావున పూవున కనియే చెప్పవలయును. బహువచనమందును, సమాసమందును పువర్ణమువైకల్పికముగ లోపించును.

తా త్ప ర్య ము

రాత్రి ముగిసెను. ఉదయము కావచ్చెను. శ్రీరామాభిషేకమందాసక్తిగల మంత్రిపురోహితాదులు రా రమ్మని నన్నిఁకఁ దీవరింతురు. నేనేమో యిఁక బ్రదుకుట కల్ల. కావున శ్రీరాముని పట్టాభిషేకమునకై సిద్ధముచేసిన పదార్థములతో మరణించిన నాకు శ్రీరాముఁడే యూర్ధ్వలోకప్రాప్తికిఁ జేయవలసిన కార్యములన్నియుఁ జేయునుగాక.

కం॥ ఈకరటిని రాముని యభిషేకమునకు విఘ్నమీవు•చేయుటఁ జెనటీ
నీకొడుకును నీవును నవి,వేకిని నా కింక నీళ్ళు•విడరాదు సుమీ. ౪౧౯

తా త్ప ర్య ము

దుర్మార్గురాలా! నీ వీ విధముగ శ్రీరాముని యభిషేకమునకు విఘ్నము కలిగించుటచే నీవుగాని నీకొడుకుగాని నాకుఁ దిలోదకములు విడువఁగూడదు.

కం॥ మును పెలమి నలరుచుండఁగఁ, గనినట్టిపురీజనంబు•గతహర్షంబై
కనఁగ నవాఙ్ముఖమై కడు, వనటం బడ నెట్లుచూడ•వశమను చుండన్.

ఎలమిన్=సంతోషముతో, గతహర్షము=పోయిన సంతోషముగలది, సంతోషహీనమైనది, అవాఙ్ముఖమై=తలవంచుకొన్నదై, కడున్=మిక్కిలి, వనటంబడన్=దుఃఖింపఁగా.

తా త్ప ర్య ము

శ్రీరామునకు బట్టాభిషేకము జరుగునని యెంతోసంతోషముతో వికాసము నొందిన ముఖములుగల జనులిదుర్వార్తవిని సంతోషముచెడి తలలువంచుకొని కన్నీరు కార్చుచుండ నూరకచూడ నాకు సాధ్యమా.

కం॥ రిక్కలు మాయఁగ జలధికిఁ, జుక్కలఱేఁ డరుగఁ దూర్పు●సొబగు గనంగా
గ్రక్కున రే వేగుట గని, క్రొక్కారు రోషమునఁ గైక●నృపతికి ననియెన్.

రిక్కలు=చుక్కలు_ఋక్షశబ్ద భవము రిక్క. చుక్కలఱేఁడు=నక్షత్రాధిపతి చంద్రుఁడు_వేగుట=తెల్లవాఱుట.

తాత్పర్యము

నక్షత్రములు కానరాకపోయెను. చంద్రుఁడు పశ్చిమ సముద్రమునకుఁ బోయెను. తూర్పు వికాసము నొందెను రాత్రి తెల్లవాఱెను. అవన్ని చూచి యింకను దశరథుఁడు పట్టాభిషేకము నిలుపక పనికిమాలిన మాటలు చెప్పుచున్నాఁడుగదా. అక్కడఁ గార్యము మించునేమో యని కైక కోపమున రాజుతో నిట్లనియెను.

ఉ॥ ఏ మిటు మాటలాడెదు క్షి●తీశ్వర! దుర్విషహోద్భవోరుతీ
వ్రామయతుల్యభాషణము●లాల మిఁ కేటికిఁ? బిల్వఁ బంపుమీ
రామునిఁ గానకుం బనుప●రాజు నొనర్పుము నాసుతున్ నను
న్గామిక నిస్సపత్నగ నొ●నర్పుము ధన్యుఁడ వౌదు వంతటన్. ౪౨

క్షితీశ్వర=రాజా! దుర్విషహ=బొత్తుగ సహింపరానియట్లు, ఉద్భవ=పుట్టినదియు, ఉరు=గొప్పదియు, తీవ్ర=తీక్ష్ణమైనదియునగు, ఆమయ=వ్యాధితో, తుల్య=సమానమైన, భాషణములు=మాటలు, ఆలము=ఉపేక్ష, కామికన్=గర్వమున, నిస్సపత్నగన్=విరోధులు లేని దానిఁగ; ఆలంబాలంబు సేసియనితిక్కన ని. రా.

తాత్పర్యము

ఏమి రాజా! సహింపరానిదై తీక్ష్ణమైన గొప్ప సన్నిపాత రోగము పుట్టినవాఁడు మాటలాడినట్లు మాటలాడుచున్నాఁడవు. ఈప్రొద్దు పోని ముచ్చటలతోఁ గాలక్షేపము చేయవలదు. శ్రీరామునిఁ బిల్వఁబంపి యడవులకుఁ బొమ్మనుము. నాకుమారుని రాజ్యమున నభిషేకింపుము. నన్ను శత్రువులులేని దానిఁగఁజేసి గర్వపడఁజేయుము అప్పుడు నీవు కృతకృత్యుండవగుదువు.

చం॥ సతి యిటు తన్నుఁ బల్క నృప●చంద్రుఁడు తీవ్రకశాభిఘాతబా
ధితగురు ఘోటకంబుగతిఁ●దెప్పున రేఁగి పదించె నోసి యీ
గతి భృశధర్మపాశములఁ●గట్టుపడన్ వెలసెన్, వినష్టమై
స్మృతి చెడి, రామచంద్రు శుభ●శీలుఁ గన న్మది గల్గె నంచనన్. ౪౩

తీవ్ర=మిక్కుటమైన, కశా=కొఱడాయొక్క అభిఘాత=దెబ్బచేత, బాధిత=బాధింపఁ బడిన, గురు ఘోటకంబుగతిన్=గొప్పగుఱ్ఱమువలె, తెప్పునన్=త్వరగా తటాలున, రేఁగి=విజృంభించి, భృశధర్మపాశములన్=శ్రేష్ఠమైన ధర్మమనెడి త్రాళ్ళచే, స్మృతి=తెలివి, దీనిచే శ్రీరామునిఁ గానలకుఁ బంపనిశ్చయించుకొనె నని తెలిపెడిని.

## తాత్పర్యము

తనయిల్లాలు తన్నిట్లు పల్కఁగా రాజశ్రేష్ఠుఁడు చుఱుకైన కొఱడా దెబ్బ చేత బాధపడు నుత్తమజాతి గుఱ్ఱమువలెఁ జివాలున నెగిరిపడి యోసీ నేను నీవిధముగ నతిక్రమింపరాని ధర్మమను త్రాళ్ళచేఁ గట్టుపడవలసి వచ్చెఁబడెను. తెలివి నష్టమయ్యెను. శుభచరిత్రుఁడైన శ్రీరామచంద్రుని జూడఁగోరెదను. అని చెప్పెను.

ధర్మపాశములఁ గట్టుపడవ్ వలసెనని దశరథుఁడు పలికెఁగదా. ఇది యథార్థమా యని శంక.

వాస్తవమున దశరథుఁడు ధర్మపాశబద్ధుఁడుగాఁడు. ఎట్లన:- దశరథుఁడు గృహస్థునిఁగా భావింతమా. పెద్దకొడుకును విడుచుట యధర్మము. అందును భార్యసమ్మతిలేక విడుచుట తప్పు. రాజుగా నాజ్ఞ చేసెనందమా శ్రీరామచంద్రమూర్తియందు దోషములేదు. దోషిగాని వాని దండించుట ధర్మశాస్త్రవిరుద్ధము. హానికరము. అదియునుగాక పూర్వదినమందు సభలోను దరువాత నింటిలోను శ్రీరామచంద్రమూర్తికిఁ బట్టాభిషేకముచేసెదనని చెప్పెను. ఈకారణములచే దశరథుఁడు ధర్మపాశ బద్ధుఁడు కాఁడు. సత్యపాశ బద్ధుఁడగునేమో.

పరిహారము. వాస్తవమున దశరథుఁడు సత్యపాశబద్ధుఁడే. కైకకిచ్చిన వరములు రణవేళ ప్రత్యుపకార బుద్ధితోఁ గృతజ్ఞుఁడై యిచ్చినవి. కాని భార్యయని కామబలమున రతివేళ నిచ్చినవి కావు. అవి నెఱవేర్పని యెడల దశరథుఁడు కృతఘ్నుఁడే యగును. ప్రజల కసత్యమాడ నేర్పినవాఁడే యగును. రాజాను మతము ధర్మము. యథారాజా తథాప్రజా-యద్యదాచరతిశ్రేష్ఠః తత్తదేవేతరోజన" యని ప్రజ లసత్యవర్తను లగుదురు. ప్రజలలో నెవఁడైన నసత్యమాడెనేని రాజేమని దండింపఁగలఁడు. ఎవతెకో కాదు భార్యకు. ఎప్పుడో కాదు. ప్రాణరక్షణము చేసినపుడు; దేనికో కాదు కృతజ్ఞతకై చేసిన సత్యమును నీవు తప్పితివే నేను దప్పిన నేమి దోషమని యాదోషి యడిగిన దశరథుఁడేమి చెప్పఁగలఁడు? కావునఁ బెద్దకొడుకును విడిచియైనఁ బ్రాణము విడిచియైన లోకము నిమిత్తమై సత్యపాశబద్ధుఁడు కావలసి వచ్చెను. "సతాం కేనాపికార్యేణ లోకస్యారాధన వ్రతమ్। యత్పూజితం హి తాతేన, మాంచ ప్రాణంచ ముంచతా॥ ప్రభువుల కేకార్యము చేసియైన లోకారాధనముచేయుట వ్రతము. నాతండ్రి నన్నుఁ బ్రాణములను వదలి దానిని గౌరవించెను గదా" యని శ్రీరామచంద్రమూర్తి వాక్యములుగ భవభూతి రచించెను. (ఉత్తర. ౧-౪౧.) దశరథుఁ డీయధర్మకార్యము నేనెట్లుచేయుదునని యంగలార్పఁగా నీయభిప్రాయ ప్రకార మధర్మమగునేని నాయభిప్రాయ ప్రకారము ధర్మమే యేలననేను నిన్ను సత్యమందు నిలువుమని బలాత్కరించుచున్నాను. సత్యమునుమించిన

ధర్మములేదు. అన్ని ధర్మములలో సత్యభాషణమే శ్రేష్ఠమైనది. కావున నిది యధర్మమెట్లగునని కైక వాదించెను. అటయిన శ్రుతీతిహాస పురాణములందు సత్యము ధర్మము వేఱువేఱఁ జెప్పఁబడ నేలయనిన సత్యము విశేషధర్మము. ధర్మము సామాన్య వాచకము. ధర్మమునం దనేక భేదములు గలవు. అందొకటి సత్యము దేహమునందలి యవయవములలో శిరస్సువలె ధర్మములందు సత్యము. శిరస్సులేని దేహమెట్టిదో సత్యములేని ధర్మమట్టిది. "శిరోహి సర్వగాత్రాణాం ధర్మాణాం సత్యముత్తమమ్" అని మనువు. కైకచెప్పినదిదియే. తలఁపుమీ నీవింత ధర్మవిధము. ధార్మికులు సత్యమే పరమధర్మమనరె. నీ వధర్మంబు చలుపఁగ నేను సత్యమూఁతగాఁ బట్టుపఱిచెద" ననెను. అయో. ౪౦౮. కావున దశరథుఁడు ధర్మపాశబద్ధుఁడనైతి ననుటయందు దోషములేదు.

కం॥ అంతటఁ దూర్పున నళినీ, కాంతుఁడు తోతెంచె విరియఁగాఁ జీఁకటు ల
త్యంతముదాసె ముహూర్తం,
బంత వసిష్ఠుండు స్నాతుఁడై యోగ్యగతిన్. ౪౨౪

నళినీ కాంతుఁడు=సూర్యుఁడు, తోతెంచెన్=ఉదయించెను. (తోఁచు+తెంచు=తోతెంచు) విరియగాఁన్=విరిసిపోఁగా, అత్యంతము=మిక్కిలి, దాసెన్ సమీపించెను, స్నాతుఁడై = స్నానము చేసినవాఁడై, యోగ్యగతిన్=తగిన విధముగ.

తాత్పర్యము

ఇంతలోఁ జీఁకటులు పలుచన పాఱుచుండ సూర్యుఁ డుదయించెను. ముహూర్తము కేవలము సమీపించెను. అంత వసిష్ఠుఁడు సరయువునకుఁబోయి స్నానముచేసి తగినరీతిని

వసిష్ఠశబ్దార్థమును వసిష్ఠుఁడే యిట్లు చెప్పెను. "శ్లో॥ వసిష్ఠోస్మి వరిష్ఠోస్మి వసేవాసగృహేష్వపి వరిష్ఠత్వాచ్చ వాసాచ్చ, వసిష్ఠ ఇతివిద్ధిమామ్" భార. అను. ౧౪౩ అధ్యా.

వ్యాఖ్య

వాయుశ్చ పృథివీచేతి శ్రుతిప్రసిద్ధావాయ్వాద యోవసవస్తే యస్య స్వాధీనా భవంతి సవసుమాన్ ప్రాప్త్యాదీ మాద్యైశ్వర్యో మహాయోగి। అతిశయేన వసుమానితి వసిష్ఠస్తాదృశోహమస్మి వసుమచ్ఛబ్దాదిష్ఠన్ప్రత్యయే పరేమతుబ్లోపేటిలోపేచ వసిష్ఠః॥ వాసగృహేషు వావయోగ్యేషు గృహస్థాశ్రమేషు సర్వేషాముపజీవ్యేషు వసేవసామి అతోహం వస్తౄణాం మధ్యే అతిశ్రేష్ఠ ఇతివసిష్ఠోస్మి॥ నీలకంఠ॥ వాయువుపృథివి మొదలయినవి వసువులనఁబడును. అవి స్వాధీనమందుఁ గలవాఁడు వసుమంతుఁడు. అనఁగా నణిమాద్యైశ్వర్యము గలవాఁడు. వసుమంతులయందు నేను శ్రేష్ఠుఁడను గావున వసిష్ఠుఁడను, గృహస్థాశ్రమ మందుండు వారిలో నెల్లనేను శ్రేష్ఠుఁడను గావున వసిష్ఠుఁడను.

—•వసిష్ఠుఁడు పట్టాభిషేక సంభారములతోఁ జనుదెంచుట.•—

సీ॥ ఛాత్రసమేతుఁడై•సకలసంభారముల్, గొంచుఁ బురంబుఁ జొ•త్తెంచుచోట
సిక్తసమ్మార్జిత•శ్రీపథంబును మాల్య,బృందసుమాకీర్ణ•సుందరంబు
చిత్రధ్వజాళిభూ•షితము సంహృష్టలో,కపటలంబు సమృద్ధ•విపణివీథి
కీర్తితోత్సవసమా•కీర్ణంబు, చందనా, గురుధూపధూపిత•కూటచయము
తే॥ నుర్వీజాధవహేతుస•ముత్సుకంబు. చారుశోభామరావతీ•సన్నిభంబు
నైనపురమును గనుచు నం•దంద కడచి,
యధిపునంతఃపురంబు డా•యంగవచ్చె ౪౨.

ఛాత్రసమేతుఁడై=శిష్యులతోఁ గూడినవాఁడై, సకలసంభారముల్=పట్టాభిషేకమునకుఁ గావలసిన తాను దేవలసిన సకల వస్తువులు, పురంబున్=అయోధ్యానగరమును, చొత్తెంచు చోటన్=ప్రవేశించు సమయమందు దీని వలననే వసిష్ఠుఁడు సరయువునందు స్నానము చేసివచ్చెనని సూచితము. స్నాన మనునది తక్కిన కర్మముల కుపలక్షణము. సిక్త=జలముచేఁ దడుపఁబడినదియు=సమ్మార్జిత=కసవు చిమ్మఁబడినదియు నయి, శ్రీ=కాంతియుక్తమైన, పథంబును=మార్గమును. మాల్యబృంద = పూలదండల సమూహముచేతను, సుమాకీర్ణ=చల్లఁబడిన విడిపూలచేతను, సుందరము=అందమైనది, చిత్ర=పెక్కుతెఱంగులగు రంగులు నాకారములుగల, ధ్వజాళి=ధ్వజముల సమూహములచే, భూషితము=అలంకరింపఁ బడినది, సంహృష్ట=మిక్కిలి సంతోషించిన లోకపటలంబు= జనసమూహముగలది. సమృద్ధ=అన్నిరకముల వస్తువులచే నిండియుండు విపణివీథి=అంగడి వీథులు గలది. కీర్తితోత్సవ సమాకీర్ణంబు=పొగడఁబడిన యుత్సవముచే వ్యాపించినది. చందనాగురు ధూపధూపిత కూట చయము=శ్రీగంధపుఁబొడి అగురు వీని పొగలచేతఁ బొగవేయఁబడిన యిండ్ల సమూహములు గలది. ఉర్వీజాధిప=సీతాపతియగు శ్రీరాము నిమిత్తమై సంతోషించునదియు, చారుశోభామరావతీ సన్నిభంబు=మనోహరకాంతియందు దేవతా నగరమైన యమరావతితో సమానమైనదియు, అందంద=ఆయాప్రదేశములను వరుసగ, కడచి=దాఁటి.

తాత్పర్యము

వసిష్ఠుఁడు సరయువునందు స్నానముచేసి నిత్యకృత్యములు దీర్చుకొని తాను దేవలసిన పదార్థములను శిష్యులచే నెత్తించికొని పురంబునఁ బ్రవేశించి రాజు నంతఃపురంబునకు వచ్చుచుఁ ద్రోవలోఁ గసవుచిమ్మినీళ్ళుచల్లి శోభిల్లఁ జేసి యందందు పూలదండలు కట్టి విడిపూలెగఁజల్లి నానావిధములైన ధ్వజములచే నలంకరించి సంతోషయుక్తులైన జనులు సంచరింపఁగా సకలపదార్థముల వారిగా నుంచిన యంగళ్ళుగల వీథులను శ్రీరామ పట్టాభిషేకము శ్రీరామపట్టాభిషేకము అని పొగడుచు సంతోషించు జనులచే వ్యాపించినవియు శ్రీగంధము అగురు వీని ధూపవాసనలచె

గుమాయించునవియు శ్రీరాముఁడు కారణముగా నాయన నిమిత్తమై సంతోష పడుచున్నవియునగు నిండ్లుగలిగి దేవతానగరమైన యమరావతితో సమానమైన పురమును జూచుచునాయాప్రదేశములుదాఁటి దశరథునంతఃపురము సమీపంబు నకు వచ్చెను.

కం॥ కలకల మనికూసెడిపక్షులతోఁ బురజనులలోడ•శుచిమద్ద్విజకో
టులతో ద్విజతతితో సభ్యులతోఁ జెలువారు నంతి•పురముం గనుచున్.

వసిష్ఠుఁడు వచ్చువఱకుఁ బురమున్న విధము వర్ణించి యిఁక రాజ గృహమున్న విధమునగవి వర్ణించుచున్నాడు. శుచిమత్=నిత్యాగ్నిహోత్రములు గల, ద్విజకోటులతో=బ్రాహ్మణులతో, ఇట్లనుటచే నగ్నిహోత్రములు దీర్చు కొని బ్రాహ్మణులు వచ్చిరని భావము. శుచి=అగ్ని, ద్విజతతితో=ఇతర బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులతో

తాత్పర్యము

కలకలమని కూయుచున్న పెంపుడు చిలుకలు మొదలైన పక్షులధ్వనుల తోఁ బౌరులతో నిత్యాగ్నిహోత్రులైన బ్రాహ్మణులతో నితర బ్రాహ్మణక్షత్రియ వైశ్యులతో సభకు యోగ్యులగు సామంతాది రాజులతో నంతఃపురము నిండి యుండఁగాఁ జూచుచు.

—• వసిష్ఠుఁడు దనరాక దశరథునకుఁ దెలుప సుమంత్రుఁ బంపుట. •—

ఉ॥ మూఁగిన యట్టిమూఁకలను•మున్నుగఁ బాయఁగఁ జేసి ప్రీతిమై
లోఁగిటి కేగుచో నిజవి•లోకనగోచరుఁ డౌచు వెల్వలన్
రాఁగ విశారదున్ సుమతి•బ్రాజిత మంత్రివరున్ సుమంత్రునిన్
దాఁ గనుచున్ మదాగమము•ధారణినేతకుఁ దెల్పు వేగమే. ౪-౨౭

నిజవిలోకనగోచరుఁడు=తనకన్నులకుఁ గానవచ్చినవాఁడు, మదాగమము =నారాక. ధారణి నేతకున్=రాజునకు, ప్రాజితన్=సారథిని.

తాత్పర్యము

గుంపులు గుంపులుగా నిలుచున్నవారిని ముందుగాఁ దొలఁగిపొండని చెప్పి త్రోవ యేర్పఱుచుకొని లోపలికి పోవునపు డెదురుగా వెలుపలనే కాన వచ్చిన కార్య సమర్థుఁడును మంచి మనస్సుగలవాఁడు సారథియు మంత్రియు నగు సుమంత్రుని జూచి మంత్రీ నేను వచ్చియున్నాఁడ నని వేగమే రాజునకుఁ దెలుపుము.

సీ॥ ఇవె గంగాజలపూర్ణ•హేమకుంభంబులు,నివె సింధుజలఘటీ•బృందములును
అభిషేకమునకుఁగా•నాహృతంబైన యౌ,దుంబరభద్ర పీ•ఠంబు నదిగొ
సకలబీజంబులు•క్షౌద్రంబు మణిగంధ, దధిఘృతజలాజలు•దర్భ లవియె
యష్టకన్యలు వారె•యదిగొ ఖడ్గము మత్త,వారణ మదె పూలు•పాలునవిగొ
ఆ॥ నతులహయచతుష్క•మదిగొఁ దేరు ధనుస్సు,నరవిరాజివాహ•నంబు నదిగొ
నదిగొఁ దెల్లగొడుగు•నవె వెలిచామరల్,గనకకలశ మదిగొఁ•గనఁగదయ్య.

వసిష్ఠుఁడు కార్య నిర్వహణమందుఁ దన లోపమేదియు లేదని చెప్పు చున్నాఁడు.

గాంగజల పూర్ణ హేమకుంభంబులు=గంగానది నీళ్ళతో నిండిన బంగారు కుండలు, సింధుజలఘటీబృందములు=సింధునది నీటినిగల కుండలసమూహ ములు, ఆహృతము=తేఁబడినది, ఔదుంబర భద్రపీఠము=అత్తికఱ్ఱతోఁ జేయఁ బడిన మేలిపీఁట, క్షౌద్రంబు=తేనె, సకల బీజంబులు = నవ్యధాన్యములు, లాజలు=పేలలు, మత్తవారణము=మదపుటేనుఁగు, అతులహయ చతుష్కము= సాటిలేని నాలుగు గుఱ్ఱములు, వరవిరాజి=మనుష్యులచేఁ బ్రకాశించు, వాహ నము=పల్లకి వెలిచామరల్=తెల్లవింజామరములు, కనకకలశము=బంగారు పాత్రము.

### తాత్పర్యము

సుమంత్రా నేను దెప్పింపవలసిన వెల్లఁ దెప్పించితిని. ఇవిగోఁ జూడు. ఇవి గంగానదీ జలములుగల బంగారుకుండలు. ఇవి సింధునదీ జలములుగల బంగారు కడవలు. అభిషేకమునకుఁ గావలసిన యత్తిచెక్కల పీఁట. ఇవె నవ ధాన్యములు. తేనె, రత్నములు గంధము పెరుఁగు నేయి పేలలు దర్భలు కన్యలెనమండ్రు, ఖడ్గము, మదపుటేనుఁగు మనుష్యులుగలపల్లకి, తెల్లగొడుగు, తెల్లచామరలు, బంగారు కలశము. ఇవియన్ని చూడుము.

సీ. బంగారుతలుగులు•బలుమూఁపురంబును,గలతెల్లయాఁబోతుఁ•గాంచవయ్య
నాలుగుకోఱల•నలువారుకేసరి, సత్వవంతము హరి•సత్తమ మదె
సింహాసనం బదె•చెలఁ గెడిఁ బులితోలు, నదె ప్రజ్వరిల్లుహు•తాశనుండు
వాదిత్రసంఘంబు•వఱలెడి నదిగొ సమాలంకృతంబు వే•శ్యాజనంబు
తే. బ్రాహ్మణులు వారె, యాచార్య•రాజి యదిగొ,
నావు లవె, పుణ్యమృగపక్షు•లవిగోఁ, బౌర
జానపదులు వైశ్యులు•క్షత్రియులును
వారె కొలు వెల్ల నిండిన•వారు కంటె. ౪౨౮

ఆఁబోతు=ఆవు + పోతు=పుంగవము, కేసరి=సింహము, హరిసత్తమము =శ్రేష్ఠమగు గుఱ్ఱము, వాదిత్రసంఘము=వాద్యములు వాయించువారి గుంపు సమాలంకృతంబు=చక్కఁగా నలంకరింపఁబడినది.

### తాత్పర్యము

అవిగోఁ బసులఁ గట్టెడి పలుపులు, పెద్దమూఁపురముగల యాఁబోతు, నాలుగు కోఱల సింహము, ఉత్తమజాతి గుఱ్ఱము, అదిగో సింహాసనము, పులి తోలు అదే మండుచున్న యగ్నిహోత్రము,వారె మంగళవాద్యము వాయించు వారు, సింగారించుకొన్న వేశ్యలు బ్రాహ్మణులు, ఆచార్యులు, ఆవులు, పుణ్య

మృగములు, పక్షులు, పౌరజనులు, వైశ్యులు, క్షత్రియులు, చూచితివా! వీరందఱు కొలువుకూటము నిండియున్నవారు.

తే॥ రామచంద్రుండు పుణ్యతా◆రకను రాజ్య,
మందుఁ గావుత, నీవేగి◆యవనిపాలుఁ
దీవరింపుము, రవియుఁ దో◆తెంచె ననిన,
సత్వరంబుగ నతఁ డేగి◆నృపుకొఱకు ౪౩౦

పుణ్యతారను=శుభకరమైన నక్షత్రమున, తీవరింపుము = వేగిరింపుము సత్వరంబుగన్=వేగముగ.

పుణ్యనక్షత్రమందు శ్రీరామునకుఁ బట్టాభిషేకము జరుగవలయును. ముహూర్తము మించరాదు. కావున నీవు పోయి సర్వము సిద్ధముగానున్నదని చెప్పి రాజును జాగులేక వేగిరించి పిలుచుకొని రమ్ము అని వసిష్ఠుఁడు చెప్పఁగా, సుమంత్రుఁడు శీఘ్రముగ రాజుకొఱకై పోయెను.

ఆ॥ ముతుక రాజవర్య◆మతికి నెక్కినవాని, నంతిపురికి నైన◆నడ్డులేక
విడువఁ దగు న టంచుఁ◆బుడమిఱేఁ డానతి,
నిడుట మున్నె పోవ◆విడిచె గొల్ల ౪౩౧

ముతుకన్=ముసలివానిని, గొల్ల=ద్వారపాలుఁడు.

తాత్పర్యము

ముసలివాఁడును రాజునకు సమ్మతుఁడును విశ్వాసపాత్రుఁడును నగు సుమంత్రుని నెప్పుడైన నంతఃపురములోనికి విడువవచ్చునని పూర్వమే రాజు సామాన్యముగా నాజ్ఞ యిచ్చియుండుటచే ద్వారపాలుఁ డడ్డము చెప్పక రాజాజ్ఞకై కాచుకొనక లోపలఁ బోవవిడిచెను.

—◆ సుమంత్రుఁడు దశరథుని నిద్ర మేలుకొలుపుట. ◆—

చం॥ వసుమతినాథుఁ డున్న దుర◆వస్థ యెఱుంగనివాఁడు గావున
న్వెసఁ జని యాసుమంత్రుఁ డవ◆నీపతి డాసి, ఘటించి యంజలిన్,
బస గలసూక్తులం బలికెఁ◆బార్థివవర్యునిఁ గూర్చి తాఁ బ్రభా
తసమయయోగ్యపద్ధతిని◆దద్దయు భక్తిపురస్సరంబుగన్. ౪౩౨

వసుమతినాథుఁడు=రాజు, దురవస్థ=కష్టస్థితి, వెసన్=త్వరగా. ప్రభాత సమయ యోగ్యపద్ధతిని=ఉదయకాలమున కుచితమైన మార్గమున;

తాత్పర్యము

సుమంత్రుఁడు రాజుండు కష్టదశ యెఱుఁగఁడు. కావున సుమంత్రుఁడు త్వరగా లోపలికిపోయి రాజును సమీపించి చేతులు జోడించి సారవంతమైన మంచి మాటలను నుదయకాలమునఁ బ్రబోధింప యోగ్యమగు రీతిని భక్తితో రాజు నుద్దేశించి యిట్లనెను:

సీ॥ అవధారు దేవ! త•మోరిరాకను వార్ధి, పొంగెడిరీతి ను•ప్పొంగు మెలమి
నసురారి యైనబ•లార్కి వ్యాతలి మేలు,కొలుపుభంగిని మేలు•కొలుపువాఁడ
సాంగవిద్యామ్నా య•మిజ్జసంభవుని బో,ధించుచందాన బో•ధించువాఁడ
నవనీతలంబు సూ•ర్యాచంద్రములయట్లు, బోధించువాఁడ నిన్•భూపవర్య
తే॥ వేగలెమ్ము మహారాజ•వివిధరుచిర, మంగళాలంకృతుండ వై •మహితభంగి
స్వర్ణగిరి వీడి వచ్చుభా•స్కరుని పగిది,
రమ్ము రజేంద్ర లోకంబు•రంజిలంగ. ౪౩౭

అవధారు=వినుము, ఇది అవధారయ యను సంస్కృత పదముయొక్క తత్సమరూపము, కొందఱు దీనిని తవర్గ చతుర్థవర్ణము కలిమిని వైకృతానిందర్య గ్రామ్యమనెదరు. కాని దీనిని సాధింపనంత శ్రమపడవలసిన పనిలేదు.తమోరి=చీఁకటికి శత్రువగు చంద్రుని, తమోరి. (1) సూర్యుఁడు (2) చంద్రుఁడు (3) అగ్ని. బలారి=ఇంద్రుఁడు, మాతలి=ఇంద్రుని సారథి, సాంగ, విద్యా=శిక్ష మొదలగు నంగములతోను ఉపాంగములతోను కూడిన,ఆమ్నాయము=వేదము అబ్జసంభవునిన్=బ్రహ్మను, నామరూపంచ భూతానాంకృత్యానాంచ ప్రపంచనం వేదశబ్దేభ్య ఏ వాదౌ దేవాదీనాంచకారస" యను మను వాక్యము నిచట నను సంధింపఁదగు. సమ స్తభూతములకు దేవతలకు నామము రూపము కృత్యము మొదలైనవి బ్రహ్మవేదశబ్దముల వలననే తెలుసనేర్చుకొనెను. సూర్యాచంద్రముల యట్లు=సూర్యచంద్రులవలె, దేవతా ద్వంద్వేచ=పాణిని ౬-౩-౨౬. వాయుశబ్దప్రయోగే ప్రతిషేధః అను పాణిని సూత్రప్రకారము దీర్ఘము, వివిధ=అనేకములగు, రుచిర=మనోహరమైన మంగళాలంకృతుండవు=శుభకరములైన యలంకారములు చేసికొన్నవాఁడవు, స్వర్ణగిరి=మేరుపర్వతము, ప్రకృతము సాక్షాత్సంబంధములేదు, అందు సూర్యుఁడుదయింపఁడు. అయినను గక్ష్య సంబంధము వలన నిట్లు చెప్పఁబడెను.

తాత్పర్యము

దేవా వినుము. పూర్ణచంద్రోదయమున సముద్రము పొంగినట్లు శ్రీరామాభ్యుదయంబున సంతోషముతో నీవు నుప్పొంగుము. రాక్షస విరోధియగు నింద్రుని నతని సారథి హెచ్చరించునట్లు నీకు సారథినైన నేను నిన్ను హెచ్చరించుచున్నాను. అంగములతో నుపాంగములతోఁగూడిన వేదము సృష్టి విషయమై బ్రహ్మదేవుని బోధించునట్లు నీవు జరుపవలసిన రాజకార్యములందునేను బోధించుచున్నాను. మహారాజవేగలెమ్ము, మంగళకార్యము జరుగవలసియున్నది. కావునఁ దగినరీతి నలంకరించుకొని మేరుపర్వతము విడిచి వచ్చు సూర్యునివలె నీవును లోకము సంతోషింపఁ జేయరమ్ము.

కం॥ సోముఁడు సూర్యుండును సు,
 త్రాముఁడును మహేశ్వరుండు•ధననాయకుఁడున్
 భూమిప వరుణుం డగ్నియు,నోముదురు జయంబు నీకు•నొప్పగ నిడుచున్.

సోముఁడు=చంద్రుఁడు, సుత్రాముఁడు=ఇంద్రుఁడు, మహేశ్వరుండు=శివుఁడు, ధననాయకుఁడు=కుబేరుఁడు, ఓముదురు=రక్షింతురు.

తాత్పర్యము

చంద్రుఁడు సూర్యుఁడు ఇంద్రుఁడు ఈశానుఁడు కుబేరుఁడు వరుణుఁడు అగ్ని వీరు నీకు జయ మిచ్చిరక్షింతురుగాక.

చం॥ భగవతి రాత్రి దీఱెను, ప్ర•భాతము మీఱె, నితః పరోచితం
 బగుక్రియలన్ ఘటింప సమ•యం బరుదెంచెను, లెమ్ము నీ విఁకం
 దగుగతిఁ బౌరజానపద•నైగమసంవృతుఁడై వసిష్ఠుఁ డొ
 ప్పగ నటనున్నవాఁ, డిడుము•పుత్రునిఁ బట్టము గట్ట నానతిన్. ౪౩౫

భగవతిరాత్రి=శ్రీమతి- ఐశ్వర్యవతి- కీర్తిమతి యగురాత్రి, శ్రీరాముల పట్టాభిషేకము నిశ్చయింపఁ బడిననాఁటి రాత్రి కావున నది యట్లు పొగడఁబడినది. ఇతః పరోచితము=ఇఁక మీఁద జరుగవలసిన యర్హకృత్యము, పౌర = అయోధ్యాపురజనులు, జానపద=పల్లెటూళ్ళవారు, నైగమ=రాష్ట్రమునందలి నగరములవారు."నైగమస్త్వావనిషది దంతే వణిజ నాగరే" నానా-సంవృతుఁడై = చుట్టఁబడినవాఁడై, ఆనతిన్=ఆజ్ఞను.

తాత్పర్యము

శ్రీమంతమైనరాత్రి పోయెను ప్రభాతమయ్యెను. ఇఁక జరగవలసిన కార్యములు దీర్చుసమయము వచ్చెను. నీ విఁకలెమ్ము. అయోధ్యాపురవాసులతోను గూడి వసిష్ఠుఁడు నీరాక వేచి సభామందిరమున నున్నవాఁడు. నీవు వచ్చి పుత్రునకుఁ బట్టముగట్ట నాజ్ఞ యిమ్ము.

కం॥ కావరి లేనిపశుల్ ధ్వజి, నీపాలుఁడు లేనిసేన•నెల లేనినిశల్
 గోపతి యెడసినకదుపులు, భూపాలకః రాజు లేని•పురరాష్ట్రంబుల్. ౪౩౬

కావరి=కావుచేయువాఁడు, ధ్వజనీపాలుండు=సేనానాయకుఁడు, నెల = చంద్రుఁడు, గోపతి=వృషభము, ఎడసిన=ఎడఁబాసిన, కదుపులు=ఆవులు.

తాత్పర్యము

నేను రాకుండిననేమి, కార్యముచలుప రాదాయందువేమో. రక్షకుఁడులేని పశువులు, దళవాయిలేనిసేన, చంద్రుఁడు లేనిరాత్రులు, మందకుఁ బెద్దయగు వృషభములేనియావులు, రాజులేని నగరము రాష్ట్రము సమానములు, రాజు లేక యేదియు శోభింపదు. కావున నీవేవచ్చి శ్రీరామపట్టాభిషేక కార్యముఁ దీర్పుము.

ఆ॥ అనిన నర్థవంత•మైనయాసామోక్తి, విని విషాదగరిమ•విభుఁడు శోక
శోణలోచనముల•సునిశితమర్మవి, భేదనోక్తిఁ గష్ట•పెట్టి దేల. ౩౪

అర్థవంతము=ప్రయోజనముతోఁ గూడినది- ప్రాతఃకాలపు మేలుకొలుపు జయప్రదము కావున జయమను ప్రయోజనముకలది (౨) పట్టాభిషేకమను ప్రయోజనముకలది.సామోక్తి=మంచిమాట,విషాదగరిమన్=దుఃఖాతిశయముచే, శోకశోణలోచనములన్=శోకముచేనెఱ్ఱనైన కన్నులు,సునిశిత=మిక్కిలి పదునైన, మర్మవిభేదనోక్తిన్=మర్మములను భేదించుమాటచే.

తాత్పర్యము

ప్రయోజనముతోఁ గూడిన మంచిమాటల నిటు సుమంత్రుఁడు పలుకఁగా శ్రీరామాభిషేకము జరుగఁజాలదు. కావున నవినిష్ప్రయోజనములు క్రూరములై తోఁచుటచే దుఃఖాతిశయమున రాజేడ్చుటచే నెఱ్ఱనైన కన్నులతో నోయీ మర్మముల భేదించువాఁడివాక్యముల నన్నేల కష్టపెట్టెదవు?

కం॥ అన నృపుసకరుణవాక్యము,లను విని కని యతనివిహ్వ•లత్వంబును గే
లిని మోడ్చి జరగెఁ గొంచెము,వెనుకకు సూతుండు మదిని•వెఱ నివ్వటిలన్. ౩౫

సకరుణ=దుఃఖముతోఁగూడిన, విహ్వలత్వంబును = వెరవెరపోవుటను, నివ్వటిలన్=కలుగఁగా.

తాత్పర్యము

అనఁగా నారాజు పలికిన శోకముతోడి మాటలను విని యతని మనస్సు చెదరియుండు స్థితినిజూచి సమయ మెఱుంగక వచ్చితినిగదా యని భయపడి కేలుమోడ్చి కొంచెము వెనుకకుఁ బోయెను.

—• కైక సుమంత్రునితో శ్రీరాముని దోడితెమ్మని చెప్పుట. •—

ఉ॥ తా నయి చెప్పలేక పతి•దైన్యమునం బడియుంటఁ జూచి యూ
హానిధి కైక పల్కె సచి•వాగ్రణితోఁ బతి రామహర్ష సం
ధానితమానసుం డగుచుఁ•దద్దయు నిద్దుర లేమి శ్రాంతుఁ డై
తా నిటు లిప్డు కన్గనికె•దానఁ జూమీ వచియింపఁ డేమియున్. ౩౬

దైన్యమునన్=శోకమువలన దీనత్వముచే, ఊహానిధి=సమయోచితమగు నాలోచనలకు గనివంటిది, స్వకార్యసాధన తత్పరగావున నసత్యమాడుటకును జంకదు. సచివాగ్రణితోన్=మంత్రిశ్రేష్ఠునితో, రామహర్ష సంధానిత మానసుండు =శ్రీరాముని విషయమైన సంతోషముచేఁ గూడిన మనస్సుగలవాఁడు, శ్రాంతుఁడై=అలసినవాఁడై, కన్గనికెన్=కన్నుమూసెను.

తాత్పర్యము

శ్రీరాముని౯ బిలుచుకొని రమ్మని తానై చెప్పలేక శోకముచే దీనుఁడై పడి యుండు దశరథునిఁజూచి తన కార్యము సాధించుకొనుటయందు సమయోచితముగ నేదైన౯ జేయనేర్చిన, యూహలకు స్థానమగు, కైక యబద్ధమాడ రోయక మంత్రిశ్రేష్ఠుఁడైన సుమంత్రునితో నిట్లనెను సుమంత్రా రాత్రియంతయు శ్రీరామ పట్టాభిషేక విషయమైన సంతోషముతో నిద్దురలేకయుండి యిప్పుడే రాజు కన్ను మూసెను. కావున నేమియు౯ జెప్పఁజాలకున్నాఁడు.

కం॥ సూతా! వేగము చని యా,సీతాపతిం దోడితెమ్ము•చెచ్చెర నిటకున్
గాత శుభము నీ విది యే,
మో తలఁపకు మనిన నతఁడు•ముద మెద మెదలన్. ౪౪౦

తాత్పర్యము

సారథీ: నీవు శీఘ్రమున౯ బోయి రాజుగారు రమ్మనుచున్నారని శ్రీరామచంద్రుని నిటకుఁద్వరగా౯ బిలుచుకొనిరమ్ము నీకు మేలగుఁగాక. నేనేమో చెప్పితినని యెంచకుము అనఁగా నతఁడు సంతోషించి తనలో.

కం॥ రామాభిషేకమునకే, యీమానిని తఱిమి చెప్పె • నీ గతి నిజ మీ
భూమీశుండు తదర్థమె, యీమెయి నాయాసపడెడు•హితధర్మమతిన్. ౪౪౧

తఱిమి=నొక్కి- తొందరపఱిచి, హితధర్మమతిన్=మేలుధర్మముతోఁగూడిన మనస్సుతో.

తాత్పర్యము

శ్రీరామాభిషేకము నిమిత్తముగానే యీమె యిట్లు తొందరపఱిచి చెప్పుచున్నదో: సత్యము రాజుకూడ నావిషయముననే హితము ధర్మము నెంచుచు నాయాసపడుచున్నాఁడు.

ఉ॥ నిక్కము రామచంద్రునకు • నేఁ డభిషేక మటంచు౯ బొంగి తా
గ్రక్కన౯ గౌసలేయు౯ గను•కాంక్షను నంతిపురంబు వీడుచున్
గ్రిక్కిఱిమూఁకలం గడచి•కేల మహాధనముల్ వహించి లో
నెక్కువమక్కువం జెలఁగు•హృష్టుల౯ బౌరుల రాజులం గనెన్. ౪౪౨

గ్రక్కన=శీఘ్రముగా, కౌసలేయున్ = శ్రీరాముని, క్రిక్కిఱిమూఁకలు = పోవసందులేకుండ౯ గ్రిక్కిఱిసిన గుంపులు- క్రిక్కు+ఇఱియు=క్రిక్కిఱియు- వృత్తియం దంత్యాక్షరలోపము, మహాధనముల్=కానుకలు, కాంక్షను=కోరికను, హృష్టులను=సంతోషించినవారిని.

తాత్పర్యము

శ్రీరామచంద్రునకు నేఁడభిషేకము జరగుట నిజమని పొంగి శ్రీరామచంద్రుని దర్శించుటకై వెంటనే యంతఃపురమువదలి సందులేకుండ మిక్కిలి

యిఱిసికొన్నియున్న గుంపులనుదాఁటిపోయి తమహస్తములందు శ్రీరామున కిచ్చుటకై కానుకలు ధరించి యతిశయించిన ప్రేమచే సంతోషించియున్న పౌరులను రాజులను జూచెను. ౧౫-వ సర్గము.

సీ॥ వేగుఁబోకనులేచి•వేదపారగులైన, బ్రాహ్మణుల్ సభ దీరి•బాహిరముగఁ
బట్టనస్థులు దళ•వాయులు మంత్రులు, నితరముఖ్యులు నొక్క•యెడను జేరి
ప్రొద్దదో యుదయించెఁ•బుష్యంబు ప్రాప్తించె,
లక్ష్మణాగ్రజుజన్మ•లగ్నమిదియ
యభిషేకమునకయి•యమరించి నట్టియా, వస్తువు లన్నియు•వఱలె నవిగొ
తే॥ భద్రజలకుంభములుఁ జారు•భద్రపీఠి, సమ్యగాస్తీర్ణశార్దూల•చర్మలసిత
రథముసింధుజలంబున•భ్రనదియమున,
కలయుతలమునఁగలయుద•కంబుమఱియు. ౪౪౩

వేగుఁబోకన్=ఉదయకాలమున, వేదపారగులు = వేదమును దుదముట్ట నధ్యయనముచేసినవారు, బాహిరమున=బహిరంగప్రదేశమున, దళవాయులు= సేనానాయకులు, ప్రొద్దు=సూర్యుఁడు- ప్రద్యుశబ్దభవము ప్రొద్దు, పుష్యంబు= పుష్యనక్షత్రము, భద్ర=శుభకరము, సమ్యక్=చక్కఁగా, అస్తీర్ణ=పఱవఁబడిన, శార్దూలచర్మ=పులితోలుచేత, లసిత=ప్రకాసించు, రథము=తేరు, అభ్రనది= గంగ ఇది మొదలు పౌరులు రాజు లనుకొనుమాటలు.

## తాత్పర్యము.

ఉదయముననేలేచి సాంగవేదాధ్యయన సంపన్నులయిన బ్రాహ్మణులు సభ దీరి బహిరంగముగఁ బౌరులు సేనానాయకులు-మంత్రులు-ముఖ్యులయిన యితరులు-నొక్కచోటఁజేరి యిట్లు మాటలాడసాగిరి. అదిగో సూర్యుఁ డుదయించుచున్నాఁడు ఇప్పుడు శ్రీరాముని జన్మలగ్నమగు కటకము జరుగుచున్నది. పుష్యము వచ్చుచున్నది. అభిషేకమునకై యమరించిన వస్తువులన్నియు సిద్ధమైయున్నవి. శుభకరములైన నీటికుండలు, మనోహరమైన పీఠము, పులితోలు చక్కఁగాఁ బఱిచిన తేరు సింధుజలములు గంగా యమునాసంగమందలి జలము, ఇవిగాక.

సీ॥ ప్రాగ్వాహములయుఁ ది•ర్యగ్వాహముల యును
నూర్ధ్వవాహములయు•నుదకములును
బద్మోత్పలసమేత•వాఃపూర్ణ సహలాజ
పల్లవచ్ఛన్నసు•వర్ణ ఘటలు
సచ్ఛుభాచారలు•సర్వాభరణభూషి
తాంగలు నైనవా•రాంగనలును
జలజారికరవిక•చప్రఖ్యకాంచన
మణిభూషితంబు చా•మరము పూలు

తే॥ చంద్రమండలసంకాశ•చారుధవళ,మాతపత్రంబు పాండురం•బై నవృషము
తెల్లగుజ్జంబు లెస్స మ•త్తిల్లి యున్న,పట్టపుంగౌరు దర్భులు•పాలు వెలసె.౪౪

ప్రాగ్వాహములయు=తూర్పుముఖములై ప్రవహించు గోదావరి కృష్ణ కావేరి మొదలయిన నదులయొక్కయు, తిర్యగ్వాహములయు=దక్షిణముఖము గాను ఉత్తరముఖముగాఁబాఱు నదులయు, గండకీశోణ సింధు బ్రహ్మపుత్ర లోనైనవి ఊర్ధ్వవాహములు= (1) పైకిఁ బాఱువానియొక్కయు నైమిశారణ్యము లోని బ్రహ్మావర్తము,రుద్రావర్తము మొదలగు సరస్సులలోని యూటతీర్థములు. ఇవి యొంటిమిట్టయందలి సీతారామలక్ష్మణ తీర్థములవంటివి. (౽) పశ్చిమ ముఖమై పాఱువానియొక్కయు, తపతి,నర్మద యిట్టివి. కొన్ని యెడల నీసమాస పదంబులు యువర్ణ వ్యవహితంబులు నగు క్రి. స. ౨౬. సూ. అను సూత్రప్రకా రము సమాస మధ్యంబున యువర్ణకము. ఇది సంఖ్యావాచక పదముల సమా సమునసేగాక సర్వత్ర యన్వయించును. పద్మో......ఘటలు=పద్మ=తామర లతో, ఉత్పల=కలువలతో, సమేత=కూడిన, వాః=జలముచే, పూర్ణ = నిండి నవియు, సహలాజ=బొరుగులతోఁగూడిన, పల్లవ=చిగుళ్ళచే,ఛన్న=కప్పఁబడిన, సువర్ణఘటులు=బంగారు కుండలు, సచ్ఛుభాచారలు=మంచిశుభకరమైన నడవడి కలవారు, సర్వాభరణ=అన్ని భూషణములచే,భూషితాంగలు=అలంకరింపఁబడిన యవయవములుగలవారు నైన, వారాంగనలు=వేశ్యలు,జలజారి=కమలములకు విరోధియగు చంద్రునియొక్క, కర=కిరణములతో, ప్రఖ్య=సమానముగు (౽) చంద్రకిరణములవలె విరివియగు కాంతిగలది, కాంచనమణిభూషితంబు=బంగారు రత్నములు వీనిచే నలంకరింపఁబడినవి, చంద్రమండల సంకాశ=చంద్రమండ లముతో సమానమై, చారుధవళము=మనోహరమైన తెల్లని కాంతిగలది యగు, ఆతపత్రము=గొడుగు, ఆతప+త్రము- ఎండనుండి రక్షించునది,పాండురంబు =తెల్లని, వృషము=వృషభము, మత్తిల్లి=మదించి, పట్టపుంగౌరు=పట్టపేనుఁగు.

## తాత్పర్యము

తూర్పుముఖముగాఁబాఱు గోదావరీ కృష్ణా కావేరీ ముఖ్యనదులయు, నడ్డము గను దక్షిణముఖముగాను ఉత్తరముఖముగాఁ బాఱునదులయు, నదములైన నర్మదా తపతులయు, భూమినిభేదించుకొని పైకివచ్చు తీర్థములయు తామరలు కలువలు వీనితోఁగలిసి నీటిచేనిండినట్టియు లాజలుగలిగి చిగుళ్ళచేఁ గప్పఁబడి నట్టియు బంగారు కడవలును, మేలియాచారమును గలిగి సర్వాలంకారములు ధరించిన వేశ్యలును,చంద్రకిరణములవలెఁ బ్రకాశించునదియై బంగారు మణులచే నలంకరింపఁబడిన దండములు గల చామరములు పూలు చంద్రబింబమువలెఁ దెల్లనైన గొడుగు- తెల్లని యెద్దు- తెల్ల గుజ్జము మదించిన యేనుఁగు దర్భలు పాలు.

కం॥ మంగళవాద్యోత్కరములు, మాంగళ్యాఖిలసువర్ణ • మణిమయభూషా
లింగితకన్యాష్టకము హా, రంగుగ వందులును ఘృతము•రాడించె నటన్.

మంగళవాద్యోత్కరములు=మంగళవాద్యముల సమూహములు, మాంగళ్య=మంగళకరములై, అఖిల=సమస్తవిధములైన, సువర్ణ మణిమయ = బంగారు రత్నములు వీనితో నిండిన, భూషాలింగిత=ఆభరణములచే నిండిన, కన్యాష్టకము=ఎనమండ్రుకన్యకలు, హారంగుగన్=అందముగ, వందులు = స్తోత్రపాఠకులు, ఘృతము=నెయ్యి.

తా త్ప ర్య ము

మంగళవాద్య సమూహములును, శుభకరములైన యన్ని విధముల బంగారు రత్నములు వీనితోఁ జేయఁబడిన యాభరణములుగల యెనమండ్రు కన్నెలు-వందులు నెయ్యి యచట నందముగాఁ దీరియున్నారు.

కం॥ క్ష్మాకాంతు లెల్ల నపు డి క్ష్వాకులయభిషేకవేళ•సముచిత మగు మే
లౌకానిక లాదిగ సీ,తాకాంతునికొఱకుఁ దెచ్చి•తమలో సభలోన్. ౪౪౬

క్ష్మాకాంతులు=రాజులు, ఇక్ష్వాకుల = ఇక్ష్వాకువంశజుల పట్టాభిషేక సమయంబున, సముచితమగు=అర్హమగు- మేలౌ, కానికలు=శ్రేష్ఠమైన బహుమానములు కానిక. రూ. కానుక. కానికె యని ఏదంత రూపము లేదు.

తా త్ప ర్య ము

రాజులందఱు నిక్ష్వాకువంశపురాజుల పట్టాభిషేకసమయమునఁ దామీయ వలసిన నియమముల ప్రకారము చెల్లింపఁ దెచ్చిన శ్రేష్ఠములగు బహుమానములను శ్రీ సీతారాముల కీయఁదెచ్చి సభలోనుంచుకొని

కం॥ పుట్టెను సూర్యుఁడు పతి గ,న్పట్టఁడు రాజున కెవఁడు•నయముగ దీనిన్
నెట్టన చెప్పఁడు దశరథు, పట్టికి నై యెల్ల సిద్ధ•పడె జా గేలా. ౪౪౭

కన్పట్టఁడు=కానరాఁడు, నెట్టన=పట్టుమని-ఇదికళ.

తా త్ప ర్య ము

సూర్యుఁడా యుదయించెను- రాజా కానరాఁడు- ఈవిషయమును రాజునకుఁ జెప్పెడువాఁడా లేఁడు, శ్రీరామునిమిత్తమై యన్నివస్తువులు సిద్ధపడి యున్నవి. ఈయాలస్య మేటికో.

—• సుమంత్రుఁడు సామంతరాజులతో సంభాషించుట. •—

చం॥ అని తలపోయు చుండఁగ ధ•రాధిపులం గనుచున్ సుమంత్రుఁ డి
ట్లనుఁ బతి రాముఁ బిల్వుమన•నచ్చటి కేగెద, భూమిభర్తకున్,
ఘనులరు మీరు, పూజ్యులరు•క్ష్మాతనయాపతి కంతకంటెఁ, గా
వున నయిరింపుఁ డేను నిదె•పోయి నృపుం గని యుష్మదుక్తిగన్. ౪౪౮

తలపోయుచున్=ఆలోచించుచు, ధరాధిపులన్=రాజులను, సయిరింపుఁడు =ఓర్చుకొనుఁడు, యుష్మదుక్తిగన్=మీమాటగ.

తాత్పర్యము

అని యందఱాలోచించుచుండ నారాజులను జూచి సుమంత్రుఁడు రాజులారా దశరథుఁడు శ్రీరామచంద్రునిఁ బిల్వుమని యాజ్ఞాపింప నచ్చటికిఁ బోవుచున్నాఁడను. దశరథునకు మీరు గొప్పవారు- పూజ్యులరు- శ్రీరామునకంతకంటెఁ బూజ్యులరు- కావునఁ దొందరపడక క్షమింపుడు. ఇది నేనుబోయి దశరథుని మీమాటగా.

కం॥ సేమ మడిగి మేల్కనియున్, రామికి వెలి కేమికతమొ॰ప్రశ్నింతు నటం
చామహిపతి డాయుం జనె, సామంతమతానుసరణ॰చరితజ్ఞుండున్. ౪౪౯

సేమము=క్షేమము, వెలికిన్=వెలుపలికి, కతమొ=కారణమొ- సామంత ....... చరితజ్ఞుండున్=సామంతరాజుల యభిప్రాయము ననుసరించి చరించు విధము నెఱిఁగినవాఁడు.

తాత్పర్యము.

క్షేమము విచారించి మేల్కనియుండియు నేల రాకయున్నవాఁడో శ్రీరామునకుఁ జెప్పవలసినందుండిన నిచటనే చెప్పరాదా? ఏల యిల్లువిడిచి వెలుపలికిరాకయున్నాఁడో? కారణము విచారించి తెలిసికొని వచ్చెదనని సామంతరాజుల యభిప్రాయప్రకారము నడచుకొనువిధముఁ దెలిసిన యా సుమంత్రుఁడు.

కం॥ తుల గానని సౌధ మనర్గళగతిఁ జొరఁ బాఱి పొగడి॰రాజాన్వయమున్
లలితగతి నృపునిశయ్యా,తలముఁ గదిసి తెఱ యొకండె॰తనకడ్డముగాన్.

తులగానని=సమానములేని, సౌధము=మేడ, అనర్గళగతిన్=అడ్డములేని విధముగా, చొరఁబాఱి=త్వరగాఁ బ్రవేశించి, రాజాన్వయము=రాజవంశము.

తాత్పర్యము

అసమానమైన మేడయింటిలోఁ దొందరగాఁ బ్రవేశించి రాజవంశమును ముందుగాఁ బొగడి దశరథుఁడు పండుకొనియుండు ప్రదేశమునకుఁ బోయి యాయనకుఁ దనకు నొకతెఱ యడ్డముమాత్ర ముండఁగా నిలిచి యిట్లనియెను.

చం॥ అనఘము నీదువంశము మ॰హాత్మ! రవీంద్రశశీశవహ్నులున్
ధనదుఁడు పాశియున్ జయ ము॰దంబులు గూర్తురు గాక నీకు, రే
చనియెను మేలుకొమ్ము నృప॰చంద్రమ! కాఁగలయట్టి కార్యముల్
పెనువుగఁ దీర్పుమా, సభను॰వేచిరి విప్రనృపార్యసత్తముల్. ౪౫౧

అనఘము=పాపరహితము, రవి=సూర్యుఁడు, ఇంద్ర=ఇంద్రుఁడు, శశి=చంద్రుఁడు, ఈశ=శివుఁడు, వహ్ని=అగ్ని, ధనదుఁడు=కుబేరుఁడు, పాశి=వరుణుఁడు, జయముదంబులు=జయము సంతోషము, కూర్తురు=కలిగింతురు,

వేచిరి=కాచుకొనియున్నవారు- విప్ర, బ్రాహ్మణులు-నృప = రాజులు, అర్య = వైశ్యులు, సత్తముల్=వీరిలో శ్రేష్ఠులైనవారు.

తాత్పర్యము

మహాత్మా! మీ వంశము దోషరహితమైనది. సూర్యుఁడు చంద్రుఁడు శివుఁడు అగ్ని కుబేరుఁడు వరుణుఁడు నీకు జయము సంతోషము గలిగింతురు గాక. రాత్రి వెడలిపోయెను. సూర్యోదయమయ్యెను. మేలుకొమ్ము. నీవు చేయ వలసిన కార్యములు దీర్పుము. సభయందు బ్రాహ్మణోత్తములు క్షత్రియవరులు వైశ్యరత్నములు నీరాకకై కాచియున్నారు.

—•దశరథుఁడు సుమంత్రునితో శ్రీరామునిఁ బిలుచుకొని రమ్మని చెప్పుట •—

మం॥ అని కొండాడు సుమంత్రుగాం తెలిఁగి గో•త్రాధీశుఁ డే నిద్దురం
గనఁ జూ, రామునిఁ దోడితెమ్మనినవా•క్యం బేలపాటింప? విం
కనయేనిం జని తోడితెమ్మిటకు వే•గం, బన్న నావాక్యముల్
విని మేలంచును నిర్గమించి నగరున్•వీక్షించె మార్గంబులన్. ౪౫౭

కొండాడు=స్తుతించు-శ్రీరాముని దోడితెమ్మని కైకచెప్పినవాక్యము=కైక చెప్పినవాక్యము నేను గాదని యననపుడు నేనుచెప్పినట్టేగదా. అప్రతిషిద్ధ మను మతమ్మను న్యాయము కలదుగదా- కాదని చెప్పకుండిన నవునని యంగీకరించి నట్టేకదా.నీవు నిద్రబోవుచు నిషేధింపలేదో మేలుకొని నిషేధింపలేదో నాకెట్లు తెలి యును.కైక కన్గుని కెనని చెప్పెనుగదాయందువా నేను మేలుకనియేయున్నాను.

తాత్పర్యము

అనిపొగడుచున్నవానిని తెలియదగ్గముండుటచే స్వరమునుబట్టి సుమంత్రుఁ డని యెఱిఁగి నేను నిద్దురపోలేదు. మేల్కనియేయున్నాను. శ్రీరాముని బిలుచు కొని రమ్మని కైకచెప్పెనుగదా.ఆమాటప్రకారము నీవేలచేయలేదు.ఇప్పుడైనను బోయి శీఘ్రముగ శ్రీరాముని బిలుచుకొనిరమ్ము. అని దశరథుఁ డనిన విని చిత్తము అని యిల్లు వెడలిపోయి మార్గమందు.

కం॥ ప్రేమంబున గుంపులు గొని, రామకథాలాపబహుళ•రాగము వెలయున్
భూమీజను లుండఁగఁ గను, చామాటలు వినుచు గాఢ•హర్షాకులుఁ డై. ౪౫౮

రామకథాలాప బహుళరాగము=శ్రీరాముని చరిత్రములు చెప్పుటయందు మిగుల ననురాగము, గాఢ=అధికమైన, హర్ష = సంతోషముచే, అకులుఁడై = నిండినవాఁడై .

తాత్పర్యము

ప్రేమవశంబున గుంపులుగుంపులై జనులు రామకథలు చెప్పుకొనుటయందు మిగుల నాసక్తిగలవారలై యుండ వారిమాటలు వినుచు లోకులందఱు శ్రీరాముని కనుకూలురేకదా యని సంతోషముచే నిండిన మనస్సుగలవాఁడై.

చం॥ చని రజతాద్రి పేటునకు•సాటి, సురేంద్రునివీటిపాటి, యా
ధనదుని మేడకున్ జత, బు•ధప్రకరాలయశృంగతుల్యమై,
గొన బగుతల్పులున్ ముదము•గూన్చునరుంగులు బైఁడి బొమ్మలున్।
ఘనమణి తోరణంబులును•గల్గి శరజ్జలదోపమానమై. ౪౨౪

రజతాద్రి = వెండికొండ, సురేంద్రుని వీటిపాటి = ఇంద్రుని యింటితో సమానమైనది, బుధప్రకరాలయ=మేరు పర్వతముయొక్క, శృంగతుల్యమై= శిఖరముతో సమానమై (ఇది యెత్తునందని గ్రహింపవలెను. రంగునకాదు) 'మేరుస్సుమేరు ర్హేమాద్రి రత్న సానుస్సురాలయ' యని యమరుఁడు. శరజ్జలదోపమానము=శరత్కాల మేఘమువలె, తెల్లనై.

తాత్పర్యము

కైలాస శిఖరమునకు సమానమై, యింద్రుని మేడకీడై, కుబేరుని యింటి కుద్దియై, మేరుపర్వత శిఖరమువలె నెత్తై, అందమయిన తలుపులనీటై, చూడ ముచ్చటగనుండు నరుఁగులు బంగారు బొమ్మలు మణులతోఁ జేయఁబడిన తోరణములు గలిగి శరత్కాల మేఘమువలెఁ దెల్లని కాంతికలదై.

సీ॥ మణివరమాల్యాళి•మండితం బగుచును,మలయజాగరుధూప•లలిత మగుచు
నాకీర్ణ విమలము•క్తావళీరత్నమై, దార్దరం బన సుగం•ధయుత మగుచు
సారసమాయూర•చారుస్వనంబు నై, సుకృతవృకావళీ•సుందర మయి
మేలి కాంతులచేత•మిఱుమిట్లు గొలుపుచుఁ,దోయజరిపుసూర్యతుల్యమగుచుఁ

తే॥ బలు తెఱంగుల రంగుల•పక్షు లమర,మేరుగుహ వోలి యంజలి•కారులొప్పఁ
గానుకలవార లందంద•కాచి నిలువఁ, బల్లెటూరులవారలు•బార్లు కట్ట. ౪౨౫

మణివరమాల్యాళీ=మణులచేఁజేయఁబడిన మేలైన సరములచే, మండితంబయి=అలంకరింపఁబడినదై,మలయజ అగరు ధూపలలితమగుచు=శ్రీగంధము అగరు చెక్కలపొడిచేసైన పొగచే మనోహరమై,ఆకీర్ణ విమలము క్తావళీ రత్నమై =చల్లఁబడిన నిర్మలమైన ముత్యముల వరుసలు రత్నములుగలదై, దార్దరంబు =దర్దర సంబంధమైనది (మలయపర్వత సమీపమున దర్దరమను చందనవృక్షములుగల పర్వతము గలదు) సుగంధయుతము=మంచివాసనతోఁ గూడినది, సారసమాయూర చారుస్వనంబునై = బెగ్గురు పక్షులయు నెమిళ్ళగుంపులయు మనోహర ధ్వనులు గలదై, సుకృత=చక్కఁగాఁ జేయఁబడిన,వృకావళీ=తోడేళ్ళ సమూహముచే, అంజలికారులు=చేతులు జోడించుకొని యుండువారు.

తాత్పర్యము

తోరణములుగాఁ గట్టఁబడిన శ్రేష్ఠములైన రత్నముల దండలచే నలంకరింపఁబడినదై, చందనము అగరుచెక్కల పొగలచే ధూపమువేయఁబడి సువాసనలు కొట్టుచు మంచి ముత్యములు రత్నములు చల్లఁబడినదై,దర్దర పర్వతము

వలెఁ బరిమళించుచు, బెగ్గురు పక్షులయు నెమిళ్ళయు విన నింపైన కంఠస్వరములుగలదై, చక్కఁగా ద్వారబంధములందు స్తంభములందుఁ జెక్కఁబడిన తోడేళ్ళుగలదై, దగద్ధగమను కాంతులు మిఱుమిట్లు కొలుపుచుఁ జంద్రసూర్యుల కాంతితో సమానమైన కాంతిగలిగి, నానావర్ణముల పక్షులొప్పుచుండ మేరుగుహతో సమానమై, సేవకులు చేతులు జోడించుకొని నిలిచియుండఁ గానుకలు తెచ్చిన వారచ్చట నచ్చట నిలిచి సమయమునకు వేచియుండ,వేడుక చూచుటకు రామదర్శనార్థులై వచ్చిన పల్లెటూళ్ళవారు బారులు గట్టి రెండు ప్రక్కల నిలువఁగా.

చం॥ వెలసి మహాభ్రతుల్య మయి•వేడుక మీఱ యలంకృతంబు నై
కలయఁ గిరాతకుబ్జజన • కాండసమావృత మైనరామచం
ద్రులభవనంబుఁ జూచి యటఁ•దొప్పలుదోరలు మూఁగి యున్నలో
కులఁ గని హర్షభాసురము•ఖుం డయి, యింద్రుగృహంబుఁ బోలుచున్.

మహాభ్రతుల్యము = గొప్పమేఘముతో సమానము, మహాభ్రమనుటచే నిటునటు గదలక నిలిచియుండుట వివక్షితము, కిరాత=అల్పదేహము గలవారు, కుబ్జ=పొట్టివారు, శ్రీరామచంద్రుల = పూజ్యార్థంబున బహువచనము, దొప్పలు దోరలు=విశేషముగ- గుంపులు గుంపులుగ, హర్షభాసురముఖుండయి=సంతోషముచేఁ బ్రకాశించు ముఖము గలవాఁడై.

తాత్పర్యము

ఒప్పుచు పెద్ద మేఘముతో సమానమై యందమై యలంకరింపఁబడినదై యల్ప శరీరమువారు మఱుగుజ్జులు వీరి సమూహముచే నావరింపఁబడినదైన శ్రీరామచంద్రుల గృహంబుఁ జూచి యచ్చట విశేషముగ గుంపులు గుంపులై మూఁగియున్న జనులను జూచి సంతోషముచే వికాసమునొందిన ముఖముగలవాఁడై యింద్రుని భవనముతో సమానమై.

ఉ॥ జానగు మేడఁ జూచి రఘు•సత్తము మెచ్చులవారు సత్ప్రియుల్
మానుగ నుంటఁ గాంచుచు సు•మంత్రుఁడు నంతిపురంబు డాసి యం
దానరపాలుసూనుభవి•కార్థదిదృక్షుశుభప్రసంగము
ల్వీనుల కింపుగా విని స•లీల శకుంతనినాదజుష్టమై. ౪౫౪

జానగు=అందమైన రఘుసత్తము మెచ్చులవారు=శ్రీరామునిచే మెప్పుదల బొందినవారు, సత్ప్రియుల్=మంచి ప్రియముగలవారు, భవికార్థ=శుభప్రయోజనము, దిదృక్షు=చూడఁగోరిక గలవారి, శుభప్రసంగముల్ = మంచి ముచ్చటలు, శకుంత నినాదజుష్టమై=పక్షుల ధ్వనితోఁ గూడినదై.

తాత్పర్యము

అందమైన మేడఁజూచి యందు శ్రీరామునిచే మెప్పుపొందినవారు ప్రియు లుండుట చూచి సుమంత్రుఁ డంతఃపురంబు చేరియుం దా శ్రీరాముని శుభ మహోత్సవము చూచు కోరికగలవారి ముచ్చటలు చెవుల పండువుగా విని, పక్షులతోఁ గూడినదై.

ఉ॥ అంజలికారులున్ లసదు•పాయనకోటిపరార్థ్యలోకు లా
యంజనశైలసన్నిభమ•దాంచదుదగ్రశరీరభవ్యశ
త్రుంజయనామకేభ మతి•తోత్ర మసహ్యపరాక్రమంబు రా
ట్కుంజర మౌపవాహ్యమును•గుంజరవాజిరథేద్ధమంత్రులున్. ౪౩౮

అంజలికారులు=చేతులు జోడించుకొని యుండువారు, లసదు...లోకులు=ప్రకాశించు కానుకలు గ్రహించియుండు, కోటి పరార్థ్య సంఖ్యజనులు, అంజన శైల సన్నిభము=కాటుక కొండతో సమానమైన, మదాంచత్=మదముచేఁ బ్రకాశించుచు, ఉదగ్రశరీర=భయంకరమైన దేహముగలదై, భవ్య=శుభలక్షణములు గలదై, శత్రుంజయ నామకేభము = శత్రుంజయమను పేరుగల యేనుఁగు, అతితోత్రము = అంకుశమును లక్ష్యపెట్టనిది, అసహ్య పరాక్రమంబు=సహింపరాని విక్రమముగలది, రాట్కుంజరము=పట్టపుటేనుఁగు, ఔపవాహ్యమున్ = రాజులెక్కు వాహనమును, కుంజరవాజి రథేద్ధమంత్రులున్ = ఏనుఁగులు-గుఱ్ఱములు, రథములు, మంత్రులు.

తాత్పర్యము

వినయము సూచింపఁ జేతులుజోడించుకొని నిలువఁబడిన వారును, విస్తారముగ శ్రేష్ఠములైన కానుకలు తెచ్చిన జనులును, అంజన పర్వతముతో సమానమై, మదించినదై భయంకరమైన శరీరముగలదై- యంకుశము లక్ష్యపెట్టనిదై సహింపరాని పరాక్రమము గలిగి శత్రుంజయమను పేరుగల పట్టపుటేనుఁగు, ఏనుఁగులు, గుఱ్ఱములు, తేరులు, మంత్రులును,

కం॥ ద్వారమునందు న్నిలువఁగ, వారల వీక్షించి చని యు•వారి తగతి వి
స్తారమణీగణరాజిత, వారిధి మకరంబు చొచ్చు•వడువునఁ జొచ్చెన్. ౪౩౯

విస్తారమణీ గణరాజిత=విస్తారముగా మణుల సమూహముచేఁ బ్రకాశించు, వారిధిన్=సముద్రమును, మకరము వడువునన్=విధముగా, మణి ఇకారాంతము ఈకారాంతమును గలదు.

తాత్పర్యము

వాకిట నిలిచియుండ వారలఁజూచి యడ్డములేని గమనమున, విస్తారముగ రత్నపురాసులచే నొప్పు సముద్రమును మకరివలె లోపలఁ బ్రవేశించెను.

## ౧౬-వ సర్గము.

తే॥ నడిమివయసునవారిని•నవ్యకుండ,లోజ్జ్వలుల నప్రమాదుల•నుత్తమాను
రక్తులను బ్రాసకార్ముక•శక్తిధరుల, వెండి కనుఁగొనె వృద్ధుల•వేత్రధరుల.

నవ్యకుండ లోజ్జ్వలులన్=మనోహరములైన కుండలములచేఁ బ్రకాశించు వారిని, అప్రమాదులన్=హెచ్చరిక కలిగియుండువారిని, ఉత్తమానురక్తులన్=నిర్వ్యంచనమై నిష్కామమైన ప్రేమగలవారిని, ప్రాసకార్ముకశక్తిధరులన్ = ప్రాసము విల్లు శక్తి యనునాయుధములను ధరించినవారిని, వృద్ధులన్=ముసలి వారిని, వేత్రధరులన్ = బెత్తములు పట్టుకొని యుండువారిని- శ్రీరాముఁడు కోదండమును ధరించి లోకములను గాచుచుండ వీరు దండములు ధరించి శ్రీరాముని రక్షించుచుందురనుట. ఈ దండములు ధరించుట తమ దాస్యమును దెలుపుటకే. శ్రీరామునకుఁ దుచ్ఛభట రక్షణ మవశ్యమగునేని లోకములనెల్ల నెట్లు రక్షింపఁగలఁడు.

### తాత్పర్యము

నడిప్రాయపువారినిఁ, బ్రకాశించు కుండలముల ధరించినవారిని, హెచ్చరికఁగ గాచియుండు వారిని, నిజమైన ప్రేమగలవారిని, విల్లు ప్రాసము శక్తి యనునాయుధముల ధరించినవారిని, బెత్తములు ధరించిన ముసలివారిని జూచెను

తే॥ పూసి తొడి కట్టి పెట్టి ప్ర•భూతరీతిఁ, గావిచేలలు ధరియించి•కాచి యుండ
నిండు హెచ్చరికను సుమం•త్రుండు పూర్వవృత్తవేది సమీపింప•నెల్లవారు.

పూర్వ వృత్తవేది=పురాతన చరిత్రము లెఱిఁగినవాఁడు, ప్రభూతరీతిన్=విస్తారముగ.

పూసి తొడి కట్టి పెట్టి యనుచో నాత్మనేపద మనిత్యము కావున 'కొను' ప్రత్యయము లోపింపఁబడియె.పట్టముఁగట్టి యేలుము మమున్'అని భారతము. కావిచేలలు=కావివస్త్రములు, ఇది వైరాగ్య చిహ్నము. ఈ సేవకులు శ్రీరాముని భక్తివైరాగ్యములతో సేవించుచున్నారనియు జీతమునకై కాదనియుఁ దోఁచెడి.

### తాత్పర్యము

గంధము పూసికొని చొక్కాలు దొడిగికొని నడికట్లు కట్టి విస్తారముగ నాభరణములు పెట్టుకొని కావివస్త్రములు ధరించి మిక్కిలి హెచ్చరికతోఁ గాచి యుండ వంశాచారము పూర్వ చరిత్రమంతయు నెఱింగిన సుమంత్రుఁడు వారి సమీపమునకు రాఁగానే వారందఱు.

తే॥ సంభ్రమంబున దిగుదు రా•సనము లోలి, వారినాదృతినిట్లను•వరసమర్థుఁ
డెఱుఁగఁజెప్పుఁడు వేగ పృ•థివీశునకును,
వాకిటసుమంత్రుఁడిదెయున్న•వాఁడటంచు. ౪౬-౭

అదృతిన్=ఆదరముతో, ఇదె=ఇది కేవలసామీప్యమును దెలుపుచున్నది.

తాత్పర్యము

గౌరవార్హుఁడైన సుమంత్రుఁడు తటాలున రాఁగానే శ్రోత్రుపాటుతోఁ దటాలున వారు వారు కూర్చుండిన యాసనములనుండి దిగఁగా వారిని ప్రేమమున నాదరించి మిక్కిలి సమర్థుఁడగు సుమంత్రుఁడు అయ్యలారా మీరుపోయి యీ వాకిట సుమంత్రుఁడు కాచియున్నాఁడని చెప్పుఁడనెను.

కం॥ అన వార లెఱుఁగఁ జెప్పిరి, జనకసుతాసహితరామ॰చంద్రున కతఁడున్
జనకాంతరంగు సూతునిఁ జనవున రప్పింపఁ దనదు॰చక్కటి కతఁడున్.

జనక సుతాసహిత శ్రీరామచంద్రునకున్ = సీతాదేవితోఁ గూడియుండు శ్రీరామచంద్రునకు, జనకాంతరంగున్=తండ్రియొక్క మనస్సు దెలిసినవానిని, చక్కటికిన్=ఎదుటికి.

తాత్పర్యము

వాకిటి కావలివారు పోయి సీతాదేవితోడనుండిన శ్రీరామచంద్రునకు సుమంత్రుఁడు వచ్చియున్నాఁడని చెప్పిరి. శ్రీరాముఁడును దనతండ్రి హృదయ మెఱిఁగిన వాఁడును సారథియునగు సుమంత్రునిఁ దన యెదుటికి రప్పించెను.

—॰ సుమంత్రుఁడు శ్రీరామునితో దశరథువాక్యంబుఁ జెప్పుట. ॰—

సీ॥ రమణీయకనక ప॰ర్యంక భాగంబున, సవు రైనముత్యాల॰సరులవాని
ఘుమఘుమంఘుమితసూ॰కరరక్త నిభశుచి, గంధానులిప్తుఁడై॰రాలువానిఁ
గంకణఝుణఝుణ॰త్కారంబు దోఁపఁ జా,మర వీచుజానకి॰మరగువానిఁ
దనపార్శ్వమున నిల్వ॰ధరణిజ చిత్రాస, మేతు మృగాంకుని॰మించువాని
తే॥ భాసురం బైన నైజప్ర॰భావిశేష, పూరమున సర్వసాక్షిని॰బోలువాని
సకలసౌభాగ్యములనువై॰శ్రవణురామ,
భద్రుఁగనుఁగొనెఁ గూర్చున్నవానినియతి. ౪౬౪

సుమంత్రుఁడు దర్శించిన శ్రీరామచంద్రమూర్తి విధమును గవి వర్ణించుచున్నాఁడు.

రమణీయ=మనోహరమైన, కనక=బంగారు, పర్యంక భాగంబునన్ = పానుపునం దొక ప్రక్కన- భాగంబున ననుటచే శ్రీరాముఁడు కూర్చుండి యున్నాఁడని గ్రహింపనగు- సూకరరక్తనిభ=అడవిపంది నెత్తుటితో సమానమై, శుచి=నిర్మలమైన, గంధ=చందనముచే, అనులిప్తుఁడయి=పూయఁబడినవాని- అలంకారము చెప్పవలసి వచ్చునపుడు ప్రక్చందనాదులఁ జెప్పుట యాచారము. కావున మొదటి పాదంబున హారములు రెండవ పాదంబునఁ జందనము వర్ణింపఁ బడియె. భగవంతుఁడు సర్వగంధుఁడని శ్రుతికలదు. అట్టివానికి నాగంధము సువాసన గలిగించుచున్నది. ఈగంధపుఁబూఁత పాలవారిధి లోనఁ బండుకొను వానికిఁ గౌఁల్య పాలిచ్చినట్లని యెఱుంగునది. అగంధమున కంతటి పరిమళ మెట్లు

వచ్చెనన జానకి సాన్నిధ్యమునఁజేసి యని మూఁడవ పాదంబునఁ జెప్పు చున్నాఁడు. సీతకు యోజనగంధ యనిపేరు. అట్టిసీత దేహవాసన ప్రసరించుటచే దానికంత సువాసన గలిగెను.సూకరరక్తముతో సమానమైనదని చెప్పుటచే గంధ మందుఁ గుంకుమ పువ్వు విశేషముగఁ జేర్చియున్నారని యెఱుంగవలయును. గంధమునకు సీతవలన లభించినది వాసన మాత్రమేకాదు.ఆమె యాగంధమును బూయునపుడు ఆమె పాణితలము నందలి రక్తవర్ణ మందుఁ గలిసె ననిభావము. గంధము శుచియగుటకుఁ గారణము సీతాహస్తస్పర్శముచే ననిభావము. కాంతి వర్ణము శుచిత్వమేకాక శైత్యగుణముకూడ నామె కరస్పర్శచేతనే వచ్చెను. అను లిప్తుఁడు=తరువాతఁ బూయఁబడినవాఁడు.అనుటచే సీతముందు దాను గంధము పూసికొని యది మృదువుగాను రమ్యముగా నున్నదా యని పరిచూచి యావల శ్రీరామునకుఁ బూసెనని భావము. దీనిచే శ్రీరాముని కలంకారాద్యుపచారముల సీతయే చేయుచుండెనుగాని పరిచారికలచేఁ జేయింపదని భావము. అంగా శాముక్తమాల్యదయేకదా. ఆమె తాను ముందుగ ధరించిన పూలదండలనే రంగనాయకుల కర్పించెను. పరగుట యనుపదము ఎడఁబాటును సహింపని కల యికను తెలుపును.కావునఁ దనకిట్లు గంధముపూసి చామరచేతఁ దీసికొని ప్రక్కన నిలఁబడి వీచుచున్న యప్పటి యామె సౌందర్యమును జూచి ప్రేమాతిశయమునఁ గౌఁగిలించె నని భావము. పరగుశబ్దము మీయర్థమును సూచించుచున్నది.

శ్రీరామచంద్రుని ప్రక్క సీతాదేవి యుండువిధమును దృష్టాంతముచేఁ గవి తెలుపుచున్నాఁడు. చిత్రానమేతున్ = చైత్రశుద్ధమున పున్నమనాఁడు చిత్రా నక్షత్రముతోఁ గూడియుండు వానిని, మృగాంకునిన్=చంద్రుని, మించువాని= అతిశయించినవాని, ఆకాశమందలి చంద్రుఁడు మృగాంకుఁడు- జింకరూపపు కళంకముగలవాఁడు. ఈ శ్రీరామునందట్టిది లేదు. కావుననే ఆ చంద్రుఁడు చంద్రుఁడే. ఈయన శ్రీరామచంద్రుఁడు. ఈకారణములచే శ్రీరామచంద్రుఁడు చంద్రునిమించి యున్నాఁడని భావము.

నైజప్రభావిశేష పూరమున=స్వభావసిద్ధమైన యతిశయకాంతి ప్రవాహము చేత, సర్వసాక్షిని = సూర్యుని, సూర్యుని తేజస్సు లోకమున నలువైపుల వ్యాపించి యున్నట్లు శ్రీరాముని తేజస్సు వ్యాపించి యున్నదనుట యందే యుపమానము. చంద్రునికంటె శ్రీరామచంద్రుఁ డెక్కుడైనట్లు, నిఘంటువులఁ జెప్పఁబడిన సర్వసాక్షి (సూర్యుని) కంటె వాస్తవ సర్వసాక్షి యెక్కుడనియు, సూర్యునితేజస్సు శ్రుతిప్రకారము సూర్యునకు నైజము కాదనియు, నదియును భగవద్దత్తమేయనియు, స్వభావతేజము గలవాఁడు భగవంతుఁ డొక్కఁడే యనియు, ఆ భగవంతుఁడు శ్రీరాముఁడే, యని తెల్ప నైజప్రభాయని చెప్పఁ

బడెను. భాసురంబైన నైజప్రభా విశేష పూరమని చెప్పుటచే నిట్టి కాంతి మఱి యెవ్వరికి లేదని గ్రహింపనగు.సర్వసాక్షి శబ్దమునకు భగవంతుఁడనియు నర్థము.

ఇచట భాసురంబైన యనుదానిని విభక్తిమార్చి భాసురుండైనయని గ్రహించి దివి సూర్య సహస్రస్యయని భగవద్గీతయందుఁ జెప్పినట్టు లనేక సూర్యులకాంతి కలవాఁడని చెప్పినను జెప్పవచ్చును.

1. సకల సౌభాగ్యములన్=సకలైశ్వర్యములందును, వైశ్రవణున్=కుబేరుని-కుబేరునివలె సకలైశ్వర్యములు కలవానిని- కుబేరుఁడు ధనదుఁడు కావునఁ దన యైశ్వర్యము నంతయు దానమందు వినియోగించునని భావము,

సకల సౌభాగ్యములన్ = సమస్త సౌందర్యములందును, వైశ్రవణున్= కుబేరుని-కామేశ్వరో వైశ్రవణోదదాతు.అను శ్రుతియందుఁ గుబేరుఁడు దాతగాఁ జెప్పఁబడెను. అట్టి వైశ్రవణు ననుటచేఁ భక్తులకందఱకుఁ దన సౌందర్యాను భవానందము (సాయుజ్యముక్తి) నిచ్చువాఁడని భావము.

రమణీయ....భాగంబునన్=ఆయన యంతటి యైశ్వర్యమునకుఁ దగినట్లు హృదయాకర్షణముగఁ జేయఁబడిన- చిత్రవిచిత్ర ప్రతిమలు మొదలగువానిచే నలంకరింపఁబడి మనోహరమయి యున్న, కనక=మీఁదఁ గూర్చుండిన శ్రీరామునకుఁ దగినట్లు బంగారుతోఁ జేయఁబడిన- ఆమంచముపై నాయన గూర్చుండి నపుడు మేరుశిఖరమున వర్షాకాలమేఘమువలె మనోరంజకముగ నుండెనని భావము. వర్షాకాలమేఘము కృషీవలులకు దర్శనీయమైనట్లు శ్రీరాముఁడు భక్తులకు దర్శనీయుఁడై యిష్టఫలదాతయై యుండెనని భావము. పచ్చని బంగారు మంచమున నీలవర్ణుఁడైన శ్రీరాముఁడు బంగారునందుఁ బొదుగఁబడిన నీలమణివలె శోభించెననియు భావము. పర్యంక భాగంబునన్=కుసుమసుకుమారమగు శ్రీరామునకుఁ దగినట్లు మిక్కిలి మృదువుగనున్న పఱుపుమీఁద:— ఈ పర్యంక మింత విశేషముకలది గనుకనే శ్రీరాముఁడడవికిఁ బోవునపుడు సకల పదార్థములు దానముచేసినను దీనిని సుయజ్ఞుఁడను పురోహితు నొద్దనుంచెను. (వ. ౮౯౬) నియతిన్ గూర్చున్నవానిని విశాలాక్షిని బత్నిగూడి సమర్చసలిపెన్ అని ముందు చెప్పినట్లు రంగనాథమూర్తి ధ్యానముతోఁ గూర్చుండిన వానిని,రాత్రిపూనిన వ్రతమింకను ముగియలేదు గదా. ఈమూర్తి యిక్ష్వాకునకు వాసుదేవ ద్వాదశాక్షరమంత్రానుష్ఠానముచే లభించిన విధము, ఇది యాయన వంశమువారిచేఁ బూజింపఁబడుటయు దీనిని శ్రీరామచంద్రమూర్తి విభీషణున కిచ్చుటయు నృసింహపురాణమునఁ జెప్పఁబడియున్నది. ఇది యుద్ధకాండము ౩౯౮౩ పద్యవ్యాఖ్యానంబున వివరింపఁబడును.

## తాత్పర్యము

మనోహరమైన బంగారు మంచముమీఁద నందమైన ముత్యాల సరములు లోనగు నాభరణములు ధరించిన వానిని ఘుమఘుమ యని పరిమళించుచుఁ బంది

నెత్తుటివలె మిగుల నెఱ్ఱనై శుచియైన గంధపుఁ బూఁతచేఁ బ్రకాశించువానిని,దన చేతి కంకణములు ఝుణంఝుణ యనుచు నుండఁగాఁ జామరము దనకేలఁ గొని వీచుచున్న జానకిని మరగినవానిని,దనప్రక్క సీత నిలఁబడియుండఁ జైత్రశుద్ధ పూర్ణిమయందుఁ జిత్రానక్షత్రముతోఁ గూడిన చంద్రుని బోలిన వానిని,సహజమైన దేహకాంతి ప్రవాహమువలె నలుదిక్కుల వ్యాపించుచుండ సూర్యుని బోలినవానిని సమస్తైశ్వర్యములఁ గుబేరుఁడగు వానిని నియతిగాఁ గూర్చుండిన వానిని శ్రీ రామచంద్రుని సుమంత్రుఁడు చూచెను.

ఈ పద్యమందలి శ్రీరామువర్ణనము పర్యంక విద్యయందలి భగవత్స్వ రూప వర్ణనమును బోలియున్నది. అది సూచించుటకే యాదియందుఁ బర్యంక శబ్దము ప్రయోగింపఁబడెను. ఈపద్యము ప్రతిదినము మనుష్యుఁడు ధ్యానింప వలసిన భగవదాకారమును సూచించుచున్నది.

కనుఁగొనెన్=కన్నులచే గ్రహించెను-అనుటచేఁ గన్నులచేతనే యాయన యాకారమంతయు మ్రింగెనా యన్నట్టు లాయెనని భావము. ఉత్కర్షమునకుఁ బరమావధి శ్రీరాముఁడు. అపకర్షమునకుఁ బరమావధి ముఖప్రీతిమాటలు చెప్పి పొట్టపోసికొను సూతుఁడు. అట్టివాని సాక్షాద్దర్శన మిట్టివాని కట్టిదశయందుఁగలు గుట యెంతభాగ్యము. శ్రీరాముని సౌశీల్య మెట్టిది. సుమంత్రుఁడు తన కంతటి ప్రియ మంత్రి యయ్యు నతని నంతఃపురమున దన యెదుటికి దశరథుఁడు రానిచ్చినవాఁడుకాఁడు. తన భార్యతోడ దాసుండ నితరులు చూడరాదని యాయన యభిప్రాయము. సీతారాములు సర్వజనసులభులు.చూడఁగోరినవాని కెంతటి నీచునకైన దర్శనమిత్తురు, ఇచ్చటఁ బుత్రవాత్సల్యము, అచ్చటఁ బర పురుషశంక.

చం॥ వరదుని రాము వంది గని • వందనముల్ ఘటియించి తద్గుణో
త్కరముల సన్నుతించి నయ•తత్పరుఁడై కరముల్ మొగిడ్చి మీ
కరుసమె కా విహారశయ • నాసనలీలల నెల్ల నంచుఁ దా
నరసి సుఖంబు, వెండి వసు • ధాత్మభవాపతితోడ నిట్లనున్. ౪౬౫

వరదుని=కోరిన వరము లనుగ్రహించు వానిని, వంది=పొగడువాఁడు-సుమంత్రుఁడు, తద్గుణోత్కరములన్ = ఆయన సుగుణగణములను, సన్నుతించి = స్తుతిచేసి, నయతత్పరుఁడై = వినయముగలవాఁడై, వందనముల్ = అనుటచే భగవంతుని విషయమున ఒంటినమస్కారము నిషిద్ధము. విహార శయనాసనంబులన్ = సంచారమందును, పండుకొనుట యందును, కూర్చుండుటయందును, ఈ వినోదకార్యములందు, అరుసమెకా= సంతోషమేకదా- 'మీకు' పూజ్యార్థంబున బహువచనంబు-రాజైన దశరథుని నీకు నీవు అని సంబోధించిన సూతుఁడు (౪౩౩-౪౩౪-౪౩౫ ప-చూడుము.) శ్రీరాముని బహువచనంబున సంబోధించుట భక్త్యతిశయమునని యెఱుంగ వలయు, వసుధాత్మభవాపతితోన్ = శ్రీరామునితో- పైపద్యము ధ్యానింప

వలసిన మూర్తివిధమును దెలుపును, ఈ పద్యము భగవత్సన్నిధానమునకుఁ బోయినపు డదయమునఁ జేయవలసిన కార్యములు దెలుపును. స్వామిదర్శనమునకై పోయి వందియయి యనఁగా సుప్రభాతములు చదివి సాష్టాంగనమస్కారములు రెండైనను గావించి తరువాత స్తోత్రపాఠములు చదివి దేహము వంచి వినయముతో నమస్కరించి మచ్చికచే జయజయధ్వనుల మంగళాశాసనము గావింపవలెను. దీనినే ప్రాత రభిగమనమందురు.కని యనుటచేఁగన్నులు గల ఫలము, వందనముల్ ఘటించి యనుటచేఁ జేతులు శిరస్సు దేహముఁగల ఫలము, సన్నుతించి యనుటచే వాక్కుగల ఫలము చెప్పఁబడెను. కమలాక్షునర్చించు కరములు కరము లని కలదుగదా.

## తాత్పర్యము

ఏకోరికలు కోరినను ననుగ్రహించు శ్రీరాముని దర్శించి సుమంత్రుఁడు సాష్టాంగనమస్కారములు చేసి యాయనగుణముల వర్ణించి వినయపరుఁడై చేతులు మోడిచి వ్యాయామములందును శయనములందును ఆసనములందును క్రీడలయందును మీకు సంతోషమేకదా యని కుశలప్రశ్నము గావించి యావల నాయనతో నిట్లనియె.

కం॥ కౌసల్యాతనయా! రా, మా! సరగున మిమ్ముఁ గనఁగ•మహిపతి కోర్కిం
జేసెను గైకేయీదే,వీసహితుం డగుచు నటకు•విచ్చేయుఁ డనన్. ౪౬౬

రామా యని యేక వచనసంబోధనము చిన్నప్పుడెత్తుకొని తిరుగుచు నేకవచనమున సంబోధించుచుండిన చనవుచేనని యెఱుఁగనగు. రామచంద్రా రామభద్రా యని తన్ను బిలుచుటకంటెఁ బ్రేమగలవారు చనవున రామా యనుటయే తనకు; బ్రీతికరమని శ్రీరాముఁడు చెప్పినట్లు భవభూతి చెప్పెను. సరగునన్=శీఘ్రమ్ముగ, విచ్చేయుఁడు=రండు.

## తాత్పర్యము

కౌసల్యానందనా! రామచంద్రా! రాజు కైకేయీదేవితోడనుండి మిమ్ముఁ ద్వరగాఁ జూడఁగోరిక గలవాఁడై యున్నాఁడు అచ్చటికిరండు.

—• శ్రీరాముఁడు సీతాదేవికి రాజాజ్ఞ నెఱింగించుట. •—

ఉ॥ అనుడి హృష్టచిత్తుఁ డయి•యానరసింహుఁడు నాని సత్క్రియా
మానితుఁ జేసి, సీతఁ గని•మానిని! దేవర దేవి మత్ప్రియం
బై సప్రభుత్వదానవిష•యంబు విచారము సేయుచున్నవా,
రానుతశీల న న్గుఱిచి•యాత్మధవుం గడుఁ దీవరించెడిన్. ౪౬౭

అనుడి=ఆమాట, హృష్టచిత్తుఁడై=(1) తండ్రి తల్లితోడనుండి పిలుచుచున్నాఁడని సంతోషించుచున్నవాఁడై.(2) అవతారప్రయోజనము సార్థకమగుకాలము సమీపించెఁగదాయని సంతోషించినవాఁడై.సత్క్రియామానితున్=సత్కా

రముచే గౌరవింపఁబడిన వానిని, దేవర=రాజు, దేవి=రాణి, మత్ప్రియంబైన=నాకుఁ బ్రియమైన, ప్రభుత్వ దాన విషయంబు (1) యౌవరాజ్యమిచ్చు విషయము (2) నా ప్రభుత్వమును ఖండించి విఘ్నము చేయువిషయము. 'దానం గజమదే త్యాగే శుద్ధి ఖండన యోరపి, యని నానా. విచారము=ఆలోచన.

## తాత్పర్యము

(౧) ఆమాటలాడఁగానే తల్లిదండ్రులిరువురు నొకచోనుండి పిలుచుచున్నారిది యపూర్వదర్శన మని సంతోషించినవాఁడై శ్రీరాముఁడు వానిని సత్కారములచేఁ బూజించి సీతతో నిట్లనియె. దేవీ! రాజుగారురాణిగా రిరువురు నాకు మేలైనదగు యౌవరాజ్యము నాకు నిచ్చువిషయమై యాలోచించుచున్నారు. అందుఁ బొగడఁబడిన నడవడిగల యాకైక నావిషయమై త్వరగాఁబట్టాభిషేకము చేయుమని తొందరపెట్టుచున్నది.

(౨) ఆమాట వినఁగానే తన యవతారము సార్థకమగు కాలము సమీపించెఁగదా యని సంతోషించినవాఁడై యాపురుషోత్తముఁడు వానిని సత్కారముల గౌరవించి సీతతో మనమవతరించినది పట్టాభిషేకము చేసికొని యింట సుఖమనుభవించుటకుఁగాదు. శిష్టరక్షణార్థము దుష్టశిక్షార్థము ధర్మము సంస్థాపనమునకుఁ గావున మన మాపనికై పోవులసియున్నది. పై రెంటిలో రెండవదే నాకుఁ బ్రియమైనది. కావున యౌవరాజ్య పట్టాభిషేక కార్యము భంగముచేయు విషయమును రాజురాణి యిరువు రాలోచించుచున్నవారు. అందురాణి నన్ను గుఱించి యడవులకుఁ ద్వరగాఁ బంపుమని తనభర్తను దీవరించుచున్నది.

సీ॥ వెరవరి గాన దే•వియు రాజుయోజన,యెఱిఁగి నాకు శుభంబు•నెసఁగఁజేయఁ
గోరు చుండుటఁజేసి•గొబ్బున నాయర్థ వృద్ధికై తొందర•పెట్టుఁ బతిని
పరహితకామాను•వర్తిని గేకయ క్ష్మాపాలుసుత యర్థ•కామ నాదు
జనని యదృష్ట మా•మనుజేశుఁ డాప్రియు, రాలు నాయర్థకా•మాభివృద్ధిఁ

తే॥ జేతమునఁ గోరెడి సుమంత్రు•దూతగాఁగ,
బంపిరిచ్చోటికిదిగదా•పాడి దలఁప
నెట్టిదో సభ దూతయు•నట్టివాఁడ,చెలియ యువరాజు నన్నిష్ట•చేయుఁజేఁడు

వెరవరి=ఉపాయము తెలిసినది, యోజన=ఆలోచన, సంస్కృతమున యోజన యను శబ్దములేదు. అర్థ వృద్ధికై=(1) ఐశ్వర్యాభివృద్ధికై (2) నా యవతార ప్రయోజనము సాంతమగుటకై, అర్థమనఁగాఁ బ్రయోజనమనుటకు, అర్థః ప్రకారే విషయే వ్యవహారే ప్రయోజనే॥ నానా-ర-) పరహిత కామాను హితమైన కోరికవర్తిని=(1) శ్రేష్ఠమై తనకు హితమైన ప్రకారము వర్తించునది. (2) నాకుహితమైన ప్రకారము వర్తించునది. అర్థకామ=(1) ధనాశగలది.(2)

నాప్రయోజనము నెఱవేర్పఁ గోరిక గలది. నాయర్థ కామాభివృద్ధి= (1) నా యర్థము కామముయొక్క యభివృద్ధి, (2) నాప్రయోజనమైన యభివృద్ధి, చేతమునన్=మనస్సునందు. రూ. చేతస్సు, పాడి=న్యాయము, చెలియయువ రాజు=చెలియా! యువరాజు(2)చెలీ!య యువరాజు=యువరాజుగాకుండునట్లు.

తాత్పర్యము

(౧) ఉపాయశాలిని గనుకఁగైక రాజు తనకుఁ జెప్పకముందే నాపట్టాభి షేక విషయమైన యాలోచన దెలిసికొని నాకు మేలు గలుగఁ జేయుకోరిక గలది కావున నా కైశ్వర్యము వృద్ధియగుటకై పట్టాభిషేకము చేయుమని భర్తను దీవరించుచున్నది. భర్తకు హితమైన కోరిక ప్రకారము వర్తించునది కావున నాతల్లికైక నాయర్థమందుఁ గోరిక కలది. నా యదృష్టమేమో నాహితా ర్థముగోరు సుమంత్రుఁడావేళ కచ్చుటికిఁ బోవుటచే నతని వారు పంపిరి. ఇది న్యాయ్యమేకదా.

నాతల్లిదండ్రులిరువురు నావిషయమున నెట్టిమంచి యభిప్రాయము గల వారో దూతము నట్టివాఁడే లభించెను. ఈ సభయందలి తీరుమానమేమనఁ జెలియా నన్ను రాజిప్పుడే యువరాజు చేయును.

(౨) రాజు నన్ను యువరాజు చేయ నున్నాఁడని యాయన యభి ప్రాయము నుపాయశాలిని గావున నాయన చెప్పకముందే కైక తెలిసికొని యాయన కోరిక నెఱవేఱిన నాకు లోకమునఁ గీర్తి ప్రతిష్టలు లేవని తలంచి నా మేలు గోరుచుండునదిగావున నాయవతార ప్రయోజనము వృద్ధిచేయుటకై శ్రీరామునకుఁ బట్టాభిషేకము చేయవలదని భర్తను దొందరపెట్టుచున్నది. కైక నాకు మిక్కిలి హితమైన కోరికప్రకారము వర్తించునది. నా ప్రయోజనము నెఱవేఱుకోరిక గలది. ఆరాజు ఆయన ప్రియురాలు నిరువురు!! తనమనస్సున నాయర్థమును గామమును వృద్ధిచేయఁ గోరెడి సుమంత్రుని దూతగాఁ బంపిరి. ఆ దంపతులు నాయర్థకామాభివృద్ధిగోరునట్లె సుమంత్రుఁడును గోరువాఁడు. కావునఁ దగిన దూతయె. వారి యాలోచన పర్యవసాన మేమన చెలీ! నన్ని ప్పుడు రాజు యువరాజుగాఁజేయఁడు.

కం॥ ఇదె పోయి రాజుఁ గనుఁగొని, సుదతీ! చనుదెంచువాఁడ•సుఖముగ నీవున్
ముదితలతో నందనుకను, మదిరేక్షణ! వేడ్కనుండు•మా యనియనుడున్

ఇదె=ఇప్పుడే, మదిరేక్షణ=సంతోషముచే మత్తత గలిగించుచూపు గల దానా! నాయైశ్వర్యము నీకన్నులయం దున్నదని భావము. తత్+ఇరా+ఈ క్షణయని పదవిభాగము చేయనగు. సుదతి=శోభనములగు దంతములుగలది. దంతశబ్దమునకు దతాదేశము.

## తాత్పర్యము

ఇదిగో(బోయి రాజును జూచివచ్చెదను. నేను వచ్చునందనుక నీవు నీచెలికత్తెలతో సుఖముగ నుండుము.(నేను మరలివచ్చినది మొదలు నీకు దుఃఖమే అంతవఱకే నీకు సంతోషము.)

సీ॥ ప్రాణేశసమ్మాని•తాసితేక్షణ సీత, వాకిటివఱకును•వచ్చి హృదయ
కాంతుని దివ్యమం•గళవిగ్రహుని( జూచి,యాశాసనముల ని•ట్లనియెనిన్ను
బ్రాహ్మణ జుష్టంబు•రాజ్యంబు రాజసూ,యాభిషేచనమున•నవనివిభు(డు
బ్రహ్మపులోమజా•పతికి( జేయువిధాన, నభిషిక్తు(జేయుత•హర్షమునను
తే॥ దీక్షితుని వ్రతసంపన్ను•దివ్యతేజు, నజినధరు శుచి నిన్ను నే•హరిణశృంగ
హస్తు( గని నిన్ను భజియింప•నాశ్రయింతు,
సర్వశుభములు నీకు నె•సంగు(గాత. ౪౭౦

సీతాదేవి శ్రీరాముని సౌందర్యాలంకారాదుల( జూచి యింత సొంపయిన యీ సౌందర్యాలంకారాదులుగల యాయనకు( దృష్టిదోషమున( గీడు మూ(డునో యని భయపడి యతనికి మంగళప్రదముగ దీవించుచు( గొంత దూరము వెంబడించుచున్నది.

ప్రాణేశ=భర్తచే, సమ్మానిత=గౌరవింప(బడిన,అసితేక్షణ=కాటుకకన్నులుగల సీత, దివ్యమంగళ విగ్రహుని=దేవసంబంధమైన శుభాకారము గలవానిని, ఆశాసములన్=ఆశీర్వాదములను, బ్రాహ్మణజుష్టంబు = బ్రాహ్మణసేవ్యము. అజినధరున్=చర్మమును ధరించినవానిని, హరిణశృంగహస్తుక్=జింకకొమ్ము చేతియందు( గలవానిని, ప్రాణేశసమ్మానిత=తనప్రాణములకు నీశు(డు=ప్రాణేశు(డు, అట్టి యీశు(డు తన్ను విడిచి పోయెనేని వియోగతాపము సైరింపలేక వెంటనే ప్రాణములాయన వెంటనేపోవును. సీతకు( దనయందు(గల పరమభక్తి తెలిసిన శ్రీరాము(డు అట్టి విపత్తు గలుగకుండుటకై సమ్మానితనుజేసెను= అన(గా(దన మెడలోనున్న కంఠహారమును ఆమె మెడలో వేసెను. ఇది గాఢాలింగన సూచనము. దానివలన నామె ప్రాణములు నిబ్బరించుకొనియుండ( గలిగెను.

అరణ్యమున సీతావియోగ కాలమున శ్రీరాము(డు రోదనము(చేయు విధము(గాంచి యేమిటి కన్నా యింతగా విలపించెదవు. నీవంటివా(డింత కామమునకు( బాలుపడవచ్చునాయని యడుగ లక్ష్మణా నాకామమునకు నేను దుఃఖింపలేదు. అయోధ్యాపురమున నున్నప్పుడు సంభోగకాలమున( గౌ(గిలించునపుడు సీత తన దేహమునకు నాదేహమునకు నడుమ( దనముత్యాలసరముండుటయు(గూడ సహింపక సర్వాభరణములు దీసివైచుచుండెను. అంతటి విశ్లేష భీరువు సీత, అంతటి పరమ ప్రేమగలది నన్నెడ(బాసి మరణించెనేమో యని యేడ్చుచున్నానని చెప్పినట్లొక కవి వర్ణించెను.

"యా మీతి ప్రియపృష్టాయాః, కామిన్యాః కంఠదఘ్నయోః, వచోజీవిత యోరాసీ, త్పురో నిస్సరణేరణః॥ భవభూతి॥ ప్రియుఁడొక ప్రియురాలితోఁ బోయెదను అనెనఁట. ఆమాటవినఁగానే వాక్కు ప్రాణములు నేను ముందు బోయెదననిన నేను ముందు బోయెదనని కలహమాడెనఁట. పోవలదనిన నవ శకునము. పొమ్మని యందమా యనినఁ బ్రాణములు ముందే పోవఁ బ్రయాణ మైనవి.

తన వియోగము సహింపలేని యీమెను నూరడింప నామెపాదములు పట్టుకొని వేఁడుకొని యూరడించెనని భట్టారకుల యభిప్రాయము.

అసితేక్షణ=అసిత+ఈక్షణ=నల్లని కన్నులు గలది. కాటుక పెట్టుకొనకున్నను కాటుక పెట్టుకొన్నట్లియుండు కన్నులుగలది.

(౧) నల్లని కలువ పూవులవలె నల్లని కనుచూపులు గలది.

(౨) కాటుకపిట్టలవంటి కన్నులుగలది. మొదటిది సహజసౌభాగ్య లక్షణము.

(౩) తనకుఁ దనప్రాణేశుఁడాయన హృదయమందలి హారమును నిర్మలమై యుండుదానిని బహుమానము చేయఁగా నాకలువకంటి సీత రాముని ప్రేమదృష్టులచేఁ జూచెను. ఆ చూపులమాలికచే నల్లకలువదండ శ్రీరామునకుఁ సీత సమర్పించెను. బంగారుకాంతిగలసీత దేహమునఁ దెల్లని ముత్యాలసరము కాంతులుపడఁగా క్షీర నీరన్యాయమునఁగలయక తిలతండుల న్యాయమున (నూవులు బియ్యము కలిపినట్లు) నుండెను. అది మెచ్చక సీత నల్లకలువదండ సమర్పింపఁగా శ్రీరాముని దేహకాంతిలోఁ గలువలకాంతి కలిసిపోయెను.ఆరూపమునఁ దన ప్రేమయెట్టిదై నది సీత దెలిపెను.

శ్రీరాముఁడీమెను నింతగా సమ్మానింపఁ బ్రేమయొక్కటే కారణమా యింకను నేమైనఁ గారణములు గలవాయనినఁ జెప్పుచున్నాఁడు.

సీత, రామునివలెఁ దల్లిగర్భమునుండిరాక నాఁగటి చాలులోఁ బుట్టినది కావున సీత యయోనిజ, కావున నభిజాత్యమున శ్రీరామునికంటె సీతయేశ్రేష్ఠురాలు. అయోనిజ తన భార్యయైనను యోనిజునకుఁ బూజ్యురాలేకదా యని భావము.

సీత యనునది గంగానదికిఁ బేరు. గంగానది యొకసారి చూచినవారిని స్పృశించినవారినిఁ బావనులఁ జేయునది. అట్టిదే సీతాదేవియును.ఇట్టియీమెతో నిత్యసంయోగముగలవాని మహిమ యేమని చెప్పసాధ్యము. అప్రమేయంహి తత్తేజోయస్య సా జనకాత్మజా" ఆసీత యెవనిదో యతని తేజ మప్రమేయమని ముందు మారీచుఁడు చెప్పఁగలఁడు. కావున సీతమహిమయే రామప్రభావమున కుద్ధారకము. వాకిటివటుకునువచ్చి=వాకిటివటుకు నేలవచ్చెను. అన ఆయన హృదయకాంతుఁడు గనుక. సూర్యుఁడెదుట నుండిన గమలము కాంతియు క్తమై యుండును. సూర్యుఁడు మఱుగాయెనా కాంతిహీనమై ముకుళించును. అట్టిలె

హృదయకాంతుఁడెదుటనుండ హృదయము సంతోషముచేఁ గాంతియుక్తమై యుండును. అవల వియోగవ్యసనాంధకారమున మునిఁగి కాంతిహీనమగును. కావున మర్యాదననుసరించి స్త్రీలెంతవఱకుఁ బోవచ్చునో యంతవఱకుఁ బోయె నని భావము. దివ్యమంగళ విగ్రహంని=అప్రాకృతమైన మంగళాకారముగల వానిని. ఈ యాకారమే యామెకు సస్థానమున భయము గలిగించినది. ఆ భయమే యనిష్టనివారణమగునట్లు దీవింపఁ జేసినది.

దివ్యమంగళ విగ్రహున్=దేవసంబంధమై యితరులకు శుభప్రదమైన యాకారముగలవానిని, దేవతల దర్శనము మనుష్యులకు వ్యర్థముపోదు. శుభ మునకే కారణమగును. అట్టి విగ్రహమునకుఁ బామరుల దృష్టిదోషముచేఁ గీడు కలిగిన లోకులకే హాని కావున నట్టిది కలుగకుండుటకై యాశీర్వదించుచున్నది.

అనియెన్=తనమనస్సులో ననుకొనెను. ఆత్మనేపద మనిత్యము కావునఁ బరస్మైపద ముపయోగింపఁబడెను, ఇచ్చట నాశీర్వచనమనఁగా మేలుకలుగఁ గోరుట. ఇది పిన్నవారు పెద్దవారికిఁ జేయునపుడు తమ మనస్సులో ననుకొన వలెఁగాని పెద్దవారు పిన్నవారికి దీవించిన ట్లితరులకు వినఁబడునట్లుగాని మంత్ర వంతముగఁగాని కూడదు.(కౌసల్య రాము నాశీర్వదించిన విధముఁ జూడుఁడు) ౩౨౦ వ పద్యము.

బ్రాహ్మణజుష్టంబు=బ్రాహ్మణులచే గౌరవింపఁబడినది. ఈ రాజ్యము బ్రాహ్మణులచే గౌరవింపఁబడినది. ఈరాజ్యమున బ్రాహ్మణులు విశేషముగరక్షింపఁబడుటచే వారును దీని యభ్యుదయముఁ గోరుచుందురని భావము. రాజసూయాభిషేచనమునన్=సమస్త శత్రువులను జయించి సార్వభౌములై చేయు రాజసూయ యాగమందలి యవభృథస్నానమువలె, బ్రహ్మ=చతుర్ముఖబ్రహ్మ పులోమజాపతికిన్=ఇంద్రునికి, బ్రహ్మయింద్రునభిషిక్తుఁ జేయునట్లు నిన్నును దశరథుఁడు జేయునుగాక. దీక్షితునిన్=దీక్షవహించి స్త్రీ సంసర్గము వదలి కృష్ణాజినముధరించి యజ్ఞమున నుండవలసిన యలంకారములతో నుండు వానిని, ఇట్లున్న వానిగఁగదా నిన్ను నేను జూడఁగోరుచున్నానని భావము.

వ్రతసంపన్నునిన్=వసిష్ఠుఁ డీ యజ్ఞమున నీ వుపవాసము చేయవలయు నని చెప్పి శ్రీరాముఁడు సుకుమారుఁడు గావున శుష్కోపవాసము చేయఁజాలఁడేమోయని లఘూపవాసము (పాలు త్రాగియుండుట) విధించెను గాన శ్రీరాముఁడో నేను శాస్త్రప్రకారము నిత్రుపవాసము చేసెద ననెను ఆ విధముగ ఋషులు చెప్పినదానికంటె శాస్త్రప్రకారము పూర్ణముగ నుపవాసాదివ్రతములు చేయు నిన్ను, సంపన్న శబ్ద మీయర్థము నిచ్చుచున్నది. సంపన్నున్=బాగుగఁగూడినవానిని దివ్యతేజున్=వ్రతాదులవలనఁ గలిగిన గొప్ప తేజస్సు గల వానిని, తపోబలమునఁ గదా ఇంద్ర చంద్ర సూర్యాగ్నుల కటువంటి తేజస్సు గలుగుట, అజినధరున్=వ్రతకాలమందు వస్త్రములు ధరించుటకంటెఁ గృష్ణాజి

నము ధరించుటే శ్రేష్ఠము. శుచిన్=పరమపవిత్రుని, వ్రతదినములందు దీక్షా కాలమునందు భార్యనుదప్ప నితరస్త్రీని దాఁకరాదని వసిష్ఠుఁడు చెప్పఁగా (చూ. ౧౨-౧౩ పద్యములు) సీతతో దర్భశయనమునఁ బరుండినను నామెను దాఁకక యసిధారావ్రతచర్య నాచరించెను. అంతటి శుచిమంతుఁడని భావము. హరిణశృంగహస్తునిన్=జింకకొమ్ము చేతఁ బట్టుకొన్నవానిని, యజ్ఞమున యజమానుఁడు తనదేహమును గోళ్ళతో గోకికొనరాదు. జింకకొమ్ముతో గోకుకొనవలెను. ఏకవస్త్రధరోధన్వీయన్నప్పుడుండు కాంతికంటెఁ గృష్ణాజినధారియై జింకకొమ్ము చేపట్టినప్పటికాంతి విశేషమని భావము.

నిన్నుఁగని భజియింపన్=నిన్నుఁ జూచుచు సేవచేయుటకు, ఇందుఁగనుటయే ప్రధానము, ఎవ్వరు భగవంతు సేవచేసినను భగవదనుభవమునకే కదా. అట్టి యనుభవము వలని ప్రీతిపూర్వకసేవ తర్వాత. నిన్ను నాశ్రయింతున్=క్రియాభేదముచేఁ గర్మమునకుఁ బౌనరుక్త్యములేదు. నిన్ను భజియింప నిన్నే యాశ్రయింతునని భావము. నిన్ను గనుటకున్=నిన్ను భజియించుటకు నిన్నే యాశ్రయింతుననుటచే నీయాశ్రయణము లభింపనేను వేఱొక యుపాయము వెదకనని భావము. ఇట్టిది యనన్యత్వము. ఇందు సీతాదేవి గోరిన ఫలము శ్రీరాముని గనుచుండుట, దానిని గలిగించునది సమాశ్రయణము, చేయు కార్యము భజనము. ఇదియేమి? నీవు పట్టాభిషిక్తుఁడవు గమ్ము. నేను పట్టపురాణినై సకలైశ్వర్యము లనుభవించెదననక నిన్నుఁ జూచుచు నాశ్రయించి భజించెదనని "ఆయురారోగ్య మర్థాంశ్చ, భోగాంశ్చైవాను షంగికాన్ దదాతి ధ్యాయినాం నిత్య, మపవర్గ ప్రదోహరిః॥ మోక్షదాతయగు విష్ణువును మోక్షమిమ్మని కోరిన యెడల నట్టియోగ్యత కలుగువఱకు నాయుస్సు ఆరోగ్యము ధనము భోగము లన్నియు నిచ్చును.

సావిత్రి యమధర్మరాజును నాకు నూర్వురు పుత్రులు గలుగ ననుగ్రహింపుమనెను. అకారణముగ యముఁడు సత్యవంతుని బ్రతికించెను. కావునఁ బ్రధానఫలమపేక్షించినయెడల నవాంతరఫలములు తమంతటఁదామేవచ్చును.

ఈ గీతమందు శ్రీరాముఁడు పైపద్యములందుఁ జెప్పిన రహస్యవిషయమునకు రహస్యమైన ప్రత్యుత్తరముగలదు. అవతారప్రయోజనము దీర్పవలసినకాలము వచ్చినదని శ్రీరాముఁ డనఁగా పితృవాక్యపాలనావ్రతసంపన్నుఁడవై వానప్రస్థుఁడవై వనవాసదీక్షవహించునిన్నుఁ గనుచు నీసేవచేయుచుండ నీతోడ నేనును వచ్చెదని సీత ప్రత్యుత్తరమిచ్చెను. దీక్షితుని, వ్రతసంపన్నుని దివ్యతేజుని, కృష్ణాజినధరుని, శుచి, శృంగహస్తుని నను విశేషణములు వానప్రస్థునందు నన్వయించును. హరిణశృంగహస్తు నన్నప్పుడు కోదండధరునని భావము. శృంగముచేఁ జేయఁబడునది శార్ఙ్గము = చాపము, శివుని వింటికి నజగవమనిపేరు. అనఁగా మేఁక

కొమ్ముతోను ఎద్దుకొమ్ముతోను జేయఁబడినదని యర్థము. ఈవిధముగ నవతారము సార్థకమగు మార్గమును సీత సూచించెను. ఆమె సహధర్మచారిణిగదా.

తాత్పర్యము

తనభర్తచే గౌరవింపఁబడిన సీత తండ్రిని జూడఁబోవు శ్రీరామునివెంటఁ దలవాకిలి వఱకు వచ్చి యాయన దివ్యమంగళ విగ్రహముఁ జూచి దృష్టిదోషమునఁ గీడుకలుగునేమో యని భయపడి యిట్లు లాశీర్వదించెను. బ్రాహ్మణ పూజ్యమైన రాజ్యమందు బ్రహ్మయింద్రు నభిషేకించినట్లు నిన్ను రాజునభిషేకించునుగాక. దీక్షవహించి పూర్ణముగా వ్రతము సాధించు దివ్యతేజుని కృష్ణాజినధరుని శుచిని జింకకొమ్ము ధరించినవానిని గని యాశ్రయించి సేవింపఁగోరుచున్నదానను. సర్వశుభములు నీకు నభివృద్ధిపొందునుగాక.

కం॥ కులిశాయుధుండు తూర్పున, నళినాప్తసుతుండు దక్షిణమున బడమటన్
జలనిధిపతి యుత్తరమునఁ, గలకాలం బైలబిలుఁడుఁ గావుత నిన్నున్.

కులిశాయుధుండు=వజ్రపాణియగు నింద్రుఁడు, నళినాప్తసుతుఁడు=యముఁడు, జలనిధిపతి=వరుణుఁడు, ఐలబిలుఁడు=కుబేరుఁడు, కలకాలము=ఎల్లవేళ.

తాత్పర్యము

తూర్పునందు వజ్రము ధరించిన యింద్రుఁడు. దక్షిణమున మీవంశకర్తయగు సూర్యునికొడుకు దండధరుఁడును, పడమర వరుణుఁడును, ఉత్తరమునఁ గుబేరుఁడును సర్వదా రక్షింతురుగాక.

ఐలబిల మను, శబ్దము అప్రయుక్తదోషమునకు లక్ష్యములుగాఁ బ్రతాపరుద్రీయ మందును దాని ననుసరించిన నరసభూపాలీయమందును గలదుకాని భాష్యమందు నప్రయుక్తదోషమనునది లేదని శాసించియుండుటను అప్రయుక్తత్వదోషస్తు నవిరుద్ధోహరేర్మతేయని దోషయుక్తము గాని పదమునకు నప్రయుక్తదోషములేదని హరిభట్టు నధర్వణాచార్యులు నంగీకరించియుండుటను పూర్వకవిప్రయోగము లుండుటను నివి యీ గ్రంథమునఁ బ్రయోగింపఁబడియె.

ఈ పద్యమునందు సీతాదేవి శ్రీరామచంద్రమూర్తి నాశీర్వదించినట్లు చెప్పఁబడెను చిన్నవాండ్రు పెద్దవారిని నందు భార్యలు భర్తల నాశీర్వదింప వచ్చునా. ఇది ధర్మమా యని సందేహము. ఆశీస్సు అనఁగా హితముఁ గోరుట మేలుకోరి చెప్పెడుమాట ఆశీర్వాదము. మంగళాశాసనము అనఁబడును. గొప్ప కార్యము సాధింపఁబోవువారికి సమీపమందు నెవరైన నవశ్యము మంగళాశాసనము కావింపవలెను. పెద్దవారు దగ్గఱలేరేని భార్యయైన నాకార్యము చేయవలెను. భగవంతుని తమ బిడ్డగాభక్తులు భావింతురు.అట్టి బిడ్డకుఁ బామరుల దృష్టి తగులు నేమోయని మంగళాశాసనము చేయుదురు.అట్టులే సీతయు శ్రీరామచంద్ర

మూర్తి తండ్రిని జూడఁబోవునపుడు చూనకుదృష్టి తగులకుండుటకునుబోయిన చోటఁ గీడు కలుగకుండుటకును మంగళాశాసనము గావించెను. అట్లులే శివునిఁ గూర్చి తపస్సు చేయఁబోవు నర్జునుని ద్రౌపదియుఁ గృష్ణుని జాంబవతియు నాశీర్వదించిరి.

ద్రౌపది.

"తం సింహ మివ గచ్ఛంతం, సింహ స్కంధోరసం తథా
ప్రాంజలిః పాండవం కృష్ణా, దేవానాం కుర్వతీనమః
వాగ్భిః పరమశుక్లాభి, ర్మంగళాభి రభాషత
నమో ధాత్రే చ సంధాత్రే స్వస్తి గచ్ఛ వనాద్వనమ్
ధర్మస్త్వాం జుషతాం పార్థ, భాస్కరశ్చ విభావసుః
బ్రహ్మత్వం బ్రాహ్మణాం శ్చైవ, పాలయంతు ధనంజయ॥
జ్యేష్ఠాయ చాపి జ్యేష్ఠస్య, భ్రాతుర్వచన మాస్థితః
ప్రపద్యేథా వసూన్ రుద్రా, నాదిత్యాన్ సమరుద్గణాన్
విశ్వేదేవాం స్తథా సాధ్యాన్, శాంత్యర్థం భరతర్షభ
స్వస్తి తేంతరిక్షేభ్యో, దివ్యేభ్యో భరతర్షభ
పార్థివేభ్యశ్చ సర్వేభ్యో, యే కేచి త్పరిపంథినః
అని యర్జును దీవించెను.

జాంబవతి కృష్ణుని నిట్లు దీవించెను.

"సా చ మా మబ్రవీ ద్గచ్ఛ, శివాయ విజయాయ చ
బ్రహ్మశిరః కాశ్యపశ్చ, సధ్యో దేవా మనోనుగాః
క్షేత్రౌషధ్యో యజ్ఞభాగా, శ్ఛందాంస్యర్షిగణాధరా
సముద్రా దక్షిణా స్తోభా, ఋక్షాదీ పితరో గ్రహాః
దేవపత్న్యో దేవకన్యా, దేవమాతర ఏవ చ
మన్వంతరాదీ గావశ్చ, చంద్రమా సవితా హరిః
సావిత్రీ బ్రహ్మవిద్యా చ, ఋతవో వత్సరా స్తథా
క్షణా లవా ముహూర్తాశ్చ, నిమేషా యుగపర్యయాః
రక్షంతు సర్వత్రగతం, త్వాం యాదవ సుఖాయచ
అరిష్టం గచ్ఛ పంథాన, మప్రమత్తో భవానఘ॥
ఏవం కృత స్వస్త్యయన, స్తయా హం.......
తతోభ్యనుజ్ఞాయ పరేంద్రపుత్రీమ్॥ అనుశాసనికము.

కావున సీత చేసినది యకార్యము కాదు.

పల్లాండు పల్లాండు పల్లాయిరత్తాండు పల్కోడి నూఱాయిరం॥ అనునది భగవంతునికిఁ జేయు మంగళాశాసనమే కదా.

కం॥ అంగన నిటు కృతకౌతుక,మంగళుఁ డగు నృపసుతుండు•మరలఁగ నాజ్ఞా
సంగత నొనర్చి సూతుని,సంగతి నిలు వెడలె రామ•చంద్రుం డెలమిన్.

అంగనన్=సీతను, కృతకౌతుక మంగళుఁడు= (౧) చేయఁబడిన పట్టాభిషేక శుభవిషయమైన దీవనగలవాఁడు. అథకౌతుకమ్ కుతుకేచ్ఛా హస్తసూత్ర మంగళే తిహ్యకర్మసు ప్రఖ్యాత హర్షయో॥ నానా.

కౌతుకమనఁగా శుభకార్యములందుఁ జేతికిఁ గట్టుకొను కంకణమునకుఁ బేరు. రాక్షసవధయను శుభకార్యమునకై కట్టుకొన్న కంకణముగలవాఁడు.మరలఁగన్=ఇంటిలోనికిఁబోవ, ఆజ్ఞాసంగతన్=ఆజ్ఞతోఁగూడిన దానిని, సూతునిసంగతిన్=సుమంత్రునితో, ఎలమిన్=సంతోషముతో.

తా త్ప ర్య ము

పట్టాభిషేక విషయమైన యాశీర్వచనముగలవాఁడై శ్రీరాముఁడు తన తోడ వచ్చిన సీతను నంతఃపురమునకుఁ బొమ్మని చెప్పి సుమంత్రుతోడ నిల్లు వెడలెను.

—• శ్రీరాముఁడు దశరథగృహంబునకుఁ బోవుట. •—

సీ॥ కందరాంతరవిని•ర్గతసింహమోయన, నిజమందిరము వీడి•నీటు మెఱయఁ
ప్రథమకక్ష్యాంతర•ద్వారభాగంబునఁ, బ్రహ్వాంజలి సుమిత్ర•పట్టిఁ గూడి
మధ్యమకక్ష్య స•మ్మతిఁ జేరి యచట మి,త్రార్థుల నందఱ•నాదరించి
చని యటఁ బావక•సంకాశ మై వ్యాఘ్ర,చర్మాంచితంబు నై•జలదరవము
ఆ॥ నుగ్రభానుకాంతి•యుచిత వై శాల్యంబు, కలభకల్పజవన•గణము లమర
ధవశతాంగజవము•నవుతేరు శ్రీరామ,చంద్రుఁడెక్కెఁ దూర్పుఁ•జంద్రునట్లు ౪౮౩

కందరాంతర వినిర్గత సింహమో=గుహలోనుండి వెలువడిన సింహమో, నిజమందిరము=తనగృహము, వీడి=విడిచి, ప్రథమ కక్ష్యాంతర ద్వారభాగంబునన్=మొదటితొట్టి కట్టులోపలి వాకిట, ప్రహ్వాంజలి = వినయమునదేహము వంచిచేతులు ముకుళించినవాఁడైన, సుమిత్రపట్టిన్=లక్ష్మణుని, మధ్యమకక్ష్యన్ నడిమి తొట్టి కట్టును, మిత్రార్థులన్=స్నేహితులను, కార్యము నిమిత్తమై ధనార్థులై వచ్చినవారిని, పావక సంకాశమై=అగ్నిహోత్రునితో సమానమై, వ్యాఘ్ర చర్మాంచితంబునై =పులితోలుచేఁ బ్రకాశించునదియై, జలదరవము=మేఘధ్వని ఉగ్రభానుకాంతి=తీవ్రకిరణములుగల మధ్యాహ్న సూర్యునియొక్క ప్రకాశము, ఉచిత వై శాల్యంబు=నలుగురైదుగురు కూర్చుండుటకుఁ దగిన వెడల్పుగలది. కలభకల్ప=ఏనుఁగు పిల్లలతో సమానములైన, జవనగణము=శీఘ్ర గమనము గల గుఱ్ఱముల సమూహము, అమరధవ=ఇంద్రుని, శతాంగ = తేరియొక్క, జవము=వేగము గలది.

తాత్పర్యము

గుహలోనుండి బయలు వెడలి వచ్చిన సింహమోయనునట్లు తన మందిరము విడిచి తన కాంతి దిక్కుల వ్యాపించుచుండ మొదటి కక్ష్యలోపలి వాకిట వినయంబున వంగి చేతులు మోడ్చి నిలుచున్న లక్ష్మణుతోఁగూడి నడిమి కక్ష్యఁ జేరియందున్న మిత్రులను సర్వులను నాదరించి యావలఁ దాఁటిపోయి నగ్నిహోత్రముతో సమానమై పులితోలుచే నందమై మేఘధ్వనిగలదై మధ్యాహ్న సూర్యకాంతిగలిగి తగిన వైశాల్యము గలదై ఏనుఁగు పిల్లలవంటి గుఱ్ఱములు కట్టఁ బడినదై యింద్రునితేరివలె గమనవేగముగలదైన రథమును జంద్రుఁడు తూర్పుకొండ యెక్కినట్లెక్కెను.

సీ॥ ఛత్రచామరములు•జానొప్పఁ గేల్దోయి, మెఱయ వెన్ప్రక్క సౌ•మిత్రి గావ
సౌరమార్గమునఁబ•ర్జన్యుని విధమున,వరశతాంగము కడు•మొరయుచుండఁ
నుదయాద్రి వెలువడు•నుత్పలాప్తునిఁ బోలి,
తన నికేతము వీడి•తరలుచుండఁ
గనుఁగొనుజనముల•కలకలనాదంబు, తుములమై పర్వంగఁ•దోరముగను
తే॥ జందనాగరురూషిత•జనము చాప,ఖడ్గధరకోటు లెలమి ముం•గలనునడువ
వెనుక నార్గకొలందులు•వేనవేలు, హయవరంబులు నేనుఁగు•లంటి రాఁగ

ఛత్రచామరములు=గొడుగులు వింజామరములు, జానొప్పన్=అందగింపఁగా, కేల్దోయి=రెండుచేతులు, సౌరమార్గమునన్=అకాశమందు, వరశతాంగము=శ్రేష్ఠమైన రథము పర్జన్యుని విధమునన్=మేఘమువలె, మొరయుచుండన్=ధ్వనించుచుండ, ఉత్పలాప్తునిన్=కలువలకు మిత్రుఁడగు చంద్రుని, నికేతము=ఇల్లు, తుములమై=కోలాహలమై, తోరముగన్=అధికముగ, చందనాగురురూషితజనము=చందనము, అగరు వీని పూఁతగల దేహముగల మనుష్యులు, చాపఖడ్గధరకోటులు=విల్లు, కత్తిధరించినవారి సమూహములు, ముంగలన్=ముందుప్రక్క, హయవరంబులు=శ్రేష్ఠములైన గుఱ్ఱములు.

తాత్పర్యము

లక్ష్మణుఁడు వెనుక ప్రక్క నొకచేత ఛత్రము మఱియొకచేతఁ జామరముఁ బూని యెండదగులకుండునట్లు ఈఁగలు వ్రాలకుండునట్లు రక్షించుచుండ నాకాశమున మేఘము ధ్వనించినట్లు రథము ధ్వనించుచుండఁ దూరుపు పర్వతమును విడిచివచ్చు చంద్రునివలె నిల్లు విడిచివచ్చుచుండఁగా నాయనను జూచు జనముల కోలాహల మతిశయమగుచుండఁ జందనము అగరు పూసి కొనినవారు విండ్లు ఖడ్గములు ధరించినవారు ముందుప్రక్కనడువ వెనుకప్రక్క నార్గకొలఁదులు వేలకొలఁదులు గుఱ్ఱములు నేనుఁగులు రాఁగా.

ఉ॥ మంగళవాద్యఘోషము ల•మందసువందిజయారవంబు సా
రంగతురంగ రావములు•ప్రస్ఫుటశూరమహానినాదముల్
రంగుగ నెల్లచోట్లఁ దన•రంగ గవాక్షగభూషితాంగ లా
నంగన లెల్లఁ జల్లిరి క•రాంజలులం గొని పూలు రాము పై. ౪౭౩

అమంద=అతిశయించిన, సువంది=మంచిస్తోత్రపాఠకుల,జయారవంబు =జయ జయ మను ధ్వనులు, సారంగ తురంగరావములు = ఏనుఁగులయు గుఱ్ఱములయు ధ్వనులు, ప్రస్ఫుటశూర మహానినాదముల్=మిక్కిలి స్పష్టమైన శూరుల గొప్పచప్పుడులు, గవాక్షగ=గవాక్షములందుండు, భూషితాంగలు= అలంకరించుకొనిన దేహములు గలవారు, అంగనలు=స్త్రీలు, కరాంజలులన్= చేతిదోసిళ్ళయందు.

తాత్పర్యము

మంగళవాద్య ధ్వనులు వందుల జయజయ ధ్వనులు, ఏనుగుల బృంహితములు,గుఱ్ఱముల హేషలు,శూరుల మహాసింహనాదములు నన్నిచోట్లవ్యాపింపఁగ నీవేడుకచూడ మేడల కిటికీల నిలిచిన స్త్రీలు చక్కఁగ సింగారించుకొని తమదోసిళ్ళయందుఁ బూవులు గొని శ్రీరాముపై జల్లిరి.

కం॥ నేలను సౌధంబులఁ గిటి,కిలను గనుచుండు సతులు•కీర్తించిరి సీ
తాలలనాహృదయేశు,మాళీసుకుమారు నతఁడు•హర్షమునొందన్. ౪౭౬

సౌధంబులన్= మేడలయందు, సీతాలలనాహృదయేశున్ = సీతాదేవి భర్తను, సుమాళీ సుకుమారున్=పూలవలె మృదువైన దేహముగలవానిని, హర్షము=సంతోషము.

తాత్పర్యము

మేడలులేనివారు పొరుగూళ్ళనుండి వచ్చినస్త్రీలు నేలమీఁదను పురమున నుండు స్త్రీలు మేడలయందలి కిటికీలయందునుండి చూచుచుఁ గుసుమసుకుమారుఁడు శ్రీరాముఁడు విని సంతోషింపఁగీర్తించిరి.

సీ॥ కౌసల్యనందనా!•కర మలరారు నిన్,సఫలాయాత్రుఁ బదస్థు•జననిచూచి
సీతామనోహరా!• సీమంతినీవర,ము న్నట్టితపముల•మొనసె నొక్క
యారోహిణి శశాంకు•నట్టులు నినుఁ గూడి, నీ ప్రియురా లయి•నెగడ సీత
రామచంద్రా! నిను•రాజుఁగాఁ గన నేమి, సలిపినార మొ ప్రశ•స్తవ్రతంబు

తే॥ రామభద్రుండు దశరథ•రాజుకరుణ,మనకు నేలిక యయ్యెడు•మనము పూర్వ
కాములౌదుము మఱుతము•కష్టమనఁగ,నెట్టిదో యింకనీయన•యేలుబడిని
స్త్రీలు చెప్పుకొనుమాటలు వినువదింపబడుచున్నవి.

కరమలరారున్=మిక్కిలి సంతోషించుచును, సఫలయాత్రున్=ఫలముతోఁ గూడిన ప్రయాణముగల,పదస్థున్=యౌవరాజ్యపద మందుండువానిని,జనని=

తల్లి కౌసల్య, సీమంతినీవర=ముత్తైదువులందు శ్రేష్ఠురాలు. సీమంతము=పాపట, అది గలది సీమంతిని. భర్తలులేని స్త్రీలకుఁ బాపటలులేవు. వెండ్రుకలు కలయదువ్వుదురు. అదియే వైధవ్యలక్షణము. 'వీరల కెలనఁ బాపటలు లేక, ధౌతసితవస్త్రపరిధానలై తనువుల నిర్వృతిదోఁపఁగనున్న యిన్నెలంత లాంబికేయుకోడండ్రు కరుణా విధేయులార॥ ఆశ్రమ ౨౫. ౪౪ పద్యము. దీని వలనఁ దలవెండ్రుకలుగల విధవలు పాపటలు లేకుండునట్లు కలయ దువ్వ వలయునని యేర్పడుచున్నది. ఏలిక=ప్రభువు.

## తాత్పర్యము

శ్రీరామచంద్రా! తల్లి యన కౌసల్యయే తల్లిగాని యందఱు తల్లులా. ఆమె నీవు పోవు ప్రయాణము సిద్ధించి యౌవరాజ్యపదమందుండఁగా మిక్కిలి సంతోషించును. స్త్రీలనిన నందఱు స్త్రీలా నీ మనస్సాకర్షింపఁజాలిన సీతయే గాక. అటువంటి వనితామతల్లి రోహిణి చంద్రునివలె నెప్పుడుగూడియుండ నీకుఁ బ్రియురాలయియుండ సమర్థురాలగు సీత మున్నే యే తపములు చేసెనోకదా.

రామచంద్రా! ప్రజలనిన నందఱు ప్రజలా నిన్ను రాజుగాఁ బొందుటకుఁ బూర్వజన్మమున మేమే మేమిప్రశస్తములయిన వ్రతములను సల్పితిమో.

అమ్మలారా! దశరథరాజు దయచే మనకు శ్రీరామచంద్రమూర్తి రాజుగా నున్నాఁడు. మనకోరిక లన్నియు నెఱవేఱును. ఈయన పాలనమున నిఁకఁ గష్టమనఁగ నెట్టిదో మఱతుము.

చం॥ అని యిటు కాంతలెల్లఁ దను • నాడుకొనన్ విని హృష్టచిత్తుఁడై
చని హయవారణంబులయు • స్వస్తికమాగధవందిసూతపూ
ర్జనులయుఁ బుణ్యవాటులయు • సంఘము లుల్లసిలంగ రాముఁడున్
జననిబిరీససౌధగృహ • చత్వర రాజపథంబుఁ గన్గొనెన్. ౪౪౮

కాంతలు=స్త్రీలు, ఆడుకొనన్=తనవిషయమై యనుకొనుచుండఁగా, హృష్టచిత్తుఁడై=సంతోషించిన మనస్సుగలవాఁడై, హయవారణంబులయు=గుఱ్ఱముల యేనుఁగుల యొక్కయు, స్వస్తిక=స్వస్తిపలుకు వారియొక్కయు, మాగధవందిపూర్జనులయు=మాగధులయొక్కయు, వందులయొక్కయు, సారథుల యొక్కయు పౌరులయొక్కయు, మాగధులు, రాజులను మేలు కొలుపువారు. క్షత్రియ స్త్రీయందు వైశ్యునికిఁ బుట్టినవారు, మాగధులు. వందులు రాజుస్తోత్ర పాఠములు చదువువారు బట్టువాండ్రు సూతులు రాజులకు సారథ్యము చేయుట యందు స్తోత్రపాఠములు పఠించుటయందు నియమింపఁ బడినవారు. క్షత్రియునకు బ్రాహ్మణ స్త్రీయందుఁ బుట్టినవారు సూతులు. ఇవి విలోమజాతులు. పుణ్యవాటులు=పుణ్యప్రదేశములయు, ఉల్లసిలంగన్=సంతోషింపఁగా, జన=జనులచే, నిబిరీస=దట్టమైన, సౌధ=మేడలు, గృహ=సామాన్యములయిన, యిండ్లు చత్వర=ముంగిళ్లుగల, రాజపథంబు=రాజమార్గము, కన్గొనెన్=చూచెను.

తాత్పర్యము

స్త్రీలందఱుఁ దనవిషయమై యిట్లు పలుకుచుండఁగా విని సంతోషించి పోయి గుఱ్ఱములు, ఏనుఁగులు, జయజయ యని ఘోషించు స్వస్తికులయు సూతవంది మాగధులయు పురజనులయు పుణ్యప్రదేశములయు సంఘమును సంతోషింప జనులచే నిండిన మేడలు ఇండ్లు ముంగిళ్లుగల రాజమార్గమును జూచెను.

౧౭-వ సర్గము.

సీ॥ కమనీయ మగుపతా•కాధ్వజతతులతోఁ,బరిమళదగురుధూ•పములతోడ
వెలిమబ్బులను బోలి•వెలయుగృహాళితో, నగరుచందననిచ•యములతోడ
వలిపంపుఁబట్టుదు•వ్వలువలరాశితో, స్ఫటికముక్తాఫల•పటలితోడ
నుచ్చావచంబు లై•యొప్పుభక్ష్యములతో, వలనొప్పు నంగళ్ల•వరుసతోడ
తే॥ రాజితంబయి యల యంబ•రంబునందు, దేవపథమున కుద్దియై•తేజరిల్లు
రాజమార్గంబునందు శ్రీ•రామవిభుఁడు,
సంతసంబారఁదానటు•చనుచునుండ. ౪౫౯

కమనీయమగు=మనోహరమైన, పతాకా=చిహ్నములులేని టెక్కము లయు, ధ్వజ=చిహ్నముగల జెండాలయు, తతులతోన్=సమూహములతో, పరిమళత్=సువాసనకొట్టుచున్న, అగరుధూపములతోడన్=అగరుచెక్కల పొగలతో, వెలిమబ్బులను=తెల్లమేఘములను, అగరుచందన నిచయములతోడన్= అగరు చందనపుఁ జెక్కల సమూహములతోను, వలిపంపుఁ బట్టు దువ్వలువల రాశితోన్=తెల్లని సన్నని పట్టువస్త్రముల సమూహముతో, స్ఫటికముక్తాఫల పటలితోడన్=స్ఫటికములయు ముత్తెములయు సమూహముతో, ఉచ్చావచం బులై=నానావిధములై, అంబరమునందున్=ఆకాశమందుఁగల, దేవపథమున కున్=స్వాతిమార్గమునకు, ఆకాశమున నక్షత్రములు విశేషము కానరాక వాని కాంతిచేఁ దెల్లనై బాటవలెఁగానవచ్చునది, ఉద్దియై=సమానమై.

తాత్పర్యము

అందముగాఁ బేర్లు వ్రాయఁబడినవి గరుడాది చిహ్నములు గలవియగు టెక్కెములతోను ఘుమం ఘుమయని సువాసనలీను నగరుపొగలతోను తెల్ల మబ్బులవలెనుండు సున్నపుఁ బూఁతలుగల యిండ్లతోను, అగరు చందనముల చెక్కలతోను సన్నని పట్టువలువలతోను, స్ఫటికములు ముత్యములు వీని రాసులతోను నానా విధములైన పిండివంటలతోను నొప్పు నంగళ్ళవరుసలతోఁ బ్రకాశించు రాజమార్గంబునందు శ్రీరామచంద్రుఁడు సంతోషముతోఁ బోవు చుండఁగా.

కం॥ హవి దధ్యక్షతలాజలఁ, బ్రవిమలరాజార్హదివ్య•భద్ర శ్రీధూ
పవితతుల మాల్యముల నర్హవిధిఁ బూజితములైన•యజిరములఁగనెన్.

హవి=హవిస్సు, దధి=పెరుగు, అక్షత=అక్షతలు=పసుపుతోఁగూడిఁగలిసిన విఱుగని బియ్యపుగింజలు, లాజలన్=బొరుగులు,పేలాలు వీనిచేతను,ప్రవిమల=

మిక్కిలి నిర్మలమైన, రాజార్హ=రాజయోగ్యమైన, దివ్య=దేవతాసంబంధమైన భద్రశ్రీ=చందనముల, ధూపవితతులన్=పొగల సమూహములచే, మాల్యములన్=పూలదండలచే అర్హవిధిం=తగినరీతిని, అజిరములన్=మొగసాలలను.

తాత్పర్యము

హవిదధి యక్షతలచేతను లాజలచేతను నిర్మలములై రాజయోగ్యమైన దేవసంబంధమైన చందనాది ధూపములచేతను పూలదండలచేతను తగురీతి పూజితములైన మొగసాలల చేతను.

—• ప్రజలు శ్రీరాముని దీవించుట •—

కం॥ అందులవారలు దన కా•నందంబున నీయ దీవ•నలు వారల నె
ల్ల దగురీతిగ మార్యా,దం దెల్పుచుఁ జనఁగ వారు•తాత్పర్యమునన్.౪౮౧

అందులవారు=ఆప్రదేశమునుండువారలు, అందు శబ్దమున కలిగాగమము లేదను వారీరూపము గ్రహింతురు. అందు శబ్దమునకు లకారము చేర్చిన ప్రదేశార్థకమగు. "అందులకు ధరణిగల నృపనందనులెల్ల" నని భారత ప్రయోగము.

తాత్పర్యము

ఆ మొగసాలలనుండువారు తన్ను సంతోషముతో దీవింపఁగా వారినెట్లెట్లు గౌరవింపవలయునో యట్లు చిఱునవ్వు, కనుబొమలాడించుట, మాటలాడుట, చూచుట, నమస్కరించుటలోనగు కార్యములచే గౌరవించుచుఁ బోవఁబోవ వారును నాసక్తితో.

కం॥ తాతలు ముత్తాతలు నే,రీతిం బాలించి రట్టి•రీతిని నీవున్
భూతలనాథుఁడ వై మముఁ, బ్రీతిం బాలింప వయ్య•శ్రీరఘురామా!

తాత్పర్యము

నీ తాతలు వారి తండ్రులు భూమి నేరీతి ధర్మము చెడకుండఁ బ్రజలకు బాధలేకుండఁ బాలించిరో యట్టులే మమ్ము నీవు ప్రేమతో శ్రీరామచంద్రా పాలింపుము.

సీ॥ పొరిఁ దండ్రిదాతల•ప్రోపుకన్న సుఖాన,రామరాజ్యంబున•బ్రదుకఁగలము
అన్న మేటికిఁ బర•మార్థంబు లేటికి, రాముఁడు రా జయి•రాకయున్న
శ్రీరామపట్టాభి•షేకంబుకంటెను, గడుశుభం బెద్ది రాఁ•గలదు మనకు
రామమహోత్సవం•బీమెయి వర్తిల్ల, నన్యంబులకుఁ జిత్త•మరుగు నెట్టు
ఆ॥ లేమి పుణ్యఫలమొ•యింతకుఁ బూర్వంబు, వెనుక నేరికిని ల•భింప నట్టి
రామచంద్రయౌవ•రాజ్యాభిషేక ద,ర్శనము గలిగె జన్మ•సార్థకముగ.౪౮౩

పొరిన్=చక్కఁగ, ప్రోపు=రక్షణము, పరమార్థంబులు=శ్రేష్ఠములైన ధనములు, ఈమెయిన్=ఈవిధముగ, వర్తిలన్=జరుగఁగా, జన్మసార్థకముగన్=పుట్టుక ఫలము కలుగునట్లుగ, సార్థకము ఇది భావప్రధానము. సార్థక్యము. ఈ పద్యమున భగవద్దర్శన లాభమే యన్నిటికంటె నుత్తమ లాభమనియు నది

పూర్వపుణ్యవశమునఁగాక లభింపదనియు దానిని విడిచి మఱియొకదానికై దేవులు లాడువాఁడు క్షుద్రుఁడనియుఁ దెలుపఁబడును.

తా త్ప ర్య ము

చక్కఁగా మా తల్లిదండ్రులు తాతలు మమ్ము రక్షించినపుడనుభవించిన సుఖముకంటె రామరాజ్యంబున నెక్కువ సుఖమున బ్రదుకఁగలము. శ్రీరామచంద్రుఁడు పట్టాభిషేకముఁ జేసికొని రాజయి రాకముందు మనకన్న మేల యితరములైన యుత్తమ ధనాదులేల? అనుత్తమ సుఖకరమైన శ్రీరామపట్టాభిషేక దర్శనమునకంటె మీలైనది మన కే జన్మమందైన నేది రాఁగలదు. ధనాదులు దారపుత్రాదులును సుఖకారణములు కావాయందురేమో. అవి తుచ్ఛములు. అశాశ్వతములు కావున రామపట్టాభిషేక మహోత్సవం బీ విధమున జరుగుచుండ దానిపై మనస్సుంచి యానందింపక యితరక్షుద్రకామ్యముల పై నెవ్వనికి నెట్లుపోవును. పోదు. మందారమకరంద మాధుర్యమైనఁ దేలుమధుపంబు పోవునే మదనములకు. ఔరా మనమెంతపుణ్యము చేసినవారము. శ్రీరామునితో సమకాలికులమై యుండుటేకాక పూర్వమందు మనతాత ముత్తాతలకు వారితాతముత్తాతలకునైన మన వెనుక మనమనుమలకునైనను జూడలభింపని శ్రీరామచంద్రుఁడు యౌవరాజ్యమందుఁ బట్టాభిషిక్తుఁడగుచుండ మనము చూచి జన్మమును సార్థకము చేసికొనఁ గలిగితిమి? ఇఁక మనకు జన్మములేదు.

మ॥ అని శ్రీరామునిమీఁద నుంచిననిజా•పాంగంబులుం జిత్తముల్
ఘనుఁ డాతండు సుదూర మేగినను లో•కవ్రాత మెక్కింత యై
నను ద్రిప్పంగ వలంతి గాదు, బయల•స్సంకల్ప దార్ఢ్యంబునన్
గను చుండున్ రఘునాథునాకృతిని ము•త్కంఠాతి రేకంబునన్. ౪౮౪

•నిజాపాంగంబులున్=తమ కడకంటిచూపులు, సుదూరము=మిక్కిలి దూరము, లోకవ్రాతము=జనసమూహము, వలంతి=సామర్థ్యముగలది, బయలన్=బాహ్యశబ్ద భవము బయులు, ఆవరణములేని యాకాశ ప్రదేశము. సంకల్ప దార్ఢ్యంబునన్=దృఢమైన సంకల్పబలముచే, ఉత్కంఠాతిరేకంబునన్=అతిశయమైన తహ తహ పాటుచేత, ఈ పద్యమందు భక్తులు భగవంతుని మూర్తిని బాహ్యమందు నంతరంగమందును ధ్యానించి నిలుపు విధము చెప్పఁబడెను.

తా త్ప ర్య ము

ఈప్రకారము చెప్పుకొనుచుఁ దాముకదలుటలేక యొకచోటనే నిలఁబడియుండ రథము దూరముపోఁగా నాయన యెదురుగానున్నప్పుడాయనపై నిల్పిన చూపులను మనస్సును ఆయన మిక్కిలి దవ్వుగాఁగాన రాకపోయినను ఆయనమీఁద నుండి యితర పదార్థముల మీఁదికిఁద్రిప్పఁజాలరైరి. దూరముగాఁ బోయినపుడు చూపెట్లు రామునిపై నిలిపిరనఁదమ యెదుట నున్నప్పుడు చూచిన యాకారమును మనస్సున దృఢముగ

నిలుపుటచే నాయనలేనపుడును ఆరూపమె సంకల్పబలంబున వారు హృదయమున నిలిపి యన్యము మఱచి యారూపమునే యింకను జూతమా యింకను జూతమాయను నాశతోఁ జూచుచుండిరి. దీనివలన ముందు స్థూలరూపమును జక్కఁగాఁచూచి లక్ష్యము దృఢపడినపిమ్మట నారూపమునే హృదయమందులో చూపుచేఁ జూడవలయునని యేర్పడుచున్నది. దీనివలన బాహ్యలక్ష్యము వ్యర్థమను వారి వాదము నిరస్తము.

కం॥ రాముని౯ గనుఁగొనఁ డెవ్వఁడు,
రాముఁడు గనఁ డెవని వాని౯ బ్రతుకదియేలా
భూమిని నింద్యుండై మను,నామనుజాధముని వాని౯ యాత్మయె రోయున్.

ఇంత శ్రమించి శ్రీరాముని౯జూచిన ఫలమేమియనఁ జెప్పుచున్నాఁడు.

ఎవఁడు=ఎంతగొప్పవాఁడైనను, రాముని౯=జనులు తన్నుఁ జూచినమాత్రముననే వారిని బరిపూర్ణానందామృత సరస్సున ముంచువానినిగూడ, కనుఁగొనఁడు=చూడఁడో, స్తుతింపకున్నను, మాటలాడకున్నను బూజింపకున్నను మానుసుగాక, వానిని జూచినవారు వీఁడేమి యచేతనమా? తోలుబొమ్మయా?యని భ్రాంతిపడకుండుటకై కనులనైనఁ జూడకుండెనేని,చేతనుఁడు భగవంతునియెడ నేకార్యమైనను చేయఁడేని యచేతనమునకు వీనికి నేమిభేదము? అట్లు చేయకుండుటచే నెవని శ్రీరాముఁడు కనఁడో, నరుఁడు భగవంతున కభిముఖుఁడై యుండినఁగదా భగవంతుఁడానరునిపై దయాళువై దర్శన మిచ్చునని భావము.

యమైవేష వృణుతే తేనలభ్యః, తస్యైష ఆత్మావృణుతేతనూంస్వామ్. యే యథామాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్. అని ప్రమాణములు కలవుగదా. వాని బ్రదుకు=శ్రీరాముని దర్శింపక శ్రీరామకటాక్షమునకుఁ బాత్రుఁడు గాక యుండువాని బ్రదుకు. ఏలా=ఉండియేమి ప్రయోజనము, నింద్యుండై=సర్వజనులచే నిందింపఁబడ యోగ్యుఁడై, మనున్=జీవించును- లోకమున స్త్రీలోలుఁడగువాఁడు పరు లనేకులు నిందించినను వానియాత్మకు వాఁడుచేయు పని తృప్తికరముగనే తోఁచును. వీనినో వీనియాత్మయే రోయును.

శ్రీరీయము. ఎవ్వఁడు-రాముని౯=తన దేహమున నున్న రాముని౯- కనుఁగొనఁడో కాఁబట్టి రాముఁడెవనిఁ గనఁడో వాని బ్రదుకేలా? సమయము వచ్చి కన్నులార రామబ్రహ్మము ననుభవింపనివాఁడు అందఱు నిందింపఁ దగినవాఁడే? ప్రయాసము లేక భగవత్సాక్షాత్కారముచేసి ముక్తినంపాదింప నదృష్టములేని వాఁడెన్నఁడును సంసారమును దాఁటఁడు. వాని యాత్మయే=వాని యంతర్యామియే, రోయున్=ఈపాపిష్ఠుఁడు ముక్తిని సాక్షాత్కరించి జన్మము వదలుకొనలేక యున్నాఁడుగదా యని నిందించును.

తా త్ప ర్య ము

శ్రీరాముని నెవఁడు చూడఁడో అకారణముచే శ్రీరాముఁడెవనిఁ జూడఁడో వానిబ్రదుకు వ్యర్థము.వాఁడు భూమిపైఁ బశువులకంటె నికృష్టుఁడని నిందింపఁ దగినవాఁడు. మనుష్యులందధముఁడైన యిట్టివానిని లోకము రోయుటేకాదు. వాని యాత్మయేవానిని రోయును.ఎవఁడు భగవన్మూర్తిని దర్శింపఁడో యెవనిపై భగవత్కటాక్షము పడదో వాఁడు మరల మరల జన్మములెత్తుచుండవలసినవాఁడే కావున శ్రీరాముని మూర్తిని బాహ్యమందును అంతరంగమందును రెండు విధముల ధ్యానించువాని జన్మమే జన్మము. "రామునిఁగనుగొనఁ డెవ్వఁడు, రాముఁడు గనఁడెవని" ననుటచే భగవత్కటాక్షమునకుఁ బాత్రుఁడగుటకు ముందు పురుషుఁడు దానికై ప్రయత్నింపవలయుననియు కొంచెమైన మన ప్రయత్నములేక భగవత్కటాక్షమురాదనియు సూచన.

తే॥ నాల్గుజాతులవారిని • నయముమీఱ, నన్నివయసులవారల•నాదరించు
నటులు గావున జనులెల్ల•ననవరతము,
ననఘుధర్మాత్ము శ్రీరాము•ననుసరింత్రు. ౮

శ్రీరాముని సేవించుటయందు నధికారము నియతిలేదనియు ఆయన సర్వసముఁడనియుఁ జెప్పఁబడుచున్నది.

తా త్ప ర్య ము

శ్రీరాముఁడు వర్ణాశ్రమ పక్షపాతబుద్ధిలేక నాలుగువర్ణములవారిని, వృద్ధులెక్కువ, చిన్నవయస్సువారు తక్కువ, స్త్రీలుతక్కువ పురుషులెక్కువ బ్రాహ్మణులెక్కువ,శూద్రులు తక్కువ యనుభేద బుద్ధిలేక వారివారి యోగ్యతానుసారముగ నందఱను నాదరించును. కావున లోకులందఱు ధర్మాత్ముఁడైన శ్రీరామునే యెల్లప్పు డనుసరించి యుందురు. భగవంతుఁడు సర్వజనసేవ్యుఁడు.

కం॥ చదుకములకుఁ జైత్యములకు, గొదకొనుదేవపథములకుఁ•గోవెలలకు స
మ్ముదమున సీతాకాంతుఁడు,ప్రదక్షిణముగఁ జనియెరాజ•భవనంబునకున్.

చదుకములకున్=నాలుగుత్రోవలు కలియుచోటులకు, దేవపథములకున్=ఉత్సవకాలమున దేవుఁడూరేగు మార్గములకు, కోవెలలకున్=దేవాలయములకు.

తా త్ప ర్య ము.

శ్రీరాముఁడు చదుకములకుఁ జైత్యములకు దేవపథములకు దేవాలయములకుఁ బ్రదక్షిణమార్గమున రాజునింటికిఁ బోయెను.

ఇది శ్రీరాముని శ్రద్ధాభక్తులుశాస్త్రవిశ్వాసము సదాచారసంపత్తి తెలుపును.

ఈ శ్రీరామునిచర్య దేవాలయాదులకుఁ బ్రదక్షిణముగ బోవలయునని సూచించుచున్నది. అప్రదక్షిణముగఁ బోరాదు. "ప్రశస్త మాంగల్యదేవాయతన చతుష్పథాన్ ప్రదక్షిణ మావర్తయేత" గౌతముఁడు.

"మృదంగాం దైవతం విప్రం ఘృతం మధు చతుష్పథమ్ ప్రదక్షిణాని కుర్వీత, ప్రజ్ఞాతాంశ్చ వనస్పతీన్" మను. ౪-౩౯. ప్రదక్షిణంచ కుర్వీత, సర్వానేవ వనస్పతీన్ । చతుష్పథాంశ్చ కుర్వీత, సర్వానేవ ప్రదక్షిణమ్। అనుశాసన, మృదంగములకు, దేవతలకు, బ్రాహ్మణులకు, నేతికి, తేనెకు, నాలుగు దోవలు కలియుచోటికి, ప్రసిద్ధవనస్పతులకుఁ బ్రదక్షిణముగఁ బోవలయును.

కం॥ అంబుదసంఘనిభం బయి,యింబగు ప్రాసాదముల ర•హించుచు మఱి రౌ
వ్యం బగు శిఖరికి జోడై, యంబరమును ముద్దుగొనుచు•నమలంబగుచున్.

అంబుద సంఘ నిభంబయి = మబ్బుగుంపుతో సమానమై, రౌవ్యంబగు శిఖరి=వెండికొండ- కైలాసము, అంబరమును = ఆకాశమును.

తాత్పర్యము

మేఘసమూహముతో సమానమై మనోహరమైన మేడలచేఁ బ్రకాశించుచు వెండికొండకు సమానమై యాకాశము నంటుచు మాలిన్యములేక.

తే॥ రత్నజాలపరిష్కృత•రమ్యవర్ధ,
మానగృహముల మెఱయుచు•మఱిమహేంద్ర
సదనమోయనఁ దులలేని•సవురుపొనరి,
దివ్యమగు తనతండ్రిమం•దిరముఁజొచ్చి. ౪౮

రత్నజాల=రత్నముల సమూహముచే, పరిష్కృత=అలంకరింపఁబడిన, రమ్య=అందమైన, వర్ధమాన గృహములన్=వర్ధమానమనుపేరుగల యిండ్లచే, మహేంద్రసదనమో=ఇంద్రునియిల్లో, తులలేని=సరిలేని, సవురు=చక్కఁదనము. వర్ధమాన గృహలక్షణము బృహత్సంహిత యందిట్లు చెప్పఁబడెను. దక్షిణ ద్వారము గలదై దక్షిణమునఁబడమట వెలుపలివైపు వసారాలు(వంచపాళి)గల గృహము వర్ధమానమనఁబడును. ఇదిగాక సర్వతోభద్రము నంద్యావర్తము స్వస్తికము రచకము హిరణ్యనాభము సుక్షేత్రము చుల్లి- పక్షఘ్నము లోనగు గృహభేదములుగలవు. వీనిలో నంద్యావర్తము, వర్ధమానము ఉత్తమములు, స్వస్తికము రుచకము మధ్యములు. సర్వతోభద్రము రాజులకుపయోగించును. హిరణ్యనాభము ధనదము. సుక్షేత్రమభ్యుదయ కరము. చుల్లిధననాశకరము. పక్షఘ్నము పుత్రఘ్నము శత్రువృద్ధికరము. వీని వివరముగోరువారు వరాహ మిహిరుని బృహత్సంహిత చూడవలయును.

తాత్పర్యము

రత్నసమూహములచే నలంకరింపఁబడిన యందమైన వర్ధమాన గృహములచే మెఱయుచునింద్రు నిల్లోయను నట్టు నసమానమైన చక్కఁదనముగలదై దివ్యమైన తండ్రియింటిలోఁ బ్రవేశించెను.

తే॥ విల్లుఁబాఱును సుభటులు•విడువ కెపుడు, కాపుసేసెడిమూఁడుక•క్ష్యలను రథము
తోడమిత్రులతో దాఁటి•తోయజాక్షుఁ, డవలిరెండునుగాల్నడ•నధిగమించి.

విల్లుకాఱు = విల్లుధరించినవారు-రూ. విల్లుకాండ్రు. ఏ. విల్లుకాఁడు.

తాత్పర్యము

విండ్లను ధరించినవారును భటులును విడువక యెపుడు రక్షణముచేయు మూఁడు కక్ష్యలను రథముమీఁదఁ గూర్చుండియే స్నేహితులతో దాఁటిపోయి యావల రెండు కక్ష్యలను కాలినడకనే దాఁటి

ఉ॥ అచ్చటఁ దోడవచ్చినహి • తాళుల నెల్లను నిల్పి తండ్రి పే
రిచ్చఁ జరించునంతపురి • కేగ రఘూద్వహుఁ, డంత లోకులున్
గ్రచ్చఱ రాముఁ రాకకయి • కాచి వసించిరి ద్వారసీమఁ బెం
పెచ్చ మహార్ణవంబు కువ • లేశునిరాకకు వేచునట్టులై. ౪౯౧

కువలేశుని=కలువలఱేని- చంద్రుని, కువాలయం, కువలయం కువాలం కువలం కువమ్మని శ్రీహర్షుని ద్విరూప కోశము, క్రచ్చఱన్=శీఘ్రముగా.

తాత్పర్యము

ఐదవకక్ష్యయందుఁ దనతోడ వచ్చినస్నేహితులనెల్ల నిలిపి లక్ష్మణుఁడు మాత్రముతోడ రాఁగా (చూ-వ ౨౪౦) తన యిష్టానుసారముగ సంచరించు నంతఃపురములోనికి శ్రీరాముఁడు వెళ్ళెను. లోకులును శ్రీరాముఁడెప్పుడెప్పుడు వచ్చునా యని సముద్రము చంద్రునిరాక గోరి కాచియున్నట్లు వాకిటకాచుకొని యుండిరి.

—• ౧౪-వ సర్గము. శ్రీరాముఁడు దశరథునిస్థితికి వగచుట. •—

చం॥ చని యటు రామచంద్రుఁడు వి • శాలశుభాసనమందుఁ గైకతోఁ
బెనువనటన్ నిజాననము • విహ్వలపాటున వాడువాఱఁగా,
గనుఁగవ నశ్రుధార లొలు • కం బెడమో మయియున్న తండ్రిఁ దాఁ
గనె యభివాదనం బొనరఁ • గాఁ బచరించి వినీతిమంతుఁడై. ౪౯౨

విశాల శుభాసనమందున్=వెడలుపై యందమైన పడుకయందు. ఇట్లనుటచేఁ గైకయు దశరథుఁడు కోపగృహము విడిచి సుమంత్రుఁడు రాకముందే వాడుకగా పడుకొనుచోటికి వచ్చిరని తెలియనగు. పెనువనటన్ = మిక్కిలి దుఃఖముతో, నిజాననము=తనముఖము, విహ్వలపాటునన్=కలఁకతో, వాడువాఱఁగన్=వాడిపోఁగా, కనుఁగవన్ = రెండు కన్నులయందు, అశ్రుధారలు=కన్నీళ్ళు, పెడమోము = మాఱుమోము, అభిముఖుఁడు గాక వెనుకప్రక్కగఁ దిరిగియుండ (శ్రీరాముని ముఖముచూడలేక-తనముఖము శ్రీరాముఁడు చూడనిష్టములేక) అభివాదనము=నమస్కారము, వినీతిమంతుఁడై =వినయముతోఁ గూడినవాఁడై, ఇచట నాసనమనఁగా శయ్య "కలఁకవహించి శోకమునఁ గ్రాఁగి శయంబున సొమ్మసిల్లుచున్. (పద్యము ౨౩౧) అని ముందు చెప్పఁబడును. కావున నిచ్చట నాసనమన శయ్యయే యని యర్థము వ్రాయఁబడెను.

తాత్పర్యము

ఆవిధముగాఁ బోయి శ్రీరామచంద్రుఁడు విశాలమైన మంచి పడుక యందుఁ గైకతో మిక్కిలి దుఃఖించుటచేఁ దనముఖము వాడిపోఁగాఁ గన్నుల రెంటను నీళ్ళుగాఱ శ్రీరామచంద్రుని ముఖమును జూచిన శ్రీరాముఁడు కోపించునో సంతాపించునో యని పెడమరగాఁ దిరిగియుండిన తండ్రికి నమస్కరించి వినయము గలవాఁడై.

కం॥ పిమ్మటఁ గైకేయీపాదమ్ముల పైఁ ద్రాలి నిలువ • దశరథుఁ డతిశో
కమ్మున రామా యని వాక్యమ్మును నొం డనఁడు చూడఁ•గానఁడు సుతునిన్. ౪౬౩

తాత్పర్యము

తండ్రికి నమస్కరించిన యనంతరము కైకపాదములపై వ్రాలి నమస్కరించి నిలువఁగా దశరథుఁ డతిశోకముతో రామాయని యొకసారి యని యేమియుఁ జెప్పలేక శ్రీరాముని ప్రక్కఁ జూడనైనఁ జూడ లేక పోయెను.

కం॥ మున్నెన్నఁ డెఱుంగనియాపన్నదశం గుందు నృపతి•భయదాకృతిఁ దాఁ
గన్నులఁ గని రాముఁడును, బన్నగమును ద్రొక్కు వాని•వగిది న్వెఱచెన్.

ఆపన్నదశ = కీడుస్థితి, భయదాకృతి = వెఱపు గలిగించు నాకారము, పన్నగమున్=పామును.

తాత్పర్యము

పూర్వమెన్నఁడు నెఱుఁగని విపత్తి దశయందుండి వ్యసనపడు రాజు యొక్క భయముగలిగించు నాకారమును జూచి శ్రీరామచంద్రమూర్తి పామును ద్రొక్కినవానివలె భయపడెను. ఎన్ని కష్టములు వచ్చినను భయపడని శ్రీరామచంద్రుఁడు తన తండ్రి స్థితినిజూచి యట్టిస్థితికిఁ దన యపచారము కారణమేమో యని భయపడెను. పామును ద్రొక్కినవానివలె నన్నప్పుడు కొలఁత అపచారము చేసినవాఁడు మనుష్యుఁడేకదా.

చం॥ అనుపమశోకకర్శితుని, • హర్షవిహీనుని, నష్టచేతనున్
ఘనతరదీర్ఘనిశ్వసను • గష్టదశావశు, రాహుపీడితా
ర్కునిగతి, క్షోభితాంబునిధి • కోపున, దబ్బఱ లాడినట్టిన
మ్మునివలె, నున్నవానిఁ గని • తొట్రిలుపాటునఁ దాను నట్టులై. ౪౬౪

అనుపమశోకకర్శితునిన్=అసమానమైన శోకముచేఁ బీడింపఁబడినవానిని, హర్షవిహీనునిన్=సంతోషము లేనివానిని, నష్టచేతమన్=మనస్సు చెదరినవానిని, ఘనతర=మిక్కిలి పెద్దవియు, దీర్ఘ=నిడుపైనవియునగు, నిశ్వసనున్=ఊర్పులు గలవానిని, కష్టదశావశున్=కష్టస్థితికి వశపడినవానిని, రాహుపీడిత=రాహువుచేఁ బీడింపఁబడిన, అర్కునిగతిన్=సూర్యునివలె- దీనిచేఁ గాంతి హీనుఁడని తెలియ

నగు. క్షోభిత=కలఁతపడిన, అంబునిధికోపునన్ = సముద్రమువలె- (దీనిచే మనస్సు చెదరి పోయినదని సూచితము.) దబ్బఱలు=అసత్యములు- ఈయుపమానము శక్తిసామర్థ్యములు క్షీణించెనని తెలుపును. తొట్రిలుపాటు=తడఁబాటు.

తాత్పర్యము

అసమానశోకముచే బాధింపఁబడి సంతోషముచెడి గుండెచెదరి నిట్టూర్పులు పుచ్చుచు నతి కష్టదశకుఁ బాలయి రాహుముఖమునఁబడిన సూర్యునివలె, పెద్ద గాలికిఁ గలవరపడిన సముద్రమువలె నసత్యము పలికిన మునివలె నుండిన వానిని దండ్రిని జూచి తడఁబాటునఁ దనవలనఁ దండ్రికింత వ్యథ గలిగెఁగదా యని తండ్రివలె నయ్యెను. అనఁగా దీర్ఘనిశ్వాసనుఁడు హర్షవిహీనుఁడు నష్టచేతనుఁడు కష్టదశావశుఁడు నయ్యెను.

కం॥ జలనిధి పరువంబునవలెఁ, గలఁతంబడి కలుగరాని • గతి భూపతికిన్
గలిగె నెటోయని తనలోఁ,పల నిటు చింతించె రామ•భద్రుఁడు భీతిన్. ౪౯౮

పరువము = పర్వదినము-అమావాస్య-పున్నమ.

తాత్పర్యము

పున్నమలయందుఁ గలఁతపడు సముద్రమువలె క్షోభిల్లి రారాని యట్టిస్థితి రాజునకేల కలిగెనని తనలోపలఁ దండ్రి యేమగునో యనుభీతిచే నిట్టులనుకొనెను

ఉ॥ అక్కట నన్నుఁ జూచి ముఖ • మ్మం దిపు డేల వికాస మూనఁడో ?
యొక్కెడ దేనికేన్ గినుక • నూనియు మున్నను జూచినంతనే
మక్కువ గారవించు, నల • మార్గము దప్పినజాడ దోఁచె, నా
దిక్కును జూచి యిప్పు డతి • దీనతఁ గుందెడి, నేమి హేతువో? ౪౯౭

కినుక = కోపము, మక్కువ = ప్రేమ.

తాత్పర్యము

అయ్యో! నన్నుఁ జూచియు నేల మనస్సున సంతోషింపఁడు? నావిషయమునఁ గాక మఱియెందైన నేకారణముచేనైన నితరులపై గోపము వహించి నపుడు నన్నుఁ జూచెనా యాకోపమంతయుఁ బోఁగొట్టుకొని శాంతుఁడై సంతోషముతో నన్నుఁ బలుకరించునే. ఇప్పుడాత్రోవ దప్పినది. ఏలన నావంకఁ జూచి కూడ వ్యసనపడుచున్నవాఁడే. దీనికేమి కారణమై యుండునో.

కం॥ అని మది నాలోచించుచుఁ,బెను పగుశోకమున మిగుల•విహ్వలుఁ డగుచున్
దన మోము వెల్లబాఱఁగ,
నసఘుఁడు భీతాత్మయుక్తిఁ•ప్రాంజలి యగుచున్. ౪౯౮

పెనుపగు=అధికమైన, భీతాత్మయుక్తిన్=భయపడిన మనస్సుతోఁ గూడినవాఁడై, అనఘుఁడు=పాపము చేయనివాఁడు, కనుకనే భయము- తొట్రుపాటు.

తాత్పర్యము

అని యిట్లు తనలో నాలోచించుచు శోకాతిశయమున వికలుఁడై తన ముఖము తెల్లఁబాఱఁగా నిర్దోషియగు శ్రీరామచంద్రుఁడు భయపడినవాఁడై నమస్కరించి.

—• శ్రీరాముఁడు కైకను దశరథుదుఃఖపాటునకుఁ గారణ మడుగుట. •—

ఉ॥ ఉల్లము దల్లడిల్ల వ్యస • నోద్గతిఁ గైకయివంకఁ జూచి యో
తల్లి! ప్రమాదపాటునను • దప్పొకఁ డే నొనరింపఁ దండ్రి, కి
ట్లొల్లఁడు నన్నుఁ జూడ, మొగ • మోడెడుఁ బల్కఁగ నప్రసన్నుఁడై,
చెల్లఁ దదీయకారణముఁ • జెప్పవె, తేర్పవె నీవ యేనియున్. ౪౯౯

ఉల్లము = మనస్సు, మొగమోడెడున్ = నాముఖముఁజూడ నొల్లకున్నవాఁడు, అప్రసన్నుఁడై =కలవరపడుచున్న మనస్సుగలవాఁడై.

తాత్పర్యము

మనస్సు తల్లడిల్లఁగాఁ గైకనుజూచి తల్లీ తండ్రిగారివిషయమున నేనే తప్పైనఁ బొరపాటుచేనైనఁ జేసినవాఁడఁ గాను. అట్లుండియు నన్నుఁజూడ నిష్టములేనివాఁడై యున్నాఁడు. నాతో మాటలాడుటకు ముఖము చెల్లలేదు. మనస్సు శాంతముగాదు. ఏమి చేయుదునమ్మా, దీనికేమి కారణమమ్మా. నీవైన నీయనను జక్కఁజేయుము. శ్రీరాముఁడు బాలుఁడు, మీకుమారుఁడు తెలిసి తెలియక యేదైనఁ దప్పుచేసిన క్షమింపు మని నాకు మాఱుగ నీవైనఁ బ్రార్థింపుము.

ఉ॥ నాపయి నెంతయో నెనరు • నం జరియించెడు నెప్డుఁ దండ్రి, దా
నోపఁడు మాటలాడ నిపు • డో జననీ! యిది యేమి దేహసం
తాపమొ? చిత్తవేదనయొ? • ధారిణిఁ బుట్టినజీవి రోగసం
తాపముఁ గాంచ కుండునె, స•దా సుఖ మబ్బునె దేహధారికిన్? ౫౦౦

నెనరు = దయ.

తాత్పర్యము

తల్లీ! యెప్పుడు నాపై నెంతో దయగలవాఁడు నాతండ్రి అట్టి వాఁడిపుడు నాతో మాటలాడుటకు నిష్టములేని వాఁడై యున్నాఁడు. ఇదియేమి వ్యాధియా? లేక మనోవేదనయా? భూమి మీఁదఁ బుట్టిన దేహికి శాశ్వతముగా సుఖమే యుండునా? ఏదైన నాధియో వ్యాధియో రావచ్చునుగదా. ఇప్పుడేది వచ్చెను. చెపుము.

కం॥ వినఁడు గదా భరతుని కడ,తనయుని విషయుంబునందుఁ•దా నశుభంబుల్
కనఁడు గదా కీడును నా,జనముల పట్టులను వీత•సమ్మదుఁ డగుచున్.

కడతనయుని = శత్రుఘ్నుని, వీతసమ్మదుఁడు = పోయిన సంతోషము గలవాఁడు.

తాత్పర్యము

భరతుని విషయమందుఁగాని శత్రుఘ్నుని విషయమందుఁగాని యశుభ వార్త యేదియువినలేదుగదా. సంతోషము చెడునట్టి కీడును నాతల్లులయందుఁ గనలేదుగదా.

కం॥ ఏవిషయ మైనఁ జెప్పినఁ, గావింపక తండ్రి నొవ్వఁ•గా మూర్తం జేసి
జీవింప నొల్ల ధర నే, నెవిధి జీవింతుఁ గుపితుఁ•డేనియుఁ దల్లీ. ౨౦౨

నొవ్వఁగాన్ = నొప్పిచెందునట్లుగ, కుపితుఁడేనియున్ = కోపముగల వాఁడాయెనా.

తాత్పర్యము

ఏ విషయము చెప్పినను దానిని జేయక తండ్రిమనస్సు నొచ్చునట్లు చేసి యల్పకాలమైన బ్రతికియుండఁ జాలను. అట్టినేను దండ్రి నావిషయమునఁ గోపించిన నెట్లు బ్రతుఁకఁగలను.

కం॥ సత్యముగఁ దనకుఁ దరణౌచిత్యము గల దేహమిచ్చి•క్షితిఁ బ్రోచినయా
ప్రత్యక్ష దైవమున క,ప్రత్యయమతిఁ దండ్రి కెవఁడు•ప్రతిభాషించున్.

తరణౌచిత్యము = జనన మరణ సాగరము దాఁటిపోవ యోగ్యము, అప్రత్యయమతి = విశ్వాసములేని మనస్సుగలవాఁడు, ప్రతి భాషించున్ = ఎదురు చెప్పును.

తాత్పర్యము

జనన మరణ రూపకమైన యీసంసార సముద్రమును దాఁటిపోవుటకు సాధన మైన దేహమిచ్చి దానిని రక్షించిన మహోపకార పరుఁడై కన్నులకుఁ గానవచ్చు దైవమైన తండ్రికి నెవఁడు విశ్వాసములేక కృతఘ్నుఁడై యెదిరించి పలుకును.

ఈ రెండు పద్యముల వలనఁ దండ్రిమాట వినక కొడుకు తనమనస్సు నొప్పింపరాదనియుఁ బ్రత్యక్షదైవమగు తండ్రిమాట కెదురాడరాదనియు నేర్పడుచున్నది.

ప్రత్యక్షదైవమునకుఁ దండ్రికనుటచే నింద్రియగోచరులుగాని దేవతలఁ బూజించుటకంటె నింద్రియగోచరుఁడగు తండ్రినిఁ బూజించుటసుకరము. పితృ దేవోభవ యని శ్రుతి. తండ్రిదైవమనియే చెప్పుచున్నది. ఇంటగెలువలేని వాఁడు రచ్చనేమి గెలువఁ గలడన్నట్లు ప్రత్యక్షదేవతలఁ గొలువలేని వాఁ డప్రత్యక్ష దేవతల నేమి కొలువఁ గలడు ఇది యవ్యక్తోపాసనమునకంటె వ్యక్తమూర్తి యుపాసనము మేలను నర్థము తెలుపుచున్నది. భ. గీ. ౧౨-౨.

శ్లో॥ యావత్త్రయస్తే, జీవేయు, స్తావన్నాన్యం సమాచరేత్
తేష్వేవనిత్యం శుశ్రూషాం, కుర్యాత్ ప్రియహితే రతః॥ మను. ౨-౨౩౫

తల్లి-తండ్రి-యాచార్యుఁడు జీవించియుండు వఱకు వేఱొకధర్మము వారి యనుమతిలేకచేయరాదు. ప్రతిదినము వారికిఁ బ్రియమై హితమగుకార్యము చేయుచు శుశ్రూష చేయుచుండవలయును.

శ్లో॥ యస్స్యాపయతి యామాతే, యేన విద్యో పదిశ్యతే
జ్యేష్ఠభ్రాతాచ భర్తాచ, పంచైతే గురవస్స్మృతాః ॥
ఆత్మనః సర్వయత్నేన, ప్రాణత్యాగేన వా పునః
పూజనీయావిశేషేణ, పంచైతే భూమి మిచ్ఛతా॥
యావత్పితాచ మాతాచ, ద్వావేతౌ జనికారకౌ
తావత్సర్వం పరిత్యజ్య, పుత్రస్స్యాత్త త్పరాయణ॥ శుక్రుఁడు

తన్న తల్లిదండ్రులు, విద్యనేర్పినవాఁడు, అన్న, స్త్రీకి భర్త యీయైదు గురు గురువు లనఁబడుదురు. బాగుపడఁగోరువా రీయైదుగురిని సర్వప్రయత్నములఁ దమప్రాణమిచ్చియైనఁ బూజింపవలెను. తల్లిదండ్రులిరువురు తన జన్మమునకు హేతువులు. కావున సర్వమువదలి కొడుకు వారేగతియని వారి కార్యములు చేయుచుండవలెను.

కం॥ ఈవిధి జనకుఁడు వగవఁగ, నీ వభిమానంబుబలిమి ♦ నెగ్గించుచుఁ గో
పావేశంబున నోత, ల్లీ! వఱగొడ్డంబు లాడ ♦ లేదుగ చెపుమా. ౨౦౪

ఎగ్గించుచు=తప్పులు పట్టుచు, వఱగొడ్డంబు = విడ్డూరపుమాటలు- నిష్ఠురములు. "భీముఁడు వఱగొడ్డము లాడంగ నెట్లు కుడిచెద వదిపా" భాగ.౧.స్కం.

తాత్పర్యము

ఈరీతి తండ్రివగచునట్లుగా నీవు దురభిమానముచేఁ దప్పులుపట్టుచుఁ గోపవశమున నిష్ఠురము లాడలేదుగదా. తల్లీ! చెప్పవమ్మా. ఏమిచేసితివో.

కం॥ నిక్కము వచింపు నృపతికి, నెక్కరణిని వచ్చెఁ బూర్వ ♦ మెఱుఁగనివ్యథ దా
స్రుక్కెడి నేటికి నీగతి, నక్కటయింతకును మూల ♦ మాడుము దేవీ. ౨౦౫

నిక్కము=నిజము, మూలము = ఆదికారణము, ఆడుము = చెప్పుము.- ఇంతకును మూల మాఁడుము. ఇంతపని చేసితివి గావున నీవు మూలపడి చేసిన యకృత్యమునకు వగచుచు సంతాపాగ్నిచే మాఁడుచుండుము. అనియు నేర్పడును. కైకకు రాఁబోవు గతి యిదియేకదా.

తాత్పర్యము

ఎన్నఁడు లేని వ్యథ రాజున కిప్పుడు రావలసిన కారణమేమి గలిగెను నిజము చెప్పుము. ఏల యిట్లు తపించుచున్నాఁడో దానికిఁ గారణమేమో దేవీచెప్పుము.

కం॥ అనురామ చంద్రుమాటలు, విని లజ్జ దొఱంగి మదిని ♦ వికలత లేకి
ట్లనుఁ గైక యతనిఁ గనుచును, దనహితమే మదిఁదలంచి ♦ తగవెంచకెడన్.

తొఱంగి=విడిచి, వికలత లేక = స్థిరచిత్తముతో, తగవు = న్యాయము, ఎడన్ = మనస్సునందు.

తాత్పర్యము

ఆ శ్రీరాముల మాటలువిని కైక భర్త యెదుటనే యతని కప్రియమాడ వచ్చునా యను సిగ్గు విడిచి స్వస్థచిత్తముతో శ్రీరామచంద్రునితో నప్రియ

మెట్లుండునని జంకుగొంకు లేక తనహితమేకాని పెద్దపిన్నయను ధర్మము నాలోచింపక యాయనతో నిట్లనెను.

ఉ॥ కోపము లేదు రాజునకుఁ • గోసలరాజతనూజ! మేనికిం
దాపము లేదు, మానసము • నం గలకోర్కి వచింప నీ కెడన్
గోపము వచ్చునో యనుచుఁ • గొంకెడి, నే వచియింతునా? మన
స్తాపము దీఱు రాజునకుఁ • దప్పక నీ వది చేసి తేనియున్. ౩౦౪

తాత్పర్యము

నాయనా! రామచంద్రా! రాజునకు నీమీఁదఁ గోపమేమియులేదు. వ్యాధియులేదు. తన మనస్సున నొక కోరిక యుంచుకొని యది చెప్పిన నీకుఁ గోపము వచ్చునోయని భయపడి చెప్పనులేక చెప్పక యుండనులేక తపించుచున్నాఁడు. ఆయన కోరిక నీవు నెఱవేర్చితివా యాయనకు మనస్సునందలి కుందు తీఱును. చెప్పవచ్చును చెప్పుమనినఁ జెప్పెదను.

కం॥ ప్రియుఁడగునీతో నెట్ల,ప్రియమును వచియింతు ననుచు • భీతిల్లుట నా
ల్కయురా దితనికినీతో, నయముగ మాట్లాడ, నందు•నా యది తనయా? ౩౦౫

తాత్పర్యము

పుత్రకా! ఎంతో నీ వీయనకుఁ బ్రియుఁడవు. అట్టి నీతో నప్రియవార్త యెట్లు చెప్పుదునా యని నీకు భయపడి యుండుకారణముచే నీతోఁ జనవుగఁ బలుకుటకు నాలుకరాకయున్నది. కుమారా నేనది చెప్పవచ్చునా?

ఉ॥ మున్న యొసంగి నాకు వర • ముల్ బహుమానపురస్సరంబుగాఁ
బన్నుగ నిప్డు కోరినను • బ్రాకృతునట్టులు గుందుచున్న వాఁ
డన్న! ప్రతిజ్ఞ చేసియు గ • తాంబుల సేతువుఁ గట్టఁ జూచెడి,
న్పన్నము కాక న్యాయ్య మగు • నా తనమాటయె తాను దప్పఁగన్? ౩౦౬

బహుమానపురస్సరంబుగన్=గౌరవ పూర్వకముగ, ప్రాకృతునట్టులు = పామరజనునివలె, గతాంబులన్=పోయిననీటికి, సేతువు=ఆనకట్ట, బన్నము = భగ్నశబ్దభవము బన్నము-వ్యర్థప్రయత్నమే.

తాత్పర్యము

అన్నా! రామచంద్రా! మీతండ్రి కృతజ్ఞుఁడై నన్నుఁ బూర్వమెంతో గౌరవించి రెండు వరములనిచ్చెను. వానినే యిప్పుడిమ్మని నేను గోరితిని. అవి యీయలేక మహాత్ముఁడయ్యుఁ బామరునివలె నేడ్చుచున్నాఁడు. నీరు పోయిన తరువాతఁ గట్టువేసిన వానివలె ముందు మాట యిచ్చి యిప్పుడు దానిఁ దప్పఁ గొట్ట యత్నము చేయుచున్నాఁడు.దీనివలనఁ దన కవమానమేకాని లాభమేమి గలదు. నాయనా! నీవు చెప్పుము. ముందుమాట యిచ్చి తప్పవచ్చునా? అది న్యాయ్యమా? నీవే చెప్పుము.

ఉ॥ నాయన! ప్రాజ్ఞు లెల్ల భువ•నంబులమూలము ధర్మ మంద్రు, మీ
నాయన నీపయి న్నెనరు • నం, గడు నాపయిఁ గిన్కఁజేసి, తా
నీయెడఁ దప్పు కుండు గతి • నీ వయినన్ గురుబుద్ధి మేలు గా
నీ యది కీడు గాని సుత • నెమ్మి నొనర్చెద వేని చెప్పెదన్. ౨౧౦

భువనంబులమూలము = అన్ని లోకములకు నాధారము, నెనరునన్ = ప్రీతిచే, కిన్క=కోపము- రూ. కినుక. గురుబుద్ధి = తండ్రిచెప్పిన మాటగదా మనను నెఱవేర్తమని గొప్పమనస్సు - చేసి నెమ్మిన్=సంతోషముతో.

తాత్పర్యము

నాయనా! పండితులందఱు లోకముల స్థితికి మూలకారణము ధర్మమే యని చెప్పుదురు. అట్టి ధర్మమును నీపయి ప్రేమచేతనో నామీఁది కోపము చేతనో రాజు భంగము చేయకుండ నీపయినను మనతండ్రి చెప్పినమాటమనము సార్థకపఱుపకుండిన నెవరు సార్థక పఱుతురను గొప్ప బుద్ధితో నదిమేలు గానీ కీడుగానీ చేసెదవేని చెప్పెదను.

కం॥ భూపతితలంపుఁ జెప్పెద, నాపలుకులు వ్యర్థముగ నొ • నర్పవ యేనిన్
నీపయి మోమోటను దా,నై పలుకఁడు నీకు నప్రి•యంబో యనుచున్. ౨౧౧

తాత్పర్యము

నామాట నీవు వ్యర్థము చేయనని చెప్పెదవేని రాజు నభిప్రాయము చెప్పెదను. విన్న తరువాత నీవు చేయవేని నేనుజెప్పి యేమి ప్రయోజనము. నీతండ్రి యిష్టము. నీయిష్టము. నేను చేయిచూపించి యుపలక్షణ మనిపించుకొననేల? అయనయె యేల చెప్పరాదు. నీవు చెప్పనేల యందువేమో? నీయందలి దాక్షిణ్యముచే నీవు దాని నప్రియముగా నెంతువేమోయని భయపడి చెప్పకున్నాఁడు.

కం॥ ఈకరణిని పచియించిన, కైకం గని కుతిలపడుచుఁ•గడు రాముఁడు భూ
మీకాంతు సమక్షంబునఁ, బ్రాకటగతిఁ బల్కెఁదనదు•భావము దెలియన్.

కరణిన్=విధముగ, కుతిలపడుచున్=వ్యసనపడుచు. ౨౧౨

తాత్పర్యము

కైక యీవిధముగాఁ బలుకఁగా శ్రీరాముఁ డాహా యేమి యీమెచిత్తవృత్తి. నాతండ్రి కోరికను నెఱవేర్తునో నెఱవేర్పనో యని యీమె నావిషయమందుఁ గూడ సందేహించుచున్నది కదా యని విషాదపడుచు రాజు వినుచుండ నాయన యెదుటనే తన యభిప్రాయము తెలియునట్లు శ్రీరామచంద్రమూర్తి స్పష్టముగాఁ జెప్పెను.

శా॥ ఆస్సీ తల్లి! యి దేటిమాట, తగవే•యిట్లాడ నన్ రామునిన్?
లె స్సాయెన్ నృపునాజ్ఞఁ జేసి విను వ • హ్ని జ్వాలకున్ దేహమున్
భిస్సామాత్రముఁ జేసెదన్, విషము లే స్వీ త్రావుదుం, గంధి రం
హస్సంరంభము మీఱఁ జొచ్చెదను, శం • కాతంక మింకేటికిన్. ౨౧౩

వహ్ని జ్వాలకున్=అగ్నిహోత్రజ్వాలలకు, భిస్సామాత్రము=పూర్ణాహారము, ఇచ్చుట మాత్రశబ్దము కార్త్స్న్యార్థకము, కంధిన్=సముద్రమును, రంహస్సంరంభము=వేగాతిశయము, శంకాతంకము=సందేహమువలని భీతి, భాషాజ్ఞానము లేని గ్రామ్యజనులు దీని శంకాటంకమందురు, లెస్సాయెన్=ఇది వ్యతిరేకోక్తి.

తాత్పర్యము

ఛీ యేమి మాటలాడితివమ్మా నీవు. నన్ను రాముని నీవిట్లు పితృవాక్యము పాలించునో పాలింపఁడో యని సందేహించి పలుకుట న్యాయ్యమా. నీవు పలికినది బాగులేదు. రాజాజ్ఞయాయెనా మండెడు మంటలో దుముకుమనిన దుమికెదను విషము త్రాగుమనినఁ ద్రాగుదును. సముద్రములోఁ జొరుమనినఁ జొచ్చెదను. నీవేల సందేహముతో భయపడెదవు.

శ్రీరామచంద్రమూర్తి సద్గుణాతిశయ మీపద్యంబునఁ గననగు. ఇందుఁ దండ్రి యాజ్ఞచేసెనేని యాయన ప్రీతికై మంటలో దుమికెదను.సముద్రములో మునిఁగెదను. విషముఁ దినుమనినఁ దినెదననెను గాని వానిని జంపుమనినఁ జంపెదను వీనిని దండింపు మనిన దండించెదనని చెప్పినవాఁడు కాఁడు. దశరథుఁడు కైక ప్రీతికై గీ॥ చంపఁదగని వానిఁ జంపింతు, నీకుఁగాఁ జంపఁదగిన వానిఁ జాన విడుతు, ధనికుఁ బేదగాఁగ ద్రవ్యార్థ్యుఁగా నిఱు, పేదనేనొనర్తుఁ బ్రేమఁ జెపుమ॥ యనెను. ఇరువురకెంత భేదముగలదో చూడుఁడు. స్త్రీదాసులేపని చేయలేరు?శ్రీరామచంద్రమూర్తి మతమునఁ దన తండ్రి ప్రీతికై తానెన్ని కష్టములయినఁ బడవచ్చును గాని పరుల బాధింపరాదని యేర్పడుచున్నది.

కం॥ భూమిపతి గురువు తండ్రియు, నామే లెదఁ గోరు నెపుడొ•నర్తు నభీష్టం
బోమాత! బాసచేసెద, రాముం డిరుమాట లాడ•రాఁ డెఱుఁగుమనన్.౨౦౪

తాత్పర్యము

ఈయన రాజు. కావున నీయన యాజ్ఞ పరిపాలింప వలసినది విధి. అందు గురువు. హితాహితమును బోధచేసినవాఁడు పెద్దవాఁడు. అందుఁ దండ్రి. అదియును గాక యెల్లవేళ నామేలే కోరుచుండువాఁడు. రాజాజ్ఞయు మీఱరానిది. గుర్వాజ్ఞయు మీఱరానిది. తండ్రియాజ్ఞయు మీఱరానిది. తనమేలు కోరువాని వాక్యము మీఱరానిది. ఇట్లుండ నాలుగు గుణము లొకనియందే యున్నప్పుడు అట్టివాని యాజ్ఞ నేనెట్లు వ్యర్థము చేయఁగలను. కావునఁ దల్లీ! తండ్రి కోరిక తప్పక నెఱవేర్చెదను. రాముఁడు రెండు మాటలవాఁడు కాఁడు. ముందొకమాట వెనుక నొకమాట మాటలాడఁడు. ఇది నీవు తెలిసికో. అని చెప్పఁగా.

—• శ్రీరామునితోఁ గైక తన వరములవృత్తాంతముఁ దెల్పుట. •—

కం॥ చక్కనినడవడి గలయా,చక్కనిసుతు సత్యవాది • జనవినుతుని నా
టక్కరి జాణెత యిట్లను,నుక్కును గరఁగించి చెవుల•నుంచినమాడ్కిన్.౨౧౨

తా త్ప ర్య ము

చక్కని నడవడి చక్కని యాకారము చక్కని నిక్కపు మాటలుగల యీ లోకస్తోత్రపాత్రుఁడైన శ్రీరామచంద్రుని మోసకత్తెయగు నా దుష్టస్త్రీ యుక్కును గరఁగించి చెవులలోఁ బోసినట్టు లీప్రకారము చెప్పెను.

ఉ॥ పూర్వము నిర్జరాసురుల ♦ పోరున నీజనకున్ సశల్యునిన్
 గర్వితదైత్యకోటికిని ♦ గైవసముంపడకుండ నేను యు
 ద్ధోర్విని గాచితిం గొడుక! ♦ యొప్పుగ నిచ్చె వరద్వయంబు నీ
 యుర్విధవుండు తత్ప్రతిగ ♦ నుత్తమశీల! కృతజ్ఞుఁ డౌటచేన్. ౨౧౬

నిర్జరాసురుల=దేవతల రాక్షసుల, సశల్యునిన్=బాణపు ములుకులు దేహముననాటి మూర్ఛపడినవానిని, గర్వితదైత్య కోటికిని = గర్వించిన రాక్షసుల సమూహమునకు, కైవసముంపడకుండన్=స్వాధీన పడకుండునట్లు, యుద్ధోర్విని =యుద్ధ భూమియందు, తత్ప్రతిగన్=దానికి మాఱుగ, కృతజ్ఞుఁడు=చేసిన మేలెఱిఁగినవాఁడు.

తా త్ప ర్య ము

పూర్వము దేవతలకు రాక్షసులకు యుద్ధము జరిగినపుడు రాక్షసుల బాణములు ములుకులు దేహమునందు నాటి యీరాజు మూర్ఛపోయెను. అప్పుడు రాక్షసు లీయనను జంపరాఁగా వారికిఁ జిక్కకుండునట్లు రథము తోలుకొని దూరముగఁ బోయి యీయన ప్రాణమును రక్షించితిని. ఆమేలు తలంచి కొడుకా నీ తండ్రి నాకు రెండు వరంబు లిచ్చెను. ఆరెండు వరములనే యిప్పుడిమ్మని కోరితిని.

కం॥ ఆ రెండువరంబులచేఁ, గోరితి నీతమ్ము భరతుఁ ♦ గువలయపతిఁగాఁ
 గూరిమి నొనర్ప దండకఁ, జేరఁగ నీ విపుడ చనఁగ ♦ శ్రీరఘురామా. ౨౧౭

కువలయు పతి = భూచక్రపతి- రాజు.

తా త్ప ర్య ము

ఆరెండు వరము లేవందువా- నీ తమ్ముఁడు భరతునకు బట్టాభిషేకము చేయుట యొకటి. రెండవది నీ విప్పుడే దండకకు వెడలిపోవుట.

కం॥ నీతండ్రికి నీకును వి,ఖ్యాతిగ బొంకొదవకుండఁ ♦ గాచుకొనెద వేన్
 సీతానాయక! విను సం,ప్రీతిన్ నాపలుకు దీర ♦ నృపతి కుమారా! ౨౧౮

తా త్ప ర్య ము

నీతండ్రి నాకీవరములిచ్చెను. నామాట తండ్రిమాట పాలించెదనని నీవు చెప్పితివి. కావున నీ తండ్రికి నీకు నసత్యదోషము రాకుండఁ గాపాడుకొనఁ దలఁచితివేని నామాటలను దుదముట్టఁ బ్రీతితో వినుము. నీ వీరాజు కుమారుఁడవయితివా యీ ప్రకారము నెఱవేర్పుము.

సీ॥ అన్న! నాయాడిన • వన్ని వింటివి గదా, జనకువాక్యము దప్పఁ జనకు మయ్య
పదునాల్గువర్షముల్ • బహుకాటవులయందు, సంచరింపఁగ నిప్డ • చనఁగదయ్య
నీయభిషేకంబు • నెఱవేర్పఁ గూర్చిన, వస్తువుల్ భరతుకై • వలయు నయ్య
పట్టాభిషేకసం • భ్రమ మంతయును వీడి,
జడలుఁ జర్మముఁ దాల్చి • నడువవయ్య. ౨౧౮

తే॥ వివిధ రత్న సమాకీర్ణ • విపులవిభవ
యుక్తరథగజవాజినం • సక్తమైన
కోసలపురంబునందు నా • కొడుకు భరతుఁ
డొప్పుగ నృపాలుఁ డయి యేలు • చుండుఁ గాక. ౨౧౯

బహుకాటవులయందున్=అనేకములైన యడవులందు, వివిధరత్న...
కోసలపురంబునందున్=నానామణులచే కూడిన విస్తారమైన యైశ్వర్యముతోఁ
గూడిన రథములు ఏనుఁగులు - గుఱ్ఱములుగల యయోధ్యాపురమునందు.

తాత్పర్యము

అన్నా నామాటలు వింటివిగదా. నీవు చేయవలసినదేమనఁగా. తండ్రి వాక్యము తప్పిపోవఁ జేయకుము. పదునాలుగేండ్లు నానారణ్యములందు సంచారముచేయ నిపుడే పయనింపుము. నీయభిషేకమునకై కూర్చినవస్తువులన్నియు భరతునకుఁ గావలయును. ఈ పట్టాభిషేక వేషము ప్రయత్నమునంతయు విడిచి జడలు కృష్ణాజినము ధరించి తరలిపొమ్ము. నానావిధములయిన రత్నములతోఁ గూడిన సంపద గలిగి రథములు ఏనుఁగులు గుఱ్ఱములు వీనితోఁగూడిన యీ యయోధ్యయందు నా కొడుకు భరతుఁడు రాజై పాలింపనిమ్ము.

చం॥ అతులదయాళుఁ డైన వసు • ధాధిపుఁ డీవరయుగ్మ మిచ్చియు
స్మృతి చెడినట్టు లార్తి వద • నం బిటు వెల్వెలఁ బోవుచుండ నీ
గతి నినుఁ జూడ నోడె నన • ఘవ్రత! యాతని మాటఁ జెల్చి యీ
క్షితిపతి సత్యవాది యను • కీర్తిని నిల్పి తరింపఁ జేయుమీ. ౨౨౦

అతుల దయాళుఁడు=అసమానదయగలవాఁడు రూ. దయాళువు. బి
దయాళురు, వరయుగ్మము=రెండువరములు.

తాత్పర్యము

నాయందు మిక్కిలి దయచేరాజు నాకి రెండువరములు ముందిచ్చికూడ నిపుడు మతిచెడిన వానివలె దుఃఖపడుచు ముఖము వెల వెలఁబోవనేడ్చుచు నిన్నుఁ జూచుటకు భయపడుచున్నాఁడు. దోషరహితమైన వ్రతముగలవాఁడా నీకు వ్రతభంగము రాకుండఁ జేసికొనెదవేని యీయన మాట నెఱవేర్చి శ్రీరాముని తండ్రి సత్యవాదియని కీర్తిని నిలిపి యితనిఁ దరింపఁ జేయుము.

ఉ॥ ఈవిధ మైననిష్ఠురము•లెన్నియు పల్కిన ధీరబుద్ధి శో
కావిలతం గనండు మది•యందున యే నిసుమంతయేని, భూ
మీవిభుఁ డంతయు న్విని స•మిద్ధవియోగమహాగ్నిఁ గ్రాఁగుచున్
వావిరి తాపవేగమునఁ•బల్లటిలెన్ సుతశోకతప్తుఁ డై. ౩౦౧

నిష్ఠురములు=పరుసపుమాటలు, ధీరబుద్ధి=చలింపని మనస్సుగలవాఁడు, శోకావిలతన్=శోకముచేఁ జెదరిన మనస్సుగలవాఁడు, ఇసుమంతయేని=కొంచెమైనను, ఇసుమంత=ఇసుము + అంత = ఇసుమునంతయని యుండవలెను- కొన్నిచోట్ల షష్ఠీ సమాసమునం దుకారంబున కచ్చు పరంబగునపుడు నుగాగమంబునకు లోపంబగు- ప్రౌ. వ్యా॥ సంధి. ౧౦ సూ. సమిద్ధ=మిక్కిలి ప్రకాశించు, మహాగ్నిన్=రాఁగలయెడఁబాటు అనునగ్ని, క్రాఁగుచున్=కాలుచు.

## తాత్పర్యము

రామచంద్రా! మీ తండ్రి సమాచారము నీవెఱుఁగవా. ప్రతిష్ఠ కుఁగా ముందు నీ వేమడిగిన నిచ్చెదనని ప్రమాణముచేసి చెప్పనేల? అడిగినమీఁద నియ్యవలసివచ్చెనేయని ముఖమున గుడ్డవేసికొని గోలు గోలున నేడువనేల? ముందునాకు వరము లిమ్మని నేనడిగితినా బలవంతపెట్టితినా? తానేకదా తన కృతజ్ఞత ప్రకటింపనిచ్చెదనని చెప్పెను. అవినాకేమి తేరకిచ్చుచున్నాఁడా? తన ప్రాణము రెండుమార్లు కాపాడితినే. అదియైన నెంచఁ బనిలేదా? విశ్వామిత్రుఁడు వచ్చినపుడిటులే యేదైన నడుగు మిచ్చెదననెను. నిన్నుఁదనతోడఁ బంపుమని యడిగిన నేడ్వఁ బ్రారంభించెను. ఆయన మగవాఁడు. మహాత్ముఁడు. కావునఁ గోపించియో శపింతునని భయపెట్టియో నిన్నుఁ బిలుచుకొనిపోఁగలిగెను. నేనాఁడు దాన నేమిచేయఁగలనని యిట్లు దొంగయేడ్పు లేడ్చుచున్నాఁడని యీ విధముగానెన్నియో నిష్ఠురములాడఁగా శ్రీరామచంద్రుఁడు ధీరబుద్ధి గావున నైశ్వర్యము గోలుపోవుటయేగాక యడవులకుఁ బోవలసివచ్చెఁగదాయని కొంచెమైన మనసు నందైన శోకముచే వ్యాకుల మందినవాఁడు కాఁడు. కైక పలికిన మాటలన్నివిని దశరథుఁడు శ్రీరాముఁడీక నడవులకుఁ బోవునే యెట్టులాయన నెడఁబాసియుందునా యని మంటలోఁబడి పొరలి నట్లి తాపాతిశయముచేఁ బుత్రశోకముచే నార్తుఁడై తల్లడిల్లి తెల్లఁబోయెను.

—• ౧౯-వ సర్గము. అరణ్యమునకుఁ బోవ శ్రీరాముఁ డంగీకరించుట. •—

చం॥ మరణసమానముల్ సవతి • మాతనుడుల్ గడునప్రియంబు లా
పరబలమర్దనుండు విని • ఖానమునం దొక యింతయున్ వ్యథా
భరమున గ్రుక్కికిట్లనియె • భామిని కైకకు, నింతమాత్రకా
నరపతి దుఃఖ మందెడిని • నన్గని పల్కఁగ నొల్ల కక్కటా? ౧-౨

మరణసమానముల్=మరణకాలమునందుఁ గలుగు వేదనవంటి వేదన కలిగింపునవి,కడున్=మిక్కిలి అనిష్టములు- సాధారణముగా లోకులకునని భావము.

పరబల మర్దనుండు = శత్రుసైన్యములను సంహరించువాఁడు- ఇట్లనుటచే వలయునని కోరినచోఁ దన పట్టాభిషేకము విఘ్నముచేయఁ బూనిన వారినందఱను ససైన్యముగా సంహరించి రాజ్య మాక్రమింప శక్తిగలవాఁడని భావము. భామిని=కోపముగలది.

తాత్పర్యము

మఱియెట్టి వారికైనను మరణకాలమందలి వేదనవంటి వేదన కలిగింపఁ జాలు నప్రియములైన యామాటలువిని శత్రుబలహరణ దక్షుండైన యారామచంద్రుఁడు మనసునందైనఁ గొంచెమైన వెతపడక తన్ను కోపించిపలుకుచున్న కైకను జూచి యింత మాత్రమునకా మాతండ్రి నన్నుఁజూచి పలుకక దుఃఖపడుచున్నాఁడు.

కం॥ జడలను దాలిచి నారల, నెడపక ధరియించి తల్లి!•యిప్పుడ చనుదున్
బెడిదపుటడవులకును నృపు,నుతువుల సార్థకముఁజేయ•నూల్కొనువాఁడన్.
నూల్కొనువాఁడన్=పూనుకొనువాఁడను. ౨౩

తాత్పర్యము

తల్లీ! యిదిగో నిపుడే జడలు ధరించి నారవస్త్రములుగట్టుకొని భయంకరములైన యడవులకుఁబోయి మాతండ్రిమాటలు యథార్థపడఁ జేయువాఁడను.

ఉ॥ నా కిది చెప్పవమ్మ జన•నాయకుఁ డేటికి మున్ను వోలె నా
రాకకు నన్నుఁ జూచియును • రంజిల నోపఁడు, నీసమక్షముం
దే కలభంగిఁ జెప్పెద, ని•దే వనిఁ జీరజటాధరుండనై
నీ కెదఁ బ్రీతిగాఁ జనెద•నెమ్మది నూఱడు మల్క మానుమీ. ౨౪
కలభంగి=ఉన్నవిధము- వాస్తవము.

తాత్పర్యము

ఆవిషయమై నీవాలోచింపవలసిన పనిలేదు గాని నాకొక విషయము మాత్రము చెపుము. రాజేల నేను వచ్చియెదురుగ నిలువఁబడి పల్కరించినను పూర్వము వలె సంతోషింపక దుఃఖపడుచున్నాఁడు. నీవు చెప్పినది యల్పవిషయము. వానికై దుఃఖింపవలసిన పనిలేదు. కావున దుఃఖపడుటకు వాస్తవ కారణమేమి చెప్పుము. నే నడవికిఁబోక తిరుగుపాటు చేయుదునేమోయని దుఃఖించుచున్నాఁడనెదవా. అట్లైన నున్నదున్నట్లు చెప్పెదవినుము. ఇదిగో నీగడియయందే జడలు నార చీరలు ధరించి నీకు సంతోషముగాఁ బోయెదను, మదిలో నూఱట నొందుము. నిష్కారణముగ నాయన మీఁదఁగాని నామీఁదఁగాని కోపపడకుము.

కం॥ హితుఁ డఁట మఱి జనకుం డఁట,
కృతజ్ఞుఁడఁట గురువును నఁట•నృపతియునఁట స
మ్మతి నమ్మి చేయు మన్నను,
క్షితి బ్రదికియు నేల ప్రియముఁ•జేయక యుండున్. ౨౫

### తాత్పర్యము

రాజ్యాభిషేకము చేసికో రాజభోగము లనుభవింపుమని ప్రియముచెప్పిన సరియే యంటివిగాని యడవికిఁ బొమ్మని యప్రియమాడిన నీవు చేయుదువని నమ్ముటెట్లు? అనెదవా. అది యాజ్ఞాపించినవాఁడెవఁడు? ఇది యాజ్ఞాపించిన వాఁడెవఁడు? రెండు విషయముల నాజ్ఞాపించినవాఁడు, నామేలు కోరువాఁడు, నన్నుఁగన్నతండ్రి, కృతజ్ఞుఁడు, గురువు, రాజునగువాఁడుగదా. నాయం దన్ని విధముల వాల్లభ్యము గలిగి నీవీకార్యము చేయవలసిన దన్నప్పుడు నేనేకార్య మైనఁ జేయకుందునా? పట్టాభిషేకమనునది తండ్రిరాజు హితుఁడు నగు గురువు నాజ్ఞ కావున శిరసావహించెదను. తండ్రియాజ్ఞ నెఱవేర్చుట నాకు విధిగాని యది నాకుఁ బ్రియమా యప్రియమా యని విచారించు నధికారము నాకులేదు. కడి యనిన నోరు దెఱచి కళ్ళెమనిన నోరుమూయు గుఱ్ఱము నేసుందురు? కావునఁ దండ్రికోరిన దాని నాదేహములో నూపిరియుండఁగా జేయకయుందునా?

ఉ॥ ఒక్కటికిం దపింతు నది • యుల్లముఁ గ్రాఁచెడిఁ జూడఁ జూడఁగా,
నక్కట తానుగా నృపతి • యాదట న న్బిలిపించి నాయనా!
మక్కువ చేసెదన్ భరతు • న్మోదవుఁ జేయుఁగ నంచుఁ గూర్మి పెం
పెక్కఁగ నొక్కమాట యనఁ • డేయపరాధ మొనర్చినాఁడనో. ౨౮౬

### తాత్పర్యము

పట్టాభిషేకము చేసికొను మన్నప్పుడు నేను బొంగనులేదు. ఇప్పుడునేను గ్రుంగనులేదు. కాని యొకవిషయము మాత్రము నాకు విచారము గలిగించు చున్నది. అది యేదంటివా. ఈమధ్యవర్తులతోఁ బనిలేక తానుగా నన్నుఁబిలి పించి నాయనా భరతునకుఁ బట్టాభిషేకముచేయ మక్కువపడుచున్నాను. అని నామీఁదఁ బ్రీతిగలవాఁడై యొక్కమాట చెప్పకపోయెను. జూచితివా నాయం దెంత నమ్మకము ప్రీతి లేదాయెను? ఇటు నన్ను నమ్మరాకుండుటకు నేనేమి నేరము చేసితినో కదా యని తపించెదను.

చం॥ భరతున కెంతొవేడ్క బహు • భాష లవేటికి మున్నె జానకిన్
ధరణిని బ్రాణంబున్ ధనవి • తానము నీయఁగ లేనె నేనుగా?
ధరణిపుఁ డంతె కాక మఱి • తండ్రియుఁ దానుగఁ గోర, నీకు ము
త్కరముగఁ జేయ కుందుదునె • తల్లిరో! నాదు ప్రతిజ్ఞ ప్రీతితోన్. ౨౮౭

ధనవితానము=ధనసమూహము, ముత్కరముగన్=సంతోషకరముగ.

### తాత్పర్యము

అమ్మా! యేల పెక్కుమాటలు, దీనికై యిన్నిదినాలేల కాచికొని యుండ వలె. వివాహకాలమందే సీతను భూమిని ప్రాణములను సంపదను అన్నియును రామా! భరతునకిమ్మని రా జనియుండిన భరతునికెంతో సంతోషముగ నేనేయిచ్చి

యుండనా? ఇంత వ్యవహారము కావలయునా? ఈయన రాజుమాత్రమే కాక తండ్రియునుగదా. అట్టివాఁడు కోరినప్పుడు తల్లివగు నీకు సంతోషముగ నా ప్రతిజ్ఞ నేను దీర్పకుందునా?

చం॥ భరడిపుఁ దీర్ప వమ్మ వసు•ధాగతలోచనుఁ డౌచు బాష్పముల్
గురియఁగ నేల దుఃఖపడ,•గొబ్బున మాతులునింటికిన్ సుతున్
భరతునిఁ దేర దూతలను•బంపుము రాజు ననుజ్ఞ, గాన కే
నరిగెదఁ దండ్రి చెప్పఁ డను•నంకిలి పెట్టను, నొప్పు దప్పనన్. ౫౭౮

తేర్పుము=సమాధానపఱిచి సంతోషపెట్టుము, వసుధాగతలోచనుఁడు=భూమి యందు దృష్టులు నిలిపినవాఁడు,ఇప్పుడు దశరథుఁడు తలవంచుకొనికూర్చుండి యున్నాఁడు. మాతులునింటికిన్=మేనమామయింటికి, తేరన్=పిలుచుకొని వచ్చుటకు, అంకిలి=అడ్డము.

తల్లీ: నీభర్తను నీవు సమాధానపఱుపుము. నేల చూపులు చూచుచుఁ గన్నీరుగాఱ దుఃఖపడవలసిన కారణమేమున్నది. రాజాజ్ఞ తీసికొని మేనమామ గారి యొద్దకు భరతుని పిలుచుకొని వచ్చుటకై దూతలనంపుము. నేనడవికిఁ బోయెదను. నాకుఁ దండ్రిచెప్పలేదే నీవెవతెవు చెప్పుటకు నీమాటలు నిజమో యబద్ధమో యని యడ్డము చెప్పను. ఇది తప్పు. అది యొప్పు అని ధర్మాధర్మ విచారముకూడఁ జేయను.

చం॥ అనురఘురామువాక్యముల•కాత్మ నితాంతము సంతసించి యా
వనితయు నట్ల చేసెదను•బంపెద దూతలఁ దోడితేర నా
తనయునిఁ, గాలయాపనముఁ•దాళను, నాసుతువార్త లేటికిన్?
వనముల కీవు తర్లు మెడ•పల్కక, సంతనకట్టు బోకకున్. ౫౭౯

ఎడపల్కక=అడ్డము చెప్పక, బోకకున్=అడవికిఁ బ్రయాణమగుటకు, సంతనకట్టుము=ప్రయత్నముచేసి సిద్ధపడుము.

## తాత్పర్యము

అని శ్రీరాముఁడు చెప్పఁగా గైక సంతోషించి యాయనతో నిట్లనియె, నీవు చెప్పినది బాగున్నది. భరతుని బిలుచుకొనివచ్చుటకు దూతలను పంపెదను గాని నీవీముచ్చటలతోఁ గాలముగడుపుట సహింపలేను. నాకొడుకు ముచ్చటలు నీకేల? నిత్రోవన నీవుపో. నాకొడుకు వచ్చిన నేమి? రాకున్న నేమి? పిలిపింతునో పిలిపింపనో నీకేల యాజోలి? ఆసెపము పెట్టి కొన్నాళ్ళు నిలువఁ జూచుచున్నావా? అతఁడు వచ్చిన హింసింపఁ జూచుచున్నావా? నీవంతకాల మిచ్చట నుండరాదు. అడ్డము చెప్పక నీవిపుడే యడవులకుఁబొమ్ము. దానికేమి కావలయునో యాప్రయత్నములు సేయుము.

ఉ॥ సిగ్గున నీదుతండ్రి తమి•సేయఁడు చూ పలు కాడ, దానఁ దా
సగ్గినముగ్గిసల్ గొనెడి•జాలఁగ దైన్యము పేర్మి, దాని నీ
వెగ్గుగఁ జూడఁ బోకు వని•కి వటుపోయెడిదాఁక జేఁడు దా
నిగ్గతిఁ గూడు నీళ్ళు గొన•కేని యిలం బడియుండు నం చనన్. ౨౩౦

తాత్పర్యము

నీతండ్రి నీతోఁ బలుకకుండుటకుఁ గారణము తానీవిషయము నీతోఁజెప్ప సిగ్గుపడియేకాని యితరముకాదు. అకారణముచే మిక్కిలి దీనత్వముచేఁ జెప్ప లేక చెప్పక యుండలేక తనపీడ నామీఁదఁబోనీలే అదీ చెప్పనీలే శ్రీరాముఁడు దానినే కోపగింపనీలే. లోకులు దానినే తిట్టనీలే యని గిజగిజలాడుచున్నాఁడు. నాయనా అదియొక తప్పుగానీవెంచి యాయనమాటలాడవలె నేను బోవలె ననఁ బోకుము. అడవికి నీవు బోవువఱకు రాజుగారు కూడుతినరు నీళ్లుత్రాగరు. ఈ విధముగ బిగించుకొనియుందురు. నీవుపోయిన పిమ్మట మరల యథాప్రకారము నవ్వుచుఁ బ్రేలుచునుందురు.

చం॥ చెలి నుడు లాలకించి, పతి•భీ యిది యెంతటికష్ట మంచు లోఁ
గలఁక వహించి శోకమున•గ్రాఁగి, శయంబున సొమ్మసిల్లుడున్
బలియుఁడు లేవ నెత్తి, సతి•పల్కెడుమాటల కప్ప యోజనన్
జలిపె వనాశికిం జనఁ గ•శాభృశతాడితఘోటకం బనన్. ౨౩౧

ఆలకించి=విని, పతి=దశరథుఁడు, శయంబునన్=పడుకమీఁద, శయ్య యందు, సొమ్మసిల్లుడున్=మూర్ఛపోయిపడఁగా, కశాభృశతాడిత ఘోటకంబు =కొఱడాచేఁ దీవ్రముగఁ గొట్టఁబడిన గుఱ్ఱము.

తాత్పర్యము

కైకపలుకులు విని దశరథుఁడు నానిజమైన యభిప్రాయమేమి యిది చెప్పెడి విధమేమి? అదిగాదని చెప్పలేని నాదుర్దశయేమి? ఇంతమాత్రము చెప్పుటకు నాకునోరులేదాయెఁగా? యెంతటి కష్టదశ ప్రాప్తించెరా దేవుఁడా! యని తనలో కలఁతపడి బైటజెప్పలేక శోకమున మాఁడి సహింపలేక శయనము మీఁద మూర్ఛిల్లిపడెను. అప్పుడు బలశాలియగు శ్రీరామచంద్రుఁడు లేవనెత్తి కూర్చుండఁబెట్టి కైక పలికెడి నిష్ఠురోక్తులు సహింపలేక కొఱడాదెబ్బతినియు నిలువఁ జాలని యుత్తమాశ్వమువలె నొకనిమిషమైన నుండనొల్లక యడవి కపుడేపోవ నాలోచించెను.

కం॥ అచెడుగు దన్నుఁ బలికిన, వాచానారాచములకు•వగఁ జెందక సీ
తాచపలాక్షిపతి యా,పావపునతి కనియెఁ దనదు•భావము దెలియన్. ౨౩౨

చెడుగు=దుష్టస్త్రీ, వాచానారాచములకున్= బాణములవంటి మాటలకు, వగ=వ్యసనము.

## తాత్పర్యము

భరతునిరాక నెపము పెట్టి, యడవులకుఁబోక కాలహరణముచేసి యతఁడు వచ్చినతరువాత నతని నేనేమోచేయనున్నానని యిటువంటి కుచ్ఛితపు మాటలాడిన కైకయొక్క మాటలను బాణములదెబ్బకు వ్యసనపడక కాముకులకిది స్వభావగుణమే వారిదోషమేమియున్నది. ఇందు లోకవిరుద్ధము శాస్త్రవిరుద్ధమేమి లేదని తన్ను దానే సమాధానపఱిచికొని శ్రీరామచంద్రుఁ డాపాపాత్మురాలికిఁ దనభావము దెలియ నిట్లనియె.

చం॥ అతివ: ధనార్జనంబ పర•మార్థముగాఁగఁ దలంపఁ బోను, నీ
క్షితి నిలువంగ నైనఁ దమి•సేయఁ జుమీ, నిజ మీ వెఱుంగుమీ,
యతులితసత్యధర్మనియ•మైకరతిం జరియించుసంయమి
వ్రతతులతోడ సాటి నని•బాగుగ నిల్పుము దేవి: నీమదిన్. ౨౩౩

ధనార్జనము=ధనము సంపాదించుట, పరమార్థము= పురుషార్థములలో ముఖ్యమైనది, అతులిత=సమానములేని సత్యధర్మనియమైకరతిన్ = సత్యము ధర్మమునను నియమమందే ప్రీతిచే, సంయమివ్రతతులతోన్=ఋషులసమూహముతో.

## తాత్పర్యము

తల్లీ: నేను ధనకాంక్షచే రాజ్యమువిడిచిపోవుట కిష్టములేక జాగుచేయుటకై నెపములు చెప్పుచున్నానని నీవభిప్రాయపడుచున్నావు. ధనము సంపాదించుట నామతమున నుత్తమపురుషార్థముగాదు. ఈభూమియందుండుటకైన నాకిష్టము లేదు. ఇది సత్యమని నీవు తెలిసికో. అటయిన నీవు దేనిఁ బరమార్థమని తలంతు వందువా? సత్యధర్మనియమములందే యభిలాషగల ఋషులతో సమానుఁడని దృఢముగ మనస్సున నిలుపుము. వ్యర్థసందేహములచే బాధపడకుము.

ఇచ్చట శ్రీరామచంద్రమూర్తి యర్థమును గేవలము నిరసించెనని కొందఱందురు. అది సరిగాఁ దోఁపదు. శ్రీరామచంద్రమూర్తి సన్న్యాసిగాఁడు. గృహస్థునకు నర్థము త్యాజ్యముకాదుకాని ధర్మమునకు నర్థమునకు విరోధము వచ్చి యొకటి విడువవలసివచ్చినపుడు ధర్మమునే గ్రహించి యర్థమును బరిత్యజించు ననిభావము అర్థమును నిరసించిన రాజ్యమేమి యేలఁగలఁడు.

శ్లో॥ "ఊర్ధ్వ బాహుర్విరౌమ్యేష, నచ కశ్చి చ్ఛృణోతిమే
ధర్మా దర్థశ్చ కామశ్చ, సకిమర్థం నసేవతే" భారతసావిత్రి

ధర్మమువలననే యర్థము ధర్మమువలననే కామము కలుగును. వానికై ప్రత్యేక ప్రయత్నము చేయవలసిన పనిలేదు. అని నేను జేతులెత్తి యేడ్చినను నామాట నొకఁడు వినఁడు. ఇది వ్యాసవాక్యము.

ఉ॥ ధర్మపథం బొకండె తనుఁదప్పక కొల్చెడి వాని కెప్పుడున్
ధర్మము నర్థకామములఁదప్పక కూర్చు నిజం బదెట్లనన్
ధర్మిడియైన భార్య గడుఁధర్మముఁగూరుచుఁ బ్రేమఁగామమున్
శర్మముఁగూర్చు నర్థమునుసత్సుతుమూలముగాఁగఁ గూర్చెడిన్.

అయో. ౫౯౨

ఇది రామచంద్రమూర్తి యభిప్రాయము అనుష్ఠానముచే దృఢపఱిచెను. దానినే వ్యాసులు చెప్పెను. లక్ష్మణుఁడర్థప్రధానవాది. అర్థముండిన ధర్మము కామము లభించునని యీయన వాదము. ఈవిషయమున యుద్ధకాండమున ౧౯౨౨ మొదలు ౧౯౭౦ వఱకుఁజూడుఁడు.

అర్థకామములకంటె ధర్మమే ముఖ్యమనుటకు "పరిత్యజేదర్థకామౌ। స్యాతాం ధర్మవివర్జితౌ॥ మను। పరిత్యజ్యేదర్థకామౌ, ధర్మపీడాకరౌ నృప। వి.పు.

తండ్రి నసత్యవాదిగఁజేసి రాజ్యము గ్రహింపవలయునా? తండ్రిని సత్యవాదినిఁజేసి రాజ్యమువదలవలయునా యను ప్రశ్న రాఁగా శ్రీరామచంద్ర మూర్తి పితృవాక్య పరిపాలన మనుధర్మమునకై రాజ్యమును వదలుటయే సరియైన కార్యమని తలఁచెనని యేర్పడుచున్నది.

చం॥ ఇది యన నెంత? దేవి! వినుమీ ప్రియ మెయ్యదొకండు తండ్రికిన్
మదిగొని చేయఁ గల్గినను మానక ప్రాణము లిచ్చియైన నే
నది యొనరించినాఁడ నెటులైనను, దండ్రిసపర్యకంటెఁ ద
ద్గదితము దీర్చుకంటె ధరఁగల్గునె మే లగుధర్మ మేదియున్? ౨౩౪

సపర్య=శుశ్రూష, తద్గదితము=ఆయనచేఁ జెప్పఁబడినది.

తాత్పర్యము

అడవులకుఁ బోవుటదొడ్డ కష్టకార్యమని నీవు తలంచినట్లున్నది. అదియెంతటి కార్యము? అది నాకొక లక్ష్యమా? తండ్రికిఁ బ్రియమైన కార్యము చేయవలసి వచ్చెనేని యది నాప్రాణమిచ్చియైనఁ జేసినవాఁడనే. అంతటి పట్టుదల యేల యందువా? అది యాయన సుద్ధరింపఁగాదు. తండ్రిసేవకంటెఁ దండ్రిమాట ప్రకారము వర్తించుటకంటె శ్రేష్ఠమైన ధర్మము వేఱొకటి పుత్రునకులేదు. అది చేయక తక్కినవెన్ని ధర్మములు చేసినను వ్యర్థములే. కావున నన్నుద్ధరించు కొనుటకై నేను బోయెదను.

కం॥ జనకుఁడు వొమ్మన కున్నను, నీమాటఁబట్టి చనియెద నిపుడే
వనములఁ బదునాల్గేఁడులు, గొనకొని వసియింప నీదు కోరికఁ దీర్పన్.

తాత్పర్యము ౨౩౫

కావున భరతుఁడువచ్చువఱకు నిందు నిలుతునని తలంపకుము. అంతియ కాదు. నాతండ్రియాజ్ఞ యెట్టిదో తల్లియాజ్ఞయునట్టిదే. కావున నీవు చెప్పినదే చాలునని పదునాలుగేఁడులు అడవుల యందుండ నీకోరికఁ దీర్పఁబోయెదను.

కం॥ బలవంతపెట్టి భూపతి, నలయించితి వొక్కమాట•ననవైతివి నా
కిల నీశ్వరతర వయ్యును, దెలియఁగ లేవైతి నాదు•ధీగతి గుణమున్.

అలయించితివి=ప్రయాసపెట్టితివి, ఈశ్వరతర=నన్ను శాసించుటయందుఁ దండ్రికంటె నెక్కువ యధికారముగలదానవయ్యు, తండ్రికంటె నూఱింతలు తల్లియెక్కువనిగదా శాస్త్రము. ధీగతి=బుద్ధివిధము.

తాత్పర్యము

రాజును బలవంతపెట్టి యాయనచేఁ జెప్పింపవలయునని యాయనను వృథా బాధపెట్టితివి. రామా నాయభిప్రాయమిదిమని యొక్కమాట నాతోననవైతివి. రాజు నాకీశ్వరుఁడు శాసింపదగినవాఁడు. నీవో యీశ్వరిగావు కేవలమీశ్వరవు గావు. ఈశ్వరతరవు. అదిగాని నేనెవరిపట్ల నెట్టియభిప్రాయము గలవాఁడనో యదిగాని నాయౌదార్యాది గుణములుగాని యిన్నాళ్లుగానన్నుఁ జూచు చుండియుఁ దెలిసికొన లేవైతివి.

కం॥ తల్లి యనుజ్ఞంగొని నా,వల్లభ నూరార్చి వచ్చు•వఱకు విళంబం
బల్లమున సైఁపు మిదె నీ కుల్లాసముగాఁగ నడవి•నుండఁగఁ బోదున్. ౨౩౪

తాత్పర్యము

సందేహింపకుము. భయపడకుము. నాతల్లి యాజ్ఞ తీసికొని నాభార్యకుఁ దెలియఁ జెప్పివచ్చువఱకునగు కాలవిళంబనము సైఁపుము. నీకు సంతోషముగా నిదిగో నడవులనుండఁ బోయెదను.

కం॥ భరతుఁడు రాజై తండ్రికి, గురుమతి, శుశ్రూషసేయు•గుణుకొనునట్టుల్
వరమతిఁ దెల్పుము తల్లీ, ధరణి నిది సనాతనంపు•ధర్మము కైకా. ౨౩౫

తాత్పర్యము

భరతుఁడురాజై తండ్రి గురుఁడను భావముతో సేవచేయునట్లు మంచి బుద్ధితో జెప్పుము. ముసలివాఁడు వానితో నీకు గావలసినదేమి? వేసినదింత తిని పడియుండునులే యని చెప్పకుము. ఏలయందువా యిది సనాతనధర్మము. సంపాదించువాఁడైనను వయసువాఁడైనను ముసలివాఁడైననుదండ్రితండ్రియే

కం॥ అనురాముని వచనంబులు, విని దుస్సహశోకభార•వేగంబునఁ ద
జ్జనకుఁడు వావిడిచి మహా,స్వనమున నావఱచినట్లు•పలవింపంగన్. ౨౩౬

దుస్సహశోకభారవేగంబునన్=సహింపరాని శోకాతిశయముయొక్క వేగమున, వావిడిచి=నోరుదెఱచి బాయని మహాస్వనమునన్=పెద్దగొంతుతో, ఆవు అఱచినట్లు.

తాత్పర్యము

శ్రీరాముఁడు చెప్పిన ధర్మవాక్యములు విని సహింపరాని శోకబలమున మనస్సు నిబ్బరించుకొనలేక నోరుదెఱచి గట్టిగఁ బెద్దగొంతుతో దూడ కానరానపుడు ఆవు అఱచునట్లు ఏడ్చెను.

—• శ్రీరాముఁడు కౌసల్యాగృహమునకుఁ బోవుట. •—

చం॥ వలగొని మ్రొక్కి తండ్రికిని • వందనమాఱగజంతకైకకున్
సలిపి సురోచి యంతిపురి • చయ్యన వెల్వడి యశ్రుపూర్ణదృ
క్కుల ననుజుండు వెన్కొనఁగ • క్రోధసముజ్జ్వలితాంతరంగుఁడై;
వలనుగ నాభిషేచనిక • భాండములన్ వలగొంచు రాముఁడున్. ౨౯౦

వలగొని=ప్రదక్షిణించి, జగజంత=గయ్యాళి, సురోచి=మంచి తేజము గలవాఁడు. దీనిచే రామచంద్రమూర్తి మనస్సునందైన వ్యసనపడలేదని యేర్పడుచున్నది. మనస్సునందిన ముఖమునప్పుడే కానవచ్చియుండును, అశ్రుపూర్ణదృక్కులన్=నీళ్ళతోనిండిన చూపులచే (రామకైకేయీసంభాషణ మంతయు లక్ష్మణుఁడు వినుచుండెను). క్రోధసముజ్జ్వలితాంతరంగుఁడై = కోపముచే మిగుల మండుచున్న మనస్సుగలవాఁడై (ఇదిలక్ష్మణునకు విశేషణము) అభిషేచనిక భాండములన్=అభిషేకమునకై సిద్ధపఱచియుండిన పాత్రములు, వలగొంచున్=ప్రదక్షిణముగాఁ దిరుగుచు, లక్ష్మణునందు బుద్ధివిక్షేపక మగు నవిద్యకలదనియు, రామునందది లేదనియు తిలక వ్యాఖ్య-౨౮౪ వ పద్యవ్యాఖ్య చూడుఁడు.

తాత్పర్యము

తండ్రికిఁ బ్రదక్షిణనమస్కారములుచేసి యావల యాగయ్యాళికైకకు నమస్కరించి తేజోవంతుఁడైన శ్రీరామచంద్రుఁ డాయంతఃపురము శీఘ్రముగ విడిచి బయలుదేఱి కోపముచే మండుచున్న మనస్సుతో నీళ్ళుకాఱు కన్నులతో లక్ష్మణుఁడు తన వెనుకరాఁగా శ్రీరాముఁ డభిషేకమునకై యుంచిన భాండములకుఁ బ్రదక్షిణముగావించి.

చం॥ ఇవి భరతాభిషేకమున • కేర్పడుఁ గాక యటంచు వేఁడుచున్
దవులఁగ నీక వానిపయిఁ • దద్దయు దృష్టియు రక్తి, ఛత్రమున్
సవు రగుచామరంబులును • స్యందనమున్ స్వజనంబు వీడి తా
నవికలితేంద్రియుం డయి జ • నావళిదుఃఖముకై వగర్చుచున్. ౨౯౧

అవికలితేంద్రియుఁడై =వికలతలేని యింద్రియములు గలవాఁడై.

తాత్పర్యము

ఇవన్నియు భరతుని పట్టాభిషేకమున కుపయోగపడునుగాక యటంచుఁ గోరుచు, వానిమీఁద దృష్టిగాని మనస్సుగాని యనురాగముగాని నిలుపక గొడుగు చామరములు తేరును తనవారిని వదలి, చలింపని యింద్రియ

ములతో నుండియు నా నిమిత్తముగాఁ బ్రజలకు నింతదుఃఖము వచ్చెఁగదా యని దీర్ఘనిశ్వాసములు పుచ్చుచు.

చం॥ చనియెను దల్లి వీటికయి • సర్వసుఖంబులు రాజ్యభోగముల్
పొనుపడినన్ ముఖంబునను • బొల్పు దొఱంగదు యోగి కట్లు రా
మునకు, క్షపాగమంబు జన • మోహనమూర్తికి శీతరశ్మికిన్
గనఁగ మలీమసత్వ మొసఁ • గంగ సమర్థమె యెన్నఁడేనియున్. ౨౪౨

తల్లివీటికిన్=తల్లి యింటికి, పొనుపడినన్=క్షీణించినను, క్షపాగమంబు=రాత్రిరాక, జనమోహన మూర్తికిన్=జనుల మోహింపఁజేయు నాకారముగల వానికి, శీతరశ్మికిన్=చంద్రునకు, మలీమసత్వము=మురికి, దృష్టాంతాలంకారము, రెండు వాక్యార్థములతో నొకటి బింబమువలెను మఱియొకటి ప్రతిబింబమువలె నుండిన దృష్టాంతాలంకారము.

## తాత్పర్యము

తల్లియింటికై బయలుదేఱిపోయెను, అట్లు శ్రీరామునకు సర్వసుఖంబులు రాజ్యభోగంబులు సర్వము చెడినను ముఖమునఁ గాంతి యోగికివలెఁ దొలఁగినదికాదు. ఎట్లనః రాత్రి చీఁకటి చంద్రునికాంతి నెక్కువగాఁ దోఁచునట్లు చేయునుగాని మలినపఱుచునా? అట్లులే శ్రీరామునకు వచ్చిన యీకష్టమీలోకమున నాయనకీర్తి హెచ్చించుటకేకాని దానివలన నాయన కేలోటులేదు.

ఉ॥ ఏతదనిష్టవార్త వచి • యింపఁగ నేగెడు రామచంద్రుప్ర
స్ఫితముఖాంబుజంబున వి • శేషముగానరు చూప జెవ్వరేన్
ధీతతయుక్తిమై శరదు • దీర్ణకరుండు మృగాంకునట్లు తే
జోతిశయంబు మానఁడు, ప్ర • హర్షము వీడఁడు కొంచె మేనియున్. ౨౪౩

ఏతదనిష్టవార్త=ఈకీడువార్త. ప్రస్ఫితముఖాంబుజమునన్=ప్రకాశించు శ్రీరాముని ముఖకమలమందు, విశేషము=కైకయింటికిఁ బోవునప్పటి స్థితియందు ఇప్పటి స్థితియందు భేదము, ధీతతయుక్తిమై=విస్తారమైన బుద్ధిబలముచే, శరదుదీర్ణకరుండు=శరత్కాలమందు నధికతేజోవంతములైన కిరణములు గలవాఁడు అగు మృగాంకునట్లు=చంద్రునివలె, తేజోతిశయంబు=అతిశయకాంతిని, ప్రహర్షము=ఎక్కువ సంతోషమును, చూపఱు=చూచువారు, రామచంద్రుఁడు ఇంతవిపత్తిదశయందును నాయన యభిరామత్వము, ఆహ్లాదకరత్వము మానినవాఁడు కాఁడని భావము.

## తాత్పర్యము.

. ఈ కీడువార్త సెప్పుటకై తల్లియింటికిఁబోవు శ్రీరామచంద్రుని ముఖకమలమందు మునుపటికప్పటికిఁ దేజస్సున భేదమేమియు నెంతపరిశీలించి చూచియు నెవ్వరు తెలిసికొనలేకపోయిరి, శరత్కాలమందలి చంద్రునివలె నధిక

తేజస్సును మానినవాఁడుగాఁడు, సంతోషము వదలినవాఁడు కాఁడు, ఇఁక ఖేదమెందుండి వచ్చును?

చం॥ కడుకొనుదుఃఖమున్ హృదయ•కంజమునంద యణంచి లక్ష్మణుం
డుదితపరాక్రముండు దన•యొప్పునఁ దోఁ జనుదేర లోకులన్
ముదమున మంచిమాటలను•మోదిలఁ జేయుచుఁ జొచ్చె మాతృస
త్సదనముఁ, జెప్ప కాత్మలయ•శంక నిజార్థవిపత్తి నేరికిన్. ౫౪౪

కడుకొను=కడుముకొను, అతిశయించు, కడుకొనునది కడుకొను రూపాంతరము కాదు. కడున్+కొని=కడుకొని, ఇవి రెండు రూపాంతరములని దడలకు ప్రాసమైత్రి చెప్పుటతప్పు "కడుకొని వేఁడిబాష్పములు" "కందుక కేళి సల్పెడు ప్రకార"మనునవి సరియైనపాఠములు. ఉదిత పరాక్రముండు=దీనిచే లక్ష్మణుఁడు పరాక్రమముచే దశరథు బంధించి రాజ్యమును శ్రీరామునకు లభింపఁ జేయనాలోచించుచున్నట్లుతోఁచెడిని. శ్రీరామునకు దుఃఖములేదు. లక్ష్మణుఁడు దుఃఖమణఁపఁగలిగెను. ఇరుయిరువురకు భేదము. ఆత్మలయశంకన్=ప్రజలు ప్రాణము విడుతురోయను సందేహముచే. నిజార్థవిపత్తి=తన పట్టాభిషేకము విఘ్నమైనవార్త, ఏరికిన్=ఎవరికిని.

తాత్పర్యము

పెళ్ళగించుకొనివచ్చు దుఃఖమును హృదయకమలమందే యణఁచి లక్ష్మణుఁడు పరాక్రమమున రాజ్యము శ్రీరామునకు లభింపఁజేయుదునా యని యాలోచించుచుండనవలెనే యేమియు నెఱుఁగనివానివలెనే తోడరాఁగా శ్రీరామచంద్రుఁడు లోకులను మంచిమాటలచే సంతోషింపఁజేయుచుఁ దనకువచ్చిన యైశ్వర్యభంగవిషయముచెప్పిన లోకులు ప్రాణముపిడుతురోయని సందేహించి యెవ్వరికిఁ జెప్పక తల్లి గృహమున ప్రవేశించెను.

౨౦-వ సర్గము.

ఉ॥ అంతిపురంబు వీడి చని•నంతన రాముఁడు ఘెుల్లటంచు శు
ద్ధాంతనితంబినీజనుల•యార్తనినాదము మిన్నుముట్టె నే
కాంతము, రామచంద్రుఁడు వ•నాంతరవాసముఁ జేయు నంట, హా
యెంతలు పుట్టె నేమిగతి•యేగతిఁ దాళఁగ? నేమిచేయఁగన్? ౫౪౫

ఘెుల్లటంచున్=ధ్వన్యను కరణము, ఘెుల్లని ధ్వనికలుగునట్లు. వర్గద్వితీయ చతుర్థవర్ణములు తెలుగునందు లేకున్నను ననుకరణంబుల ప్రయుక్తంబులగు. ఖామ్మని ధామ్మని. ఝుళం ఝుళారవము. ఇత్యాదులు. శుద్ధాంత నితంబినీజనుల=అంతఃపురస్త్రీల. ఆర్తనినాదము=ఏడుపుధ్వని, ఇది కైకయింటివృత్తాంతము అంతఃపురస్త్రీలు వారివారి పరిచారికలు చాటు చాటుగనుండి భార్యాభర్తలయుఁగ్గైకేయీ శ్రీరాములయుసంభాషణము వినుచుండిరని యూహ్యము. మిన్ను

ముబెన్=అకాశమంటెను, ఏకాంతము=మిక్కిలి, తీవ్రైకాంత నితాంతాని గాఢ బాఢదృఢానిచయని యమరుఁడు,వనాంతర వాసము=అడవులలోఁ గాఁపురము

తాత్పర్యము

శ్రీరాముఁ డంతఃపురమువిడిచిపోఁగానే తల్లి కొడుకుల సంభాషణమును జాటునమండి వినుచుండిన యంతఃపుర స్త్రీలు రాజభార్యలు నిఁక శ్రీరాముఁ డడవికిఁ బోవుట నిజమని నిశ్చయించుకొని యందఱొక్కసారిగ ధ్వని యాకాశ మునంటునట్లు ఘొల్లున నేడ్చిరి. అయ్యో! మన రామచంద్రుఁడు కాఱడవులలో వసింపఁబోవునఁట. ఆహా యెంతవిపరీతములు పుట్టెనమ్మా! ఇఁక మనగతియే మమ్మా, శ్రీరాముని విడిచి యుండుటయెట్లమ్మా! ఇఁకఁజేయవలసినదేమి? శ్రీరామునితోడ మనము పోదమా? ఇందేయుందమా.

చం॥ జనకుఁడ చెప్పకుండినను•సర్వము నంతిపురంబుకృత్యముల్
చనవునఁ దీర్చి యందఱకు•సమ్మతి మై శరణంబు దిక్కువై
జననిని గొల్చురీతిఁ దన•జన్మముఁ దొట్టి నితాంతరక్తిమై
మనలను గొల్చుతండ్రి గుణ•మాన్యుఁడు రాముఁడు కాన కేగెడిన్. ౩౪౬.

తాత్పర్యము

తనతండ్రి యంతఃపురములందు నీవీ కార్యములు చేయుమని చెప్ప కుండినను మనమేలుగోరి యంతఃపుర కార్యములు విచారించుకొనుచు మంచి మాటలచేతనే యాయావారిచేఁ బనులు చేయించుచు నెవరికి నొప్పిలేక సర్వ సమ్మతమైన విధమున మనకు రక్షకుఁడు, ప్రాపునై తన తల్లిని సేవించు విధమున ఆయన పుట్టినది మొదలు మిక్కిలి యనురాగముతో మనలను సేవించు గుణపూజ్యుఁడు శ్రీరాముఁడు కానల కేగు వాఁడఁట.

దీనివలన రామచంద్రమూర్తి తన తల్లిని గౌరవించునట్లు లందఱుసవతి తల్లులను గౌరవించుచుండెనని యేర్పడుచున్నది.సత్పుత్రుఁడు గుణవంతుఁడు తన తల్లియందు సవతి తల్లులయందు భేదమెఱుంగఁడు, "శ్లో॥ యథా కుంతీ తథా మాద్రీ, విశేషోనాస్తి మే తయోః। మాతృభ్యాం సమ మిచ్ఛామి, నకులో యక్షజీవతు॥" భార. అరణ్య నాకుఁగుంతి యెట్టిదో మాద్రియునట్టిదే, వారిరువు రందు నేనుసముఁడను. కావున యక్షా! నకులు బ్రతికింపుము. అని ధర్మరాజు చెప్పెను.

చం॥ తనయెడ నెవ్వరైన నొక•త ప్పొనరించినఁ బ్రల్లదంబులా
డిన విని కోపగింపఁడు, వ•డిన్ విడనాడును గ్రోధనీయము,
ల్గినిసినవారియందుఁ గృప•లేశము మానఁడు కోసలాత్మజా
తనయుఁడు రామచంద్రుఁడు సు•ధన్యుఁడు కానల కేగునయ్యయో.

ఇంకను శ్రీరాముని గుణములు దలఁచి విలపించుచున్నారు. ప్రల్లదం బులు=పరుషవాక్యములు, క్రోధనీయముల్ = కోపింపఁదగినవి, కినిసినవారి యందు=తనపైఁ గోపపడినవారియందు.

తాత్పర్యము

తన విషయమందెవరైన నపరాధ మొనరించినను బరుషముగా మాటలాడినను వినియును గోపగింపఁడు, కోపకారణములగు వానిని వదలివేయును. తనమీఁద నెవరైనను గోపపడినను వారిపైఁబగసాధింపక వారియందుఁ గొంచెమైన దయువదలఁడు. అట్టి కౌసల్యాపుత్రుఁడు శ్రీరామచంద్రుఁడయ్యో కానలకుఁ బోవునుగదా.

కం॥ గతి యెవ్వఁ డఖిలభూత వి,తతికా పుణ్యాత్మురాముఁ•దయచెడి వనికిన్
మతి దప్పి పనుచు రాజీ, క్షితి జీవనాళిని హింస•సేయకయున్నే. ౨౪౯

అఖిలభూత వితతికిన్=సమస్తభూతముల సమూహమునకు, మతితప్పి=బుద్ధిమాలి.

తాత్పర్యము

సమస్త ప్రాణికోటికి గతియెవ్వఁడో యటువంటి పుణ్యాత్ము శ్రీరామచంద్రుని దయమాలి బుద్ధిలేక యడవులకుఁ బనుపు రాజు భూమియందుఁగల జీవులనెల్ల హింసించి వాత వేసికొనకుండునా?

కం॥ అని దేవెరు లందఱు భీ,జనకంబుగఁ దన్నుఁ దెగడి•పరవమ్ముగ గో
లున నేడ్వ దశరథుం డది, విని తల్పమునందు క్రుంగి•విన్నఁదనమునన్

దేవెరులు=రాణులు, భీజనకంబుగన్=భయముపుట్టునట్లు, తెగడి=దూషించి పరవమ్ముగన్=ధ్వనితోడ, తల్పమునంద=పానుపుమీఁదనే, విన్నఁదనమునన్=సిగ్గుచే, అవమానముచే, క్రుంగెన్ = కూలఁబడిపోయెను, తలయెత్తిచూపుటకాయన మనస్సొప్పినదిరాదు.

తాత్పర్యము

అని రాణులందఱు నొక్కటిగ భయము పుట్టునట్లు దన్నుఁ దిట్టుచు ధ్వని కలుగునట్లు గొంతెత్తి బిగ్గ నేడ్వఁగా దశరథుఁడు సిగ్గుచేఁ బానుపునందే కూలఁబడెను.

సీ॥ సౌమిత్రిసహితుఁడై•రాముఁడు దద్ధ్వని,
వినిదుఃఖము నణంచి•మనమునంద
నెఱఁ గుంజరం బన•నిట్టూర్పువిడుచుచు,
దల్లియంతిపురంబుఁ•దఱిసి యందు
ద్వారపాలకు వృద్ధుఁ•బరమపూజితు మఱి,
యందుమూఁగిన యట్టి యఖిలజనులఁ
జూచి వారలు దన్నుఁ•జూచి జయారవ,పూర్వకంబుగ లేవఁ•బోవు చవల

తే॥ నాదికక్ష్యను దాఁటి రెండవదిసొచ్చి,
యందు నృపమాన్యులై వృద్ధు•లైనయట్టి
వేదసంపన్ను లగుపూజ్య•విప్రవరులఁ,
జూచి వారికి రాముండు•సొరిదిమ్రొక్కె. ౨౫౦

కుంజరంబనన్=ఏనుఁగోయన, తఱిసి=సమీపించి జయరవపూర్వకంబు గన్=జయజయ ధ్వనులతో, ఆదికక్ష్యను=మొదటి కట్టును, సొరిది=వరుసగన్.

### తాత్పర్యము

లక్ష్మణుతోడ శ్రీరాముఁడా యేడుపుధ్వనివిని తన నిమిత్తముగ వారికింత దుఃఖము కలిగెఁగదా యని వ్యసనముదోఁప, దాని మనసులోన నణఁచి యేనుఁగువలె నిట్టూర్పు విడుచుచుఁ, దల్లియుండు నంతఃపురంబు సమీపించి, యచట ముసలివాఁడును మిగులఁ బూజ్యుఁడునగు ద్వారపాలకుని మఱియచట గుంపుచేరిన జనులనుఁజూచి, తన్నుఁజూచి వారు జయజయ రాఘు రామయను ధ్వనులతో లేవఁగా వారిని దాఁటి, యావలఁబోయి మొదటితొట్టికట్టు దాఁటి, రెండవదాని యందుఁ బ్రవేశించి యచట రాజపూజ్యులై వృద్ధులై వేద సంపన్నులైన బ్రాహ్మణశ్రేష్ఠులఁ జూచి వారికి వరుసగ నమస్కరించి.

ఉ॥ ఆవలి కక్ష్యద్వార మన•యంబును గాచుముసళ్ళ బాలలన్
వావిరి చేరఁబోవుటయు•వారలు దీవన లిచ్చి యేగి పీ
తావిభురాక చెప్పనెడఁ•దాను రేయి వ్రతంబుఁ బూనుచున్
వేవిన విష్ణుపాదపద•విపరిణద్ధమనోంబుజాతయై. ౨౨౧

వేవినన్=ఉదయముకాఁగా, అనాద్యంబును, ససంయుక్తంబునగు గకారమునకు నొకానొకచో వకారంబగు సువ్యా ఆచ్ఛిక. ౬౧. సూ. అనుసూత్రము చొప్పున వేగిన యనునది వేవిన యని యయ్యె. వేవిన మేడపై వలభివేదిక యని యాముక్తమాల్యద. పదాదియం దీ మార్పురాదు. విష్ణుపాదపదవీ పరిణద్ధమనోంబుజాతయై=విష్ణువుయొక్క పాదము లనుస్థానమందుఁ జక్కగాఁ బంధింపఁబడిన కమలమువంటి హృదయము గలదై.

### తాత్పర్యము

మూఁడవ కక్ష్యయందు ద్వారమును విడువక కావలియుండు ముసలి వాండ్రను ఆఁడుపిల్లలను సమీపింపఁగా వారు జయ జయ మని దీవనలిచ్చి లోపలికిఁబోయి కౌసల్యతో శ్రీరామచంద్రమూర్తి వచ్చినాఁడని చెప్పినసమయమునఁ గౌసల్యయుఁ దాను రాత్రియంతయు వ్రతముఁబూని యుదయము కాఁగా విష్ణుపాదకమలముల నిజహృదయంబుఁ జేర్చినదై.

### —• శ్రీరాముఁడు కౌసల్యను జూచుట. •—

సీ॥ సుతహితార్థంబుగ•నతిభక్తి శ్రీవిష్ణు, పూజ గావించెడి•పుణ్యశీల
వెలివలిపము గట్టి•నెలమి విధ్యుక్తంబు, వ్రతపరాయణ యైన•పరమసాధ్వి
మంత్రపూతంబుగ•మంగళాకలితయై,యగ్ని వేల్చుచునున్న•యమలచరిత
నిష్ఠలఁ గృశియించి•నిజదైవతము సేఁత, దన్పుచు నున్న కాం•తామతల్లిఁ

తే॥ దల్లిఁ గని దేవపూజ కొ•దధిఘృతంబు
హవియు లాజలు మాల్యపా•యసము లార
నిండుఁ గడవలు సమిధలు•నిర్మలంపుఁ
గృసరమును గాంచి యామెకు•నెఱఁగె భక్తి. ౨౨.౨

సుతహితార్థంబుగన్=కుమారుని మేలుకొఱకు, వెలివలిపము=తెల్లని సన్న పట్టువలువ, విధ్యుక్తంబు=శాస్త్రమునఁ జెప్పఁబడిన ప్రకారము, వ్రతపరాయణ =వ్రతమున విశేషాసక్తి గలిగిన, పరమసాధ్వి=ఉత్తమ పతివ్రత, మంత్ర పూతంబుగన్=మంత్రములచేఁ బవిత్రమగునట్లు,మంగళాకలితయై=శుభముతోఁ గూడినదై, అగ్నివేల్చుచున్=అగ్నిహోత్రమున బ్రాహ్మణులచే హోమముఁ జేయించుచున్న, అమలచరిత=నిర్మలమైన నడవడిగలది, నీటఁ దప్పుచున్న =అభిషేకము చేయుచున్న, కాంతామతల్లి=స్త్రీలయందు శ్రేష్ఠురాలు,పూజకు ౙొ =పూజకుఁ గావలసిన, దధి=పెరుఁగు, ఘృతంబు=నెయ్యి, మాల్య=పూల లండలు, సమిధలు=కట్టెపుల్లలు,కృసరము=నూవులు పాలు మొదలైన నవికలిపి వండిన యన్నము.

తాత్పర్యము

తన పుత్రునకు మేలుకలుగ వలయునని మిగుల భక్తితో విష్ణుపూజగా వించెడి పుణ్యస్వభావురాలు. తెల్లని పట్టువస్త్రముగట్టి సంతోషముతో శాస్త్రమునఁ జెప్పఁబడిన వ్రతమందాసక్తిగల యుత్తమ పతివ్రత, మంత్రములచేఁ బవి త్రముచేసి శుభపదార్థములతోఁ గూడినదై హోమము చేయించుచున్నస్త్రీరత్న మునగు తల్లినిఁజూచి దేవపూజకుఁ గావలసిన పెరుఁగు నెయ్యి హవిస్సు పేలలు పూలదండలు పాయసము, నీటనించిన కడవలు, కట్టెపుల్లలు (రావి మొదలైనవి) పరిశుద్ధముగా సిద్ధము చేయఁబడిన నూవుల యన్నముచూచి యామెకు భక్తితో నమస్కరించెను.

కం॥ వచ్చినసుతుఁ గని యచ్చపు,ముచ్చట గోడిగ కిశోర•మునుబోలె నెదు
ర్వచ్చి తమి హెచ్చఁ గౌఁగిటఁ,
గ్రుచ్చి శిరము మూరుకొంచు•గురువత్సలతన్. ౨౨.౩

గోడిగ=ఆఁడుగుఱ్ఱము, కిశోరము=పిల్లగుఱ్ఱము, గురువత్సలతన్= గొప్ప ప్రేమతో, మూరుకొంచున్=వాసనచూచి.

తాత్పర్యము

వచ్చిన కుమారునిఁజూచి తనపిల్లయొద్దకు నాఁడుగుఱ్ఱము పోవురీతి నెదురుగా వచ్చి ప్రేమతోఁ గౌఁగిలించి శిరమాఘ్రాణించి నిండారుప్రేమతో.

కం॥ కౌసల్యాసతి యన్యదు,రాసద తేజుని రఘూద్వ•హాగ్రణి నిజహ
ర్షాసమకలశోదధిరా,కాసితకరుఁ బ్రియహితంబు•గా దీవించెన్. ౪౨.౪

అన్యదురాసద తేజునిన్=ఇతరులకు సైఁపరాని తేజస్సుగలవానిని,రఘూ ద్వహాగ్రణిన్=రఘువంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుని, నిజహర్ష = తనసంతోష

మనెడి యనమానమైన పాలసముద్రమునకు షోడశకలాయుక్తుఁడైన చంద్రుని వంటివానిని, ప్రియహితంబుగాన్=ప్రియము హితము నగునట్లు.

తాత్పర్యము

కౌసల్యాదేవి యన్యులకు సహింపరాని తేజస్సుగలిగి రఘువంశ రాజులలో గుణములందు మొదటివాఁడై తన సంతోషమనెడి పాలసముద్రమునకు నిండు చందురుఁడైన శ్రీరామచంద్రుని ప్రియముగాను హితముగాను దీవించెను.

కం॥ స్థవిరుల మహితాత్ముల ధ,ర్మవిదుల రాజర్షివరుల॰ప్రథ యాయుస్సున్
శవడిల్లు నీకు ధర్మము,నవు రొప్పె గులాన రామ॰చంద్రకుమారా. ౫౨౫

దీవనవిధము చెప్పఁబడుచున్నది.

స్థవిరుల=వృద్ధుల, దీనిచే దీర్ఘాయువు, మహితాత్ముల=పూజ్యమైనమనస్సుగలవారల, దీనిచే శీలము, రాజర్షివరుల=రాజర్షిశ్రేష్ఠుల, ప్రథ=కీర్తి, స్థవిరుల, కాకివలెఁ జిరకాలము బ్రదికి లాభములేదు. మనస్సు గొప్పదై యుండవలెను. మనస్సు గొప్పదికాఁగానే లాభమేమి? అది ధర్మయుక్తమై యుండవలయును. ధర్మమెఱిఁగిన లాభమేమి? ఋషిచర్యయందు గొప్పవాఁడనిపించుకొనవలయును. ఇది మోక్షసాధకము.

రాజర్షివరుల ప్రథ యాయుస్సు అనుచో రాజర్షివరుల ప్రథ, రాజర్షివరుల యాయుస్సు అని యన్వయము. ఒక్కొక్కచో సమానగత పూర్వపదంబు వ్యవహితోత్తరంబొంటితోడను బెక్కింటితోడను నన్వయించెడిని. త్రి. సమా ౩౦ సూ.

తాత్పర్యము

రఘువంశమునఁబుట్టి దీర్ఘకాలము జీవించి పూజ్యమైన మనస్సుగలవారై ధర్మమెఱిఁగినవారై రాజర్షులనిపించుకొనిన రాజులకీర్తియు, ఆయుస్సు నీకుఁగలుగును గాక. కుమారా, రామచంద్రా మనవంశమున జ్యేష్ఠుఁడు రాజ్యార్హుఁడను ధర్మము స్థిరపడెను.

కం॥ చనుమీయిప్పుడ తండ్రిని,గనుమీ సత్యప్రతిజ్ఞ॰గలఁ డతఁ డీయన్
గొనుమీ యువరాజత్వము,మనుమీచిరజీవి వయి కు॰మారా యనుచున్.

తాత్పర్యము ౫౨౬

నాయనా నీవు పోయి తండ్రిని జూడుము. ఆయన సత్యప్రతిజ్ఞుఁడు. ఆడి తప్పఁడు. కావున నీకు నాయన యౌవరాజ్య మీయఁగా గ్రహింపుము. చిరంజీవివయి జీవింపుము.

కం॥ అనుకంప భోజనార్థం, బునిచినయాపీఁట నంటి॰యొయ్యనఁ గేలన్
జననికిఁ గించిద్వీడా,నసుఁడై కేల్మోడ్చి యిట్లు॰నంగఁ దొడంగెన్. ౫౨౭

అనుకంపన్=దయచే, భోజనార్థంబు=భోజనముకొఱకు, కించిత్=కొంచెము వ్రీడాననుఁడై=సిగ్గుగల ముఖముగలవాఁడై, కేల్మోడ్చి=రెండుచేతులుజోడించి కేలు నిత్యైకవచనాంతము. తొడంగెన్=ప్రారంభించెను. కైకయింట జరిగిన విషయము కౌసల్యకుఁ దెలియదు. అంటి=తాఁకి, ఒకపదార్థ మొకరిచ్చినపుడు దానిని బరిగ్రహింపరాకయుఁ దిరస్కరించుట మర్యాద గాదనియుఁ దోఁచిన పుడు దానిని జేతితోఁ దాఁకవలయును. అని శాస్త్రమర్యాద. వ్రతము ప్రకా రము సుఖాసనముపైఁ గూర్చుండరాదు. తల్లియిచ్చినదాని నిరాకరింపరాదు. కావునఁ దాఁకెను.

తా త్ప ర్య ము

తల్లి కడుపుచూచు నన్నట్లు రాత్రియంతయు నుపవాసముండి కొడుకు వచ్చెనే యని భోజనము పెట్టుటకై పీఁటవేయఁగా దానిని మెల్లఁగాఁ జేతితోఁ దాఁకి యింత ప్రేమగలయీయామె కీయనిష్టవార్తయేమని తెలుపుదునాయని కొంచెము సిగ్గునఁ దలవంచి చేతులు జోడించి యిట్లు చెప్పసాగెను.

కం॥ అతిమాత్రవినయగుణ మా, క్షితిజాపతికిన్ స్వభావ•సిద్ధం బందున్
నుతగుణ జనని యెడం గల,
యతిభక్తిని వినతుఁ డగుచు•ననుఁ దవహీకన్.౨౫౮

అతిమాత్ర వినయగుణము=అధికమైన వినయగుణము.

తా త్ప ర్య ము

శ్రీరామునకు మిక్కిలి వినయగుణము స్వభావసిద్ధము. అందు గుణము లచేఁ బొగడ్తగన్న తల్లి యెదుట నేమి యవినయముగ వర్తింతునో యామె యేమి తలంచునో యని భయము. ఇట్లు భయముతోఁగూడిన భక్తితో నమస్క రించినవాఁడై తన ప్రయాణము గుఱించి చెప్పనారంభించెను.

—• శ్రీరాముఁడు తల్లితోఁ దా నరణ్యమునకుఁ బోవువార్తఁ జెప్పుట.•—

కం॥ తల్లీ! తెలియవుగా యివు, డుల్లం బగలించుదుఃఖ•ముగ్రత నీకున్
బల్లవకోమల సీతకు, సల్లలిత గుణాఢ్యుఁడైన•సౌమిత్రికినిన్. ౨౫౯

అగలించు=పగులఁదీయు, పల్లవకోమల=చిగురువలె మృదువైన దేహము గలది, సల్లలిత=మంచి మనోహరమైన, గుణాఢ్యుఁడు=గుణసంపత్తిగలవాఁడు

తా త్ప ర్య ము

అమ్మా! నీకును మృదుగాత్రయైన సీతకు, మనోహర గుణసంపన్నుఁడైన లక్ష్మణునకు, గుండెలు పగిలించు భయంకర దుఃఖము ప్రాప్తించుట నీవింకను నెఱుఁగవుగదా.

ఇది శ్రీరామచంద్రమూర్తి మనోదార్ఢ్యమును, జితేంద్రియత్వమును, దెలుపుచున్నది.

ఉ॥ ఏటికి నీసుఖాసన? మిఁకదే చనువాఁడను దండకాటవీ
వాటికి,విష్టరాసనముఁపై వసియింపఁగ వేళ నాకుఁ దాఁ
బాటిలె,నామిషంబుఁవిడి పక్వఫలంబులు తేనె మూలముల్
వాటముగాఁగ మెక్కి మునిఁనాఁ జరియింతుఁ జతుర్దశాబ్దముల్. ౨౬౦

విష్టరాసనము=దర్భాసనము, ఇరువదియైదు దర్భలతోఁ జేయఁబడిన ఋషుల యాసనమునకు విష్టరాసనమనియు, నేఁబది దర్భల ఋష్యాసనమునకు బ్రహ్మాసనమనియుఁ బేరు. ఆమిషము=విషయభోగచింత, విడి=వదలి "రసవద్భోజ్యవస్తురహిత" యని వైద్యనాథీయము. ఇచ్చట ఆమిషమనఁగా మాంసమని యర్థము చేసికొని శ్రీరాముఁ డీవాక్యమునకు విరోధముగా మాంసము భుజించెఁగదా యని కొందఱు సందేహింతురు. ఆమిషశబ్దమునకు విషయచింతయనియు వైద్యనాథీయమందు రసవంతమైన భోజ్యవస్తువనియు వ్రాయఁబడియుండుటచే నింటిలో సిద్ధము చేయఁబడిన రుచిమంతములగు పక్వపదార్థములు వదలెదనని శ్రీరామచంద్రుఁడు చెప్పెనని తెలియనగు. క్షత్రియులకు మాంసాహారము నిషిద్ధముగాదు. కావున శ్రీరామచంద్రుఁడు రుచిమంతముగా నేతిలోనుడికించి పోపువేసిన మాంసము వర్జించి క్షుత్తునివారణార్థము నిప్పులలోఁ గాల్చి తినుటవలన వ్రతహానిలేదు. అదియునుగాక యాకాలంబున మునులును నిట్టిమాంసము భుజించుచుండి యావల దానివలన దోషము తెలిసి విసర్జించిరి.

తా త్ప ర్య ము

అమ్మా! నాకేల యీసుఖాసనము? నేనిదిగో నిప్పుడే దండకాటవిలోదర్భాసనముపైఁ గూర్చుండుసమయము లభించినది. అంతియకాదమ్మా! రుచిమంతములైన యీభోజనములమాని పండినపండ్లు తేనె వేరులు చక్కఁగాఁదిని మునివలెఁ బదునాలుగు సంవత్సరము లడవులందే వసింతును.

కం॥ ధరణిపతి యౌవరాజ్యము, భరతునకు నొసంగు నన్నుఁఁబదునాల్గేడుల్
చరియింపఁ బంపె దండక,ధరియించి మునీంద్రురూపుఁఁదల్లీయిపుఁడే.

తా త్ప ర్య ము

రాజుగారు భరతునకు యౌవరాజ్యమునిచ్చును. నన్నుఁ బదునాలుగు సంవత్సరములు దండకలో మునివేషముతో సంచరింప నిపుడే పొమ్మనెను.

కైక చెప్పినదనినఁ గౌసల్యకు మఱింతసంతాపకరముగ నుండుననియు "అప్రతిషిద్ధమను మతమ్" కాదనకున్న నంగీకరించి నట్లేయను న్యాయము ననుసరించి కైక చెప్పినదానిని గాదని చెప్పకుండుటచే దశరథుఁడంగీకరించి నట్లే యను నభిప్రాయముతో శ్రీరామచంద్రుఁడు తన్నుఁ దశరథుఁడాజ్ఞాపించి నట్లే చెప్పెను. అట్లు గాకున్న సవతితల్లిమాట కంటెఁ గన్నతల్లిమాట యెక్కువ యాదరణీయమగును.

చం॥ వనముల నాలు నెన్మిదియు•వత్సరముల్ విజనస్థలంబునన్
గొనకొని సంచరించుచును•గూరలు గాయలు వేరువెల్లఁకుల్
దిని, ముని రీతి నామిషము•నేఁ దల పెట్టక, ప్రొద్దుపుచ్చుచుం
దును నన గొడ్డటన్ నలుక•దొల్లెడు కాననసాలమో యనన్. ౨౮౨

విజన స్థలంబునన్=జనములులేనిచోట-పధునాలుగు నేనునది పెద్దసంఖ్యగాఁ గనఁబడునని యాలునెన్మిది యని చెప్పెను. తల పెట్టక=తలంపక, సాలము=వృక్షము, మద్ది వృక్షము = అమిషము.

శ్లో॥ అధ్యాత్మరతి రాసీనో, నిరపేక్షో నిరామిషః।
ఆత్మనైవ సహాయేన, సుఖార్థీవిచరేదిహ॥ మను. ౬-౪౯.

(౧) నిరామిషః=అమిషం విషయాః తదభిలాషరహితః అనికుల్లూకభట్టు. అమిషము నేఁ దల పెట్టక యనుటచే విషయచింతలేక, బ్రహ్మచర్య మవలంబించి యని యర్థము.

(౨) నిరామిషః=రసవద్భోజ్య, వస్తురహితః=రసవంతమైన భోజ్యవస్తువులు మాని యని వైద్యనాథీయము.

సనత్కుమార సంహితయందు

దగ్ధమన్నం ద్విపక్వంచ, మసూరాన్నం సవల్కలమ్।
ఉద్ధాలకాః పర్యుషితం, మన్న మామిష ముచ్యతే॥
వృంతాకాని పటోలాని, తుంబికాచ కళింగకమ్।
బింబీఫలాని త్రపుషం, ఫలం శాకేషు చామిషమ్॥
దోరకాతులసీ చిల్లీ, ఛత్రాకం పోస్త పత్రకమ్।
చక్రవర్తీ రాజగిరిః, పత్రశాకేషు చామిషమ్॥
గృంజరం రక్త మూలంచ, పలాండుం లశునం తథా।
సర్వదై వామిషాణి స్యుః, కార్తీకేసూరణం త్యజేత్॥

పద్మపురాణమున

ప్రాణ్యంగ మామిషం చూర్ణం, ఫలే జంబీర మామిషమ్।
ధాన్యే మసూరికాః ప్రోక్తా। వన్నేపర్యుషితం తథా।
అజాగో మహిషీక్షీరా, దన్యేదుగ్ధాది చామిషమ్,
ద్విజక్రీతారసాః సర్వే, లవణం భూమిజం తథా!
తామ్రస్థితం పంచగవ్యం, జలం పల్వలసం స్థితమ్।
ఆత్మార్థం పాచితం చాన్న, మామిషం చోచ్యతేబుధైః॥

తాత్పర్యము

అడవులందు నొకయాలు నొకయెన్మిది యేఁడులీమాత్రముకాలము జనములు లేనిచోటఁ దిరుగుచుఁ గాయగూరలు వేరు వెల్లఁకులు దిని మునివలె నామిషము

వదలి కాలము ద్రోయుదును అని చెప్పఁగానే గొడ్డలితో నఱుకఁగాఁ బడెడు నడవి చెట్టువలె.

చం॥ దివి విడి నేలపైఁ దొరలు • దేవతనాఁ బడె, నిట్లరంటి నా
ఘవిఁ బడియున్న తల్లి సుఖ • పూజ్యను మూర్ఛితఁ జూచి వేగ రా
ఘవుఁడును లేవ నెత్తి కడు • గాటపు ద్రేఁకను ద్రెళ్ళినట్టిగో
డివవలె ధూళి గ్రుంగుడుఁ గ • డిందిగఁ గేలను మెల్లఁ బాచుచున్. ౨౬౩

దివి=స్వర్గము, విడిచి=వదలి, అరంటినాన్=అరఁటిచెట్టువలె, ద్రేఁకను = భారముచే, గోడివ=గోడిగ– ఆఁడుగుఱ్ఱము, గ్రుంగుడున్=మునుంగఁగా.

తాత్పర్యము

కౌసల్య పుణ్యక్షయమున స్వర్గమునువిడిచి నేలఁదొరలిపడిన దేవతాస్త్రీయో యన నేలపై మూర్ఛిల్లిపడెను. ఇట్లు నఱుకుడుపడిన యరఁటిచెట్టువలె భూమి మీఁదఁబడియుండు తల్లిని, సుఖముచే గౌరవింపఁ దగిన దానిని, మూర్ఛచే దేహము తెలియనిదానిని,జూచి మిగుల బరువును మోయలేక నేలఁబడిన యాఁడు గుఱ్ఱమువలెఁబడి దుమ్ములో మునుగఁగాఁ శీఘ్రముగ శ్రీరాముఁడామెను లేవ నెత్తి చేతితో నాదుమ్ము తుడుచుచు

కం॥ చెంగటఁ గూర్చుండినసుతు, నిం గని సౌఖ్యార్హ పలుకు•నెఱశోకమునన్
ముంగలఁ గలసౌమిత్రి వి,నం గన్నులయందు జలక•ణంబులు గురియన్.

చెంగట=సమీపమున, జలకణంబులు=జలబిందువులు.

తాత్పర్యము

తన సమీపంబునఁ గూర్చుండిన కొడుకునుజూచి సుఖయోగ్యమగు కౌసల్య నిండార్తు.శోకంబున ముందు నిలుచుండిన లక్ష్మణుఁడు వినునట్లు కన్నులనీరు గాఱుచుండ నిట్లనెను.

—• శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవుట విని కౌసల్య దుఃఖించుట. •—

ఉ॥ నాయన! నీవు నాకడుపు•నన్ జనియింపక యుండితేని య
త్యాయతదుఃఖ మీవగిది•నందక యుండుదుగాదె? మేలు గా
దే యిటువంటిదుఃఖములఁ•దీఱుటకంటెను గొడ్డురాల నై
యే యెటులో ధరన్ దినము•లీగఁగఁ ద్రోచుచు నుంట పుత్రకా? ౨౬౪

ఇది మొదలు కౌసల్యపరితాపము వర్ణింపఁబడును. ఉండుదువని యొక యర్థమున, ఉండుదునని మఱియొక యర్థమున గ్రహింపవలెను. శ్లేషమందు నఖండ నిర్బంధుకములకు మేళనము.

తాత్పర్యము

నాయనా! నీవు నా కడుపునందుఁ బుట్టకయుండితివేని యీ విస్తారదుఃఖము నీవు ననుభవించియుండవు. నా కడుపునఁబుట్టిన కారణముచే నీకీ పెనుదుఃఖము

ప్రాప్తించెను. నా కడుపున నీవు పుట్టకుండిన నాకీ దుఃఖములేదు కదా. ఒకరి నిమిత్తమై యొకరు మనమిరువురము నానుండి నీవు నీనుండి నేను నేడువ వలసివచ్చినది. ఏ భాగ్యవతి కడుపునందైన నీవు పుట్టియుండిన నీవు సుఖించి యుందువు. ఆ తల్లియు సుఖించియుండును. పుత్రశోకములేక నేను సుఖించి యుందును. అదేమమ్మా యట్లులనెదవు గొడ్డురాలగుట మేలాయందువేమో. తండ్రీ! యిటువంటి కడుపుదుఃఖముచేఁ జచ్చుటకంటెను గొడ్డురాలనయి యే విధముగానో కాలము ద్రోయుచునుండుట మేలుకదా.

కం॥ బిడ్డలు లేరని యొక్కటె, గొడ్డుంబోతులకుఁ జింత•కొడుకులు పుట్టన్
దొడ్డగ బ్రదికిన మేలగు, బిడ్డా! యిటులైన నేమి•ప్రియ మగుఁ జెపుమా.

గొడ్డుఁబోతు, బోతు అనునది తాచ్ఛీల్యార్థక ప్రత్యయము.

తాత్పర్యము

అపుడు మాత్రము విచారములేదా బిడ్డలులేనివారు బిడ్డలో బిడ్డలో యని కలవరించి పలవరించుటలేదా యందువేమో. నాయనా! బిడ్డలు లేకపోయిరిగదా యని గొడ్రాండ్లకు నొకవిచారమే. బిడ్డలు కలిగినయెడల వారు గొప్పగా జీవించిన మేలుగాని యీప్రకారము కని పెంచి కాచి నక్కలపాలుచేసిన నేమిమేలు?

ఉ॥ అక్కట! పెద్దపెండ్లమని•యైన విభుం డొకనాఁటనైన న
న్నక్కునఁ జేరఁదీసి, బహు•మానపురస్సరవాక్కులాడి, యిం
పెక్కఁగ సౌఖ్యమో శుభమొ•యేమియుఁ గూర్ప నెఱుంగ, బిడ్డఁడే
నొక్కఁడు పుట్టనద్దయిన•నొందుదుఁగా సుఖమంచు నుందుదున్. ౨౬౪

తాత్పర్యము

అయ్యో పుత్రకా! కట్టుకొన్న మగని నడవడికై యేడుతునా? కానక కానక కన్నబిడ్డ కానలకుఁ బోవుచున్నాఁడని యేడుతునా. రాజొకనాఁడైన నయ్యో యిది పెద్దపెండ్లాము పట్టపుదేవిగదాయనియైనఁ బ్రేమతో దగ్గఱకుఁ దీసి మర్యాదగా మాటలాడి సంతోషకరముగ నొకసుఖమో యొకమేలోగూర్పఁగా నేనెఱుఁగను. ఒక కొడుకైనఁ బుట్టిన వానియందలి ప్రేమచే వాని తల్లిగదాయను నెపముననైన నన్ను సుఖపెట్టునుగదా యని తలంచుచుంటిని.

చం॥ చనినది పోవని మ్మికఁ న•సహ్యములై వినరానిమాటలన్
మన పవియంగ నాడ నధ•మల్ సవతుల్ వరకాంత నెట్టులే
విన్నఁ గలదానరా, సతికి•వెండియుఁ గష్ట మొకండు గల్గునా ?
చనినను నీవునున్ వనికి•శక్యమై సైఁప ననంతదుఃఖమున్ ? ౨౬౫

అవియుంగన్=పగులఁగ, అధమల్=తక్కువవారు, వరకాంత=ఉత్తమ స్త్రీ. దుష్టయగు సవతి యొక్క కైకయే యయినను నొకతె యని చెప్పినఁ గైకను సూచించినట్లగును. దానికేమి కోపమువచ్చునోయని బహువచనమునఁ జెప్పెను.

అసహ్యములైనవికొన్ని విననైనఁగూడియుండును. కొన్ని వినరానివి సహ్యములై యుండును. సవతుల మాటలు సహ్యములుగావు వినఁగూడినవిగావు.

వినరాని మాటలన్=అను బహువచన ప్రయోగముచే నింతవఱకు శ్రీరాముని తల్లిగదా యీమె యనిన శ్రీరామునకుఁ గోపమువచ్చునో శ్రీరాముని తండ్రికిఁ గోపమువచ్చునో యని భయపడి మాటుమాటలననేవో యొకయేటుమాట యొక పోటుమాట కాకిమీఁదఁబెట్టి పిట్టమీఁదఁబెట్టి యనుచుండిరి. ఇఁకనో బహిరంగముగ నెన్నియేని యందురని భావము.

అధమాః = వల్లెత్తి యెవరిని నొవ్వనాఁడని నీచముగాఁజూడని నేనుగూడ నధమలని యనవలసివచ్చినవారు, సపత్నీః = ఒకభర్తకు భార్యలగుటచే నందఱు సమానలమను నహంకారముగలవారు.

వరకాంతను=వారివలె నేను నధమురాలనై యుండిన వారనిన నేననిన సరిపోవుచుండును. నేనో యనను లేను పడనులేను. వారు నిన్ను నేమియందురందు వేమో. ఏమనిచెప్పుదును. రాజు నాకుఁ బంపు వస్తువులు పంపకుండజేయుదురు. నాపుట్టినింటిసొత్తు నేను ధరించినను మగఁడొల్లనిదానికి దీనికిన్ని సొగసులా? ఎవని మెప్పించుటకీ సొగసులందురు. మగఁడు నాయింటికి రాకపోయినను ఎప్పుడైనా నేనై యాయన యవసరము తెలిసి మనస్సు ప్రసన్నమైనపుడు పోయినను వెంటనే వారు వచ్చి నామగనితో నీకేమి మాటలు ఆవలఁ బొమ్మందురు. ఇట్టివెన్నో కలవు ఇవి యెట్లు సహింతును. ఏమని చెప్పుకొందును. ఎవరితోఁ జెప్పుకొందును.

తాత్పర్యము

అయినదేమో యయినది. కడచిన దానికి వగచి యేమి ప్రయోజనము. ఇఁక జరుగవలసిన విధము చెపుము. కులగుణవయస్సుల నాకంటెఁ దక్కువవారగు సవతులు కర్ణకఠోరములై సహింపరానిమాటలను మనసు ప్రీలిపోవునట్టు లనుచుండఁగా నెట్లురా నేను వినఁగలను? ఆఁడుదానికి నింతకంటె గొప్పకష్టము మఱియొకటికలదా? సవతులమాటలకేడ్తునా? మగని యవిశ్వాసమున కేడ్తునా? నీవు కానలకుఁ బోయితివని సహింపఁరాని కడుపుదుఃఖమునకై యేడ్తునా?

కం॥ పలువతనంబున సవతులు, పలుకఁగ దుర్భాషణములు • వరవర్ణిని నై
కలనా వినుచుండఁగ? హా, తెలియను గద నామదుఃఖ • దీనతలతుదిన్.

వరవర్ణినిన్=ఉత్తమస్త్రీ. ౨౬౬

తాత్పర్యము

నీచపు సవతులు నోటికి వచ్చిన దుర్భాషణములు పలుకుచుండఁగా నుత్తమస్త్రీనై యెట్టులు వినుచుండఁగలను? వినఁజాలని, సహింపఁజాలని, బదులనలేని, నాగతియేమి? నాదుఃఖమునకు దైన్యమునకు నంతమెపుడో తెలియులేదుగదా.

కం॥ నీ వుండఁగనే నాకడ, నీపిధి సంప్రాప్తమయ్యె•నిక్క, ట్లింకన్
నీవును నడవుల కేగినఁ, జా వొక్కటిదక్కనేది•శరణము తనయా! ౨౪౦

తాత్పర్యము

నాయొద్ద నీవున్నప్పుడే నాకిట్టి కష్టములు ప్రాప్తించెను. ఇఁక నీవుకూడ నడవులకుఁబోయిన నాకు మరణముతప్ప కుమారా! వేఱు శరణము గలదా.

చం॥ మగనికిఁ బ్రేమ లేమి కను•మానము లే, దిఁకమీఁద బుత్రకా
వగ చెడఁ గైక తొత్తులకు•వత్తును సాటిగఁ, గాదు కాద, యె
ట్లగు నది? వారికంటె నధ•మాధమ నయ్యెద రామచంద్ర! యె
మిగ మెయిఁ దాల్చు దాన? నెది • మేర వచింపుము దుఃఖవార్ధికిన్?

తాత్పర్యము ౨౪౧

నామగఁడు నీకారణముననైన లక్ష్యపెట్టునుగదాయని భ్రమించియుంటిని. కన్నకొడుకును కులముద్ధరించు పెద్దకొడుకును నిన్నే యీగతి పట్టించినవాఁడు నన్నేగతిపట్టింపఁడు? కావున నతనికి నామీఁద దయలేదనుటయందు సందేహములేదు. ఇఁక మగఁడే దయలేక నిరాదరించినపుడు సవతులమాట యనవలయునా? ఇంటివారు వ్రేలఁజూపినఁ గానివారు కాలఁ జూపరా? ఇఁకనేను గైక పరిచారికలకు సమానురాలనగుదును. అదియునుగాదు. కైక తొత్తులకు నే నెట్లు సమానురాలను గాఁగలను. వారుకూడ నన్ను లక్ష్యపెట్టరు. కావున వారికంటె నధమురాలనై వారి పరిచారికగ నగుదును. ఇట్టి స్థితియందు రామచంద్రా యేమని దేహమింకను ధరింతును? నాకు దుఃఖాంత మెపుడు చెపుము.

ఉ॥ పాయనినోటిమంచి నెడ•పా తడపా ననుఁ గొల్చు వారలే
నేయెడ నైన నొక్కపరి•యేనియు నే మని పల్కరించు వా
రో యనఁ బోరు నేఁ బిలువ, • నొల్లరు మోమును జూపనింకఁ, గై
కేయితనూజుఁ జూచి వెఱఁ•గీడ్చెడుచున్ సుత! దేని కేడ్చెదన్. ౨౪౨

ఎడపాతడపా=అప్పుడప్పుడు రూ. ఎడపతడప

తాత్పర్యము

ఇంతవఱకు నానోటి మంచితనముచే నమ్మాయక్కా యనుటచే నెప్పుడు గాకపోయిన నప్పుడప్పుడైన నొకప్పుడుగాకున్న నొకప్పుడైనను బిలిచిన నేమి యనువారింక నేను బిలిచిన 'నో' యని కూడ ననరు. పిలిచినఁ బిలువనీలే యని మూతిత్రిప్పికొని పోదురు. అంతేకాదు. కన్నులకుఁ గనఁబడిన నేమిపనిచెప్పుదునో యని కనులకైనఁ గానరాకుందురు. ఏల ? ఇది వారి స్వభావగుణము కాదు. కైక కొడుకునుజూచి యతఁడు దండించునో యను భయముచేత నాయనా! దేనికేడ్తునో చెప్పుము.

కం॥ మటమట లాడెడిమోమును, జిటచిట యని కసరికొట్టు•చీఁదఱపలుకుల్
కుటిలగుణంబును గల యా, పటుమాయల కైకమోము•బరికించు టెటో.

కోపమున మట మటలాడుచుఁ జిటచిట చీఁదరించుకొనుచుఁ గసరికొట్టు చీఁదరమాటలు కుచ్ఛితగుణము గల యా పెనుమాయలమారి కైకముఖమును నేనేమని చూతును. ఇఁక దాని పెత్తనముగావున దానిని జూడక యెట్లు తప్పును?

మ॥ పదునేడేఁడులనుండి యెప్పు డొకో నా॰భంగంబు దుఃఖంబులున్
దుదగాంచున్, సుఖ మబ్బు, నంచు మది నెం॰తో వేచి మోదింపఁగాఁ
దుద కి ట్లయ్యెనుగా! సపత్నులదురు॰క్తుల్ వించు నెన్నాళ్ళయో
మది క్షీణించుచు నుండ నేర్తుఁ దనయా॰మానంబుఁ బోకార్చుచున్. ౨౮౪

పదునేడేఁడులనుండి=పదునేడనులెక్క మొదటి జన్మమునుండిరాదు. రెండవ జన్మము ద్విజత్వము ప్రాప్తించినది మొదలు. అనఁగా నుపనయనము మొదలు. శ్రీరామున కుపనయనము తొమ్మిదవ సంవత్సరమున జరగెను. అది మొదలిప్పటికిఁ బదునేడు సంవత్సరములు. ఇప్పుడు శ్రీరామునకు ౨౫ సంవత్సరముల వయస్సు. ఈ విషయము సీత రావణుతోఁ జెప్పినమాటలవలన నేర్పడుచున్నది. గర్భైకా దశేషు రాజన్యమ్మను సూత్రమునకు వ్యాఖ్యానము వ్రాసినవారు ఏకాదశేషు అని బహువచన సారస్యమునుబట్టి గర్భములో నుండునది మొదలు తొమ్మిదిగాని పదిగాని పదునొకండుగాని యని వ్రాసియున్నారు. కావున శ్రీరామునికిఁ దొమ్మిదవ యేఁట నుపనయనము జరగుట శాస్త్రవిరుద్ధము కాదు.

పుట్టినది మొదలిప్పటికిఁ బదునేడేఁడులని చెప్పినయెడల సీత రావణునకు "మమభర్తామహాతేజా వయసా పంచవింశక" యని చెప్పిన మాటతో విరోధించును. ఇదిగాక పండ్రెండేండ్లు మగని యింటనుంటినని సీతయనుటచే శ్రీరామునకు వివాహకాలమునకు నైదేండ్లనియు నుపనయనము ౧౮ వ యేఁటననియు నేర్పడును. ఇది శాస్త్రవిరుద్ధము నిర్ధారించి సీత సన్న్యాసియని నమ్మి రావణుతోఁ జెప్పినమాటతో విరోధించును. గావున శ్రీరామున కిప్పటికి ౨౫ సంవత్సరము లనువారి వాదము నంగీకరింపరాదు. ఊన షోడశవర్ష మ్మనుచోట నది నిర్ధారణ వాక్యముగాదు. పదునాఱింటికి నెంత తగ్గినను దగ్గినదే. ౨-౩ నెలలని యేమి నిశ్చయము. ఈ విషయము బాలకాండము ౨౦-౧౮వ పద్యవ్యాఖ్యానమందుఁ జర్చింపఁబడినది.

భంగంబు=అవమానము, వేచి=కాచుకొనియుండి, మోదింపఁగాన్=సంతోషింపఁగా, దురుక్తులు=దుర్భాషణములు, పోకార్చుచున్=నాశము చేసికొనుచు.

### తాత్పర్యము

నీ యుపనయనమైనది మొదలు పదునేడు సంవత్సరములనుండి నాకొడుకెప్పుడు పెద్దవాఁడగునా, నోరు కలవాఁడగునా, వానిమూలమున నా యవమానము దుఃఖము నశించునుగదా, సుఖపడుదునుగదా, యని కాచివేచి సంతోషపడుచుండగాఁ గడపటికి ట్లయ్యెనుగదా. సవతుల నిష్ఠురవాక్యములు వినుచు నెన్నాళ్ళురా నాయనా! మానము నాశముచేసికొని మనస్సులోనే క్రుళ్ళిక్రుళ్ళి నశింతును.

కం॥ ఎప్పటికి నాకు దుఃఖము, దప్పునటం చోర్తు సవతి•ధౌర్త్యం? బది నే
నెప్పగిదినా యోర్పునమున్, ముప్పునఁ దద్విప్రకార•ముల నెటు సైఁతున్.

ధౌర్త్యము = ధూర్తత్వము, ముప్పునన్=ముసలితనమునందు,విప్రకారములు = విరోధపు మాటలు, సైఁతున్ = సహింతును.

తాత్పర్యము

నాకు సవతి పోరువలనఁగలుగు దుఃఖమెప్పటికిఁ దీఱునని నాయనా!నేను సహించుకొనియుందును. అది యెప్పటికిఁ దప్పునిదాయెఁగదా. ఒకవేళ నీ దుఃఖముల సైచితిననుకో సవతిపలుకు దుర్భాషణము లెట్లు సహింతును ?

చం॥ పొలుపున నిండుఁజందురునిఁ • బోలిన నీదుముఖారవిందమున్
సలలితరీతి నొక్కనిమి•షంబును జూడక యుండ నేర; నే
తలఁపున జీవము న్నిలుపఁ • డాఱుదురా పదునాల్గువర్షముల్
చెలువఱి నిన్నుఁ జూడకయె•చిన్నికుమారక! దీనురాల నై. ౨౪౬

చెలువఱి = అందముచెడి, దీనురాలనై = నిర్భాగ్యురాలనై.

తాత్పర్యము

ఏదో యొకవిధముగ సవతిపోరును సహింపఁగలననుకో. ఇప్పటి నాస్థితి చెప్పెద వినుము. అందమున నిండుచందురుని బోలు నీముఖకమలమును నొక నిమిషమైనఁ జూడక ప్రాణములు నిల్పలేను. చిన్నినాయనా! యిఁకఁబదునాలుగు సంవత్సరములు నిన్నుఁజూడక యేరీతిఁ బ్రాణములు బిగఁబట్టుదునురా ఈ నిర్భాగ్యురాలికది సాధ్యమా ?

కం॥ వ్రతములు తప ముపవాసము,వెత లెన్నియొ పడుచు దుఃఖ•వృద్ధికిఁగాఁగన్
సుతరత్నమ! నిను సాఁకితి, నతులితనిర్భాగ్యురాల•నగు నే నకటా. ౨౪౭

తాత్పర్యము

కుమారరత్నమా! నిర్భాగ్యురాండ్రలో నసమానురాల నగు నేను వ్రతము లుపవాసములు నితరకష్టములెన్నెన్ని పడవలయునోయన్నిపడి దుఃఖము వృద్ధియగుటకై నిన్నుఁ బెంచితిని. అదృష్టవతులకు సుఖములనిచ్చు వ్రతోపవాసాదులు నేను నిర్భాగ్యురాలనయిన కారణముచే నాకు దుఃఖముకలిగించుటకై నిన్నుఁ గుమారుగా నొసంగెను. నిన్నుఁ బెంచుటరూపమున నాదుఃఖమును బెంచుకొంటిని.

ఉ॥ ఎక్కటి నీవు కానలకు•నేగిద నన్ను నాదుగుండియల్
వ్రక్కలు గామిచే నిను మొ•రాయియొ యా నిది నిశ్చయంబ, యొం
డొక్కటి యైన వానల మ•హోద్ధతిఁ బాఱెడి క్రొత్త వెల్లికిన్
జిక్కినయొడ్డు నా సమసి • చేడ్పడ కుండునె యింత కయ్యయో. ౨౪౮

ఎక్కటి = ఒంటరిగా, వ్రక్కలు = తునుకలు, వెల్లి = ప్రవాహమునకు, సమసి = నశించి.

తాత్పర్యము

ఒంటరిగా నీవు కానలకుఁ బోయెదవను వార్త వినఁగానే నాగుండెలు ముక్కలు ముక్కలుగఁ బగులకుండుటచే నది యినుమో ఱాయియో యయి యుండవలెను. ఇది నిశ్చయము. అటుకానియెడల జడివానలకు మహావేగముగఁ బాఱు క్రొత్తప్రవాహముచే నొడ్డులు రూపుమాయునట్లు లీ దుఃఖముచే నిప్పటి కిది నాశము గాకుండునా.

చం॥ మరణము లేదు నాకు, యమ॰మందిరమందుఁ దలంబు నేనియున్
దొరకదు నిక్క, మేల యనెఁదో విను నీదుప్రవాసవార్తకున్
భరపడి యేడ్చు నన్ను మృగిఁ ॰ బట్టి బలాత్కృతిఁ గొంచుపోవు కే
సరికరణిన్ యముం డిపుడ ॰ సత్వరుఁడై కొనిపోవ కుండుటన్. ౩౫

ప్రవాసవార్త = ఇతర ప్రదేశములకుఁ బోయెదవన్న సమాచారము, మృగిన్=ఆఁడుజింకను, బలాత్కృతిన్=బలవంతముగా, కేసరి కరణిన్=సింహమువలె, సత్వరుఁడై=త్వరతోఁగూడినవాఁడై.

తాత్పర్యము

నాకుఁ జావులేదు. ఎప్పుడు నిచ్చట నిల్లడుచుచుండవలసిన దాననే. ఒకవేళ మరణించినా యమలోకములో నాకు స్థలము లేదు. కావున నధమగతుల యందుండవలసినదాననే. నిజము. అది నీకెట్లు తెలియునందువా విను. నీవు దేశాంతరము పోవుదువన్నవార్త వినఁగానే దుఃఖమును సహింపలేక యేడ్చు నన్ను సింహమాఁడుజింక నపలీల నీడ్చుకొని పోవునట్లు యముఁడు బలవంతముగా నీడ్చుకొని పోకయుండునా? నాకుఁ జావేలేదో యమలోకమున స్థలమే లేదో. కావుననే యముఁడూరకున్నాఁడు.

చం॥ అనఘ! సహింపరానివిపు॰లార్తిఁ జిత్తము తున్కతున్కలై
చన, దిది యుక్కుతుంట యగు॰సందియ మింతయు లే,దకాలమం
దొనరదు దేహికి న్మరణ, ॰ ముగ్రపునోములు దానముల్ తపం
బును వెతఁ గూర్చె, ము న్నెపుడు॰పొందఁగ లే దిటువంటిదుఃఖమున్.

అనఘ = పాపరహితుఁడా. ౩౬

తాత్పర్యము

నాయనా! నీవు పాపాత్ముఁడవగుటచే నీవు నాకొడుకయిన కారణమున నాకి కష్టము వచ్చెనని నాయభిప్రాయముగాదు. నీవు పుట్టకముందుకూడ దుఃఖములే యనుభవించుచుంటినిగదా. నావంటి నిర్భాగ్యురాలి కడుపునఁ బుట్టుటచేఁ బుణ్యాత్ముఁడవైన నీకును గష్టములు కలిగెఁగదా యని యేడ్చెదను. నాకుఁ బుట్టకున్న నీకీవనవాసాయాసము కలిగియుండదుగదా. నానిమిత్తమునఁగదా నీకీ యరణ్యవాసప్రాప్తి, సహించుటకు సాధ్యముగాని మహాదుఃఖముచేఁ జిత్తము

తునుకలు తునుకలై పోకయుండుటచే నది యుక్కుతునుకయే. సందేహము లేదు. అటయిన నదియేల పోలేదందువా? అకాలమందు దేహికి మరణమురాదు. కావున జీవించియున్నాను. లోకములో నందఱకు సుఖమిచ్చు దానములు నోములు తపస్సులు నివి యన్నియు నాకు మనోవ్యథ కలిగించెను. ఇదివఱ కెన్నిమాఱులో యెటువంటి దుఃఖములో యనుభవించితినిగాని యిట్టి దుఃఖము నేనెప్పుడు ననుభవించినది లేదు.

కం॥ కొడుకులు కొడుకు లటంచును, గొడుకా! నలిపితిని నేను • ఘోరతపంబున్
 గడకు నది చవిటినేలను, నిడువిత్తన మయ్యె నేమి • యేడ్తును జెపుమా.

తాత్పర్యము

కొడుకులో కొడుకులో యని కొడుకుల కొఱకై ఘోరమైన తపస్సు చేసితిని. ఏమిఫలము? ఆతపస్సంతయుఁ జవిటినేల నాటినవిత్తనమయ్యెను. ఈవిపరీత ఫలమునకు నేనేమని యేడ్తును.

కం॥ గురుతరదుఃఖహతాత్ములు, మరణింపఁగ శక్యమేని • మత్పుత్ర! నీవి
 పరణిఁ జన, లేఁగఁ బాసిన,సురభి యనం బోనె యముని • జూడఁగ నిపుడే.

తాత్పర్యము ౨౮-౨

గొప్ప దుఃఖముచేఁ గొట్టఁబడిన మనస్సులుగల వారాదుఃఖబలమున మరణించుట సాధ్యపడునేని నాకుమారా! నీవిట్టు లడవికిఁబోగా దనలేదూడను బాసిన యావువలె నేడ్చు నేను యముని దర్శింప నిప్పుడే పోనా?

చం॥ బ్రదికియు నేమిసార్థకము • రా సుత! నే నిఁక నిన్నుఁ బాసి యీ
 సదనమునందు, దూడబడిఁ • జక్కఁగ నేగెడిబక్కగో వనం
 బద చనుడెంతు నీబడిని • మానను నన్గొనిపొమ్మటంచు నా
 సుద్ధతి దురంతశోకమున • గ్రుక్కెను గిన్నరి నా సుతార్థమై. ౨౮-౩

తాత్పర్యము

మరణము సుఖమనెదవు- మరణించి యమలోకమునకుఁబోయిన నచ్చట నరకబాధ ననుభవింపవలదా యందువేమో బ్రతికి నిన్నుఁబాసి యీ యింట నుండినంత మాత్రమున నేమిప్రయోజనము- ఏమి సుఖము ? కావున మరణించుట మేలుగాదని బ్రతికి యీయింట నుండుటయు మేలుగాదు- కావున దూడ వెంటఁబోవు బక్కగోవువలె నీవెంటవచ్చెదను బద- నీవు పోవు చోటికి నన్నుఁ దీసికొనిపొమ్ము- వదలను. అని యాకౌసల్య యంతములేని శోకమునఁ గుమారు నిమిత్తమై విలపించెను.

—• { ౨౧-వ సర్గము. లక్ష్మణుఁడు కౌసల్యతో శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోరా దని చెప్పుట. } •—

కం॥ ఈసరణిని విలపించెడి. కౌసల్యం జూచి దైన్య • కలితాననుఁ డై
 యాసౌమిత్రియుఁ దద్వ్య, కాసదృశము లైనవాక్కు • ల న్వచియించెన్.

ఈసరణిని = ఈవిధముగ, దైన్యకలితాననుఁడై = వెలవెలఁబోయిన ముఖము కలవాఁడై, తద్వేళాసదృశములు = అకాలమునకుఁదగినవి - అనుటచే లక్ష్మణుఁడు ధర్మమును భూషించుచుఁ జెప్పెడిమాటలు పరమార్థములైన యుతనియభిప్రాయములుగావనియు నన్ను నేవిధముననైన నడవికిఁ బోకుండఁజేసి సుఖపెట్టంగోరి చెప్పెడి మాటలనియు గ్రహింపవలెను - ఇట్టి దనుభవమందు నేఁటికిని గననగును - దీనివలన లక్ష్మణునందు నవిద్యగలదను నభిప్రాయము సరిగాదు.

తాత్పర్యము

ఈవిధముగ నేడ్చుచున్న కౌసల్యంజూచి ముఖము వెలవెలఁబోవ లక్ష్మణుఁడు అకాలమునకుఁదగిన మాటల నిట్లు చెప్పెగా.

ఉ॥ అఁడుది యాడినట్టిపలు♦కం దొకయాదరబుద్ధి నిల్పి యే
పోఁడిమి లేక రాజ్యమును ♦ భోగము లన్నియు మాని కానకు
న్వాఁడిమిఁ బాసి పోవు టన ♦ నాకును లో రుచియింప దయ్యెడున్,
ఱేఁడన వృద్ధు వెక్కిలి మ♦ఱిన్ మరుత్రిప్పులఁ జిక్కి యాడెడిన్. ౨౹౩

వాఁడిమి = పౌరుషము, వెక్కిలి = మనస్సు చెదరినవాఁడు - అర్ధమర్ధకలవాఁడు, మరుత్రిప్పులన్ = కామవేదనచే.

పలుకందు = ఉదంతములైన యుమహద్వాచకంబులకు 'కంబె - అందు' వర్ణకంబులు పరంబులగు నపుడు కొండొకచో నగాగమంబునునగు - పలుకందు - పలుకునందు.

తాత్పర్యము

ఎవతెయైనా యొకయాఁడుది నోటికివచ్చినట్లెల్ల వదరఁగా, దానియందు నాదరబుద్ధియుంచి, యేసుఖమునొల్లక, రాజ్యభోగములన్నివదలి, పౌరుషము విడిచి, యడవికిఁబోవుట యనునది నాకు సమ్మతమైనదికాదు - అఁడుదానిమాటలు గావే తండ్రిమాటగదాయని శ్రీరాముఁడను నేమో అయనరాజుగదా అయన యాజ్ఞ రాజాజ్ఞ దానిని మీఱవచ్చునా యనునేమో - యనితలఁచి యనుచున్నాఁడు స్వస్థచిత్తుడై లోవడవలసినదేవిధి - ఈరాజో వృద్ధు - అకారణము చేతనే సిరచిత్తములేనివాఁడు - దానికిఁదోడు కామవశుఁడై చిక్కి యెవతె యెట్లు లాడించిన నట్లులాడువాఁడు - ఇట్టివానిమాట పాటింపఁదగునా?

కం॥ మతి చెడి విషయసుఖై కని,రతుఁడై విపరీతబుద్ధి♦రా జంగజచో
దితుఁడై యేపలు కాడఁడు? సతివలలం జిక్కువాఁడు♦జడుఁ డగు టరుదే? ౨౹౪

తాత్పర్యము

దశరథుఁడు తొలుత వార్ధకముచేతనే మతిచెడిన చపలచిత్తుఁడు - అందు విషయసుఖములందే మిక్కిలి ప్రీతిగలవాఁడు - అటుగాకున్న నింతటి ముసలివానికి, గాడు రమ్మని వీడు పొమ్మనఁ గాటికిఁగాళ్ళుచాఁచి యుండువాని, కింకను

గామములా? విషయసుఖమే పరమార్థముగ నెంచువాఁడు విపరీతబుద్ధి యగు టేమి యాశ్చర్యము- 'వినాశకాలే విపరీతబుద్ధి' యని కలదుకదా- అందు మన్మథుఁ బ్రేరితుఁడై యుండువాఁడు పలుకరాని మాట యేదికలదు?అట్లు బుద్ధి లేనివాఁ డేదియైన వదరును- 'కామే ప్రసక్తః పురుషః కిమకార్యం విసర్జయేత్. భార. ౧౨-౮౨-౨౧. కామాసక్తుఁడగు పురుషుఁ డేయకార్యమును వదలును? అవన్ని లెక్కకుఁదీసికొనవచ్చునా? కామదాసుఁడు బుద్ధిహీనుఁడగుట యాశ్చర్యమా? కామాన్ధోపి నపశ్యతి' యనికలదుకదా-అర్థాంతరన్యా-సాలంకారము- సామాన్యలోక న్యాయముచే విశేషము సాధింపఁబడును.

ఉ॥ తప్పదియేమొ నే నెఱుఁగఁ • దథ్యము రామునియందు లేఁడు దా
నిప్పగిది న్వనావళికి • నేగు మ టంటకు, నింతపాపమా ?
యొప్పనివాఁడె యైన, నొక • యొప్పమి దండితుఁ డైన, దూఱఁ గా
నెప్పు డెఱుంగ నే నెదురు • నేనియుఁ జాటుగ నేని రామునిన్. ౨౮:

తాత్పర్యము

అటుగాదు- రాజు స్వస్థచిత్తుఁడే. మనఃపూర్వకముగానే తెలిసి చెప్పెనందురా- స్వస్థచిత్తుఁడగు వాఁడొకని దండించునపుడు ముందుగ వాఁడుచేసిన నేరమేమో చెప్పి నీవీనేరము చేసితివికావున నీకి శిక్షయని చెప్పవలె- రాజు శ్రీరామునం దేమినేరముమోపి దండకకుఁ బొమ్మనెను- శ్రీరాముఁడు దండకకుఁ బోఁదగిన తప్పేమిచేసెనో సత్యముగా నే నెఱుఁగను- నేరములేక యడవికిఁ బొమ్మనెనే ఇంత పాపకార్యముండునా? విరోధియైనను ఒకనేరముచేసి శిక్షింపఁబడినవాఁడైనను శ్రీరాముని నెదురఁగాని చాటుఁగాని దూషింపఁగా నేను విన్నది కన్నదిలేదు. ఎప్పుడు శ్రీరామునితోడనుండు నాకే తెలియనిది యెచ్చటనో మూలయింట నాఁడంగులతో ముచ్చటలాడు ముసలికెట్లు తెలిసెను ? తెలిసియుండెనా చెప్పరాదా?

మ. మత్తకోకిలము. దేవకల్పు ఋజున్ సుదాంతుని • దేవి! శత్రుల నైన స
ద్భావుఁడై దయఁజూచు వాని ని • తాంతపుణ్యునిఁ బూజ్యునిన్
భూవరుం డొకతప్పు లేక యుఁ • బుత్రు నెట్టిస్వధర్మ సం
భావనం బురిఁబాపి పొ మ్మనెఁ? • బ్రాజ్ఞు లియ్యది మెత్తురే?

దేవకల్పున్=పరదైవముతో సమానుని, ఋజున్ = యథార్థప్రవర్తనము గలవానిని, మత్తకోకిల - వృత్తమునకు - రసజజభరగణములు - ౧౧ వ యక్షరమున యతి.

తాత్పర్యము

పరదైవముతో సమానుఁడై చక్కటినడవడిగలవాఁడై యింద్రియనిగ్రహము గలవాఁడై, శత్రువులనైన మంచి యభిప్రాయముతో దయతోఁ జూచువానిని, మిక్కిలి పుణ్యవంతుని, నెల్లవారికిఁ బూజింప యోగ్యుఁడగువానిని, జ్యేష్ఠ

పుత్రుని నొకతపైన లేక మనుష్యమాత్రుఁడు వక్రవర్తనుఁడు ఇంద్రియలోలుఁడు నిష్కారణముగ భార్యనిమిత్తము దండింప సిద్ధపడువాఁడు (చూ. ప-౫౪౮) నగు వాఁడే రాజధర్మము ననుసరించి పురమువిడిచి పొమ్మనెను ? వివేకముగలవారు దీనిమెత్తురా.

ఉ॥ పిల్లతనంబునన్ నృపుఁడు•ప్రేలినచో నిటు ధర్మదూరతన్
జెల్లఁగ నిచ్చునే నృపతి•నీతి నెఱింగిన రాచబిడ్డఁ డో
తల్లి! యెవండు నైన నని•తాలిమి పట్టఁగ లేక వెండి తా
నల్లన లక్ష్మణుండు జన•కాత్మభవాపతితోడ నిట్లనున్. ౨౮౯

ప్రేలినచో=వదరినన్, తాలిమి=ఓర్పు, పిల్లతనంబునన్ = పిల్లవానివలె జ్ఞానములేక.

తాత్పర్యము

మూఢుఁడై రాజధర్మ విరుద్ధముగా వదరినంతమాత్రముననే రాజనీతి యెఱింగిన యేరాజకుమారుఁడైన ఆమాటలు సాగనిచ్చునా? అని కౌసల్యతోఁ జెప్పికోపము పట్టలేక యోర్పువిడిచి శ్రీరామచంద్రునితోడనే లక్ష్మణుఁడిట్లనెను_

—• లక్ష్మణుఁడు శ్రీరామునితో నరణ్యమునకుఁ బోవల దని చెప్పుట •—

చం॥ ఇరుచెవి సోఁక కుండుమునుపే•విషయంబు ధరాతలంబు నీ
గురుతరశాసనంబునకుఁ • గోల్కొనునట్లుగ నేను దోడుగాఁ
ద్వరపడి చేయుమీ, మఱి కృ•తాంతసమున్ నినుఁ జాపధారి నై
దురమున నేను గాచి నిలు•తున్ మఱి నీ కొకయడ్డ మున్నదే? ౨౯౦

ఇరుచెవి = ఇరుగుచెవి_ రెండవచెవి_ ఈ చెవిలోఁబడినది ఆచెవిఁజేరక ముందే_ అంతశీఘ్రముగ, గురుతరశాసనంబునకున్=మిగుల గొప్పయాజ్ఞకు కోల్కొనునట్లుగన్=అంగీకరించునట్లు, కృతాంతసమున్=యమునితో సమానుఁడైనవానిని, దురమునన్ = యుద్ధమందున్.

తాత్పర్యము

ఈవిషయము రెండవానిచెవిలోఁ బడకముందే యీభూమియంతయు నీ మహితశాసనమునకు లోపడునటు నా సాహాయ్యముతో శీఘ్రముగాఁ జేయుము యమునితో సమానుఁడవైన నీవే యెల్లవారిని జయింపఁగలవు_ ఇఁకఁ గోదండము ధరించియుద్ధమందు నిన్నుఁగాచుచు నేను నిలిచెదను. ఎవరు నీ కడ్డము రాఁగలరో చూతము.

ఉ॥ భాసురతేజ! తీవ్రశర•వారపరంపర నిర్మనుష్యమున్
జేసెద, నింతలోనఁ బురిఁ • జేడ్పడఁ దాశరథాప్తు లెవ్వరేన్
దాసినఁ జించి చెండెదను • డాకను, మెత్తఁదనంబు చేత నే
నాసియుఁ గల్గఁబోదు, వరి•భావితుఁ డౌ బరిపంథికోటిచేన్. ౨౯౧

భాసురతేజ=ప్రకాశించు తేజస్సు గలవాఁడా, నిర్మనుష్యము=మనుష్యులు లేనిదానిగా, వాసి=కీర్తి, పరిభావితుఁడు=అవమానింపఁ బడినవాఁడు, పరిపంథి కోటిచేన్ =శత్రుసమూహముచే.

సూర్యతేజా! తీక్ష్ణములైన శరసమూహముల వరుసలచే నీపురివారు నీ పట్టాభిషేకమున కడ్డమువచ్చిరేని యయోధ్యను మనుష్యరహితముగఁ జేసెదను. భరతునకుఁ గావలసినవా రెవ్వ రడ్డమువచ్చినఁ బరాక్రమమునఁ జించిచెండాడె దను. మెత్తగానున్న మొత్తబుద్ధియైనదన్నట్లు మెత్తనితనముచే నే కీర్తియు రాదు. పైపెచ్చు శత్రువులచే నవమానింపఁబడుదు.

కం॥ తనయాలికి లోపడి మన, జనకుఁడు పగతుండువోలెఁ • జరియించినయేన్
గనికరములేక పలయుం దునుమంగా నొండెఁ, జెఱను • ద్రోయఁగనొండెన్.

### తాత్పర్యము ౫౯-౫

పరుల నట్లుచేయుదువు. తండ్రియే విరోధిగదా- ఆయన వచ్చిననేమి చేసెదవందువా-తనభార్యకు వశుఁడై యామెపక్షమూని మనకు విరోధివలె దశ రథుఁడు వర్తించెనా తండ్రికదాయను దయలేక చంపవలెను.లేదా యూపిరిలోఁ జిక్కినఁ జెఱసాలలోఁ ద్రోయవలయును.

శ్లో॥ పుత్రస్సఖా వా భ్రాతావా, పితావా యది వా గురుః
రిపుస్థానేషు వర్తంతే। హంతవ్యా భూతి మిచ్ఛతా॥ భార-౧-౧౪౦-౫౫.

కొడుకుగాని - సఖుఁడుగాని తోడఁబుట్టినవాఁడుగాని తండ్రిగాని గురువు గాని శత్రువువలె వర్తించెనా యైశ్వర్యము గోరువాఁడట్టివానిని జంపవలెను.

తే॥ కార్య మియ్యది యిది యకార్యమనుచుఁ,
దెలియకైనను గర్వంబు • బలిమినైనఁ
గానితెరువునఁ జనియెడి • వాని గురునినైన దండింపవలయు ధ • ర్మైకనిరత.

ధర్మైకనిరత=ధర్మమునందే యెక్కువ ప్రీతిగలవాఁడా! అకార్యము = చేయరానిది, కాని తెరువునన్=పోరానియధర్మమార్గమున, గురునైనన్=తండ్రి నైనను, పరశురాముని భీష్ముఁడు దండించి నట్టు లాచార్యునైనను.

### తాత్పర్యము

ధర్మైకనిరతా! యది చేయఁదగినది యిది చేయరానిది యని తెలియక యజ్ఞానముచేనైనను తెలిసి తెలిసి నాకెదురెవ్వరని గర్వముచేనైనను దప్పు త్రోవలఁబోవువాని దండ్రినైన నాచార్యునైన దండించుటే తగినపని. ఇది ధర్మశాస్త్ర పద్ధతి.

ఉ॥ ఏమిబలంబు నచ్చి ధర•ణీశ్వరుఁ డేమి నెపంబు పెట్టి నీ
భూమిభరంబు నీవలనఁ•బూన్పక కైక కొసంగ నెంచెడిన్?
శ్రీమహితా! నృపాలకుఁడు•నీయెడ నాయెడ వైర మూని తా
నేమిగతిన్ ఘటించు నవ•నీశ్వరుఁగా నలకైకపుత్రునిన్ ? ౫౯౪

నచ్చి = నమ్మి. తాత్పర్యము

రాజు తానెవరి సాహాయ్యము నమ్మి యేమి నెపము పెట్టి యారాజ్యభారము నీయందుంచక కైక కియ్యఁదలంచుచున్నాఁడు. ఈయనకుఁగల ముఖ్యబలము మనమిరువురము-భరత శత్రుఘ్నులనందువా, వారిచ్చటలేరు. ఇట్టి సందర్భము లలో మనయిరువురితో విరోధించి కైక కుమారునెట్లు రాజుగఁ జేయఁగలఁడు. అది సాధ్యమా.

మ॥ వినుమీ నామదిభంగి నోజనని దే•వీ! భ్రాతృభావంబు మై
ననురక్తుండ భవత్తనూజునకు, స•త్యాభీష్టదానాశుగా
సనరాజంబుల మీఁదఁ జేసెదను బా•సన్, సంజ్వలద్వహ్నినేన్
వనినేన్ రాముఁడు చొచ్చుచోఁ దలఁపుమా•ప్రాగ్వర్తిగా నన్నెదన్. ౫౯౫

భ్రాతృభావంబుమైన్=అన్నయను తలంపుచేత, భవత్తనూజునకు=నీ కుమారునందు, అనురక్తుండన్=అనురాగము గలవాఁడను, సత్య=సత్యముమీఁదను, అభీష్టదాన = ఇష్టదేవతార్చనమీఁదను నే నిదివఱకుఁజేసిన దానములమీఁదను, ఆశుగాసన రాజంబులన్ = శ్రేష్ఠమైన విండ్లమీఁదను, బాసన్=ప్రమాణమును, సంజ్వల ద్వహ్నినేన్ = మండుచున్న మంటయందునైనను, వనినేన్ = అడవి యందునైనను, ప్రాగ్వర్తిగాన్=ముందు నడచువానిఁగా-

తాత్పర్యము

ఇట్లు శ్రీరామునితోఁ జెప్పి కౌసల్యనుజూచి దేవీ! నాకన్నతల్లి నాకెట్టిదో నీవు నాకట్టిదానవే. కావునఁ గన్నతల్లివని చెప్పుచున్నాను గాని సవతితల్లివని చెప్పరాలేదు. నామనస్సు విధము స్పష్టముగాఁ జెప్పెదను వినుము.అన్నయను తలంపుతో నీకొడుకునందు ననురాగము గలవాఁడనే కాని యితరాలోచనములు నితరలాభములు దలఁచికాదు. శ్రీరామునకు భరతునివలెఁ నీవును సవతితల్లి కొడుకవేకదా? చాటుగనుండి వాఁడింతచేసెను. ఎదురుగనుండి నీవెంత చేయ నున్నావో ఎవరెఱుఁగు రందువా. సత్యముమీఁదను ఇష్టదేవతార్చనముమీఁదను, నేను బట్టెడు శ్రేష్ఠమైన విండ్లమీఁదను ప్రమాణము చేసెదను. శ్రీరాముఁడు మండెడు మంటలో దుముక సిద్ధపడినను అడవిలోఁ బ్రవేశింప సిద్ధపడినను నన్నాయనకు ముందుగా నడుచువానిఁగా నెంచుము.

కం॥ సూర్యుఁడు చీఁకటివలెనే, వీర్యంబున నీదుమనము•వేఁకి వెలార్తున్
గార్యం బిది చూడుఁడు నా, శౌర్యం బోజనని! రామ•చంద్రుఁడు నీవున్.

వేఁకి = తాపము, పెలార్తున్ = పోఁగొట్టుదును.

తాత్పర్యము

నీ వింతటి వ్యసనాంధకారములో మునిఁగి పరితాపపడుచున్న దానవుకదా. నీ పరితాపమును సూర్యుఁడు చీఁకటిని పెరియించునట్లు రూపుమాపెదను. తల్లి యిది యిపుడు చేయఁదగిన కార్యము. ఈవిషయమున నేనెట్లు వర్తింతునో నీవు రామచంద్రుఁ డూరక చూచుచుండుఁడు. అనుజ్ఞమాత్ర మిండు.

ఉ॥ అన్నను భ్రాతృభక్తి నతఁ • డాడినయానుడు లాలకించి యా
పన్నదశాప్తి కేడ్చుచును • బంకజలోచన పుత్రుఁ జూచి యో
యన్న! భవత్సహోదరుఁ డె • యాడినపల్కుల నాలకించి తే
పన్నుగ నీకుఁ జిత్త మెటు•వచ్చు నటుల్ ఘటియింపు పుత్రకా! ౨౯౪

ఆపన్నదశాప్తికిన్=విపద్దశ సంప్రాప్తించినందులకు,భవత్సహోదరుఁడె= నీతమ్ముఁడె.

తాత్పర్యము

అన్నవిషయమై కేవల భ్రాతృభక్తిచే లక్ష్మణుఁడు చెప్పినమాటల విని యెంత కష్టకాలమువచ్చెరా దైవమా కన్న కొడుకు కడవికిఁబోవఁజూతునా? కొడుకులు తండ్రిని వధింపఁజూతునా? ఒకప్రక్క కొడుకు ఒకప్రక్క మగఁడు.ఇద్దఱు రెండు కన్నులు- ఏకన్ను పోఁగొట్టుకొన నంగీకరింతును. అని యేమి చెప్పుటకుఁ దోఁపక కౌసల్య శ్రీరామునిఁజూచి యన్నా నీతమ్ముఁడేమి చెప్పుచున్నాఁడో వింటివిగదా. నేనేమియుఁ జెప్పఁజాలకయున్నాను. నీకు నేది ధర్మమని తోఁచునో యదిచేయుము. అడవులకుఁ బోవుటబాగని తోఁచినచట్లే చేయుము. పరాక్రమమున రాజ్యము సంపాదింపఁజూచినచట్లే చేయుము.

ఇట్టి మాట ధర్మాత్ముని తల్లియగు ధర్మాత్మురాలు చెప్పెనుగాని కైకవంటి యర్థదాసియయి యుండినఁ దండ్రిని వధించి రాజ్యమును గొనుమని చెప్పి యుండును. దుర్యోధనుఁడు యుద్ధమందుఁ దనకు జయముగలుగ దీవింపుమని తల్లియగు గాంధారి నడుగఁగొడు కధర్మమందున్నాఁడని తెలిసియుఁ బుత్రాభిమానంబున నీవే గెలువుమనక ధర్మము జయించునుగాక యని దీవించెను. ఎంతటి విపత్తియందును ధర్మాత్ములు ధర్మము తప్పరు.

కవిరాజ విరాజితము.

మనమున నాసపతాలు వచించిన•మాటను బట్టి గృహంబున న
న్ననయము దుఃఖములందు మునుంగు మ•టంటయు నీకును ధర్మమెకో?
ఘనమతి! ధర్మము నల్పఁగ నీయెడఁ • గల్గినచోఁ బరిచర్యల నన్
దనుపఁగ రాదొకొ, తల్లిని గొల్చుట • ధర్మము గాదె తనూజులకున్? ౨౯౫

అనయము=సర్వదా, ఘనమతి=ధర్మమందు గొప్ప మనస్సుగలవాఁడా, పరిచర్యలన్=సేవలచే, తనుపఁగన్=తృప్తిపడఁజేయ, తనూజులకున్=కుమారులకు, కవిరాజ విరాజితము నగణముమీఁద నాలుజగణములు నొక్కగురువు. ౧౩వ యింట యతి ఇందలి యతి గురించి యిదివఱకే వ్రాయబడెను.

తాత్పర్యము

నిన్నాజ్ఞాపించినవాఁడు తండ్రిగాఁడు. నాకు సహజవిరోధియగు నాసవతి. అది చెప్పినమాటను మనస్సునన్నిలిపి కన్నతల్లినగు నన్ను శాశ్వతదుఃఖములందు నీవు ముంచుగుమనుట నీకు ధర్మమా అర్థము నాకుఁ బరమార్థముగాదు. ధర్మమేయందువా రాజ్యములేకున్నఁబోనీ నాశుశ్రూషచేయుచు నాయింటనుండుము. కొడుకులకు మాతృసేవ ధర్మముగాదా.

మత్తకోకిలము. నిండుభక్తి భజించి తల్లిని•నిల్చి యింటనె మున్ను వి
ప్రుండు కాశ్యపుఁ డన్మనీశుఁడు•పొందఁడే సురలోకమున్,
దండిగౌరవమందు జేనికిఁ•దక్కు వౌనొకొ తల్లి? నీ
వుండు మిందుఁ, బ్రవాసి వౌటకు•నొల్ల నాజ్ఞనొసంగగన్. ౨౯౯

తల్లి సేవచేయుట పరమధర్మమని దృష్టాంతము చెప్పుచున్నది. కాశ్యపుఁడు కశ్యపవంశమునఁ బుట్టినవాఁడు, ప్రవాసివి = దేశాంతరవాసివి, మత్తకోకిల-౧౧వ యక్షరము. యతిరస జజభరలు గణములు.

తాత్పర్యము

కశ్యపు వంశమునఁబుట్టిన యొక బ్రాహ్మణుఁడు పూర్వము తక్కినవారివలె నడవులకుఁబోయి యే తపస్సుచేయక యింటనేయుండి మాతృశుశ్రూషచేసి దాని వలననే-తక్కినవారు తపస్సుచే సాధించెడి స్వర్గమును సాధించెను. విశేషగౌరవమందు రాజునకంటెఁ తండ్రికంటెఁ దల్లి తక్కువయగునా. పితుర్హ్యేమాతాగరీయసీ యను వాక్యము వినలేదా. కాఁబట్టి నీతండ్రియాజ్ఞకంటె నాయాజ్ఞ తక్కువయినదికాదు- నీ వింటనే యుండుమని నేనాజ్ఞ చేసెదను. ఊరువిడిచిపోవ నేననుజ్ఞనీయను.

మత్తకోకిలము. నిన్నుఁ బాసి వసింపఁగల్గిన•నిశ్చయం బిది పుత్రకా!
యన్న మేటికి నీర మేటికిఁ• బ్రాణ మేటికి సౌఖ్య మం
చెన్న నేటికి? నీవు గల్గిన • నిన్ని యున్నటు దోఁచుఁగా,
తిన్నచో నునుఁబచ్చికైన ము•దిం బ్రియం బొనరించు రా!

తాత్పర్యము ౩౦౦

నిన్ను విడిచి నేనింట నుండుటయే కలిగనేని కుమారాయొకటి నిశ్చయము. అవల నాకన్నమేల? నీళ్ళేల ? తుదకుఁ బ్రాణమైననేల ? ఇఁక సుఖము మాట చెప్పనేల? రామచంద్రా నీవు నాయొద్దనుంటివా యివన్నియు లేకున్నను

నున్న యట్టులే ప్రాణము సంతోషించును. లేక పచ్చిక దిన్ననునాకెంతో సంతోషముగ నుండును.

కం॥ నే నింట నేడ్చు చుండఁగ, గానలకున్ నీవు పోవఁ గాంక్షించెదవే
నే నొల్లను జీవింపఁగఁ, బూనుదుఁ బ్రాయోపవేశ మున్ నాతనయా. ౬౧

ప్రాయోపవేశము=మరణించువఱకుఁగూడు నీళ్ళు వదలి యొకచోఁ బడియుండుట, అనశనవ్రతము.

తాత్పర్యము

రామచంద్రా! నీవింటిలో నేడ్చుచుండుమని నీవు మాత్ర మడవులకుఁ బోవఁ గోరెదవా నేను బ్రదుక నిష్టపడను. ఇప్పుడే ప్రాయోపవేశము చేసెదను.

కం॥ నను వీడనాడి కొడుకా! వనములకుం జనెద వేని వచ్చును జుమ్మీ
ఘననిరయ మధర్మంబున, వననిధికిన్ బ్రహ్మహత్య వచ్చినకరణిన్. ౬౨

బ్రహ్మహత్య=బ్రాహ్మణుని దుఃఖపెట్టుటవలన వచ్చుపాపము. సముద్రమునకు వచ్చిన బ్రహ్మహత్య యేమనః, పిప్పలాదుఁడను ఋషి సముద్రతీరమునఁగూర్చుండి తపస్సుచేయుచుండ సముద్రుఁడాయన తపస్సు సాగనీయక యాయన వస్తువులను దనలోనికిఁ దీసికొనుచు బాధించెను. దానిపై నాయన కోపించి సముద్రుని బాధింప శక్తినొకటి పంపెను. అది సముద్రుని వేధించుచుండెను. సముద్రస్నానము చేయువారలీ దోషము తమకుఁ దగులకుండుటకై యొకటియో రెండో రాలు సముద్రమున వైచుచు

శ్లో॥ పిప్పిలాదసముత్పన్నే, కృత్యేలోకభయంకరి
పాషాణాంతే మయాదత్త, మాహారార్థం ప్రకల్పితమ్.

అను శ్లోకమును బఠింతురు. కావున సముద్ర విషయమున బ్రహ్మహత్య యనఁగాఁబిప్పలాదుని బాధించుటచే సముద్రమునకు శక్తివలనఁ గలిగిన బాధయని యర్థము అట్టులే నీవడవికిఁ బోయితివా నన్ను బాధించిన దోషము నీకుఁ గలుగును అని భావము.

2. అధర్మమునఁ దల్లిని దుఃఖమున ముంచి దానివలన బాధకలుగునట్లు చేయుటచే సంభవించిన పాపముచేత బ్రహ్మహత్యవలనఁ గలుగు నరకబాధవంటి బాధకలుగునని యర్థమని కొందఱందురు.

తాత్పర్యము

నన్ను వదలి నీవు వనమునకుఁబోయితివా రామచంద్రా యధర్మమున సముద్రమునకు బ్రహ్మహత్యవచ్చినట్లునీకును మాతృహత్యా దోషమువచ్చును.

కం॥ ఇటు విలపించుచు నిజకట, తటముల పొష్పంబు లురలఁ దద్దయు దుఃఖ
త్రుటితహృదయ యగుతల్లికిఁ, బటుగతి రాముండు ధర్మ పద్ధతిఁబలికెన్

నిజకట తటములన్=తనచెక్కిళ్ళమీదఁ, బాష్పంబులు=కన్నీరు, ఉరలన్ రాలుచుండఁగా, తద్దయున్=మిక్కిలి, దుఃఖత్రుటితహృదయ = దుఃఖముచేఁ జీల్పఁబడిన హృదయముగలది.

తాత్పర్యము

ఈప్రకారము కన్నీరు చెక్కిళ్ళపై రాలుచుండ దుఃఖాతిశయముచేగుండె చెదరి యేడ్చుచుండ తల్లికి ధర్మమార్గవిధమును శ్రీరాముఁ డిట్లుచెప్పెను.

—♦ శ్రీరాముఁడు కౌసల్యాలక్ష్మణుల నూరార్చుట ♦—

కం॥ తల్లీ: జనకుని వాక్యము, నుల్లంఘింపఁగను శక్తి♦యున్నదె, నీవే
యుల్లమునఁ దలఁపు, మేగెదఁ,జల్లనిచూపులను జూడు♦సాఁగిలపడెదన్.
ఉల్లంఘింపన్=దాఁటుటకు, ఉల్లమునన్=మనస్సునందు. ౧౦౪

తాత్పర్యము

తల్లీ: పుత్రునకుఁ దల్లిదండ్రులిరువురు సమానపూజ్యులే అయినను ముందాజ్ఞాపించినవాఁడు తండ్రి అ వెనుకఁ దద్విరుద్ధముగ నాజ్ఞాపించుదానవు నీవు, ముందాజ్ఞాపించిన తండ్రివాక్యమును మీఱిపోవు శక్తి నామాట యటుండ నిమ్ము నీకైనఁ గలదా? నీవే యాలోచింపుము. కావున నన్ను నీమాట విన లేదని కోపింపకుము. నాక్షేమముఁగోరి చల్లనిచూపులఁజూడుము, సాష్టాంగ ముగ నమస్కరించెదను. పితురాజ్ఞా పరోధర్మః, స్వధర్మో మాతృరక్షణమ్.అను ప్రమాణము చొప్పునఁ దండ్రియాజ్ఞ పరమధర్మము.

కం॥ జనకుని వాక్యముఁ బాటిగఁ,గొని ప్రతి యగుగండుమౌని♦గూల్పఁడెగోవున్
జననీ! ధర్మము సూక్ష్మతఁ,గనికాదె యొనర్చె?దానఁ♦గలిగెనె యఘముల్?
పాటిగన్=ధర్మముగ, ప్రతి=పితృవాక్యపరిపాలనదీక్ష, గలవాఁడు.

తాత్పర్యము

తండ్రిమాటనుబట్టి యితరులకు బాధకలిగింపవచ్చునా యంటివి, తండ్రి మాటపాటించిగదా కండు మౌని గోవధముచేసెను. పితృవాక్యపరిపాలనమున గోవథరాదనికాదా ధర్మరహస్య మాలోచించి యాయన యాపని చేసెను. గోవధము చేయరాదని పితృవాక్య ముల్లంఘించియుండిన నరకమునకుఁ బోయి యుండునుగదా.

చం॥ ఇతరులమాట లేల జన♦నీ! విను మాకులమందు మున్ సగ
తృతి ఖననంబుఁ జేసినన్పృ♦పాలురు సాగరు లుర్విఁ ద్రవ్వ చో
మతిఁ దమతండ్రిమాట గొని♦మాననిశూరత భూతకోటులన్
హత మొనరింప రొక్కొ తమ♦ప్రాణవినాశము నోర్చి యేనియున్. ౧౦౬

సరిత్పతి=నదులకుఁబతియగు సముద్రుని, ఖననంబు=త్రవ్వుట, సాగరులు=సగరపుత్రులు.

తాత్పర్యము

ఇతరుల ముచ్చటలేలగాని మావంశమందే పూర్వము సగరచక్రవర్తి కుమారులు సముద్రము త్రవ్వబోటఁ దండ్రిమాటఁబట్టి దయలేక యనేక జీవకోటులను దమకు రాఁగల ప్రాణాపాయమునకు భయపడక హింసించిరి.

కం॥ తండ్రి వచించె నటంచును, దీండ్రించుకుఠారధారఁ•దెగ వ్రేయఁడొకో
గండ్రలుగఁ గన్నతల్లిని, వేండ్రంబుగ భార్గవుండు•వినమా దీనన్. ౨౦౪

తండ్రిమాటలనుబట్టి తల్లినే హింసించినవారు గలరని చెప్పుచున్నాఁడు.

దీండ్రించు=మండునట్లు ప్రకాశించు, కుఠారధార=గండ్రగొడ్డలి వాదరచేత, గండ్రలుగన్=తునుకలుగ, వేండ్రంబుగన్, తీక్ష్ణముగ, భార్గవుఁడు=పరశురాముఁడు.

తాత్పర్యము

తండ్రి యాజ్ఞాపించెనని కదా పరశురాముఁడు తనవదునైన గండ్రగొడ్డలిచేత దనతల్లి శిరమును ఖండించెను. ఇది మనము విన్నదేకదా.ఇట్లుండఁ దల్లికి దుఃఖమని తండ్రిమాట దాఁటవచ్చునా.

కం॥ ఎందఱొ మహానుభావులు, బృందారకసము లొనర్చి•పితృవాక్యంబున్
జెందిరి యశంబు, నే నే, చందంబునఁ జేయకుందు•జననీ! చెపుమా.౨౦౫

బృందారకసములు=దేవతలతో సమానులు.

తాత్పర్యము

తల్లీ! దేవతలతో సమానులైన యెందఱో మహానుభావులు తండ్రివాక్యమును బాలించి కీర్తి సంపన్నులైరి, ధర్మశాస్త్రము శిష్టాచారము నిట్లుండతండ్రి యాజ్ఞ నెఱవేర్పకుందును.

సీ॥ ఏనొకండనె కాను•హితగతిఁ బితృవాక్య,పాలకుల్ పెక్కండ్రు•వసుధఁగలరు
నే నపూర్వపుధర్మ•మూని నీ కిటు ప్రతి,కూలుండ నై పోవు•కోర్కి లేదు
పూర్వులు పెంపుమైఁ•బోయినత్రోవన, యరిగెదఁ గాని యన్యం•బుగాదు
కావున జనకోక్తి•కార్యంబు, జనకుని,వాక్యంబు వినఁ కున్నఁ•బాప మొదవు
తే॥ నిశ్చయంబుగఁ జనుదు వ•నీనివాస,
మునకుఁ జింతింప వలవ దో•పుణ్యచరిత
నన్నుఁ గరుణార్ద్ర దృగ్రస•స్నాతుఁ జేసి,
కాన కంపుము దయచేసి•కనరువాసి ౨౦౬

హితగతిన్=హితమైనరీతి, పితృవాక్యపాలకుల్=తండ్రివాక్యమును బరిపాలించినవారు, అపూర్వధర్మము,ప్రతికూలుండనై=విరుద్ధభావముగలవాఁడనై,

వనీ నివాసమునకున్=అడవులందు వసించుటకు, కరుణార్ద్రిదృక్ రసస్నాతున్=దయారసముచేఁ దడిసిన చూపులను నీటియందు స్నానముచేసిన వానినిఁగా, కనరు=కోపము, పాసి=వదలి, పెంపుమై

అభ్యుదయముగోరి పూర్వులు చేసినవన్నియు మనము చేయవచ్చునా? చంద్రునివలె గురుద్రోహము చేయవచ్చునా? యందువేమో, చంద్రుఁడభ్యుదయము గోరిగాదు. పిత్రాజ్ఞచేతనుగాదు చెడ్డకార్యముఁచేయుట, కామాతురతఁ గావున నది సరిగాదు, మాతృవధాదులు దృష్టాంతముగాఁ జెప్పెదవు, అది సాహసకార్యమని యనుష్ఠేయముకాదని శాస్త్రము "దృష్టోధర్మవ్యతిక్రమస్సాహసంచ పూర్వేషా"మ్మని వారివాక్యముల నిందింపలేదా, యందురేని యిచ్చట శాస్త్రాభిప్రాయము వ్యాఖ్యాతలయభిప్రాయముగాదు. ఈ శ్లోకమునందు నిందింపఁబడిన సాహసము తండ్రియాజ్ఞలేక చేసిన కార్యముగాని జనకాజ్ఞచేఁ జేసినది కాదు. ఇది యాలోచింపక వ్యాఖ్యాతలు వ్రాసినదానిని సరియని గ్రహింపరాదని గోవిందరాజీయము.

"పితుశ్శతగుణంమాతా, గౌరవేణాతిరిచ్యతే" తండ్రికంటెఁ దల్లినూఱంతలు గౌరవమందెక్కువ యనుశాస్త్రవాక్యము శుశ్రూషవిషయమే కాని యాజ్ఞావిషయముగాదు, ఆజ్ఞావిషయమునఁ దండ్రిగొప్పయని భావింపవలెను. "మాతా భస్త్రాపితుః పుత్రోయస్మాజ్జతస్స ఏవస" యను భారతవాక్య మీయర్థమునే సాధించుచున్నది.

పూర్వులుపోయిన త్రోవన యరిగెదన్.

యేనాస్యపితరో యాతాః। యేనయాతాపితామహాః

తేన యాయాత్సతాంమార్గం। తేనగచ్ఛన్నరిష్యతే॥ మను. ౪-౧౭౮

తండ్రులు తాతలేమార్గమునఁ బోయిరో యట్టిసాధుమార్గమునఁబోవువాఁడు క్షయింపఁడు.

సాధుమార్గమనుటచేఁ దండ్రితాతలు దొంగతనము జంకుతనముచేసినఁ దాను జేయరాదని భావము.

తాత్పర్యము

తల్లి పితృవాక్య పరిపాలనము త్తమ ధర్మమని యెంచువాఁడను నేనొకఁడనేకాను, అది హితమైన మార్గమని తలఁచి చేసినవారనేకులు గలరు, ఇంతవఱకు నాచారమందు లేని క్రొత్తధర్మ మవలంభింపఁబూని నిన్ను ధిక్కరింపలేదు, పూర్వులు నడచిన మార్గముననే నేను నడచుచున్నానుగాని వేఱొకత్రోవఁ బూనలేదు. కావున జనకునిమాట పాలించుటే తగినపని, తండ్రిమాట వినకుండినఁ బాపము సంభవించును, కాఁబట్టి నిశ్చయముగ నడవులకుఁ బోదును, నీవు పుణ్యాత్మురాలవు నాకుఁ బాపమువచ్చు నని చెప్పకుము, వనవాసదీక్షకై

స్నానము కావలసియున్నది, కావున నీ దయార్ద్రదృష్టులను తీర్థముచే నన్ను స్నానము చేయింపుము. అడవికిఁ బోవ ననుజ్ఞయిమ్ము, నాయందు దయ యుంచుము.

కం॥ నిర్మలమతిఁ దల్లికి నిటు, శర్మంబుగఁ బలికి రామ•చంద్రుఁడు శశ్వ
ద్ధర్మ విదగ్రేసరుఁడును, ధర్మభృదగ్రేసరుండు•దమ్ముని కనియెన్. ౬౧౦

ధర్మంబుగన్=క్షేమముగలుగ, శశ్వద్ధర్మవిదుఁడు సనాతనధర్మము దెలిసినవారిలో వారిలో శ్రేష్ఠుఁడు ధర్మభృదగ్రేసరుండు=విల్లుపట్టినవారిలో శ్రేష్ఠుఁడు, శస్త్రపాండిత్యము శాస్త్రపాండిత్యము గలవాఁడని భావము.

తాత్పర్యము

నిర్మలమగు మనస్సుతోఁ తల్లికి క్షేమకరముగఁబలికి యామె సందేహములు దీర్చి సనాతనధర్మజ్ఞానమందును విలువిద్యయందును శ్రేష్ఠుఁడగు లక్ష్మణునితో నాయనను సమాధానపఱుపఁగోరి యిట్లనెను.

లక్ష్మణువాక్యములు రాజధర్మము ననుసరించి చెప్పఁబడినవి కావున నవి యధర్మములని చెప్పరాదు, అయినను రాజనీతియంతయు ధర్మముగాదు, ధర్మమంతయు రాజనీతియగును ధర్మముచే సాధింపలేనివారు రాజనీతి ననుసరింతురు. ధర్మైకనిష్ఠులు రాజనీతి ననుసరింపరు, కేవల ధర్మ మేయనుష్ఠింతురు ఈ తెగలోఁజేరినవాఁడు శ్రీరామచంద్రుఁడు, ఆతెగవారి యభిప్రాయప్రకారము వాదించువాఁడు లక్ష్మణుఁడు. రామలక్ష్మణసంవాదమం దీవిషయము జ్ఞప్తియందుంచుకొనవలెను.

లక్ష్మణుఁ డన్న దుఃఖముపడుట సహింపలేక యావాదము చేసెనుగాని ధర్మద్వేషబుద్ధినిగాదు.

ఉ॥ తమ్ముఁడ లక్ష్మణా! విను స•తంబుగ నాపయి నీకు స్నేహమున్
ముమ్మర మౌటయున్ భవద•మోఘపరాక్రమసత్త్వ శౌర్య తే
జమ్ములు, నేరమిన్ జనని•చాలఁ దపించు టెఱుంగనోటు, స
త్యమ్ముశమమ్మునుందెలియు•ధన్యుఁడ వీవును నిట్లుపల్కుదే? ౬౧౧

సతంబుగన్=శాశ్వతముగ, ముమ్మరము=అధికము, భవత్=నీయొక్క, అమోఘ=వ్యర్థముకాని సత్త్వశౌర్యతేజమ్ములు=బలము, శూరత్వము తేజస్సు, నేరమిన్=అజ్ఞానముచే, ఎఱుంగనోటు=ఎఱుంగనాయేమి?

తాత్పర్యము

తమ్ముఁడా! లక్ష్మణా నీకు నాపై నమితమై స్థిరమైన స్నేహముండుటయు, నీ యమోఘబల పరాక్రమ తేజస్సులు, అజ్ఞానముచేఁ బుత్రమోహమ్మునఁ దల్లి దుఃఖించుట, నే నెఱుఁగనా? ఆమె స్త్రీ. కేవలవాత్సల్యదృష్టినే చూచినది. నీవు సత్యము శమము దెలిసినవాఁడవు. నీవుకూడ నామెవలెనే యిట్లు బలుకవచ్చునా?

కం॥ నీ విటుపలికిన జననికి, భావంబున మీకు దుఃఖ•పా టటుగానన్
గావింపకు మయ్యా నీ, వీవిధసంభాషణములు•హితమతి వగుచున్. ౬౧౦

తాత్పర్యము

తమ్ముఁడా: నీ వీ ప్రకారము పలికిన మీ యభిప్రాయమే సరియనియు, నా యభిప్రాయము తప్పనియు, నేను దెలియకయో, మూర్ఖత్వము చేతనో, యిట్లు చేయుచున్నానని యామెతలఁచి మఱింత దుఃఖింపసాగును. నా మేలు కోరినవాఁడవై తివా నీ విట్లు మాటలాడకుము?

కం॥ ధర్మమె పర మీజగతిని, ధర్మమె సత్యంబునకు ని•ధానం బగుటన్
ధర్మోద్ధ జనకవాక్యము. ధర్మంబా తప్పఁద్రోయ•ద త్త్వజ్ఞులకున్. ౬౧౩

ఈజగతిని=ఈలోకమందు, ధర్మమే పరము=ధర్మమేశ్రేష్ఠమైనది, నిధానము=స్థానము, ధర్మోద్ధ=ధర్మముచేఁ బ్రకాశించు తత్త్వజ్ఞులకున్ = వాస్తవ జ్ఞానులకు.

తాత్పర్యము

నాయనా: ధర్మార్థ కామ మోక్షములలో మొదటిదే ప్రధానము, అది విడిచినఁ దక్కిన మూఁడు లేవు, కావున మొదటిది మొదటిదే, సత్యమునకు ధర్మమే స్థానము, ఏ ధర్మమైనను సత్యమునందుఁ బర్యవసింపవలయును, సత్యము లేక ధర్మములేదు. కాఁబట్టి యారెంటికి నవినాభావ సంబంధము కలదు, కావున ధర్మముతోఁగూడిన జనకుని వాక్యమును దప్పఁద్రోయఁ దత్త్వ జ్ఞానులకుఁదగునా? అది యెవఁడైనఁ బామరుఁడు చేయఁదగిన కార్యముగదా

కం॥ జనకునివాక్యం బైనను, జననీ వాక్యంబునైన•ష్మొబుధునుడి యొ
నఘజలిపెదనని మఱి వృథ, చనఁ జేయఁగఁ దగదుధర్మ•శాలులకెందున్.

తాత్పర్యము ౬౧౪

లక్ష్మణా: తండ్రిమాటగాని తల్లిమాటగాని బ్రాహ్మణవాక్యముగాని ముందు చేసెదనని చెప్పి మరలఁదప్పుట ధర్మబుద్ధుల లక్షణముగాదు.

చం॥ పితృవచనానుసారముగఁ•బిన్నసవిత్రియు నాన తిచ్చె నేఁ
బ్రతిన యొనర్చినాఁడ నలు•పం దదభీష్టము దీల తప్పుచున్,
మతిని ననార్య మౌనదయు•మార్గము క్షత్రియధర్మ మద్ది న
మ్మతిఁగనఁ బోకు, క్రౌర్యమును•మానుము, మన్మత మూనియుండుమీ.

పితృవచననానుసారముగన్=తండ్రిమాట ననుసరించి, పిన్నసవిత్రి=పిన్నతల్లి, ప్రతిన=ప్రతిజ్ఞ, అనార్యమౌ=సాధుసమ్మతముగానిదగు.

తాత్పర్యము

సౌమిత్రీ: తండ్రిమాట ననుసరించి పిన్నతల్లి చెప్పెను గాని యాయన మాట నతిక్రమించి చెప్పలేదుగదా, చెప్పినది యెవతె? దేశములోనుండు నెవ్వ

తెయోగాదు. మనపినతల్లి, వారు చెప్పుటమాత్రమేకాదు. వారియిష్టప్రకారము చేసెదనని నేను బ్రతిజ్ఞ చేసినాఁడను. అది తప్పుదునా? నీవు క్షత్రియనీతి యనుసరించి మాటలాడుచున్నావు, అది దయాహీనమైన మార్గము, అది అర్థము నిమిత్తమెంత ఘోరకార్యమైన సమ్మతించునది, దానిని నీవు గొప్పగాఁ జూడవలదు, కేవల సత్యమాధారముగాఁ గల నా ధర్మమతమును నవలంబింపుము.

కం॥ కనికరమున నిటు తమ్మున, కని తల్లిం జూచి యామె•యంఘ్రిద్వయి పై
 వినయనమితోత్తమాంగం,బును రాముఁడు నిల్పిపల్కెఁ•బుష్కలభక్తిన్.

కనికరమ్మునన్=దయచే, అంఘ్రిద్వయి=రెండుపాదములు, వినయ=అణఁకువచే, నమిత=వంపఁబడిన, ఉత్తమాంగంబును = శిరమును, పుష్కలభక్తిన్=నిండుభక్తిని.

### తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి తమ్మునికి దయచే నిటు చెప్పితల్లినిజూఁచియామె రెండు పాదములపై శిరస్సును నణఁకువతో వంచియుంచి నిండుభక్తితో నిట్లనియె.

శా॥ తల్లీ! నాకు ననుజ్ఞ నిమ్మిపుడు కాం•తారప్రవాసార్థమై,
 పెల్లాడం గన కమ్మ, యొట్టిడుదు దే•వీ! నాదుప్రాణంబు పైఁ,
 దెల్లం బైనకృపాకటాక్షమునన్•దీవించి స్వస్త్యాదికం
 బుల్లం బార ఘటింపుమీ, చెలఁగుమీ•సోత్సాహచిత్తంబునన్. ౬౧౪

కాంతారప్రవాసార్థమై=అడవికిఁ బ్రయాణమైపోయి యందు నివసించు నిమిత్తము, పెల్లాడన్=పెల్లు=విశేషము, ఆడన్=మాటలాడన్, కనకు=చూడకు, కనకుము+అమ్మ=కనకమ్మ, వ్యతిరేకమధ్యమపురుషైకవచనంబున కెల్ల యెడల లోపంబు విభాషనగు, సు, వ్యా, సూ, సంధి ౩౧ తెల్లంబు=స్పష్టము, సందేహము లేనిది, స్వస్త్యాదికంబు=స్వస్తి మొదలైనవి, ఆరన్=కొఱఁతలేక.

### తాత్పర్యము

అమ్మా! ఇపుడు నేనడవులకుఁబోయి యందే వసింప నా కనుజ్ఞ నిమ్ము, విశేషించి విఘ్నవాక్యములు చెప్ప నాలోచింపకు, అట్లు చేసితివా నా ప్రాణము మీఁద నొట్టుపెట్టుదును, శంకలేని దయతోఁగూడిన నీ కడగంటి చూపులచేనన్ను దీవించి ప్రయాణము పోవువారికిఁ జేయవలసిన స్వస్తివాచనము మొదలయినవి కొఱఁతలేకుండ నుత్సాహముతోఁ జేయుము.

కం॥ జననీ! ప్రతిజ్ఞ దీఱిచి, చనుదెంతు వనంబునుండి•చయ్యనఁ బురికిన్
 మునుపు యయాతియు స్వర్గం,
 బును విడి ధరనుండి మరలి•పోయిన మాడ్కిన్. ౬౧౫

తాత్పర్యము

తల్లీ! పూర్వము యయాతియను మహారాజు స్వర్గమునుండి భ్రష్టుఁడై భూలోకమునకు వచ్చి సాధుసాంగత్యబలమున మరల స్వర్గమునకుఁ బోయినట్లు నేనును బదునాలుగు సంవత్సరములు వనములయందుండి మునులసంగతిఁ బ్రతిజ్ఞదీర్చి మరలవచ్చెదను.

చం॥ వగపును లోనణంపుఁ పితృ•వాక్యము దీరిచి వేగ వచ్చెదన్
మగుడఁగఁ, గన్నతండ్రి యగు•మానవపాలునిమాటఁ బట్టఁ బొం
దగుఁ గద నేను నీవు వసు•ధాత్మజ లక్ష్మణుఁడున్ సుమిత్రయుం
దగుగతిఁ, దల్లిరో! ఘనస•నాతనధర్మవిధం బిదే కదా? ౬౯

వగపు=వ్యసనము.

తాత్పర్యము

అమ్మా! ఇట్లు గోలుగోలున నేడువకుము, అది నాకపశకునము, లోప లనే భ్రమింగుము. వెలుపల రానీయకుము, తండ్రివాక్యము పాలించి త్వరగా వచ్చెదను. దీని కేడువనేల? కన్నతండ్రియు రాజునగు వానిమాట ప్రకారము నేను మాత్రమేకాదు. నీవు సీత, లక్ష్మణుడు సుమిత్ర నడుచుకొనవలసినవారలే కదా. గొప్పదియగు సనాతన ధర్మమిదియేకదా, నన్నుఁ బొమ్మన్నట్లు మీలో నెవ్వరినైనఁ బొమ్మనినఁ బోకయుందురా?

కం॥ మానిచి సంభారంబుల, నూనతనొందించి దుఃఖ•ముల్లంఘన నా
కాననవాసంబునకున్, మానుగ సెల వీవుమ ధర్మమార్గముఁ గనుమా.

తాత్పర్యము ౭౦

జననీ: పట్టాభిషేకమునకై చేసిన యత్నము లెల్లవదలి మనస్సులోదుఃఖ మణఁచి నే నడవులందు వసింప మనఃపూర్వకముగ సెలవిమ్ము, ధర్మమునాలో చింపుము.

తే॥ వినుతధర్మ మవ్యగ్రం బ•విక్లబంబు,నైన తనయునిమాటల•నాలకించి
తల్లి ధర సోలి తెలివొంది•తనయుజూచి,దైన్యపాటున నిట్లను•దలఁకుమదిని.

వినుతధర్మంబు= స్తోత్రముచేయఁబడిన ధర్మముగలది, అవ్యగ్రంబు =కలఁతలేనిది, అవిక్లబము=దృఢనిశ్చయముతోఁగూడినది,తలఁకు = చలించు, భయపడు.

తాత్పర్యము

ఉత్తమ ధర్మమగుటచే నెట్టివానిను శ్లాఘింపఁదగినదియు కొంతధర్మము కొంత యధర్మముగా సంకీర్ణముగాకుండునదియు చేయుదమా వలదాయను

సందేహములు సజగుజలు కౌతుకులు లేక దృఢనిశ్చయముతోఁగూడినవియగు శ్రీరామచంద్రుని పలుకులను విని కౌసల్య మూర్ఛవోయి పడి తెలివితెచ్చుకొని దుఃఖముతోను భయముతోను గొడుకును జూచి యిట్లనియెను.

కం॥ కనుమా ధర్మముచేతను, దనయా! స్నేహంబుచేతఁ దండ్రికి సరి యా
   జనని గద, నేను వందురఁ, జనియెదె నను బాసి వనికి సమ్మతినీయన్.
   వందురన్=సంతాపింపఁగా. ౬౫౯

### తాత్పర్యము

ధర్మము చేతను, స్నేహముచేతను, దండ్రికిఁ దల్లి సమానురాలుగదా, నేను దుఃఖించుచుండఁగా నీవు పోవచ్చునా, నేను సమ్మతింపను.

ఈ ప్రకారము ధర్మస్నేహములచేఁ దల్లిదండ్రు లిరువురు సమానులై యుండ రామచంద్రమూర్తి "ఒట్టిడుదు దేవి నాదుప్రాణంబుపై" నా కాజ్ఞ యియ్యవేని నన్నుఁజంపినట్లేయని (౬౧౩-౫)యింత కఠినముగ నిర్బంధింప వచ్చునా? తల్లిని దండ్రిని నాచార్యుని నిర్బంధింపరాదుగదా. కావున శ్రీరామ చంద్రమూర్తి చర్య సరిగాదు, అని యాక్షేపము.

సమాధానము

శ్లో॥ మాతుః పితుర్గురూణాంచ, కార్యమే వానుశాసనమ్
   హింతవా వ్యహితం వాపి, నవిచార్య నరర్షభ॥ అనుశా.

తల్లి దండ్రి గురువు వీరియాజ్ఞప్రకారము నడువవలసినదే. అదిహితమా యహితమాయని విచారింపరాదు.

శ్లో॥ మాతాపిత్రోర్గురూణాంచ, పూజా బహుమతా మమ
   అత్రయుక్తోనరోలోకాన్, యశశ్చ మహదశ్నుతే॥
   యశ్చతే భ్యను జానీయుః, కర్మతాత సుపూజితాః
   ధర్మం ధర్మవిరుద్ధం వా, తత్కర్తవ్యం యుధిష్ఠర॥

తల్లిదండ్రుల గురుల పూజయే నాకు మిగుల సమ్మతము ఇట్టివాఁడిచ్చట ముక్తుఁడై లోకములను గొప్ప యశస్సు సంపాదించును. వారాజ్ఞాపించినది ధర్మము కాని యధర్మముకాని చేయదగినదే, ఈవాక్యములవలన నమువ్వురు సమానపూజ్యులని యేర్పడుచున్నది.

ఉపాధ్యాయాన్ దశాచార్యా, ఆచార్యాణాం శతం పితా
సహస్రంతు పితుర్మాతా, గౌరవేణాతిరిచ్యతే॥

పదుగు రుపాధ్యాయులకంటెఁ నాచార్యుఁడు, నూర్వు రాచార్యులకంటెఁ దండ్రియు వేవురు తండ్రులకంటెఁ దల్లియు హెచ్చు.

శ్లో॥ దౌగురూపురుషస్యేహ, పితామాతాచ సర్వదా,
   పితా గురుతర స్తావన్మాతా గురుతమా భవేత్॥

ఇందుఁ బురుషున కిరువురు గురువులు, వారు తండ్రి తల్లి, తండ్రి గురుతరుఁడు. తల్లి గురుతమ, కావునఁ దండ్రికంటెఁ దల్లియే హెచ్చు, మనువు.

శ్లో॥ పితౄన్ దశతుమాతైకా, సర్వాం వా పృథివీమపి
గురుత్వేనాభి భవతి, నాస్తిమాతా సమోగురుః॥ భార.

తల్లితో సమానుఁడగు గురువులేఁడని, దండ్రికంటెఁ దల్లియే పదంతలు శ్రేష్ఠయని యనేక వాక్యములుగలవు అంతియకాక "కాని పథమునఁ జనియెడి వాని గురునినైన దండింపవలయు"నని వాక్యములు గలవు. కాని తల్లిని దండింపు మని యొకవాక్యమైనలేదు. అంతియకాక.

పతితా గురవస్త్యాజ్యా, నతు మాతా కథంచన
గర్భధారణపోషాభ్యాం, తేన మాతా గరీయసీ॥

పతితుఁడైన తండ్రిని నాచార్యుని వదలవచ్చునుగాని పతితయైనను దల్లిని వదలరాదు. గర్భమందు ధరించుట పోషించుటచేఁ దల్లిగొప్పది.

ఇట్టి తల్లిమాట ననాదరణము చేయరాదనుట సత్యమే. అయినను విష్ణుపురాణంబున.

మాన్యః పితా సమస్తానాం, గురుణాం పరమో గురుః॥

అందఱు గురువులలో బరమగురువు కావునఁ దండ్రి పూజ్యుఁడు.

తయోరపి పితాశ్రేయాన్, బీజప్రాధాన్యదర్శనాత్॥

తల్లిదండ్రు లిరువురిలో బీజప్రాధాన్యమునుబట్టి తండ్రి శ్రేష్ఠుఁడు. అని భారతమోక్షధర్మ పర్వంబునను పురాణసముచ్చయమునందును గలదు.

"పితా పరం దైవతం" మానవులకుఁ దండ్రియే పరదైవతమని తల్లికంటె గొప్పవాఁడని పెద్దలు చెప్పుదురు.

అదియునుగాక "పితారక్షతికౌమారే, భర్తారక్షతి యౌవనే, పుత్రశ్చస్థవిరే భావే, నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి॥"

బాల్యమునఁ దండ్రి, యౌవన ప్రాప్తి మగఁడు. వార్ధకంబునఁ దనయుఁడు వనితలఁకు రక్షకులు గావున స్త్రీలకు స్వాతంత్ర్యము లేదని స్మృతి చెప్పుటచేఁ దల్లికిఁ దండ్రిని గాదని యాయన యాజ్ఞకు విరోధముగా నాజ్ఞాపించు నధికారము లేదు.

శ్రీరామచంద్రమూర్తి యీ యభిప్రాయముగలవాఁడే ఎట్లన :

కం॥ తనువు నొసంగిన జననీ జనకులకంటెను సుబుద్ధి సంపదఁగూర్పన్
గనుటను నాచార్యుఁడె గురుఁడను పెనుపుం గాంచి శ్రేష్ఠుఁడయ్యెను రామా.

కం॥ ధరడీతన యాధవ నీ,గురువునకున్ గురుఁడ నేను గురుఁడన్ నీకున్
వరమతి నా నుడి వినినను, జరఁగదు సన్మార్గగతికి భంగము తండ్రీ!

అని చిత్రకూటమందు వసిష్ఠుఁడు చెప్పఁగా రామచంద్రమూర్తి నీకంటె దల్లిదండ్రులే శ్రేష్ఠులు. అందుఁ దండ్రి యాజ్ఞచేసినది కాదని నేన ట్లనఁగలను." అనెను. అట్లైనఁ దల్లి గొప్పదను వాక్యముల గతియేమి యందురా.

"మాతుర్భరణమాత్రేణ, ప్రీతిః స్నేహః పితుః ప్రజా? (భారతంబున).
పితురాజ్ఞా పరోధర్మః, స్వధర్మో మాతృరక్షణమ్॥

తండ్రియాజ్ఞ నెఱవేర్చుట, తల్లిని రక్షించుట ఇవి పుత్రునకు స్వధర్మము అని యేర్పడెను. తండ్రికంటెఁ దల్లికే యెక్కువ శుశ్రూష చేయవలెను. ఆమెను గౌరవింపవలెను. పోషింపవలయును. ఆజ్ఞయందుఁ దండ్రిచెప్పినట్టు వర్తింపవలెను. అని యేర్పడుచున్నది. జీవతో వాక్యకరణా త్తనికలదుకదా. భర్త యాజ్ఞకువిరోధముగా భార్య యాజ్ఞాపింపరాదుకదా. కొడుకునకుఁ దల్లి గుర్వియైన నామెకు నామెభర్త గురువుకదా. తనగురునాజ్ఞకు విరోధముగఁ దానెటులాజ్ఞాపింపఁగలదు. కావునఁ గౌసల్యమాట ననాదరించుట శ్రీరామునకు ననుచితముగాదు.

శా॥ అన్నా! నీ వెడఁ బాయ నేమిటికిరా ప్రాణంబు లీబొందిఁ! సం
పన్నం బౌపరలోక మేల? స్వధయేఁ ప్రాప్తించెఁబో యేల? యా
సన్నంబైనను నేటికిన్ సుధ? నిమేషం బైన నాయొద్ద నీ
వున్నన్ శ్రేయము జీవసంచయము లెన్నో యుంట కిం చేద్భునన్. ౯-౫౩

బొందిన్=దేహమునందు, స్వధ=పితృదేవతల యాహారము, సుధ=అమృతము, ఇది దేవతల యాహారము.

తాత్పర్యము

అన్నా నీవు వదలిపెట్టిపోయితివా. అవల ఈదేహములోఁ బ్రాణములుండియు నేమిరా ప్రయోజనము?కావున జీవించియువ్యర్థమే. ఈలోకముకాకున్నఁ బరలోకమే లభించెననుకో. ఏమిప్రయోజనము?అదిగాకున్నఁ బితృలోకమున కేగనక్కడ స్వధ సంప్రాప్తమయ్యెననుకో, ఏమిలాభము? స్వర్గము సమీపింపఁగాఁ నచట సుధయే లభించెననుకో ప్రయోజనముకలదా? అదిగాకుండిన నంతకుఁబై లోకములో బ్రహ్మలోకము వఱకునుండు వారందఱు లాభించివారితో నాలోకసుఖము లనుభవింపవలసి వచ్చెననుకో. వీని యన్నింటికంటెను నీవొక్కఁడవు నాయొద్దనుండుటే శ్రేయస్కరము.

ఆ బ్రహ్మభవనాల్లోకాః, పునరావర్తినోర్జున
మాంప్రాప్యతు కౌంతేయ, పునర్జన్మ నవిద్యతే॥ భ.గీ.

అన్నట్లు పై యేడులోకములలోఁ గలుగు సుఖములన్ని యనుభవించుటకంటె భగవంతు నొక్కని నాశ్రయించుట శ్రేయస్కరము. నాయొద్ద నీవున్నన్ అనుట సాయుజ్యమును సూచించుచున్నది. నీయొద్ద నేనున్న ననక

నాయొద్ద నీవున్నవనుటచే మన ప్రయత్నముచే భగవత్ప్రాప్తిదుర్లభము. కావున "అహంస్మరామి మద్భక్తం నయామి పరమాంగతి"మ్మన్నట్లు ఆయనయేవచ్చి యుండుట శ్రేయస్కరముగదా. నీప్రాప్తికై నేనుబడిన పాట్లన్నియు స్మరించి నీవు నన్ను వదలిపోకుము.

కం॥ నరు లుల్కాతతులం గొని, యరికట్టిన యేని యిచ్చ•నరిగెడికరి నాఁ
  గరుణోక్తులకున్ రాముఁడు,
   పర మిగుతనమతము విడఁడు•పటుధైర్యమునన్. ౬౫౪

ఉల్కాతతులన్=కొఱవులను, అరికట్టినన్=అడ్డగింపఁగా, ఇచ్చన్=ఇష్టము వచ్చినట్లు, కరి=ఏనుఁగు, కరుణోక్తులకున్ కరుణ+ఉక్తులకున్=శోకాలాపములకు పరము=శ్రేష్ఠము.

తాత్పర్యము

తన్నుఁబట్టుకొనుటకై పురుషులు నలుప్రక్కలఁ గొఱవులు తీసికొని చుట్టు కొని బెదరించినను దాని లక్ష్యముసేయక తన యిచ్చవచ్చినట్లు పోవు మదపు టేనుఁగువలెఁ గౌసల్య దీనాలాపములకు శ్రీరామచంద్రమూర్తి దృఢధైర్య ముచే దన యుత్తమ మతము వదలినవాఁడుకాఁడు.

చం॥ తను వవశత్వ మొంద వసు•ధాస్థలి వ్రాలినదీనఁ దల్లి, హా
  రని తనకంటికిం గడవఁ•దశ్రులు గూర్చెడి పిన్నదమ్మునిన్
  గనియును రాముఁ డొక్కరుఁడె•కా కిటు దుస్తరధర్మసంకటం
  బున నెవఁ డోపు ధర్మమున•పొంతను బోవ నితాంతధీరతన్. ౬౫౫

తనువు=దేహము, అవశత్వము=స్వాధీనముతప్పుట, దుస్తర=తరింపఁ గష్టమైన, ధర్మసంకటంబునన్=ధర్మమువలన నిబ్బంది కలిగినప్పుడు.

ఈరెండు పద్యంబులందును గవి యిట్టి సంకట సమయమందును శ్రీరామచంద్రుని ధర్మనిష్ఠధైర్యము కొనియాడుచున్నాఁడు.

తాత్పర్యము

దేహము పరవశమై మూర్ఛిల్లి తెలివితప్పిపడిన తల్లిని, హా'రని కడవ లతోఁ గ్రుమ్మరించినట్లు కాఱెడు కన్నీళ్ళుగల తమ్మునిఁజూచి యిట్టిధర్మసంకట సమయంబున మిక్కిలి ధైర్యముగలవాఁడై ధర్మము పొంతకుఁబోవఁగలవాఁడు శ్రీరాముఁడుగాక మఱి యెవరుకలరు? శ్రీరామునకుఁగాక మఱియెవ్వరికైన నసాధ్యకార్యమే.

బుద్ధుఁడు భార్యను శిశువును విడిచిపోలేదా? యందురేమో? వారు మేలు కనియుండినఁ దనప్రయాణము సాగదని వారు నిదురించునపుడు మోసగించి పోయెను. అదిగాని నలుఁడు చేసినదిగాని ధీరత్వము ప్రకటింపదు.

—• శ్రీరాముఁడు లక్ష్మణునకు ధర్మోపదేశంబుఁజేయుట. •—

ఉ॥ తమ్మునిఁ జూచి యిట్టులనుఁ • దమ్ముఁడ! వింతలె నాకు నీదు నె
య్యమ్ముఁ బరాక్రమమ్ముఁ, దగు • నా యిటు లేడ్చుచుఁ దల్లితోడ నా
కుమ్మలికంబుఁ గూర్చెద, వ • యొ మదిఁ గానవు కంటె నాదుచి
త్తమ్ము తెఱంగు, ధర్మపుఁబ • థం బెడఁబాయఁగ నొల్ల నెమ్మియున్. ౬౨౬

ఉమ్మలికంబున్=దుఃఖమును, పథము=మార్గము, వింతలు=క్రొత్తలు.

తాత్పర్యము

తల్లికిఁ జెప్పుట చాలించి తల్లికంటె నెక్కువగా నేడ్చుచుండు లక్ష్మణుని సమాధానపఱుపఁ గోరి శ్రీరామచంద్రమూర్తి యిట్లనియె.

తమ్ముఁడా! నీకు నాయందుఁగల స్నేహము నీపరాక్రమాతిశయము క్రొత్తలుగావు. తల్లితోడ నీవుకూడ నేడ్చుచు నాకు దుఃఖము కలిగించెదవు. ఇది నీకున్యాయ్యమా? ఇది స్నేహితుని లక్షణమా. శూరునిలక్షణమా? నాయందుఁ బ్రేమగలవాఁడవు నాకు శ్రేయస్కరమైనది చెప్పవలెఁగాని యిట్లు ధర్మవిరుద్ధముగ్గా నాయభిప్రాయమునకు విరుద్ధముగాఁ జెప్పవచ్చునా? అయ్యో! నాయనా యిన్నినాళ్ళు నాతోడనుండియు నామనస్థితి నీకుఁదెలియదాయెఁగదా. ఇప్పుడైన నేనె చెప్పెద వినుము. ధర్మమును విడిచి కొంచెమైనఁ దొలఁగుటకు నామన స్సంగీకరింపదు.

ఉ॥ ధర్మపథం బొకండె తను • దప్పక కొల్చెడివాని కెప్పుడున్
ధర్మము నర్థకామములఁ • దప్పకకూర్చు నిజం, బ దెట్లనన్
ధర్మిణి యైన భార్య గడు • ధర్మముఁ గూరుచుఁ, బ్రేమఁ గామమున్
శర్మముఁ గూర్చు, నర్థమును • పత్సుతుమూలముగాఁగఁ గూర్చెడున్. ౬౨౭

ధర్మిణి=సతీధర్మమందుఁ బ్రవర్తించు పతివ్రత, శర్మమున్=సౌఖ్యమును

తాత్పర్యము.

ధర్మార్థకామము లనుమూఁటిలో ధర్మముమాత్రమే తన్నెపుడు సేవించువానికి ధర్మము నర్థమును కామమును ఈమూఁటిని దప్పక కలిగించును. పతివ్రతయైన భార్య సహధర్మచారిణియై ధర్మాభివృద్ధి కావించును. ప్రేమచేఁ గామసుఖమును గలిగించును. పుత్రుని మూలమున నర్థమును గలిగించును.

భారతమున నీయర్థమే భారత సావిత్రియందుఁ జెప్పఁబడెను. "ఊర్ధ్వబాహుర్విరౌమ్యేష నచకశ్చిచ్ఛృణోతి మే। ధర్మాదర్థశ్చ కామశ్చ సకిమర్థం న సేవ్యతే॥" ధర్మమువలననే యర్థము కామము కలుగునని చేతులెత్తి యేడ్చినను నామాట యొకఁడువినఁడే యని వ్యాసులేడ్చెను. "ధర్మమూలస్సదైవార్థః కామోర్థఫలముచ్యతే, భార. ౧౨-౧౨-౩౪- అర్థమునకు ధర్మముమూలము, అర్థఫలము కామము.

కావున నర్థకామములఁ గోరువారును వానికై ప్రత్యేక శ్రమము పడక ధర్మమునకై శ్రమించినఁ జాలును. అటుగాక ధర్మమును విడచినయెడల నర్థ కామములు లభింపవు. లభించినను నిలువవు.

ధర్మ ఏకో మనుష్యాణాం సహాయః పారలౌకికః భార. ౧౩-౧౧౧-౧౩

మనుష్యులకుఁ బరలోకమందు సహాయపడునది ధర్మమొక్కటియే.అర్థము కాదు. కామము కాదు.

ధర్మ ఏవ హతో హంతి, ధర్మోరక్షతి రక్షితః॥ భార. ౩-౩౧౩-౧౨౮.

ధర్మమే తన్నుఁ జంపిన వానిని జంపును. రక్షించినవానిని రక్షించును. అర్థకామములు తమ్ముఁ జంపినవానిఁ జంపఁజాలవు. రక్షించినవాని రక్షింపఁ జాలవు.

చం॥ కలుగవొ ధర్మ మర్థమును◆గామము దేనను దాని నెవ్వఁడేన్
జలుపఁగఁ బూన రా, దెటఁ బ్ర◆శస్తపుధర్మము గల్గు దానినే
చలుపఁగ నౌ, ననేకులకు◆శాత్రవుఁ డౌను ధనైకకామి, కే
వలయును గామసక్తుఁడు ధ్రు◆వంబుగ నింద్యుఁడు సుమ్ము తమ్ముడా.

తాత్పర్యము ౬౨

లక్ష్మణా! ధర్మము, అర్థము,కామము ఈమూఁడును దేనివలనఁ గలుగదో దానిని నెవ్వఁడైనను జేయరాదు.

ఎందుఁ బ్రశస్తపు ధర్మముగలదో దానినిచేయవలెను. ధర్మమునువిడిచి ధనమునందే కామముగలవాఁడు లోకుల కనేకులకుఁ బగవాఁడగును. అట్టులే ధర్మము విడిచి కామాసక్తుఁడగువాఁడు పశుప్రాయుఁడనిలోకమున నిందింపఁ బడును.

చం॥ గురుఁడును రాజు దండ్రి ముది◆గూరినవాఁ డొకవేళఁ గింక నే
నరునము పేర్మినే నతుల◆మౌఢ్యశకామముచేత నైనని
ప్పరుసున నైనఁ జేయుమని◆వంచినదానిని జేయకుండు నా
నరుఁడు నృశంసుఁడున్ ఖలుఁడు◆నష్టయశుం డగుఁ గాదె లక్ష్మణా. ౬౩

తండ్రివృద్ధు, మఱుత్రివ్వులఁ జిక్కియాడెదున్ అను లక్ష్మణుమాటలకు శ్రీరామచంద్రుఁడు సమాధానము చెప్పుచున్నాఁడు. కింక=కోపము, నృశంసుఁడు=క్రూరుఁడు,ఖలుఁడు=పాపి.

తాత్పర్యము

తమ్ముఁడా! గురుఁడు రాజు తండ్రి వృద్ధుఁడు వీరిలో నొక గుణముగల వాఁడైనను జెప్పినమాట దాటరాదు. అట్లుండ నాలుగు గుణము లొకనియందే యుండి యతఁడు కోపముచేనైనను వేడుకకేయైనను కామాతిశయముచేనైనను మఱియేవిధముననైనను జేయుమని చెప్పిన దానిని జేయని వాఁడు క్రూరుఁడు, అపకీర్తిపరుఁడు పాపియు నగునుగదా. రాజెట్టివాఁడైనను రాజాజ్ఞయెట్లుపాలింప

వలయునో యట్టులే గురునాజ్ఞ తండ్రియాజ్ఞ పాలింపవలసినది విధి. వారి యాజ్ఞతో మనకుఁ బనికాని వారి గుణములతోఁగాదు. వారిగుణముల ఫలము వా రనుభవింతురు.

శ్లో॥ గురుణాంచైవ నిర్బంధో, నకర్తవ్యః కదాచన
అనుమాన్యః ప్రసాద్యశ్చ, గురుః క్రుద్ధో యుధిష్ఠిర:
సమ్యక్ మిథ్యాప్రవృత్తేపి, వర్తితవ్యం గురా విహ
గురునిందా దహత్యాయు, ర్మనుష్యాణాం నరాధిప॥ అను.

గురువులనెప్పుడు నిర్బంధింపరాదు. క్రుద్ధుఁడైన గురువును బహూకరించి యాయన యనుగ్రహమును బొందఁదగును. మిక్కిలి మిథ్యాప్రవర్తనముగలవాఁడైనను గురువును నిందించినచో నిందించినవాని యాయువు క్షీణించును. ఇది ౨౯౩ లోని లక్ష్మణు వాక్యమునకు బ్రత్యుత్తరము.

ఇక్కడ నొక చిన్నసందేహము. తప్పుత్రోవఁబోవు గురువును దండింపవలయునని లక్ష్మణమతము. దండింపరాదు నిందింపనురాదు అని శ్రీరామచంద్రమూర్తి మతము. ఇందేది యనుసరణీయము. గురువు కత్తికట్టి తనమీఁదికి వచ్చెనేని భీష్మునివలె దండింపవచ్చును. ఇట్లురాక వానంతటవాఁడు దుర్వృత్తి యందుండెనేని హితము మంచిమాటలతో రహస్యముగ బోధింపవలెను. నలుపురిలో నవమానింపరాదు. అక్కడికి వాఁడు వినకపోయెనా వాని సంబంధము వదలుకొని తనంతటఁ దానుండవలెను.

ప్రాణాపాయదశయందు నాత్మరక్షార్థముగఁదప్పు నెవరిని దండించునధికారము రాజునకుఁ దప్పనెవరికిలేదు. లక్ష్మణ మతము రాజనీతి ననుసరించినది. శ్రీరామచంద్రమతము కేవల శుద్ధ ధర్మము ననుసరించినది. ధర్మమంతయు రాజనీతియగునుగాని రాజనీతి యంతయు సర్వదా సర్వత్రధర్మము గాదు. కావుననే రామచంద్రమూర్తి లక్ష్మణునితో 'అనార్యమౌనదయమార్గము క్షత్రియధర్మమిద్ది సమ్మతిఁ గనఁబోకు' మనిబోధించెను. శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవఁబూనినది రాజాజ్ఞయనికాదు. తల్లిదండ్రుల కోరికయని. తల్లిదండ్రులేగుణము కలవారై యేయుద్దేశముతోఁజెప్పినను బుత్రుఁడు తప్పకవిని లోపడవలయును. ఇది శ్రీరామమతము. అట్లుకానివాఁడు కొడుకేకాఁడు. "ప్రతికూలః పితుర్యశ్చ నసపుత్రః సతాంమతః" అని ప్రమాణము. భార. ౧. ౭౫-౨౪.

చం॥ ధరణీతలేశ్వరుం డిటు య॰థామతిఁ బంచిన దెల్లఁ జేయ కే
కరణి సహించువాఁడ, విను॰మ్మాధవుఁ డేగతి నయ్యె నాకునున్
భరతునకుఁ బ్రశాస్త, మది॰భావన సేయుము తల్లి కట్ల యౌ,
నరయఁగ భర్తగాదె పర॰మార్థము దిక్కు భార్యకున్. ౬౩౦

యథామతిన్=మనస్సుచొప్పున, పంచినది = ఆజ్ఞాపించినది, ఏకరణిన్=ఏవిధముగ, ప్రశాస్త=శాసించువాఁడు.

### తాత్పర్యము

రాజు తన యిష్టప్రకార మాజ్ఞాపించినదంతయుఁ జేయక యెట్లుండఁగలవాఁడను. నేను రేపు రాజైనపుడెవరైన నాయాజ్ఞనుల్లఘించిన నేనూరకయుండవలసినవాఁడనేకదా. నేను వాని దండింపఁబూనిన వాఁడు, రాజగు నీతండ్రి మాట నీవు పాలించితివా? నీవుచేసిన దోషముకాదు. నేను జేసినదోషమా? యనిన నేనేమి చెప్పవలె. ఆరాజు పట్టాభిషేకము చేసికొమ్మని భరతుని, అడవులకుఁ బొమ్మని నాకాజ్ఞపెట్టుట కెట్టి యధికారియో తల్లికట్టులేకదా. ఆమె కొకరాజు మాకొకరాజా? అంతియకాదే. ఈమెకు రాజు భర్తయును, భార్యకు నుత్తమ పురుషార్థము ధర్మము రక్షకుఁడు భర్తయే కదా.

ఉ॥ భూమిధవుండు పుణ్యపథ•భూషణుఁ డూపిరితోడ నుండఁగా
నే మని వచ్చు నాబడిని•నేసతి భర్తృవిహీనయట్లు గా?
భామిని కెయ్యెడం దగవె•ప్రాణధవుం బెడఁబాసి యుండఁగా?
భూమిఁ దనూజుకంటెఁ బతి•భూజ్యుఁడు సాధ్వికిఁ జుమ్ము లక్ష్మణా. ౬౩౧

పుణ్యపథభూషణుఁడు=పుణ్యమార్గమే భూషణముగాఁ గలవాఁడు, నాబడి=నావెంబడి, వెంట, భర్తృవిహీన=పతిలేనిది, విధవ, ఈసతి=ఈ పతివ్రత.

### తాత్పర్యము

తమ్ముఁడా! పుణ్యమార్గమే యలంకారముగాఁగల రాజు జీవించి యుండఁగా నీమె విధవవలె నా వెంబడి నేమని వచ్చును? ఎట్టి సమయమందైనను భార్యకు భర్తను విడనాడియుండవచ్చునా. పతివ్రతకుఁ గొడుకునకంటెభర్తయే గౌరవింపఁదగినవాఁడు. ఇరువురిలో నొకరివిడిచియుండవలసినపుడు పతివ్రత కొడుకును విడువవలయునుగాని భర్తను విడువరాదు అని మరలఁ దల్లినిజూచి రామచంద్రమూర్తి చెప్పుచున్నాఁడు.

చం॥ వనముల కేగుదుం జనని•స్వస్త్యయనంబు నొనర్పు మాకు, న
న్గఁనుగొనుమీ ప్రసాదసుము•ఖం బగుదృష్టిని, బూర్ణమైనచో
జనకునియాజ్ఞ, గ్రమ్మఱవ•సత్యము, పేర్మినిముస్ యయాతి వ
చ్చినగతి వచ్చు వాఁడ, దయ•సేయుము చేయుము తీర్థసత్యునిన్. ౬౩౨

స్వస్త్యయనంబు=మేలుకలుగ దైవప్రార్థనము, మాకున్=నాకు లక్ష్మణునకు నని యర్థము, సీత యిచ్చట లేదు. ఆమె యభిప్రాయము తెలియదు, కావున మాకన్నచో నందు సీత చేరదు, సంజ్వాలద్వహ్ని నిన్వనినేన్ రాముఁడు చొచ్చుచోఁ దలఁపు మీ ప్రాగ్వర్తిగా నన్నాదన్=శ్రీరామునకంటె ముందు

లక్ష్మణుఁడు ప్రయాణమై రామచంద్రునితోడఁ బోవుట కంగీకరించుటచే లక్ష్మణుఁడు మాత్రము చేరుచున్నాఁడు. ప్రసాదసుముఖము=దయచేఁ జల్లనైనది, దృష్టి=చూపు, తీర్ణసత్యునిన్=తరించిన సత్యము గలవానిని.

తాత్పర్యము

తల్లీ! నేను వనములకుఁ బోవుచున్నాను. నాకు క్షేమముగలుగ దైవప్రార్థనము, ఆశీర్వాదము చేయుము నీవు తల్లివి. నీకడుపు చలువయే నాకు శ్రేయస్కరము, నీమాటవినలేదని కోపింపకుము. అనుగ్రహదృష్టిని జూడుము. తండ్రిపెట్టిన గడువు పూర్ణముకాఁగానే మరలివచ్చెదను. సత్యము, మాటదప్పను యయాతి స్వర్గమునకు వచ్చినట్లు వచ్చెదను,దయయుంచుము. నన్నుసత్యము పరిపాలించినవానిఁగాఁ జేయుము, అసత్యవాదిని జేయకుము, అది నీకు కీర్తికరముకాదు, నాకుఁ గీర్తికరముకాదు.

ఉ॥ పోకడపెట్టి ధర్మమును•భోగములం దడియాసఁ జేసి య
స్తోకపుసద్యశంబుఁ గడు•దూరము నెట్టఁగఁ జాలఁ దల్లిరో!
ప్రాకటభంగిఁ జూడఁ ద్రుటి•భంగురమాయువు గాన, ధర్మముం
జేకొన నెట్లు హీన మగు•శ్రీలకునై తమి సేయ జాలుదున్. ౬౩౩

పోకడపెట్టి=నాశముచేసి, అడియాస=అత్యాశ, అస్తోకపు సద్యశంబు=గొప్పసత్కీర్తిని, త్రుటిభంగురము=అల్పకాలములో నశించునది, తమి=కోరిక

తాత్పర్యము

అమ్మా! భోగములందలి యత్యాశచేత ధర్మము నాశము గావించిరాఁగల గొప్పకీర్తిని రాకుండ దూరముగ నెట్టలేను. ఏలయందువా.ఆయు వత్యల్పకాలముండునది. కావున ధర్మమును బాటింపక తుచ్ఛమగు సంపదలనెట్లుకోరుదును.

చం॥ అని యిటు కన్నతల్లిఁ బ్రియ•మారఁగ నూఱడఁ బల్కి యాదటన్
దనహితధర్మపద్ధతులు•దమ్మున కెన్నియొ తెల్పి దండకా
వని కరుగంగఁ గోరి నర•వల్లభుఁ డంతట భక్తియుక్తుఁడై
జననికి వే ప్రదక్షిణము•చల్పఁ దలంచి మనంబులోపలన్. ౬౩౪

ఊఱడన్=సమాధానపడునట్లు, ఆదటన్=ప్రీతిచేత, హితధర్మపద్ధతులు=హితము ధర్మమునైన తనమార్గములు, దండకావనికిన్=దండకారణ్యమునకు.

తాత్పర్యము.

కన్నతల్లికిట్లు సమాధానముచెప్పి ప్రీతిచే హితము ధర్మమునైన తన మార్గములు తమ్మునికి నెన్నియోచెప్పి దండకాటవికిఁబోవఁ గోరి శ్రీరామచంద్రుఁడు భక్తితోఁ దల్లికిఁ ప్రదక్షిణముచేయఁగోరి తన మనస్సులో

## ౨౨-వ సర్గము.

చం॥ కుమిలెడిశోకవహ్నిగడుఁ•గూరినదైన్యముపేర్మిఁగింక దే
హము నుడికింప రేఁగి ముఖ•మంతయుఁ గన్నులుగాఁగఁ గ్రుద్ధస
ర్పమువలె రోఁజుచున్ వెఱుగు•పాటున నిల్చినయూర్మితమ్మునిన్
సుమతిని లక్ష్మణుం గదిసి•నూల్కొనుధైర్యము పేర్మి నిట్లనున్. ౬౩౭

శోకవహ్ని=శోకమనెడి యగ్ని, కింక, కోపము, ఉడికింపన్=ఉడుకునట్లు చేయఁగా, రేఁగి=విజృంభించి, క్రుద్ధసర్పము = కోపించినపాము, నూల్కొను ధైర్యము=పురికొనుచున్న ధైర్యము.

### తాత్పర్యము

లోలోపల నుండుచున్న శోకాగ్నియు. దీనత్వముయొక్క యతిశయము కోపము, మూఁడు కలిసి దేహమును నుడికింపఁగాఁ గోపముచే విచ్చుటచేతఁ గన్నులు గొప్పవై ముఖమంతయు నాక్రమించునట్లు కాఁగాఁ, గోపముచే బుసలుగొట్టు పామువలె రోఁజుచు, వెఱగుపడి, నిలిచియున్న కూరిమిగల తమ్ముఁడును, మంచిమనస్సుగలవాఁడునగుటచే లక్ష్మణుని విడిచిపోరాదని యాయనయొద్దకుఁ బోయి రామచంద్రుఁడు ధైర్యాతిశయముచే నిట్లనెను.

ఉ॥ మానుము రోషమున్, వగపు•మానుము, పూనుము నిండుధైర్యమున్
మానము దూలవచ్చె నవ•మాన మటం చెద నెంచఁబోకుమా
మానితసమ్మదంబుఁ గను•మా యభిషేకసమస్తవస్తువుల్
మానుము, పూనుమీ వనస•మర్హములైన పదార్థముల్ వెసన్. ౬౩౮

### తాత్పర్యము

లక్ష్మణా! కైకమీఁద, దశరథునిమీఁద, నీమాట వినలేదని నామీఁద వచ్చినకోపము వదలుము. అడవికిఁబోయిన మనకు వచ్చినభయమేమని నిండు ధైర్యము వహింపుము. మానముపోయెనే, అవమానము వచ్చెనే యని తలంపకుము. మానావమానములు వచ్చుచుబోవును. శాశ్వతములుగావు. ఆగమాపాయినో నిత్యాస్తాన్ తితిక్షస్వభారత యన్నట్లు వానిని సహింపుము. మానావమానములకు నిష్కర్షలేదు. ఒకరికి మానముగాఁదోఁచినది. మఱియొకరికి నవమానముగాఁదోఁచును. అది కేవలము మనోవ్యాపారము. పట్టాభిషేకభంగము నీ వవమానముగాఁ దలఁచెదవేమో అది గౌరవకారణమగును. ఎట్లనెదవా. ఇంతటి యైశ్వర్యము చేతికివచ్చినదానిని విడిచి తండ్రిమాట పాటింపవలెనని యడవికిఁబోయిరి కదా వీరెంతటి పితృభక్తిపరులు. ఎంత నిష్కాములని లోకము గౌరవించును. కైక గౌరవముగాఁదలఁచునదియే యగౌరవకారణమగును. కావున మానావమానములను విచారము వదలుము. విచారము వదలుటేకాదు. ఇంతటి శ్రేయస్సు కీర్తి గౌరవము సంపాదించు సమయము

లభించెఁగదా యని సంతోషింపుము. ఇట్టి పరీక్షాకాల మెల్లవేళల, నెల్లరకురాదు వచ్చినపుడు దానిని దప్పఁ గొట్టరాదు. దానిని సాధించి కృతకృత్యులము గావలయును. అది ధీరులగు బుద్ధిమంతుల లక్షణము. కష్టములు కాఁపురములు చేయవు కీర్తి శాశ్వతము. కావున నభిషేకోత్సవమునకై నీవు ధరించిన వేషము సంపాదించిన వస్తువులు వదలిపెట్టుము. వనవాసమునకు యోగ్యములైనవి గ్రహింపుము.

కం॥ అభిషేకముకొఱకై యే, విభవంబునఁ గూర్పఁ బడియె•విశ్వంబును నా
కభిషేకనివృత్తికి నా,విభవంబున మార్పవయ్య•వివిధార్థంబుల్. ౧౩౪

తాత్పర్యము

ఏవిభవముతో నుత్సాహముతో నభిషేకమునకుఁ గావలసినవన్నియుఁ గూర్పఁబడెనో యట్టి విభవముతో నట్టి యుత్సాహముతో నభిషేకము నిలిపివేయుటకు సకల పదార్థంబులను మార్పుము.

మ॥ చననో రాముఁడు కానకుం జనఁడొకో•సౌమిత్రి ప్రేరించినన్
జన నేనంచు వచించునో యనుచుఁ దా•సందేహలోలాత్మయై
యనఘా? తత్తఱలాడు కైక మది శం•కాతంకనిర్ముక్తముం
జను నీకియ్యెడఁ జేయ,సైఁప విచికి•త్సం గుంద నాయంబయున్. ౧౩౫

సందేహలోలాత్మయై=సందేహముచే నుయ్యెలలూఁగుచున్న మనస్సుగలదై, శంకాతంకనిర్ముక్తమున్=సందేహభయమువలన విడువఁబడినది, విచికిత్సన్=సందేహముచే.

తాత్పర్యము

లక్ష్మణా! రాముఁడడవులకుఁ బోయెదననెనుగాని ప్రియభ్రాత వెలుపలి ప్రాణము కుడిభుజమునైన లక్ష్మణుఁడు పోఁగూడదని ప్రేరించినఁ బోవఁడేమో, నేను బోననునో యేమో; ఆవల నేమిచేయవలయును? బోసినోటితోఁ గఱచినట్లగునే, ఆవల నాగతియేమి? యని, కాసేపు శ్రీరామచంద్రుఁడు సత్యాత్ముఁడు కావునఁ బోవునని, కాసేపు పోఁడని, యుయ్యాలలూఁగు మనస్సుతోఁ దత్తఱలాడు కైక మనస్సు శంకనుండి భయమునుండి బొత్తిగా విడువఁబడినదానిగా నీకుఁ జేయఁదగును. శ్రీరాముఁడు సత్యాత్ముఁడు లక్ష్మణుఁ డసత్యాత్ముఁ డనుపేరు నీకేల? నాయభిప్రాయంబున మన తల్లి యీ సందేహముచే భయపడఁజేయుటయు హింసయే కావున నట్టిస్థితి నేను సైఁపను.

కం॥ వినుమా యెపుడేనియు నే, మన సెఱిఁగియు యెఱుఁగకైన•మాతలకేనిన్
జనకున కేనియు విప్రియ,మును నించుకయైనఁ జేఁత•మొనయదుజ్ఞప్తిన్ ౧౩౬

తాత్పర్యము

కన్నతల్లి గోలుగోలున నేడ్చుచుండ సహించి సవతితల్లి సందేహముచే బాధపడ సైఁపలేననెదవే. ఏల కైకయందు నీకంతటి యభిమానము

అనెదవా నాయనా నాపద్ధతి చెప్పెద వినుము. ఇంతవఱకు నేను దెలిసియైనను దెలియకయైనను గన్నతల్లికైనను తక్కిన సవతితల్లులందఱకైనను దండ్రికైనను వారి మనస్సునకుఁ బ్రియముగానిదానిని జేసినట్లు నాకు జ్ఞప్తియందును లేదు. ఈ యల్పమునకు నిప్పుడు నేనేల యిట్లు చేయవలెను.

కం॥ సత్యపరాక్రమవర్యుఁడు, సత్యవచస్కుండు సత్య•సంధుఁడు జనకుం
డత్యంతము పరలోకా, ప్రత్యయభీతుండు దిగులు•పాయుత మింకన్. ౬౪౦

తాత్పర్యము

సత్యపరాక్రమవర్యుఁడు=యుద్ధమున వంచనాదులులేక యదార్థమైన పరాక్రమము గలవారిలో శ్రేష్ఠుఁడు, సత్యవచస్కుండు = సత్యభాషణముగల వాఁడు, సత్యసంధుఁడు=ప్రతిజ్ఞచేసి తప్పనివాఁడు, అత్యంతము=మిక్కిలి, పరలోకాప్రత్యయభీతుండు = రాముఁడడవికిఁబోఁడాయెనా నాకసత్యదోషము వచ్చుట సత్యము, అసత్యదోషము వచ్చిన స్వర్గప్రాప్తిలేకుండుట సత్యము అని భయపడి యుండువాఁడు.

తాత్పర్యము

తల్లిమాట యటుండనిమ్ము. యుద్ధమందు సత్యమైన పరాక్రమముగల వాఁడు. ప్రతిజ్ఞచేసి తప్పనివాఁడు, కన్నతండ్రి స్వర్గలోకము తనకు లభింపదని మిక్కిలి భయపడుచుండువాఁడు, ఇఁక భయమువదలి సుఖింపనిమ్ము.

ఉ॥ ఈయభిషేక సంభ్రమము•లిప్పుడు మానక యుంటినేని పొ
ల్లాయె మదీయసత్య మని•యారట మొందు నృపాలుఁ డెంతయున్,
బాయనిచింతఁ దండ్రి వగ•పాటునఁ గుందఁగ నాదుచిత్తమే
చాయఁ దపింప కుండెడిని•సంతతమున్ వచియింపు లక్ష్మణా! ౬౪౧

పరలోకాప్రత్యయభీతుఁడను దాని వివరించుచున్నాఁడు. పొల్లు=వ్యర్థము.

తాత్పర్యము

ఈ యభిషేకవేషము ప్రయత్నము లిప్పుడు నేను వదలకయుంటినేని యరణ్యమునకుఁ బోవునట్లుండిన శ్రీరాముఁడప్పుడే రాజచిహ్నములు ఆప్రయత్నములు మానకుండునా. పోఁడేమో; దానికే యింకను జిహ్నములు ధరించి యున్నాఁడు. నాసత్యము వ్యర్థమయ్యెనని రాజు మిక్కిలి యారాటపడును. వదలని చింతచేఁ దండ్రి వగచుచుండ నా మనస్సుమాత్ర మిప్పుడేకాదు. తండ్రి నిట్లు వగపడఁజేసితిఁగదా యని యెల్లప్పుడును దపింపక యెట్లుండఁ గలదో నీవే చెప్పుము.

కం॥ కాన నభిషేక యత్నము, మానించి యిదే యరణ్య•మార్గముఁ బట్టం
గా నేను, గైక రాజ్య, శ్రీ నిలుపుత భరతునందుఁ•జిత్తంబలరన్. ౬౪౨

తాత్పర్యము

ఈకారణముచే నభిషేకప్రయత్నము మానునట్లుచేసి యిపుడే యడవి ద్రోవఁబట్టఁగాఁ గైక భరతునియందుఁ రాజ్యలక్ష్మిని సంతోషముతో నిలుపును గాక. అదిగని తనమాట సత్యమయ్యెనని తండ్రి సంతోషించునుగాక. తల్లిదండ్రులను సంతోషపెట్టుటకంటె మనము చేయఁగల గొప్ప పుణ్యకార్యమేది? తల్లిదండ్రులు సంతోషించినఁ బరలోకమున దీర్ఘసౌఖ్యము గలదు. తుచ్ఛమై, క్షణభంగురమైన యైహికసుఖమునకై శాశ్వతపరలోకసుఖము గోలుపోవ వచ్చునా? నీవే చెప్పుము.

కం॥ చీరాజినధారి జటా, ధారాన్వితు నన్నరణ్య•పథసంగతుఁ గ
న్నారఁ గని గైక తొమ్మనఁ, జేరిచి హస్తంబు నిదుర•చెందెడుఁ గాతన్. ౬౪౩

తాత్పర్యము

చీరాజినధారిన్=నారచీరలు కృష్ణాజినము ధరించినవానిని, జటాధారాన్వితున్=జడలగుంపుతోఁ గూడినవానిని అరణ్యపథసంగతున్=అరణ్యమునకుఁ బోవు మార్గము బట్టినవానిని.

తాత్పర్యము

నారచీరలుగట్టి కృష్ణాజినముధరించి జడలగుంపులు చుట్టగాఁ జుట్టి యరణ్యమునకుఁ బోవు మార్గమునఁ బోవు నన్నుఁ జూచి నిర్విచారముగఁ గైక తొమ్మపయి చేయియుంచుకొని నిదురించునుగాక.

ఆ॥ ఎవరిబుద్ధిశిక్ష•నియ్యది ఘటిల్లి, నిశ్చయింపఁబడియె•నెఱిగ మదిని
నట్టిమదికి నొవ్వు•పుట్టింపనేఁ జాల, నిపుడవనికిఁ బోదు•నింతనిజము. ౬౪౪

గా. ఎవరి=ఏనాయొక్క, బుద్ధి=వనవాసము చేయవలెననెడి బుద్ధియొక్క శిక్షన్=కుదురుపాటుచేత, ఇయ్యది = ఈవనవాసము, ఘటిల్లన్ = సంభవింప, నెఱిగ=న్యాయ్యమని నిశ్చయింపఁబడియె, అట్టి యామదికి నొవ్వు పుట్టింపఁ జాలను.

కైక కోరినప్రకారము వనవాసముచేయుటే న్యాయ్యమ్మని బుద్ధియందు నిశ్చయించుకొంటిని ఇప్పుడు మఱియొకవిధముగా నన్యుల బలాత్కారముచే నాబుద్ధి నొచ్చునట్లు నేను జేయఁజాలను.

౨. ఎవరి=ఏదశరథునియొక్క, బుద్ధిశిక్షన్=బుద్ధినేర్పుటచేత నా యీ కాననవాసము న్యాయ్యమని సహ్యమని తోఁచెనో యట్టి దశరథునియొక్క మనస్సు నొవ్వఁజేయఁజాలను. దశరథుఁడు నాకు వినయవంతుఁడవై జితేంద్రియుండవై నిత్యసుశీలివై నెగడవయ్యా కామంబు క్రోధము గలిగించునట్టి దుర్వ్యసనంబులను బ్రీతిపడకుమయ్యా అని కదా నేర్పెను. దీనికి విరుద్ధముగా నేను వార్తించిన నాయన మనస్సు నొచ్చుకొనఁడా.

౩. ఎవరి=ఏ మంథర దుర్బుద్ధిశిక్షచేఁ జక్కఁగా నీకైకచే నిశ్చయింపఁబడెనో యాకైకకు మనస్సు నొవ్వఁజేయఁజాలను. ఈరెండును తీర్థీయ వ్యాఖ్యానములు.

తా త్ప ర్య ము

ఎవరు బుద్ధినేర్పుటచేత నిది యిట్లు కావలయునని చక్కఁగా నిశ్చయింపఁబడెనో యట్టివారి మనస్సు నొచ్చునట్లు నేను జేయఁజాలను. నేనిపుడే యడవికిఁ బోదును.

—• శ్రీరాముఁడు లక్ష్మణునితో మేలుగీళ్ళకు దైవము కారణమని చెప్పుట •—

కం॥ వంచనకైక ఘటించెన, టంచును గినియకుము, రాజ్య•మందుటయు నివ
ర్తించుట నావనగమనము, నెంచఁగ దైవైకకృత, మిఁ•కేలా వగవన్?

[ఇంతవఱకు ధర్మము సకలఫలములిచ్చునని చెప్పి ధర్మము కర్మము అవి యచేతనములు. అది యెట్లు ఫలమిచ్చునను సందేహముదీఱ ధర్మమును మించి దైవముగలఁడని చెప్పుచున్నాఁడు].

కైక మోసగించెనని కైకమీఁద నేల కోపపడెదవు. కైక చేయఁగలిగిన దేదియులేదు. నాకుఁబట్టాభిషేకము చేయవలయునని ప్రయత్నముచేసినవాఁడు దశరథుఁడు కాఁడు. దానికి విఘ్నము చేసినది కైకయుఁగాదు. క్రొత్తనీళ్ళు వచ్చి ప్రాతనీళ్ళుకూడాఁ బోయెనన్నట్లు ముందున్నసుఖముకూడఁబోయి యడవులపాలగుటకు నేను జేసినదోషములేదు. యీ మూఁడును గేవలము దైవకృత్యములే? మఱియొకరి కార్యముగాదు. కావున దేనికి వగచెదవు? ఎవరిపైఁ గోపపడెదవు?

ఈ దైవము అదృష్టమని కొందఱ యభిప్రాయము. పూర్వముచేసిన పుణ్యపాపముల ఫలస్వరూపము ఈశ్వరుఁడని వేదాంతుల యభిప్రాయము.

కం॥ దైవప్రేరిత మగు నీ భావన గాకున్న శక్య•పడ నేర్చునె యా
దేవికిఁ గైకకు నన్నుం, గావలె ననియిట్లు మిగులఁ•గాఱియపఱుపన్. ౬౪౬

తా త్ప ర్య ము

ఇంత దూరాలోచనము దైవప్రేరణముచేఁ గలిగెను. కాకున్నఁ దనకే యపరాధము చేయని నన్ను నిష్కారణముగఁ గష్టపెట్టవలయునని కైకకు మనస్సునకైన వచ్చియుండ సాధ్యమా?

ఉ॥ అంతర మే నెఱుంగ హృద•యాంతరసీమను సౌమ్యశీల! యా
వంతయుఁ దల్లులౌముగుర•యుం, దలకైకకు నాత్మపుత్రుఁ డం
చెంతయుఁ బ్రేమఁ నావలన•నెంతయు నొల్లమి లేదు పూర్వ, మి
ట్లింతయు నేఁడ పుట్టుటకు•హేతు విఁ కెయ్యది తెల్పు తమ్ముఁడా? ౬౪౭

సౌమ్యశీల=సాధుచరిత్రా?

తాత్పర్యము

మన ముగ్గురుతల్లులయందు నాయందీమెకు నెక్కువప్రేమ యీమెకుఁ దక్కువప్రేమయని భేదము చెప్పుటకు వారిలోఁ దారతమ్యము కొంచెమైన నుండుట నే నెఱుఁగను. ఈ కైకకే నిన్నటివఱకుఁ దనకొడుకని యెక్కువ ప్రేమయులేదు. నాయందు విరోధభావములేదు. ఇదంతయు నేఁడే పుట్టుటకుఁ గారణమేమో తమ్ముఁడా చెప్పుము. ఉన్నట్లుండి యంతటిప్రేమ యింతటి విరోధముగా మాఱుటకుఁ గారణము దైవము గాకున్న మఱియేదో చెప్పుము.

కం॥ అంతటివత్సల నను నే,కాంతము=ప్రల్లదము లాడి•కాన కనుచుటల్
  చింతింప వలఁతి యగుబల,వంతపువిధిచేష్టగాక•పరులకు వశమే? ౪౮

వత్సల=ప్రేమగలది, ఏకాంతము=మిక్కిలి, ప్రల్లదములు=నిష్ఠురములు, వలఁతి=సామర్థ్యముగల.

తాత్పర్యము

తనకన్న కొడుకుకంటె నెక్కువప్రేమగల యీమె నన్ను నే యపరాధము చేయనివానిని నిష్కారణముగ నంతటి కఠినోక్తులాడి యూరనైనసుండ నీయక యడవులపాలుచేయుట యాలోచింప నిదియంతయు నెంతకైన సమర్థమగు బలవంతమైన విధి చేష్టగాక యితరుల చేష్టగాదు. ఇతరులకు సాధ్యముసుగాదు.

ఉ॥ పుట్టువుతోడఁ బుట్టె గుణ•పూజ్యత,మంచికులంబునందుఁ దాఁ
  బుట్టెను రాచకూఁతు రయి•పుష్కలదానదయానిధాన మై
  పట్టుగఁ గీర్తిఁ గాంచె, నటు•వంటిది కైకయి, భర్తృసన్నిధిన్
  గట్టిఁడి రీతి దిట్టయయి•కాఱులు నన్నొటు లోపెఁ బ్రేలఁగన్: ౪౯

తాత్పర్యము

ఆమె స్వభావముచేతనే దుష్టురాలు. ఆ దుష్టస్వభావమే యిప్పుడామెను ప్రేరించెను. ఇఁక దైవముచేసిన దేమియుందువా. సహజముగా నామె దుష్టురాలుగాదు. ఆమె పుట్టిననాఁడే యామెతోడ గుణములచే గౌరవమును బుట్టెను అది నీకెట్లు తెలియునందువా కులముకొలఁది గుణము. ఆమె గొప్ప వంశమున రాచకూఁతురై పుట్టెను. గొప్పజాతియందు గొప్పవంశమందుఁ బుట్టి గొప్పవారిచే శిక్షింపఁబడినదానికి నీచగుణము సహజమని యెట్లు చెప్పవచ్చును. దానికేమి సాలగ్రామముల గనియందు గులకరాలు పుట్టవా? సముద్రములో విషము పుట్టలేదాయందువేమో. అట్టినచో బాల్యమునుండి నీచురాలే యయియుండవలెను. అటుగాక దానమునకు దయకు స్థానమని పట్టుగఁ గీర్తిని సంపాదించెను. సహజముగా నీచురాలగుదానికి కీర్తి లభించునా? తనతో సమానురాండ్రైన సవతులపై ద్వేషము సాధించుచున్నది. గదా అది నీచతగదా యందువేమో? ఆమె

ద్వేషించినది సపత్నీత్వమునే కాని సపత్నులనుగాదు. వారు సపత్నులు గాకున్న వారిని ద్వేషించునా? ఆఁడువారి యందఱపై ద్వేషించుచున్నదా? తమయోగ క్షేమములకుహాని గలిగింతురని తోఁచిన సమానులను నణఁపవలయునని పట్టాభిషిక్తులైన రాజులు మాత్రము ప్రయత్నించుట లేదా?

ఉ॥ కంటికి నిద్రవచ్చునె? సుఖంబగు నేరతికేళి? జిహ్వకున్
వంటకమిందునే? యితరవైభవముల్ పదివేలు మానసం
బంటునె! మానుషంబుగల యట్టి మనుష్యున కెంతవానికిన్
గంటకుఁడైన శాత్రవుఁ డొకండు తనంతటివాఁడు గల్గినన్.—శ్రీనాథుఁడు

ఒకరికెంతైన దానముచేయునది యిపుడు పరులనొత్తునేల యాశించె? ఎంతో దయావతి యిట్టిక్రూరకార్యమున కెట్లు సాహసించెను? అటువంటి కైక నేఁడు మాఱుమూలలఁగాదు, దూతముఖమునఁగాదు, తానే తనమగనియెదుటనే తెంపరికత్తెవలె భయము భక్తి లజ్జ మర్యాద తప్పి ఱాఁగవలెఁ దెగఁబడి యెంతో ప్రీతిపాత్రుఁడనై యుండిన నన్నుఁ బనికిమాలిన మాటలన్నియుఁ బనికిమాలినవే కావు. బాధకలిగించునవి, యెట్లు వదరఁగలిగెను! దైవమావేశింపకున్నట్లు చేయఁగలిగియుండునా? సహజమైనచో నిన్నాళ్ళల యట్లు చేయలేదు.

కం॥ కావున్ నచింత్యమహిమము, దైవం బప్రతిహతంబు•ధర నెవ్వరికే,
నావనితయందు నాయెడ, దైవంబె విపర్యయంబుఁ•దమ్ముఁడ, కూర్చెన్.

అచింత్యమహిమము = ఊహింపసాధ్యముకాని మహిమగలది, అప్రతిహతంబు=ఎదురులేనిది, విపర్యయంబు=వ్యత్యాసము.

### తాత్పర్యము

కావునఁ దమ్ముఁడా! ఇంతటి మహిమగలదియని యూహింపనైనసాధ్యముగాని ప్రభావము గలదైన దైవము నీకు నాకే కాదు. ఎట్టివారికైన దీనిచేనైనఁ గొట్టఁబడనిదే. దానికెదురులేదు. కావున నామె కా దుర్బుద్ధిపుట్టుటకు నాకు దారిద్ర్యము వచ్చుటకు దైవమే కారణము. అదియే యింతకార్యము చేసెను.

తే॥ కార్యభూతఫలంబుల•కంటె వేఱు, చోట నించుక యైనను•జూడరాని
దుర్జయంబైనదైవంబు•తోడఁ దొడరి,
యెవఁడు పోరంగఁదానుత్స•హించుఁజెపుమ ౧౫౧

కార్యభూతఫలము= కార్యమువలనఁ గలిగినఫలము, దుర్జయము= జయింపరాని.

### తాత్పర్యము

నాయనా! దైవమున్నదనుటకు నేమి ప్రమాణము? దైవము నెదిరించి యిట్టికార్యము కలుగకుండ మనము పురుషకారము చేయరాదా? యందువేమో కార్యము మనము చేయునపుడు దైవమొకటియున్నదని, యేమో చేయుచున్నదని, మనకుఁ దెలియరాదు. ఫలము నందుమాత్ర మది కానవచ్చి యెట్లు

చేయుదలఁచినదో యట్లు చేయును. ఫలమునందుమాత్రము కానవచ్చి వేఱు చోటులఁ గానరాక యాకారణముచే జయింపరాకయుండు దైవముతో నెవఁడు పోరుటకు నుత్సహించును. అది యే స్వరూపమున నేమిచేయుచున్నదో మనకుఁ దెలియనప్పు డెట్లు దానితోఁ బోరుట. ఊనాఁ డీగడియయం దీకార్యము సాధించుట కేయే సాధనముల సిద్ధముచేసి యుంచుకొనెనో మనకు ముందు తెలిసి యుండినఁ గదా దానికి మనము ప్రతీకారము చేయుట. కార్యస్వరూపమునఁ గానరాక ఫలస్వరూపమునఁ గానవచ్చును. కావున దైవమున్నదనుటకు ననుమానమే ప్రమాణము, బుద్ధిబలముచే దాని నూహింపవలెను.

ఉ॥ జా నగుసౌఖ్యము వ్యసనశాంతియుఁ గ్రోధము లాభనష్టముల్
మానని పుట్టుగిట్టుటలు మానవకోటు లకారణంబుగా
వేనిఁ దలంచు నివ్వియును విశ్రుత మింతకు దైవ మొక్కఁడే
తా నగు మూలకారణము దప్ప దదెంతయు నమ్ము తమ్ముఁడా. ౬౨౨

జానగు=మనస్సునకింపయిన, పుట్టుటగిట్టుట = పుట్టుగిట్టుటలు ద్వంద్వసమాసము, రాపోకుండఁగనేమి కాళ్ళుతెగనే. మనుచరిత్రము.

అకారణంబుగా=కారణములేనిదానిగా, విశ్రుతము=ప్రసిద్ధము, దైవము వలనఁ గలుగుఫలము లిందుఁ జెప్పఁబడెను.

తాత్పర్యము

లక్ష్మణా! కారణములేక కార్యముగలుగదు. నిష్కారణమనుటకుఁ గారణము మనకుఁ దెలియదని యర్థమేకాని కారణమేలేదని యర్థముగాదు. కావున మనకు సంతోషకరమైన సౌఖ్యమునకు వ్యసనమునకు శాంతికి, రోషమునకు లాభనష్టములకు జననమరణములకు నివిగాక మనుష్యులు కారణములేక కలిగెనని వేనిదలంచునో యాయన్నిటికి మూలకారణము దైవమేసుమా. ఇది తప్పదయ్యా తప్పదు.

కం॥ కామక్రోధంబులచే, నేమంబుల వఱదఁ గలిపి నెఱిచెడి భ్రష్టుల్
గా మునులు తపసులయ్యును, సౌమిత్రీ! చెడుట దైవచర్యన కాదే. ౬౨౩

వఱదన్=ప్రవాహమందు, నెఱిచెడి = నియమమర్యాదలుచెడి, ఇందు దైవమే ప్రబలము. పురుషకారము కాదనుట తెలుపఁబడెను, "దైవమేవ పరమన్యే పౌరుషంతు నిరర్థక"మ్మని భారతము.

తాత్పర్యము

లక్ష్మణా! పామరులమైన మానమాట యటుండనిమ్ము. ఘోరమైన తపస్సులు చేసి యెంతో జ్ఞానము మహిమ సంపాదించి నిత్యనియమవ్రతులై శాంతులై నిష్కాములై యెందో యడవియందు నొకమూలఁబడియుండు మునులుకూడఁ దటాలునఁ గామమునకుఁ గ్రోధమునకు లోపడి దీర్ఘకాలముగ నభ్యసించుచున్న నియమములన్ని నీటఁగలిపి మర్యాదతప్పి భ్రష్టులైపోవుట దైవచేష్టచేతనేకదా

తాత్పర్యము

అటుగాకున్నఁ బురుషప్రయత్న మందేలోపముగలదు? మన గురువు విశ్వామిత్రు నంతటివాఁ డెట్లు నిమిషములోఁ గామమునకుఁ గ్రోధమునకు వశుఁడై చెడెనో మనము వింటిమిగదా. శివుఁడట్లే యయ్యెఁగదా?

కం॥ ఎన్నం డెంచని దెటులో, యున్నట్టుగనుండి యగుట•యూనినవని వి
ఛ్ఛిన్నం బగుటయు నట్టులె, యన్నా!
యివి దైవకృతము•లగు సత్యముగన్. ౬౨౪

దైవలక్షణము చెప్పఁబడుచున్నది.

తాత్పర్యము

ఎన్నఁడైన నిది యగునని నెవరును దలంపని కార్యము తటాలుఁ నున్నట్లుండియగుటయు, నగునని యందఱు నిశ్చయించిన కార్యమిట్టులే విఘ్నపడుటయు నివియెల్ల దైవము చేష్టలే, ఇది సత్యము.

కం॥ ఈనిశ్చితమతిచే నా,లో నేనే గాలగతి వి•లోకించినచో
మానసమున నభిషేకవి,ధానము దప్పుటకు వగపు•దగులదు నాకున్. ౬౨౫

నిశ్చితమతిచే=నిశ్చయింపఁబడిన మనస్సుచే, విలోకించినచోన్=చూడఁగ, ఆలోచింపఁగ, వగపు=వ్యసనము, పైవిచారముయొక్క ఫలితాంశ మిందుఁ జెప్పబడెను.

తాత్పర్యము

ఈ ప్రకారము సప్రమాణముగ నిస్సందేహముగ నిశ్చయించుకొని యితరుల యుపదేశముననేకాక నాలో నేనే కాలచర్య నాలోచింపఁగా నిది దైవకృతమని దీనిలో మన దోషమేదియులేదనియు, కైక నిమిత్తమాత్రమేయనియు, ఆమె దైవమునకు సాధనమయ్యెననియు, సాధించునది దైవమేయని తోఁచుటచే నాకు వ్యసనము గలుగలేదు. ఇది తెలియక నీవు వారు చేసినారు వీరుచేసినారని పరులపై నాగ్రహపడుచున్నావు.

కం॥ కావున నీవును వగవక, నావిధమును ననుసరించి•నలు వగునభిషే
కావశ్యక కార్యంబులఁ, బోవిడువుము, చింత యేమి•బూనకు మన్నా. ౬౨౬

తాత్పర్యము

కాఁబట్టి నీవుకూడ నాయనా! వ్యసనపడక నామార్గ మనుసరించి దైవకృత మనుభవింపక తప్పదని నిశ్చయించుకొని యీ పట్టాభిషేకమునకుఁగావలసిన పనులన్నియు వదలుము. చింతపడవలదు, చింతపడియుఁ బ్రయోజనము లేదు.

కం॥ మా నగునభిషే కార్థస,మానీతఘటోదకంబు•లగుఁ దాపసయో
గ్యానూనవ్రతమజ్జన, మూనిక నొనరింప నెంచి•యుండెడినాకున్. ౬౨౭

అభిషేకార్థ సమానీతఘటోదకంబు = అభిషేకము నిమిత్తమై తేఁబడిన ఘటములయందలి గంగాది తీర్థంబులు, తాపసయోగ్యా నూనవ్రతమజ్జనము= తపసులకు యోగ్యమైన కొఱఁతలేని వ్రతమునకై స్నానము.

తాత్పర్యము

పదార్థములు భరతుని పట్టాభిషేకమునకై యెత్తియుంచెదరనుకో గంగాది దివ్యతీర్థముల నేమిచేయవలయును. ఊఱకపాఱఁబోయవలయునా? అందువేమో. అట్లుచేయఁ బనిలేదు. పట్టాభిషేకమునకై తేఁబడిన తీర్థములు తాపసుల వ్రతముఁ బూనుటకు సిద్ధపడియుండు నాకు వ్రతారంభమునఁజేయ వలసిన స్నానమున కుపయోగపడును. దీనివలన నేవ్రతముగాని స్నానము చేసి సంకల్పించుకొని చేయవలయును అని సూచన.

కం॥ ఈరాజద్రవ్యం బగు, వారియు నా కేల? కైక•వసరదె శంకన్
ధారిణికై తేఁగెద నని? వారక నా తెమ్మనీ రె•వ్రతమున కగుతన్. ౬౨౮

తాత్పర్యము

లక్ష్మణా పొరపాటు. పొరపాటు. ఈనీళ్లు నే నుపయోగించుకొనెదనని యాలోచింపక చెప్పితిని. ఇదియును రాజద్రవ్యమేకదా. తపసులకు రాజ ద్రవ్యపరిగ్రహము నిషిద్ధముకదా. కావున నీ నీళ్ళు నాకుఁ బనిలేదు. రాజ్య ద్రవ్యమగుటయేకాదు. దానికేదైన నొకసమాధానము చెప్పుకొన్నను నీ నీటితో నేను స్నానము చేసితినేని పట్టాభిషేకమునకై నేను స్నానముచేసెదనేమోయని కైక సందేహముచే బాధపడును. నిష్కారణముగ నామెకేల నే నాబాధ గలిగింపఁవలెను. నేనే నీళ్ళు తెచ్చుకొని స్నానముచేసి వ్రతమారంభించెదను. తపస్వులు స్వయందాసులు.

చం॥ వగపకు మన్న లక్ష్మణ! వి•పర్యయ మందెను లక్ష్మియంచు, నీ
యగణితరాజ్యభోగము మ•హావిపినాలయవాస మొక్కరూ
పుగ మదిఁ దోఁచె, నారసిన•భూరివనాంతరవాసమే సుఖం
బగు, నటుగాన నేటికి వ్య•థావిలమానసవృత్తి దూపిలన్? ౬౨౯

విపర్యయము=వ్యత్యాసము, తాఱుమాఱు, అగణిత = లెక్కింపరాని, మహావిపినాలయవాసము=పెద్దయడవులయందు వసించుట, భూరివనాంతర వాసమే=గొప్పయడవులయం దుండుటయే, వ్యథావిల=వెతచేఁ గలఁతచెందిన మానసవృత్తిన్=మనోవ్యాపారముచే, దూపిలన్=శోకింపఁగా.

తాత్పర్యము

అన్నా! లక్ష్మణా! యెంత చెప్పినను నీవు శోకముమానినవాఁడవుకావు గదా.లక్ష్మి తొలఁగెను. అలక్ష్మి పట్టెనని దుఃఖింపకుము, నా యభిప్రాయమున నీ లెక్కింపరాని రాజ్యభోగ్యములు, అరణ్యవాసము రెండును ధర్మ కార్యములే గావున నొక్కటిగానే తోఁచుచున్నది. కాదు కాదు, ఒక విధమున నాలోచింప వనవాసమే సుఖమనియుఁ దోచుచున్నది. రాజ్య భోగము = సుఖరూపక దుఃఖము, వనవాసము = దుఃఖరూపక సుఖము, రాజ భోగమిప్పటికి సుఖముగఁదోఁచినను బరిణామమందే గాక నిర్వాహణమందును దుఃఖము గలది. వనవాసము నిశ్చింతము.

నిరుపద్రవము. పుణ్యఫలదము. కావునఁ దత్కాలమునదుఃఖముగఁ దోఁచినను మీఁద సుఖమిచ్చునది ఈ రెంటిలో నేదిమేలు? కావున నేల వృథావ్యథచే మనస్సుచెదరి యేడ్చెదవు.

మత్తకోకిలము. అన్న లక్ష్మణ! ప్రాప్తలక్ష్మికి•నంతరాయముఁ గూర్చె నా
పిన్న తల్లి యటంచుఁ గుందకు•ప్రీతి దప్పకు, దైవమే
యన్నెలంతుక నట్లనిష్టము•లాడఁ జేసె ముఖస్థమై
నన్ను తాత్మక!దైవ మంతకుఁ•జాలు నంచు నెఱుంగవే!౨౬

ప్రాప్తలక్ష్మికి=లభించిన యైశ్వర్యమునకు, అంతరాయము = విఘ్నము, నెలంతుక=స్త్రీ, అనిష్టములు = ఇంపుగానిమాటలు, ముఖస్థమై=ముఖమందుండినదై.

తాత్పర్యము

అన్నా లక్ష్మణ! చేతికివచ్చినపండు నోటికిరాక జాఱిపడిపోయినట్లు లభించిన యైశ్వర్యమునకుఁ గైక యడ్డమువచ్చి చెఱిచెనని వ్యసనపడవలదు. ఆమెయందుఁ బ్రీతియుఁ దప్పవలదు. ఆమెను దూషింపనురాదు. ఆమె మనకుఁ దల్లి కదా. అదియునుగాక "సుఖస్య దుఃఖస్య నకోపిదాతా, పరోదదాతీతి కుబుద్ధిరేషా, అహంకరోమీతి వృథాభిమానం, స్వకర్మసూత్ర గ్రథితోహిలోకః॥" సుఖముదుఃఖమిచ్చువాఁడు నెవఁడులేఁడు, పరు లవికలిగింతురని దుర్బుద్ధులు తలఁతురు. నేనీకార్యముచేసెద ననుట వృథాభిమానము. ప్రతిమనుష్యుఁడు తానుజేసిన కర్మముచేఁ గట్టఁబడియున్నాఁడు. ఆమె యందు స్వతస్సిద్ధమైన దోషములేదు. పిశాచము పట్టినవారు సన్నిపాతరోగముచే బాధపడువారు నేమేమో చూచువారిని దూషించినను నది పిశాచకృత్యము రోగబలమని సహింతుమేకాని మనమా మానవుల గోపింతుమా. అట్టులే దైవము కైక నోరనుండి యిట్టి కీడుమాటలు పలికించెను. కావున గైకమీఁదఁ గోపపడి యేమి ప్రయోజనము. సజ్జనస్తోత్రపాత్రమైన మనస్సుగలవాఁడా!దైవమిట్లు చేయఁగలదని నీ వెఱుఁగవా!

—• { ౨౩-వ సర్గము. లక్ష్మణుఁడు శ్రీరామునితో దైవముకంటెఁ పౌరుషమే శ్రేష్ఠమని చెప్పుట. } •—

కం॥ అనురామునివచనంబుల, వినమితమూర్ధుండు నగుచు•విని విని మదిలోఁ
బెనఁగొనువిషాదముదముల,కును మధ్యస్థపలె నుండి•కొండొకసేపున్.౧

చేతదొరికిన రాజ్యము తప్పిపోవుటకుఁ బ్రబలమగు దైవమే కారణము గాని వేఱేదియుఁగాదు. కావున నీవు పరితపింపకుము. మఱియు సకల శ్రేయస్సాధనముగు ధర్మమును విడువరాదు. పితృవాక్యపరిపాలనము పుత్రధర్మము అది మొదట మనకుఁ బ్రాప్తమయినది కావున మొదటదాని నెఱవేర్పవలెను. మాతృవాక్య పరిపాలనము ధర్మమైనను నది పితృవాక్యానంతరము

తటస్థించినది కావున దాని వెనుకఁజేయవలెను అని శ్రీరామచంద్రుఁడు వివరించి చెప్పఁగా లక్ష్మణుఁడు దాని నంగీకరింపక దైవమును బురుషకారము మరల్చి దైవము విఘ్నముచేసిన పట్టాభిషేకమును బురుషకారముచే నేను ఘటింపఁ జేసెదననెను. దానిమీద శ్రీరామచంద్రుఁడు దైవలక్షణము బలములోనైనవి చెప్పెను. లక్ష్మణుఁడీఁక దన పూర్వపక్షము విశదీకరించి బలపఱచుచున్నాఁడు.

వినమితమూర్ధుండు=వంచుకొనఁబడిన శిరముగలవాఁడు=విషాదములకును, దుఃఖమునకు సంతోషమునకు, మధ్యస్థునివలె=నడుమనుండువానివలె, కొండొకసేపు=కొంచెపుఁగాలము, విని విని యనుపీప్పచేఁ బెక్కు విషయములు శ్రీరామచంద్రుఁ డుపన్యసించెనని భావము.

వినుట కిష్టములేకయు వినయముచేతను దలవంచుకొని లక్ష్మణుఁడు శ్రీరాముఁడు చెప్పిన మాటలన్ని వినివిని యయ్యో! యిటువంటి ధర్మాత్ముఁడు సుకుమారుఁడడవుల నిడుమలఁ బడనున్నాఁడే యను దుఃఖమునకు, ఆహా మాయన్న యింతటి కష్టసమయమందును నింతటి ధర్మనిష్ఠుఁడుగదా యను సంతోషమునకు, నీరెంటికి నడుమఁ గొంతకాల ముండినవానివలెనుండి, అన్న చెప్పినది సరియందునా యాయనకష్టముల కంగీకరించినవాఁడనగుదును. ఆయన చెప్పినది సరిగాదందునా ధర్మహాని ఘటించినవాఁడ నగుదును. ఏమి చేయుదునాయని యాలోచించి కైక చేసిన దుష్టచేష్ట దురాలోచనము మదికి రాఁగా రోషమును వహించి మాధ్యస్థమునువదలి రాముని సుఖపెట్టవలయునను తలంపుతో నన్న మనస్సును ద్రిప్పటకై.

సీ॥ సౌమిత్రి దీర్ఘరో•షంబున నిష్క్రహ, స్తాశీవిషముభంగి•నట్టి రోఁజి
కుటిలమై భ్రూకుటి•చటు లనిటాలత, టంబున నటియింప•డంబు మెఱసి
క్రుద్ధసింహాస్యంబు•కోపున నెమ్మోము, దుర్నిరీక్షంబయి•దోరగిల్ల
హస్తిహస్తమునట్లు•హస్తాగ్రమునుదా వి•ధూననంబొనరించి•తొరగఁబఱపి
తే॥ దృష్టినేలను నిరువంక•ద్రిప్పి మెడను, నడ్డచూపులకొనలు ని•జాగ్రజాతు
నాస్యమునయందుఁ బ్రసరింప•నధర మదరఁ,
గావిహాఱఁగ గన్నులు•కనలిపలుకు. ౬౬౨

దీర్ఘరోషంబునన్=అతిశయించిన కోపముచే, నిష్క్రహస్త=నరులు తఱుమఁగాఁ బయవిడి బిలము చొచ్చియుండు, ఆశీవిషముభంగిన్ = సర్పమువలె, రోఁజి=బుసకొట్టి, కుటిల మైవంకరయై, భ్రూకుటి=కనుబొమలు, చటుల=కదలుచున్న, నిటాలతటంబునన్=లలాటప్రదేశంబున, డంబు=కాంతి, క్రుద్ధ సింహాస్యంబుకోపునన్=కోపించిన సింహముయొక్క ముఖమువలె,దుర్నిరీక్షంబయి= చూడరానిదై, దోరగిల్లు=ఎఱ్ఱనగాఁగా, హస్తిహస్తమునట్లు=ఏనుఁగు తొండమువలె: హస్తాగ్రమును = చేతికొనను, విధూననం బొనరించి = విదిలించి,

నిజాగ్రజాతు=తన యన్నయొక్క, ఆస్యంబునందు=ముఖమందు, అధరము=పెదవి, కనలి=కోపించి.

తాత్పర్యము

లక్ష్మణుఁడు విస్తారమైన కోపంబున దెబ్బతిని తప్పించుకొని బిలములోఁ జొరఁబడిన పామువలె బుసకొట్టి వంకరయైన కనుబొమలు చలించుచున్న లలాటప్రదేశంబున నటింపుచుండఁ గోపించిన సింహము ముఖమువలె నెఱ్ఱనయి చూడరాకయుండనేనుఁగు తొండమువలె గొనచేతిని విదల్చి దృష్టి నేల మీఁదనుంచి మెడ నీప్రక్క కాప్రక్కకు ద్రిప్పి శ్రీరామచంద్రుని ముఖము నడ్డ చూపులఁ జూచుచు పెదవి యెగురుచుండఁ గన్నులు నెఱ్ఱనకాఁగాఁ గోపించి యిట్లనియె.

చం॥ జనకునిమాట దాఁటఁ గలు•షం బగు నంచును, రామచంద్రుఁడే
వినఁ డఁట తండ్రిమాట యని•వీఁడిముూఁకలు ధర్మసేతువున్
గొనకొని త్రెంపఁ జూచెదు నొ•కో యనుశంక, నరణ్యభూమికిన్
గనుకనిఁ బోవఁ జూచెదవు•కాలము గా దిది తత్ప్రసక్తికిన్. ౬౬౩

కలుషము=పాపము, వీఁడిముూఁకలు=అవివేకుల సమూహములు, ధర్మసేతువున్=ధర్మము అనెడి ఆనకట్టను, జనులు తమ యిష్టప్రకారము పోయి చెడిపోకయుండుటకై ధర్మమనెడికట్ట, వంకలఁబడి వ్యర్థముగాఁ బోవునీటిని పొలమునకుఁ బాఱించుటకై వేసెడు కట్టవంటిది, సేతువు=వంతెన, ఇది యీ యొడ్డునుండి యాయొడ్డునకుఁ బోవువారికి సుఖమార్గము, అట్టులే సంసారసాగరముఁ దరింపఁగోరువారి కీతీరమునుండి మోక్షతీరము చేరుటకు ధర్మమునడిమి యనకట్టయని యర్థము, కొనకొని=యత్నించి, కనుకని=త్వరతో, తత్ప్రసక్తికిన్=ఆప్రసంగమునకు.

తాత్పర్యము

అన్నా రామచంద్రా; తండ్రిమాట మీఱినఁ బాపమువచ్చునను భయము చేతను, మనకన్న నెన్నియంతలో గొప్పవాఁడై మహాత్ముఁడగు శ్రీరామునంతటివాఁడే తండ్రిమాట వినలేదఁట యిఁక మనమేల వినవలె దానివలనఁ గీడుండిన నాయన యేలట్లుచేయును. కావున మనమట్లు చేసినను దోషములేదు. చేయవచ్చును. (యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః సయత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే' అనునది యిచ్చట ననుసంధింపునది.) అని యవివేకుల గుంపు ధర్మమనెడి యనకట్టను ద్రెంచి తాముచెడి లోకులఁ జెఱుతురను సందేహముచేతను, అడవులకు, నచట నేదో మునిఁగిపోయినట్లు, లాదరబాదరపోవఁ జూచెదవుగాని యవి ప్రస్తావింపనిది సమయముగాదు. అవి యీసందర్భమున నన్వయింపవు.

ఉ॥ ఎంతకుఁ జాల వీవు? తగు•నే యసమర్థవుదైవ మిట్లు నీ
వెంతయుఁ బెద్దఁ జేయఁగ? ని•జేప్సితసిద్ధికి నన్యు వేఁడు, నా

క్కింతయు మున్ను దా నిలిచి • యేమియుఁ జేయదు, దాని నీ వసం
భ్రాంతుఁడ వయ్యుఁ బ్రాకృతుని • భంగి నిటుల్ గొనియాడ నర్హమే? ౬౬౪

నిజేప్సితసిద్ధికిన్=తనయభీష్టము నెఱవేఱుటకు, వేఁడున్=ప్రార్థించును, అసంభ్రాంతుండవు=పిఱికితనముగాని, కళవళపాటుగల మనస్సుగాని, లేనివాఁడవు కొనియాడన్=పొగడఁగా, అర్హమే=తగునా,

తాత్పర్యము

అన్నా! నీవుదైవము నేమో గొప్పదిగా భ్రమపడుచున్నావు. నీవు చేయవలయునని పూనుకొంటివేని నీ కసాధ్యకార్య మేదికలదు? అట్లన్నిట సమర్థుఁడవయ్యు నే సామర్థ్యము లేనిదైవము నెంతో పెద్దచేసెదవు. అది నిజమని నమ్మి చేయుచున్నావో లేక వేఱుద్దేశ్యము మనస్సునందుంచుకొని యిది నెపముగాఁ జెప్పుచున్నావో. దైవము దుర్బలమని యెట్టులనెదవందువా అది తనకార్యము సాధించుటకు తనకు సామర్థ్యములేక యితరుల సాహాయ్య మపేక్షించును. ఇది సమర్థుని లక్షణమా? తాను ముందు నిలఁబడి యేకార్యము చేయలేదు. అది ధీరలక్షణమా? ఇట్లు దేనికి గొఱగాని దైవమును ధీరుఁడవు సమర్థుఁడవు చిత్తవిభ్రాంతి లేనివాఁడవయ్యును పామరునివలె గొప్పగాఁ బొగడెదవు. ఇదినీకుఁ దగునా?

ఉ॥ పాపము పాప మంచనెదు • పాపము గల్గునె పాపులైన జా
యాపతు లాడుమాటల న • నాదృతి చేసిన? శాఠ్యరీతి ల
క్ష్మీ పదముం దొలంచి రని • చిత్తమునందు నెఱుంగ వయ్యొ, ధ
ర్మోపధధర్మకంచుకులు • నుర్విని గల్గరె ధర్మతత్పరా? ౬౬౫

జాయాపతులు=దంపతులు, అనాదృతిచేసినన్ = ఆదరింపనియెడల, శాఠ్యరీతిన్=వంచనమార్గమున, లక్ష్మీపదమున్=లక్ష్మీస్థానమునుండి, పంచమ్యర్థమున ద్వితీయ, తొలంచిరి=తొలగించిరి, ధర్మోపధ=ధర్మము నెపముగాఁబెట్టుకొని యధర్మకార్యములు చేయువారు, ధర్మకంచుకులు=ధర్మములుచొక్కాలవలెఁ గలవారు, అనఁగాఁ గుష్ఠరోగములవారు చొక్కాలు తొడుగుకొని గుడ్డలు కప్పుకొని దానిని దాఁచునట్లు తమయందలి దోషములు ధర్మవాక్యము లుపన్యసించుటచేఁ గప్పిపెట్టువారు. ఇది విశేషణోభయపద కర్మధారయము, లోకులు నిశేషము, ధర్మతత్పరా=ధర్మమునందే విశేషాసక్తి గలవాఁడా.

తాత్పర్యము

తల్లిదండ్రులమాట మీఱినఁ బాపము పాపమని పలుమాఱనెదవు గాని పుణ్యాత్ములు ధర్మాత్ములగు వారి మాటమీఱినఁ బాపమువచ్చునుగాని పాపబుద్ధులయిన దంపతులు చెప్పినమాట నతిక్రమించినఁ బాపమువచ్చునా? ఏలయనెదవా. వారు పాపము నాశ్రయించి యుండువారు. కావున వారివిషయము బాపము చేసినను దోషముగాదు. ఇఁక వారిమాట వినకున్న దోషమెట్లు

వచ్చును? వసనాభిలో నుండు పురుగునకు వసనాభిపెట్టుట దోషమా. మన తల్లి దండ్రు లెట్లు పాపాత్ములనెదవా, నీకు రాఁగల రావలసిన రాజ్యలక్ష్మిని మోసముచేసి నీకు రాకుండఁ జేసిరియని నీవు తెలిసికొనిన వాఁడవుకావు. నీకు నల్లనివన్నియు నీళ్లు తెల్లనివన్నియుఁ బాలు అట్టులే యంద అనుకొనెదవు. లోకమునందు ధర్మమును నెపముగాఁగొని తాముచేయు దుష్కార్యములను ధర్మవాక్యోపన్యాసములచేఁ గప్పిపెట్టు శిశ్నోదరపరాయణులగు వారులేరా. నిర్వ్యంచనమైన ధర్మము ధర్మముగాని వంచనతోఁగూడిన ధర్మము ధర్మమా.

ధర్మోపథ ధర్మకంచుకులు=వీరే బైడాలవ్రతులు, బకవ్రతులు, బిడాల మనఁగాఁ బిల్లి, ఈపిల్లిపాలు త్రాగునాయన్నట్టు లణఁకువతోఁ గన్నులు మూయుచుఁ దెఱచుచునుండి యొంటివంటు దొరకఁగానే పాలు త్రాగిపోవును అట్లులోకమును వేషములతోను నక్కవినయముతోను వంచించువాఁడు బైడాల వ్రతుఁడు. కొంగనీటియొడ్డున నిర్వికల్ప సమాధియందుండు యోగివలెఁ గద లక మెదలక కన్నులు మూఁగన్ను పెట్టియుండి చేఁపసమీపింపఁగానే తటాలున వాత వేసికొనును. ఇట్టివాఁడు బకవ్రతుఁడు.

సీ॥ మచ్చిక బలిమిని•నిచ్చకంబులఁ దన,కొడుకునకును గైక•పుడమిఁ గోర
జతనంబుశ్రీరామ•చంద్రున కొనరింతు,వరములుగోరు మో•తరుణి!యనుచు
యుక్తియొక్కటి చెప్పి•రక్తున ట్లిచ్చట నాడంబర మొనర్చి•యటకుఁబోయి
మోసంబుచేసె నా•ముదుకండు, గాదేని, యేల గోరదు కైక•యిన్నినాళ్లు
తే॥ వరములను? భూపతియేల•పరిహరింపఁడయ్యెఁ?
డక్కిది, నిజమైన•నఖిలజనులు
వినినయది మున్నుగా నెఱ•వేర్పవలదె?
యామెకోర్కుల కిదియొకో•యర్హ వేళ? ౬౬౬

మచ్చికబలిమిని=తనయందుండు స్నేహబలమున, ఇచ్చకంబులన్= ముఖప్రీతిమాటల, జతనంబున్=యత్నశబ్దభవము, యత్నమును, రక్తునట్లు= మనయం దనురాగముగల వానివలె, ముదుకండు=ముసలివాఁడు, ఇచ్చటన్= సభామధ్యమున, అటకున్=కైకయింటికి, పరిహరింపఁడు=పూర్ణముచేయఁడు.

తాత్పర్యము

ఇందు మన తలిదండ్రులు చేసిన మోసమేమియందువా వినుము. తన యందుఁ దనభర్తకుఁ గలమోహము బలమున నాయన మెచ్చున ట్లిచ్చకంబులఁ గొన్ని చెప్పి తనకొడుకునకు రాజ్యమిమ్మనికోరఁ గామ దాసుఁడై యీ ముసలివాఁడు లోకముమెచ్చ నేను శ్రీరామునకుఁ బట్టా భిషేకము చేసెదనని సభలోఁజెప్పెదను. వయసుపిల్లా! నీవు వరములు కోరుమని పెండ్లానికి యుక్తినేర్పి యిచటసభలోనందఱు వినునట్లు శ్రీరాముని యువరాజు చేసెదనని చెప్పి కన్నీళ్ళు తుడిచి యిచట కైకయొద్దకు బోయి మోసంబుచేసి యేమి తెలియనివానివలె వగలేడుపు లేడ్చుచున్నాఁడు.

అట్లుగాదేని వరములిచ్చినదేనాఁడు? కోరునది యేనాఁడు? ఇన్నాళ్ళు కైకమ్మ యేమి చేయుచుండెను? రాజేల వానిని దీర్పలేదు? ఇదియంతయుఁగల్ల-ఒకవేళ నిజమనుకొందము. ఉదయము సభలోఁజెప్పినదిది. రాత్రిచెప్పినదిది- ముందు చెప్పినది ముందుగాఁ జేయవలదా.ఆమెకోర్కులు కోరుట కిదియా సమయము? ఇదియంతయు టక్కుగాదా. నిజమని యెవఁడు నమ్మును?

కం॥ లోకంబులు ద్వేషింపఁగ, నీకుత్రల నిన్నుఁగాక • యితరుల రాజ్య
శ్రీకలితులఁ జేయుఁగ నే, మేకొనఁగా నేర్తునే? క్షమింపుము నన్నున్. ౬౭

కుత్రలన్=వంచనలచే, ద్వేషింపఁగన్=విరోధింపఁగా, రాజ్యశ్రీ కలితులన్ = రాజ్యలక్ష్మితోఁ గూడినవారిని, మేకొనఁగా=అంగీకరింపఁగా.

తాత్పర్యము

వంశధర్మము నాశముచేసెను. పెద్దవాఁడుండఁగాఁ బిన్నకు రాజ్య మిచ్చెను. నిష్కారణముగాఁ బెద్దకొడుకును నడవులకుఁ బంపెను. ఇట్టివాఁడు రాజఁట మనము ప్రజలమఁట. ఇఁక వీని ప్రభుత్వమును మనసంగీకరింప రాదని లోకులు విరోధింపఁగా నిటువంటి మాయోపాయములచే న్యాయ్యముగా రావలసిన నీకుఁగాక యితరులకు రాజ్యశ్రీ దశరథుఁ డిచ్చెనేని నే నంగీకరింతునా. కావున నాయనంగీకారమును క్షమింపుము.

కం॥ వినతసుధీసత్తమః వె, మ్మనమున నేధర్మచింత • మలయుట ద్వైధం
బును బొందె బుద్ధి మోహం,బున నాధర్మమున నేవ•పుట్టెను నాకున్. ౬౮

వినుతసుధీసత్తమ=పండితశ్రేష్ఠులయందు గొప్పవాఁడని పొగడఁబడు వాఁడా, మలయుట=మెలఁగుటచే, ద్వైధంబు=రెండుగా నగుట, ఏవ=రోఁత.

తాత్పర్యము

రామచంద్రా నీవు జ్ఞానవంతులగు పండితులలోఁ బండితుఁడవు. నీకుఁ దెలియనిది లేదుగాని పితృవాక్యపరిపాలనము ధర్మమనుచింతపట్టినవాఁడవగుటచే బుద్ధిమోహముచే కొంతసేపు రాజ్యము కావలయునని కొంతసే పరణ్యము నకుఁ బోవలయునని రెండుగాఁజీలెను. ఇట్టి బుద్ధిభేదము కలిగించు ధర్మము రోఁతగా నాకుఁ దోఁచుచున్నది. ధర్మ మేకవిధముగా నిశ్చితమైయుండవలెను గాని పరస్పర విరుద్ధములయిన రెండుమార్గములఁ బ్రవర్తింపఁజేయు ధర్మము ధర్మమా? వ్యవసాయాత్మికాబుద్ధిరేకేహకురునందన" భ.గీ. నిశ్చయబుద్ధి యేకవిధముగలది. ముందొక్కటి నిశ్చయించుకొని, కొంతసేపటికి దానికి విరుద్ధముగా వర్తించువాఁడు చపలచిత్తుఁడుగాఁడా ? తొలుతనే రాజ్యము నాకక్కఱ లేదనియుండిన నేను వ్యసనపడను.

కం॥ ఏకృతికి నైన వలఁతివి, కైకేయీవశతఁ దండ్రి • గర్హ్యమధర్మ్యం
బౌకాలు ప్రేలినచోఁ, జేకొనుదే మోహమునను•జేద్పడ కున్నన్ ? ౬౯

వలఁతివి=సమర్థుఁడవు, గర్హ్యము=నిందింపఁదగినది, అధర్మ్యము=అధర్మమార్గముతోఁ గూడినది, కాఱులు=పనికిమాలినమాటలు, ప్రేలినచోన్=వదరఁగా, చేకొనుదే=అంగీకరింతువా, చేడ్పడకున్నన్=చెడిపోకున్నయెడల.

తాత్పర్యము

నీ వెంతటికార్యమునకైన సమర్థుడవు. అట్టివాఁడవు నీవు మోహమున బుద్ధినాశముచేసికొనకున్నయెడల కైకేయికి వశుఁడై దశరథుఁడు నిందింపఁదగినది అధర్మయుక్తమయినదియగు రజ్జులాడిన నీవు వానిని సరిసరియని తలయూడింతువా.

ఉ॥ మోసపుబుద్ధిచేత వర • ముల్ పరికల్పితమైనఁ, బెద్దగాఁ
జేసెదు గాని వాని నిర • సింపవు సాధుతపేర్మి, దానికై
గాసిలి దుఃఖ మందెదను • గాని యిఁ కేమియు లేద, యిట్టిచో
వాసిఁ దొలంచు ధర్మపథ • వర్తన గర్హ్యము గాదె యెఱికిన్? ౧౦

పరికల్పితమైనన్=సృష్టింపఁబడఁగా, నిరసింపవు=తిరస్కరింపవు, సాధుత్వముపేర్మిన్ = సాధుత్వాతిశయముచే, గాసిలి = కష్టపడి, వాసి = పేరుపెంపు, గర్హ్యము = నింద్యము.

తాత్పర్యము

నీకు న్యాయ్యమార్గమున రాజ్యము దొలంగియుండిన నేను దుఃఖింపను. ఇప్పుడట్లు జరగలేదు. లోకులను నిన్ను మోసగింపవలెనని వరములను కొన్ని కల్పింపఁగా వానిని నీవు గొప్పగాఁదలంచెదవు గాని నీవు మిగులసాధువు గావున నావంటివారే యందఱు నన్నీలవారు మోసముచేయుదురని వానిని దిరస్కరింపకున్నావు. ఈ మోసము నీవు తెలిసికొనలేకపోయితివిగా యని నేను దుఃఖించుచున్నానుగాని రాజ్యముపోయెనని కాదు. ఇట్టి సందర్భములందు వీరు బుద్ధిలేనివారు మోసము గనుఁగొనలేకపోయిరని కీర్తిప్రతిష్ఠలుపోఁగొట్టి యపకీర్తియప్రతిష్ఠతెచ్చు ధర్మమార్గమున వర్తింపుట నాకేగాదు. ఎవరికైన నింద్యమే.

ఆ॥ తల్లి తండ్రి యనఁగఁ • దగనిపేరులు దాల్చి, కామవృత్తులైన • కానివారు
పలుకువానినెల్లఁ • బాటింప వచ్చునే, యన్న! మనసునందు • నైన నీవు? ౧౧

తగనిపేర్లు=వారియోగ్యతకుఁదగని పేర్లు, కామవృత్తులైన=కామవ్యాపారముగలవారలైన, కానివారు=శత్రువులు.

తాత్పర్యము

కైకేయీ దశరథులు తల్లిదండ్రులు నడువవలసిన రీతి నడవలేదు. కావున వారిని దల్లిదండ్రు లనుట తప్పు. ఆపేర్లకు వారు తగరు. (ఈ యభిప్రాయముతోనే "భూమిపు నెడలేదు జనకబుద్ధి సుమంత్రా" యని చెప్పఁబోవును (చూ.ప. ౧౫౩) ఆ పేర్లకుఁదగని నడవడిగలవారు ఆ గౌరవమున కెట్లు తగుదురు? అట్టి

పేర్లుపెట్టుకొని కామబలమున నిష్టమువచ్చినట్లు సంచరించు వగవారు చెప్పినట్లెల్ల నీవు చేయవచ్చునా? చేయవచ్చునని మనస్సునందైన నీవనుకొన వచ్చునా?

కం॥ వారలదుర్మంత్రము నీ,వారఁగ దైవికమటంచు • నాత్మఁ దలఁచినన్
దీరగు నీకుం దదుపే,క్షారంభము నాకు నరుచి • యయ్యెన్ దానన్. ౬౩౨

దుర్మంత్రము=దురాలోచనము, దైవికము=దైవతంత్రమువలననయినది, తదుపేక్షారంభము=దానినుపేక్షించు యత్నము, దానన్=అదైవమందు.

తాత్పర్యము

కైకేయీ దశరథుల యాలోచన నీవు దైవతంత్రమంటివి. దైవమిట్టి దురాలోచనము కలిగించునేని యాదైవమును నీ వుపేక్షించుటయే తగినకార్యము. అట్టి దైవము నాకు రుచింపదు. క్రూరులు ప్రేరించు దైవము దైవమా పూజ్యమా.

కం॥ బలహీను లల్పతేజులు, బలవంతము దైవ మనుచుఁ • బలికెద రన్నా
బలయుతులు కీర్తికాములు, కలనైనం దలఁపఁ బోరు • గా దైవంబున్.

తాత్పర్యము ౬౩౩

బలములేనివారు అల్పతేజస్సుగలవారు దైవము బలిష్ఠమనుచుందురు. ఏల? వారు కార్యములు సాధించుబలము తెలివిలేక నిందతమయందు మోపుకొన నిష్టములేక దైవముపైఁ బెట్టుచుందురు. ఇఁక బలవంతులు_ కీర్తినిగోరువారు దైవమొకటియున్నది అని కలయందైన ననుకొనరు. పురుషకారముచే స్వకార్యమును సాధించి కీర్తి పొందుదురు. అట్టివారిని దైవమేమి చేయఁగలిగెను.

దైవం క్లీబా ఉపాసతే. భార. ౧౨. ౧౩౮. ౮౨.

కారింపఁబడక = బాధపడక.

కం॥ పౌరుషబలమున దైవము, దూరంబుగ నెట్టుఘనుఁడు • తుద దైవముచేఁ
గారింపఁబడక నిజకా,ర్యారంభముఁ దీర్చుకొను స • మర్థుం డగుటన్. ౬౩౪

తాత్పర్యము

బలముగల గొప్పవాఁడు పౌరుషబలముచే దైవమును దగ్గఱరాకుండఁ దఱుమఁగొట్టి కడపట దైవముచే నేబాధపడక సమర్థుఁడగుటచేఁ దనకార్యము చక్కఁజేసికొనును.

కం॥ దైవబలంబే యెక్కుడొ, వావిరిపురుషునిబలంబె • వరమొ, లోకుల్
దైవపురుషబలభేదం, బోవిరవతంస! చూతు • రొప్పుగ నిపుడే. ౬౩౫

అన్నయ్యా! నీవు దైవబల మెక్కువ యనుచున్నావు. నేను పురుషబల మెక్కువనుచున్నాను. దైవము చేయునది చేసినది. ఇఁక పురుషబలముచే సాధ్యమైనది చేసెదను. అప్పుడు దైవబలమే యెక్కుడో పురుషబలమే యెక్కుడో లోకులిప్పుడే చూచెదరుగాక.

ఉ॥ దైవముచేతఁ గీడ్వడిన • తావక పట్టమహోత్సవంబు నా
దౌవరపౌరుషంబున ర • యంబునఁ దీర్పఁగ, ధారణీజను
ల్దైవము పౌరుషోద్ధతిని • లావఱి కూలినఁ జూచి, యాత్మలో
దైవముకంటెఁ బౌరుషమె • తద్దయు మేలని యెంచఁ జేసెదన్. ౬౩౬

కీడ్వడిన=చెడిన, తావక = నీయొక్క, పట్టమహోత్సవంబు = పట్టాభిషేక మహోత్సవము, తీర్పఁగన్=చక్కఁజేయఁగా, పౌరుషోద్ధతిని=పౌరుష + ఉద్ధతిని = పౌరుషాతిశయముచేత, లావఱి=లావు+అఱి=బలముచెడి.

### తాత్పర్యము

దైవముచేతఁ జెడిన నీ పట్టాభిషేకమహోత్సవము నా పురుషకారబలమునఁ ద్వరగాఁ జక్కఁజేయఁగా లోకమునందలి జనులు పురుషకారముచే దైవతంత్రము బలహీనమై చెడిపోవుటచూచి దైవముకంటెఁ బురుషకారమే బలమని తలఁచునట్లు చేసెదను.

ఉ॥ భూరిమదోత్కటంబు సృణి • పోటులఁ జిక్కక ఛిన్నశృంఖలం
బై రయమారఁ బైనుఱక • నట్టి మరల్చెడిరీతి దైవమున్
సారతరోగ్రపౌరుషమె • సాయముగాఁగ మరల్తుఁ జూడుమీ
యోరిమి, నామతంబునకు • నూఁకొనుమీ, కనుమీ యథాస్థితిన్. ౬౩౭

భూరిమదోత్కటంబు=గొప్పమదపుటేనుఁగు, సృణిపోటులన్=అంకుశము పొడవులచే, ఛిన్నశృంఖలంబై=త్రెంచుకొన్న సంకెలలుగలదై, సారతర = మిక్కిలి సత్తువగల, ఉగ్ర=భయంకరమైన పౌరుషమే=పురుషప్రయత్నమె, సాయము=సహాయము, ఓరిమిన్=ఓర్పుచేత, ఊఁకొనుమీ = అంగీకరింపుమీ, యథాస్థితిన్ = ఉన్నదున్నట్టు.

### తాత్పర్యము

గొప్ప మదించిన యేనుఁగు అంకుశముల దెబ్బలను లక్ష్యముసేయక సంకెలలు త్రెంచుకొని వేగముగఁ దనమీఁదికిఁ బరువెత్తిరాఁగా మరలించునట్లు దైవమును బలవంతమైన పౌరుషము సహాయముగా మరలించెదను. తాలిమిగలిగి చూడుము. నా యభిప్రాయము నంగీకరింపుము. ఉన్నదున్నట్టు చూడుము.

శా॥ అన్నా! నీయభిషేకముం జెడఁగఁజే • యన్ లోకపాలాళి యా
సన్నంబై యెదిరించి నిల్చిన జగ • త్సంఘాతముల్ పూని డీ
కొన్నన్ నేరవు, తండ్రి జెప్పవలెనా • ఘోరాటవి న్నిన్ను నా
పన్నుం జేయఁగ గోరువారి ననుతుం • బద్మాలుగేం డ్లుండఁగన్. ౬౩౮

లోకపాలాళి=అష్టదిక్పాలుర సేనలతోడ, ఆసన్నంబై=సమీపించి, జగత్= లోకముల, సంఘాతములు=సమూహములు, ఆపన్నున్=ఆపదనొందువానిఁగా.

తాత్పర్యము

అన్నా! నీపట్టాభిషేకమును జెఱుపఁగోరి యొనమంఁద్రుడు దిక్పాలురు సేనల తోడ నెదిరించి నిలిచినను వారేమిలెక్క యన్నిలోకముల జనులేకమై దీకొనినను వారివలనఁగాదు. ఇఁకఁ దండ్రియెదిరించిన నతఁడొకలెక్కా. ఆయన రానే వచ్చెనా- నిన్నుగదా పదునాలుగేండ్ల డవిలోవిపత్తుల పాలుచేయఁ జూచు చున్నాఁడు. ఆపదు నాలుగేండ్లాయన యడవిలోనుండఁ బంపెదను.

కం॥ నీ కభిషేకము సేయక, యాకొడుకున కవనిఁ గూర్చు♦నాజనకున కా
కైకేయి కాశఁ గోయుచుఁ,బ్రాకటముగ వారినెట్లు♦పఱతునొ కనుమీ. ౬౭౯

తాత్పర్యము

అభిషేకము నీకుసేయక వారికొడుకునకు రాజ్యమీయఁ జూచు దశరథు నికిఁ గైకేయికి ఆశ నాశముచేసి వారేపాట్లుపడఁ జేయుదునో చూడుము.

కం॥ పరిపంథులకును నాభీ,కరపౌరుష మెట్లు దుఃఖ♦కారణ మగు నా
కరణిని దైవము వారికిఁ, బరఁగింపఁగ లేదు సుఖము♦పద్మదళాక్ష. ౬౮౦

పరిపంథులకును = పగవారికి, భీకరపౌరుషము = భయంకరమైన పౌరు షము, ఆకరణిని = ఆవిధముగ.

తాత్పర్యము

కమలనయనా! శత్రువులకు నా భయంకరపౌరుష మెట్లు దుఃఖము కలి గించునో యట్లు దైవము వారికి సుఖము కలిగింపలేదు.

చం॥ భరతున కెట్లు వచ్చు మహి? ♦ పాలన సేయుచు వేలయేండ్లు నీ
వరిగినఁ గాన కంత భవ♦దాత్మజు లుర్వి వహించువారుగా
భరయఁ బురానృపాచరిత♦ మట్టిద కాదె? జనంబులన్ సుతో
త్కరములఁ నేలఁ జెప్పి మఱి♦ కానల కేగరె తొల్లి భూపతుల్? ౬౮౧

భవదాత్మజులు=నీకొడుకులు, పురానృపాచరితము=పూర్వపురాజు లాచ రించినది, సుతోత్కరములన్ = పుత్రసమూహములను.

తాత్పర్యము

అన్నా! భరతునకు రాజ్య మెప్పుడైన నెట్లువచ్చును? నీవరణ్యమునకుఁ బోవలసిన కాలమేది? నీవు వేలయేండ్లు భూమిపాలించి యడవికిఁబోఁగా నీ కొడుకులుగదా రాజ్యము పాలింపవలసినవారు.పూర్వపురాజు లట్టులేకదా చేసిరి. పుత్రులారా మీరు జనులఁబాలింపుఁడని చెప్పి యావలఁగదా వానప్రస్థులై తొల్లి రాజులు వనములకేగిరి. నీవేదిలేక యెట్టు లడవికిఁ బోయెదవు.

ఉ॥ చంచలచిత్తుఁ డానృపతి ♦ శాత్రవ మూనిన రాజ్య మెట్లు ని
శ్చంచలవృత్తిఁ గ్రాలు నని ♦ సందియపాటునఁ బూనవేని, నీ

యంచితరాజ్య మంతయు మ॥హాంబుధి నాఁగెడివేలభంగి ర
క్షించెద, బాస చేసెద, న॥శించుత౯ దప్పిన వీరలోకముల్. ౨౨

చంచలచిత్తుఁడు=స్థిరబుద్ధి లేనివాఁడు, నిశ్చంచలవృత్తి=కలఁతలేక నిమ్మళముగా.

తా త్ప ర్య ము

అన్నా! నీకు మఱియొక సందేహముండవచ్చును. అదియేమనెదవా? నీవు పట్టాభిషేకము చేసికొనఁగా స్థిరబుద్ధిలేనిరాజు తనకుఁ దనవారికి రాజ్యములేక పోయెఁగదాయని విరోధము పూనెనేని రాజ్యమున నల్లకల్లోలములు పుట్టకుండునా యను సందేహముతో రాజ్యభారముఁ బూనుట కిష్టపడవేని నేను ప్రమాణముచేసి చెప్పెదను. రాజ్యమంతయుఁ జెదరకుండ సముద్రమును జెలియలికట్ట నిలిపినట్లు నేను నిలిపెదను. అట్లుచేయకపోయితినేని నావీరలోకములు నశించిపోవునుగాక.

కం॥ అభిషేకమునకు నియ్యెడ, శుభవిధిగా నియ్యకొనుము॥చొర నిమ్ము మదిన్
ప్రభువుల నెల్లను నాబల, విభవంబున నే నొకండ॥విదళింతుఁ జుమీ. ౨౩

శుభవిధి=శుభకార్యము, బలవిభవము=బలసంపద- అధిక బలము, విదళింతున్=చీల్చివైచెదను, ఇయ్యకొనుము=అంగీకరింపుము.

తా త్ప ర్య ము

రామచంద్రా శుభకరముగ నభిషేకమునకు నంగీకరింపుము. దానియందు మనస్సుపోనిమ్ము. మనకు విరోధించిన నెల్లరాజులను నాబలాతిశయముచే నేనొకఁడనే విదళించెదను సుమా. నీ వూరక చూచుచుండుము.

శా॥ అన్నా! మద్భుజదండయుగ్మమిది శో॥భార్థంబు గాదన్న, వి
ల్లన్నన్ నాకది భూష గాద, యసినా॥ నాబంధనార్థంబు గా
దెన్నన్ బాణము తూణి మోఁత కయి కా॥దీనాల్గు ద్విట్చక్రమున్
ఛిన్నాంగంబుగఁజేసి కండలను ప్ర॥చ్ఛేదింపఁగా జుమ్మనిన్. ౨౪

మద్భుజదండయుగ్మము=దండములవంటి నారెండు భుజంబులు, శోభార్థంబు=ప్రకాశించుకొఱకు, భూష=అలంకారము, అసినాన్=కత్తియనఁగా, ఆబంధనార్థంబు=నడికట్టు దానియందలి బాకు, చూచువారు ఇది వీరులయలంకారమని తలంచుకొఱకుఁగాదు. తూణి=అంబుల పొది, మోఁతకయి = బరువు తక్కువయని మోసికొని తిరుగుటకుఁగాదు, ద్విట్చక్రమున్=శత్రువుల సమూహము, ఛిన్నాంగంబుగన్=ఛేదింపఁబడిన యవయవములఁ గలది యగునట్లు, ప్రచ్ఛేదింపఁగాన్=మిక్కిలి నఱికివైచుటకు.

తా త్ప ర్య ము

అన్నా! అడ్డగడియ ప్రమాఁకులవలెనుండు నారెండు భుజములు దేహమును శోభిల్లఁజేయుటకుఁగాదు. విల్లు నాకు నలంకారమునకుఁగాదు. ఖడ్గము వీరా

లంకారముగా నడికట్టున దోపుటకుఁగాదు. మఱిదేనికై యివి ధరించితి నందువా శత్రు సమూహమును యుద్ధమందు ఛిన్నము భిన్నముచేసి కండలను దునుకలు తునుకలుగా నఱికివైచుటకుఁ జుమా.

కం॥ ఏవాఁడు నాదుపగతుం, డై వర్తిలు వానియునికి • నైన సయిఁప నే
నావజ్రినైనఁ ద్రుంచెద, శ్రీవిద్యుచ్చలితకాంత • శితఖడ్గమునన్. ౨౫

పగతుఁడు=విరోధి, ఉనికి=జీవించి యుండుటయైన, వజ్రి=ఇంద్రుఁడు, శ్రీవిద్యుచ్చలిత...ఖడ్గమునన్=కాంతిగల మెఱుపువలెఁ జలించు కాంతిగల వదునైన కత్తిచేత.

తాత్పర్యము

నాకు విరోధియెవఁడో వాఁడు ప్రాణముతోనుండుటయైన సహింపను.అట్టివాఁడింద్రుఁడైనను మిగుల కాంతిగల మెఱుపులవలెఁ జలించు కాంతులుగల ఖడ్గముచే దూరమునసుండి బాణములచేఁగొట్టికాదు పైపడిపోయి ఖండించెదను.

తే॥ ఖడ్గనిష్పేషనిష్పిష్ట • గజనరాశ్వ,హస్తమూర్ధోరుసంచయ • వ్యాప్తిధరణి
దుశ్చరంబయిగహనమై•తోఁపఁజిత్ర,
గతులమెఱయుచుఁబగతురఁ•గుతిలపఱుతు. ౨౬

ఖడ్గ....ధరణి – ఖడ్గనిష్పేష=కత్తిదెబ్బలచేత, నిష్పిష్ట=తెగఁగొట్టఁబడిన, గజ=ఏనుఁగులు, నర=మనుష్యులు, అశ్వ = గుఱ్ఱములు వీనియొక్క హస్త = చేతుల, మూర్ధ=శిరముల, ఉరుసంచయ=గొప్పకుప్పలచే, వ్యాప్తి = వ్యాపించుట, ధరణి=భూమి, దుశ్చరంబయి=మనుష్యులు సంచరింప సాధ్యముకాక, గహనమైచొచ్చుటకును సాధ్యముగాకయుండునట్లు, తోఁపన్ = కనఁబడఁగా, పగతురన్=శత్రువులను, కుతిలపఱుతున్=నశింపఁజేయుదును.

తాత్పర్యము

కత్తిదెబ్బలచేత నఱకుడు వడిన యేనుఁగులయు మనుష్యులయు, గుఱ్ఱములయు తొండములయు చేతులయు శిరములయు గొప్పకుప్పలు భూమినిండ వ్యాపింపఁగా మనుష్యులు సంచరించుటకననేల లోపలఁ జొచ్చుటకే సాధ్యపడనట్లు చిత్రగమనములఁ బ్రకాశించుచు శత్రువులను నాశము చేసెదను.

తే॥ మామకీననిశాతోగ్ర • మండలాగ్ర,చటులధారావిదారిత • శాత్రవేభ
మండలంబులు శంపాస•మగ్రవారి,ధరములట్టుల వ్రాలును • ధరములట్ల.

మామకీన=నాయొక్క, నిశాత=పదునైన, ఉగ్ర=భయంకరమైన, మండలాగ్ర=కత్తియొక్క, చటులచేఁ=కదలుటచేఁ దళతళక్కు తళతళక్కుమని మెఱయు, ధారా = వాదరచేత, విదారిత = చీల్పఁబడిన, ఇభమండలంబులు = ఏనుఁగు గుంపులు, శంపాసమగ్ర=మెఱుపులతోనిండిన, వారిధరములట్టులు=మేఘముల వలె, ధరములట్లు=కొండలవలె, వ్రాలును=నేలఁబడును.

లోహితోదాం, కేశతృణాం, మహీం కరోతి యుద్ధేషు
క్షత్రియో యస్స్వధర్మవిత్॥ భార. ౧౨. ౭౭. ౧౮.

నెత్తురనెడి నీళ్ళు, కేశములనెడి గడ్డిపోఁచలు, ఏనుఁగులనెడి కొండలు, ధ్వజములనెడి చెట్లుగలదానిగా భూమిని నెవఁడు యుద్ధమందుఁ జేయునో యా క్షత్రియుఁడు ధర్మమెఱిఁగినవాఁడు.

వధమేవ ప్రశంసంతి శత్రూణా మపకారిణామ్. భార. ౧-౧౪౦-౧౦
అపకారముచేసిన శత్రువులను జంపుటే శ్లాఘ్యము.

తాత్పర్యము

వదునై భయంకరమైన నాకత్తియొక్క చలించువాదరచేఁ జీల్పఁబడిన యేనుఁగు గుంపులు మెఱుపులతోడి మేఘములవలెఁ గొండలవలె నేలఁగూలును.

తే॥ బద్ధగోధాంగుళిత్రాణ•పరిగృహీత,భూరిచాపుఁడ నై రణ•భూమి నిల్వ
నెవఁడు శూరుండనని వచ్చి•యెదుట నిలుచు,
గుండెగలవాఁడు ధారిణీ•మండలమున? ౨౮

బద్ధ=కట్టఁబడిన, గోధా=ఉడుముచర్మముచే చేయఁబడిన, అంగుళిత్రాణ=వ్రేళ్ళను రక్షించు జీరా (Glove) చేత, పరిగృహీత = చక్కఁగా గ్రహింపఁబడిన, భూరిచాపుఁడనై=పెద్ద విల్లుగలవాఁడనై.

తాత్పర్యము

ఉడుముచర్మముచే వ్రేళ్ళకు రక్షకముగాఁ జేయఁబడిన కవచముతోడ పెద్ద వింటిని ధరించినవాఁడనై యుద్ధభూమియందు నిల్వఁగా నేను శూరుఁడనని యెదిరించి వచ్చి నాయెదుట నిలువఁగల ధైర్యముగలవాఁడు భూమండలమున నెందుఁగలఁడు.

కం॥ ఒక్కనిఁ బెక్కుశరంబులఁ, బెక్కుర నొక్కంటఁ గ్రుచ్చి•పీనుఁగు పెంటల్
గ్రక్కునఁ జేయనె పగఱం? జెక్కాడనె వారివాజి•సింధురరథముల్? ౨౯

శరంబులన్=బాణములచే, పగఱన్=శత్రువులను, వాజి=గుఱ్ఱములను, సింధుర=ఏనుఁగులను, రథములన్=తేరులను, చెక్కాడనె=చెక్కలు చెక్కలుగా నఱకివైవనా.

తాత్పర్యము

ఒకని పెక్కు బాణములచేతను పెక్కుర నొక్క బాణముచేతను నొక్కటిగాఁ గ్రుచ్చి పగవారిని పీనుఁగు పెంటలుగాఁ జేయనా. వారి గుఱ్ఱములను ఏనుఁగులను రథములను జెక్కలు ముక్కలు చేయనా.

కం॥ ఇప్పుడ నృపునేలుబడిం, దప్పించి ప్రభుత్వమెల్లఁ • దటుకున నీకే
యప్పించెడిఁ గనుఁగొనుమీ, మెప్పైన మదస్త్రలసద•మేయబలంబున్.

ఏలుబడిన్=ప్రభుత్వమును, అప్పించెదిన్=అర్పించెదిని, మదస్త్ర=నాయస్త్రములు, లసత్=ప్రకాశించుచు, అమేయ=మితి మీఱిన, బలంబున్=బలమును, అర్పించు- తద్భవము అప్పించు- సర్పము=సప్పమైనట్టని యూహించునది.

తాత్పర్యము

అన్నా! పరిమితిపెట్టరాని, నాయస్త్రబలమునఁజూడుము; ఇప్పుడే యిప్పుడే యీముహూర్తమునందే దశరథుని ప్రభుత్వముఁ దప్పించి దానిని నీకే యర్పింపఁగలను.

ఉ॥ చందనసుందరంబులు, ప్రశస్తతరాంగదరంగభూము, ల
స్పంద వసుప్రదానవిభవంబులు, మిత్రజనావనక్రియా
నందనముల్, సుయోగ్యములు నాభుజదండము లిప్డు సల్పెడిన్
జిందఱవందఱల్ త్వదభిషేకనివారణకర్మశీలురన్. ౯౧

చందనసుందరంబులు=శ్రీగంధపుఁబూతలచే నందమైనవి, ప్రశస్తతర=మిక్కిలి ప్రశస్తములైన, అంగద=భుజకీర్తులయొక్క, రంగభూములు=నాట్యమాడుస్థలములు- అనఁగా నుండునవి యనియర్థము. అస్పంద=చలింపని,వసు=బంగారు మొదలగు ధనములయొక్క, ప్రదాన=విశేషముగ దానముచేయుటయును, విభవంబులు=ఐశ్వర్యముగలవి, మిత్రజన=స్నేహితులగువారిని,అవన=రక్షణను, క్రియా=కార్యములందు, ఆనందనముల్=మిక్కిలి సంతోషించినవి, సుయోగ్యములు=ధరింప మిగుల సర్థములు గలవియుగు, భుజదండములు=దండములవంటి నాభుజములు, త్వదభిషేక నివారణ కర్మశీలురన్=నీయభిషేకమును నడ్డగించు కార్యము స్వభావముగాఁగలవారిని, చిందఱవందఱ=ఒకటిగా లేక చెదరిపోయి కలఁతపడునట్లుగా.

తాత్పర్యము.

గంధపుఁబూఁతలచే నందమై-మిగులఁ బ్రశంసింపఁదగిన భుజకీర్తులు ధరించునవియై విశేషధనముల దానముచేయుగుణమే యైశ్వర్యముగాఁగలవై మిత్రజనుల రక్షించుకార్యముపట్ల సంతోషముగలవై యిట్టికార్యములకు మిగులఁ దగినవైన నాభుజదండములు నీపట్టాభిషేకము జరుగనీయక యడ్డము వచ్చువారిని నానాముఖములఁ జెదరఁగొట్టి కలవరపడఁజేయును.

కం॥ నీకింకరుండ, ధారిణీ, నీ కెట్లు లభించుదాని నిం దెలుపుము, యి
ప్డా కానివాని నిలఁ బ్రాణాకలితుఁడు గాక యుండ నలఁచెద నధిపా. ౯౨

కింకరుఁడన్=బంటను, కానివానిన్=దానికడ్డమువచ్చు విరోధిని, ప్రాణాకలితుఁడు=ప్రాణముతోనుండువాఁడు, అలఁచెదన్=బాధించెదను.

తాత్పర్యము

రామచంద్రా! నేను నీసేవకుఁడను. కావున నీయాజ్ఞాప్రకారము వర్తింపవలసినవాఁడనే కాని స్వతంత్రించి నేనేకార్యము చేయు యోగ్యత నాకులేదు.

నీవాజ్ఞాపించినది చేయుట నాకువిధి- కావున నేవిధముగ రాజ్యములభించునో దానిని నీవేచెప్పుము. నీయిష్టప్రకారము వర్తించునపు డెవఁడు దానికి నడ్డము వచ్చునో యావిరోధిని ప్రాణముతో నుండనీయను. నీయాజ్ఞ వేచియున్నాను.

కైకేయి దశరథుల యిష్టముచొప్పునఁ దా నరణ్యమునకుఁ బోయెదనని శ్రీరామచంద్రమూర్తి కౌసల్యతోఁ జెప్పినపుడు లక్ష్మణుఁడు నీవట్లు చేయుట సరిగాదు. నీకు రాజ్యమురాకుండఁజేయుటకై వారు కుటపుఁ బన్నాగము పన్నిరే కాని యది నిజముగాదు. వంచకులవంచన ఫలింపఁజేయరాదు. కావున నీవరణ్యమునకుఁబోరాదనెను.

లక్ష్మణా: నీవు కైకేయిని దూషింపరాదు. ఈరాజ్యాభిషేక విఘ్న మామె కృతముగాదు. దైవకృతము. ఆమె నిమిత్తమాత్రమే. కావున నామెమీఁదఁ నీవేల యాయాసపడెదవు. దైవమే మేళ్ళకీళ్ళకుఁ గారణము. ఆమె కాబుద్ధి పుట్టించినది దైవమే. అటుగాకున్న నామీఁద నెంతో ప్రేమకలిగి వర్తించువారికి నిట్టి విషమబుద్ధి నిమిషములో నేలకలిగెను. దైవ మప్రతిహతము. ఏవేళకు నెవరిచే నేమిపని యెట్లు చేయించునో తెలియదు. అట్టివానితో నెవఁడు పోరఁ గలడు. అని రామచంద్రమూర్తి సమాధానము చెప్పెను.

లక్ష్మణుఁడు అన్నా! నీవు చెప్పినది సరిగాదు, దైవము పరాధీనమైనది. అది స్వతంత్రించి యేకార్యము చేయఁజాలదు. అట్టిదానిని నమ్ముకొని దైవ మిచ్చునని పురుషప్రయత్నము చేయకుండుట సరిగాదు. దైవేనదేయమితి కాపురుషావదంతి, అసంశయందైవపరః క్షిప్రమేవ వినశ్యతి-భార-౧౨-౧౦౫-౨౨ - దండఏవహి రాజేంద్ర క్షత్రధర్మోనముండనమ్-భార-౧౨-౭- -౪౩ దైవమేగతియని యుండువాఁడు శీఘ్రముగ నిస్సందేహముగ నాశమగును. రాజులకు దండము ధర్మముగాని ముండనము (సన్న్యాసము)గాదు,దైవము బలిష్ఠమని నీవనినఁబౌరుషము బలిష్ఠమని నాయభిప్రాయము. దైవపక్షమున దశరథుఁడు లోనగు భరతపక్షులు రానిమ్ము-పౌరుషపక్షమున నేను నీయాజ్ఞచొప్పున నిలిచెదను. నీదైవ మేపాట్లుపడునోచూడుము, అనెను. దీనివలన దైవమున కంటెఁ బౌరుషమే శ్రేష్ఠమని లక్ష్మణువాదము, అది నిరాధారమైనదికాదు.

మహాభారతంబున :—

శుభేన కర్మణాసౌఖ్యం, దుఃఖం పాపేనకర్మణా,
కృతంఫలతి సర్వత్ర, నాకృతం భుజ్యతే క్వచిత్
కృతీ సర్వత్రలభతీ, ప్రతిష్ఠాభాగ్య సంయుతామ్.
అకృతీ లభతేభ్రష్టః, క్షతేక్షారావసేచనమ్.
తపసారూపసౌభాగ్యం, రత్నానివివిధానిచ,
ప్రాప్యతే కర్మణాసర్వం, నదైవాదకృతాత్మనా,

సర్వం పురుషకారేణ, కృతేనేహోపలభ్యతే
జ్యోతీంషి త్రిదశానాగాః, యక్షశ్చంద్రార్కమారుతాః
సర్వేపురుషకారేణ, మానుషా దేవతాంగతాః.
అర్థోవా మిత్రవర్గోవా, ఐశ్వర్యం వా కులాన్వితమ్
శ్రీశ్చాపి దుర్లభాభోక్తుం, తథైవకృత కర్మభిః
స్వంచేత్కర్మఫలం నస్యాత్, సర్వమేవా ఫలంభవేత్.
లోకేదైవ సమాలంబ్య, ఉదాసీనోభవేన్నతు।
అకృత్వా మానుషంకర్మ - యోదైవ మనువర్తతే.
వృథాశ్రామ్యతి సంప్రాప్య, పతింక్లీబమివాంగనా ॥

శుభకార్యములు చేసినవాఁడు మేలు, పాపకార్యములు చేసినవాఁడు కీడు ననుభవించుచున్నాఁడు గాని చేయనివానికి ఫలములేదు. కార్యముచేయువాఁడే యెందుఁజూచినను భాగ్యముతోఁ బ్రతిష్ఠగాంచుచున్నాఁడు కార్యముచేయని వాఁడు భ్రష్టుఁడగుచున్నాఁడు. తపస్సుచేతనే రూపసౌభాగ్యములు వివిధరత్నములు గలుగుచున్నవి. కర్మముచేతనే సర్వము కలుగుచున్నవి. కానిచేయని వానికి దైవమేదియు నిచ్చుటలేదు. స్వర్గము - భోగము - నిష్ఠామనీషిత్వము సర్వము పురుషకారముచేతనే లభించుచున్నది. దేవతలు నాగులు యక్షులు- సూర్యచంద్రమారుతులు లోనైనవారు మనుష్యులుగానుండి పురుషకారముచేఁగదా దేవతలైరి. అర్థము- మిత్రులు నైశ్వర్యములోనైనవి పురుషకార లభ్యములే- కర్మఫలము లేదనునెడల సర్వము నిష్ఫలమైపోవును. లోకము దైవము నాలంబనముగాఁ గొని పురుషకారమునం దుదాసీనులుకారాదు. మనుష్యుఁడు చేయవలసిన కర్మముచేయక దైవమన్ని యిచ్చునని యుండువాఁడు నపుంసకుఁడగు భర్తను గట్టుగొన్న స్త్రీవలె వ్యర్థుఁడు. ఇత్యాదివాక్యములచే దైవమునకంటెఁ బౌరుషము బలిష్ఠమని తోఁచుచున్నది. రామచంద్రమూర్తి దైవమే బలిష్ఠమని చెప్పెను. దైవ పౌరుషములకుఁ బరస్పర విరోధము కానవచ్చుచున్నది. ఇదియెట్లనినఁ బురుషకారమే లేక దైవమే కార్యము చేయఁజాలమి సత్యమే- దైవసాహాయ్యమే లేక కార్యము ఫలింపమియు సత్యమే. కావున నొకఫలము గావలసిన రెండును గావలసినవే.

గీ॥ పౌరుషము దైవంబు తోడ్పాటులేక ఫలముఁ గాంచంగనేరదు పార్థివేంద్ర
విత్తు సహకారి కాకున్న రిత్తనేల వంధ్యమగుఁగాక తాఫలవంతమగునె ?

చం॥ వెరవున లావునం గృషికివేయివిధంబుల మేలొనర్చినం
దొరకొనునె ఫలంబు దతితోఁదగు వర్షములేకయున్న నె
వ్వరుసున లెస్సచేసినను బౌరుషముల్ ఫలియించుటెల్ల నా
దరణము నం బ్రసన్నమగు దైవముచేఁ తన చూపెఫల్గునా.

యథాగ్నిః పవనోద్ధూతః । సూక్ష్మోపి సుమహాభవేత్
తథా కర్మసమాయుక్తం, దైవం సాధువివర్ధతే.

గాలి విసరెనేని సూక్ష్మమైనదైనను నగ్ని యెట్లు పెద్దగా విజృంభించునో యట్లు పురుషకారముతోఁగూడిన దైవము మిక్కిలి వృద్ధిచెందును.

ఇట్లుండ రామచంద్రమూర్తి యేల పురుషకారమున కనుజ్ఞయీయలేదు. రామచంద్రమూర్తి పురుషప్రయత్నము వ్యర్థము. దైవమే కార్యసాధక, మను నభిప్రాయముగలవాఁడుకాఁడు. అట్టి యభిప్రాయము గలవాఁడై యుండెనేని సీతాదేవి నిమిత్తమై యంతటి పురుషకారము చేసియేయుండఁడు. దైవమే సీతను దెచ్చియిచ్చునని యూరకుండును. ధర్మవిరుద్ధ పురుషకార్యము రామచంద్రమూర్తికి సమ్మతముగాదు. లక్ష్మణు పురుషకారమునకుఁ బ్రథమ కబళము దశరథుఁడగును. అనఁగా రాజ్యకాముకత్వముచే తండ్రిని బీడించినవాఁడగును. అదితుచ్ఛము. కావున రామచంద్రమూర్తి యీవిషయమునఁ బురుషకార మంగీకరించినవాఁడుకాఁడు. రామచంద్రమూర్తి యీయభిప్రాయము గలవాఁడని యాయన లక్ష్మణుతోఁ జెప్పినమాటలవలనఁ దెలియనయ్యెడి. అయో-౧౪౨ పద్యము.

చం॥ ఏనొకరుండనే పుడమినెల్ల నయోధ్యను శాతబాణ సం
తాన విదారితంబుగ నొనర్పఁగఁజాలనె? కారణంబులే
కేను బరాక్రమింపఁదగునే? పరలోకభయంబు ధర్మ బీ
జ్ఞానము మాన్చెడి న్నను నసాధ్యమె పట్టము కట్టుకొంటయున్.

శ్రీరామచంద్రమూర్తి యభిప్రాయము దీనివలన స్పష్టము.

కావున నాయన పురుషకారవిరోధిగాఁడు, అన్న యరణ్యమునకుఁబోయి కష్టపడుట కిష్టములేక యెట్లైన నన్న నయోధ్యయందుండఁజేయు సద్భావముతో లక్ష్మణుఁడు వాదించెనేకాని యాయన దైవవిరోధిగాఁడు.

ఇచ్చట లక్ష్మణువాదము సాధువాదమా దుర్వాదమా యని విచారింపవలయును.

వంశసంప్రదాయమునుబట్టి శాస్త్రమర్యాదనుబట్టి శ్రీరామచంద్రమూర్తి జ్యేష్ఠుఁడగుటచే రాజ్య మాయనకు లభింపవలసినది విధి. దానిని దప్పించు నధికారము దశరథునకు లేదు. రాజ్యము దశరథ స్వార్జితముకాదు. తనయిష్టప్రకారము వినియోగించుటకు పైతృకము కావున వంశమర్యాదయనుల్లంఘనీయము. ఇంటిలోని వస్త్రాభరణాదులవలె రాజ్యము దశరథునకు సొంతద్రవ్యముగాదు. రాజ్యపాలన నిమిత్తమై రాజులేర్పడిరికాని రాజులనిమిత్తమై రాజ్యము పుట్టలేదు కావునఁ గ్రొత్తరాజేర్పడునప్పుడు ప్రజలసమ్మతి యావశ్యకము. అది శ్రీరాము నకే యనుకూలమై యున్నదని దశరథుఁడు చేసిన సభయందును నావల జనుల చర్యచేతను స్థాపితము. ప్రజలు సమ్మతించినవాఁడే రాజు. దానికి విరుద్ధముగా

వర్తించు నధికారము దశరథునకు లేదు. కావున దశరథుఁడు శ్రీరామునకు రాజ్యము రాకుండఁజేయుట లేనియధికారము తలపైఁ బెట్టుకొనుట యయ్యెను. ఇట్టి సందర్భమందు న్యాయ్యముగా శ్రీరామునకు రావలసినది సౌమ్యమార్గమున రాకున్నఁ బరాక్రమముచేనైన రాఁబట్టుకొన యత్నించుట లక్ష్మణునకుఁ దగినకార్యమేగాని విరుద్ధచర్యగాదు. యుద్ధముచేసినను నది ధర్మయుద్ధమే యగునుగాని యధర్మయుద్ధము కాదు.

దశరథుఁడు కైకేయీ వివాహకాలమందు రాజ్యముంకువ యిచ్చెఁగదా. ఆకారణమున శ్రీరామునకు రాజ్యము రాఁగూడదందురేని నూఱబద్ధాలాడి యొక పెండ్లిచేయు మన్న సామెతప్రకారముగను, "బరిణయంబులయందును బల్కు బొంకు సత్యాతిశయంబ" యగుటను వివాహకాలమునాఁటిమాట యీవిషయమునఁ బాటింపరాదు. అదియునుగాక శాస్త్రప్రకారము కౌసల్యాపుత్రునకు జ్యేష్ఠునకు శ్రీరామునకు రావలసినదని యుండుటచే శాస్త్రవిరోధముగా దశరథుఁడు వర్తించుటచే నాదానము దానముగాదు. వివాహమైనయనంతర మెంతకాలమైనను కౌసల్యకు, సుమిత్రకు సంతానము లేనికారణమున సంతానార్థియై దశరథుఁడు కైకను వివాహమాడెను. వంధ్యాసంభోగము వ్యర్థమని కైకతోనే భోగించుచుండెను. కౌసల్యకుఁ బుత్రులు గలుగరని నమ్మి కైకకు రాజ్యముంకువగ నిచ్చెను.

అదిగాకున్న యుద్ధకాలమునాఁటి వరములు గలవుగదా యందురేని యదియు గ్రాహ్యముగాదు. మగనిని భార్య బ్రతికించుకొనుట విధి. బ్రతికించుకొనకయున్న నానాఁడే విధవయై మూలఁబడియుండును. రామాయణమే పుట్టి యుండదు. సత్యవంతుని బ్రదికించుకొనిన సావిత్రికి మగఁడేమియిచ్చెను. కైక తాను జేయవలసిన కార్యము తన మాంగల్యమునకై చేసెనేకాని లోకోపకారబుద్ధినిగాదు. అయినను దశరథుఁడు మెచ్చి బహుమానములు తన ధనము భూములో పుట్రలో ఆభరణములో యిచ్చియుండవచ్చునుగాని శాస్త్రప్రకారము వరునిదై తనదిగాని దానిని దానెట్లు శాస్త్రవిరుద్ధముగా వినియోగపెట్టఁగలఁడు. కావునఁ దనసొంతసొత్తువలె రాజ్యమును యథేచ్ఛముగా భరతున కిచ్చునధికారము దశరథునకు లేదు. ఎటు చూచినను దశరథురాజు చేసినది సరిగాదు.

అట్లైనచో స్వధర్మ నిర్వహణదీక్షఁ బూనిన శ్రీరామచంద్రమూర్తి శాస్త్రప్రకారము తనకు రావలసినరాజ్యము రాఁబట్టుకొని క్షాత్రధర్మమున వర్తింపవలసియుండఁగా స్వధర్మమును విడిచి పరధర్మమైన వానప్రస్థాశ్రమమున నెట్లు మునివలెనుండ నంగీకరించెను. స్వధర్మనిధనంశ్రేయః పరధర్మో భయావహ యనుట శ్రీరాముఁడేల మఱచెనందురా.

శ్రీరామచంద్రమూర్తి దృష్టిపథము వేఱు. ఆయనవాదము వేఱు. రాజ్యము కావలయునని కాని వలదనికాని యావిషయమున నభినివేశముగలవాఁడు కాఁడు. రాజ్య... తద్దృష్టి లక్ష్మణుఁడు చూచెను. గృహధర్మదృష్టి శ్రీరాముఁడు చూచెను

కావున నిరువురకు దృష్టిభేదము కలదు. జీవతో వాక్యకరణాత్తని తండ్రి జీవించి యున్నప్పుడు ఆయన యాజ్ఞ నెఱవేర్పవలసినది పుత్రునకు విధి. ఆతండ్రి రాజైననుసరియు బిచ్చగాఁడైనను సరియు. తండ్రి తండ్రియే. ఆయనయాజ్ఞ యనుల్లంఘనీయము. కావున రామా! పట్టాభిషేకము చేసికోయనఁ జేసికొనెద ననెను. రామా యడవులకుఁ బొమ్మనినఁ దథాస్తనెను. ఇది పుత్రుని స్వధర్మము కాదా. అర్జునునివలె శ్రీరాముఁడే క్షత్రియధర్మమును తానై వదలి బ్రాహ్మణధర్మమును గ్రహింపఁబూనినవాఁడుకాఁడు. కావున బరధర్మావలంబన భీతి శ్రీరామునకులేదు. అటుగాక రాజ్యము దశరథుని స్వతంత్రపదార్థమని దాని వినియోగమందతనికి నధికారము గలదని యందురా. ఉండునుగాక అప్పుడును దశరథుఁడు తండ్రియే శ్రీరాముఁడు కొడుకే. పితృవాక్యపరిపాలన మవశ్యకార్యమే. తండ్రియిచ్చినది తీసికొనుట పుత్రధర్మము కాని ధనదాసుఁడై తండ్రితోఁ దమ్ములతోఁగలహించుట పుత్రధర్మముగాదుగదా. కావున శ్రీరాముని నిశ్చయము పితృవాక్యపరిపాలనము మేలైనను గీడైనను లాభకరమైనను నష్టికరమైనను పుణ్యమైనను బాపమైనను బుత్రున కవశ్యకర్తవ్యమనునదిగాని, జ్యేష్ఠాంశము పోఁగొట్టుకొనరాదు. తండ్రిని దోడఁబుట్టువులను జంపియైనఁ దన భాగము రాఁబట్టుకొనవలయునను విషయము స్థాపింపవలయుననికాదు. కావున నీవిషయమున భగవద్గీతా సందర్భమునకు దీనికి సంబంధము లేదు. ఈచర్యను ౬౯౩-వ పద్యమున శ్రీరాముఁడు పరిష్కరించుచున్నాఁడు.

చం॥ అని వచియించుతమ్మునయ॰నాంత వినిర్గతబాష్పవారి నొ
య్యనఁ దనకేల బోఁ దుడిచి ॰ సాదరభాషలఁ దేర్చి నాయనా!
జనకునిమాట పట్టుటయె ॰ సత్పథ మద్ది దొలంగనేర నే
ననయుత దానిఁ దీర్చుటయె ॰ సమ్మతమంచు నెఱుంగు మంచనన్. ౬౯౩

నయనాంత=కనుగొనలనుండి, వినిర్గత=బయలువెడలు, బాష్పవారిన్=కన్నీళ్ళను, ఒయ్యనన్=మెల్లగా, కేలన్=చేతితో, సాదరభాషలన్=ఆదరముతోఁగూడిన మాటలచే, తేర్చి = సమాధానపఱచి, సత్పథము = మంచిమార్గము, ననయుత = నీతితోఁగూడినట్లు.

తాత్పర్యము

ఈప్రకారము చెప్పుచున్న లక్ష్మణుని కనుఁగొనల నుండి జాఱుచున్న కన్నీళ్లను దనచేతితో మెల్లగాఁదుడిచి, యూఱడించి శ్రీరాముఁడు ప్రేమపూర్వకముగా నిట్లనియె; నాయనా! జనకుని యాజ్ఞప్రకారము వర్తించుటయే మంచిమార్గము_ "జీవతో వాక్యకరణాత్ ప్రత్యబ్దం భూరిభోజనాత్ గయాయాం పిండదానేన, త్రిభిః పుత్రస్య పుత్రతా." తండ్రి జీవించియుండఁగా నాయన చెప్పినట్లు చేయుటవలనను మరణించెనేని ప్రతి సంవత్సరము మృతిదివసమునాఁడు విస్తార మన్నదానము చేయుటవలనను, గయయందుఁ బిండము పెట్టుటవలనను, బుత్రుఁడు

పుత్రుఁడగుచున్నాఁడు అట్టివానియందుఁ బుత్రశబ్దము సార్థకము. కావున నట్టి మంచి మార్గమందుండి తొలఁగనేరను. మంచి నీతిమార్గమవలంబించి యీ వాక్యమును జక్కఁజేయుటయే నాకు సంతోషకరమైన కార్యము ఇది నాయభిప్రాయమని తెలిసికొనుము. అనిచెప్పఁగా.

—• ౨౪-వ సర్గము. కౌసల్య శ్రీరామునిశ్చయ మెఱింగి పరితపించుట. •—

చం॥ జనకనియోగపాలనమె • చల్పఁగ నిశ్చితచిత్తుఁ డైన పు
త్రునిఁ గని కోసలాత్మభవ • తోయజనేత్ర సుశీల బాష్పవా
రినిచయరుద్ధలోచన యు•రీణసధర్మపథావలంబి రా
మునిముఖపంకజంబు సుత•మోహమునం దిలకించి యి ట్లనున్. ౬౯౪

జనకనియోగపాలనమె=జనకుని యాజ్ఞపాలించుటయె, నిశ్చితచిత్తుఁడు=మనస్సున నిశ్చయించుకొనినవాఁడు, సుశీల=మంచిస్వభావముగలది, బాష్పవారి=కన్నీటి, చయ=సమూహముచే, రుద్ధ=అడ్డగింపఁబడిన, లోచన=చూపులు గలది, అరీణ=వంకరలేని, సధర్మ=ధర్మముతోఁగూడిన, పథావలంబి=మార్గము నవలంబించినవాఁడు, శ్రీరాముని ముఖపంకజంబు=శ్రీరాముని ముఖకమలము-ఇది యేకదేశి సమాసము- ధర్మపథావలంబి యను విశేషణము శ్రీరాముని ముఖపంకజంబు అను సమాసములోని శ్రీరాముని యనునొకపదముతో నన్వయించెను, కౌరవ ప్రాగసరుండు ధర్మసుతుపన్పిది - భార. ఇత్యాదిప్రయోగములు గలవు. శ్రీరాముని యనుషష్ఠ్యంత విశేష్యమునకు ధర్మపథావలంబియను ప్రథమాంతపదము విశేషణము. సుతమోహమునన్=పుత్రుఁడను మోహముచే, తిలకించి=చూచి, తనకొడుకను వ్యామోహముచేఁజూచి వగచెనుగాని లోకోద్ధారకము నకై పుట్టినకొడుకను దృష్టిఁ జూచినదికాదు. ఈవిషయము సీతాదేవిముందు చెప్పఁగలదు.

తాత్పర్యము

తండ్రియాజ్ఞ పాలింప నిశ్చయముచేసికొనిన కుమారునిఁజూచి సాధుచరిత్ర యగు కౌసల్యాదేవి కన్నీళ్ళు దృష్టుల నడ్డగించుచుండఁగా చక్కని ధర్మమార్గమందు నడుచుచుండిన రామచంద్రమూర్తి ముఖకమలమును పుత్రవ్యామోహముచేఁ జూచి యిట్లు చెప్పెను.

ఉ॥ ఎన్నఁడు దుఃఖముం గనఁగ • నెట్టి దొకో యెఱుఁగండు, ధర్మసం
పన్నుఁడుసర్వభూతహిత • మార్గముఁ దెప్పఁడు, నాకు నాతి కు
త్పన్నుఁడు, విక్రమాఢ్యుఁడు,ప్ర • భావితవుం, డెటులొక్కొ కానలో
నెన్నుల నొక్కరొక్కటిగ • నేతి భుజించు, భజించుఁ గష్టముల్. ౬౯౫

ధర్మసంపన్నుఁడు=ధర్మమే సంపదగాఁగలవాఁడు, సర్వభూతహిత మార్గముఁడు=సర్వభూతములకు హితమునే వెదకువాఁడు.సర్వభూతములకు హితమైన బాణ మగలవాఁడు ఎవరికైనఁగీడుచేయుటయందు బాణప్రయోగము చేయఁడని

భావము. రాక్షసవధాదికము లోకహితకార్యమే, అజికిన్=దశరథునకు, విక్రమా ఢ్యుఁడు=పరాక్రమమున గొప్పవాఁడు, ప్రథావిభవుండు=కీర్తియను సంపద గలవాఁడు,ఎన్నుల నేఱికొని=పైరుకోయఁగా రాలినగింజల నేఱికొని జీవించుట సిలవృత్తి కళ్ళములయొద్ద - బోళ్ళయొద్ద రాలినగింజలనేఱి తినుట - ఉంఛ వృత్తి- ఇవిరెండు నయాచిత వృత్తి జీవించువారి జీవనోపాయములు.

తాత్పర్యము

ఈ రామచంద్రుఁ డింతవఱకుఁ గష్టమనఁగా నెటువంటిదో యెఱుఁగఁడు. (ఇదివఱకుఁ గష్టము లనుభవించియుండిన యెడల నిప్పుడిది విశేషకష్టముగాఁ దోఁపకుండును) ధర్మమే తనకు సంపదగాఁ దలఁచువాఁడు. ఎల్లభూతములకు నెవరికినేమి నేమి మేలు చేయుదునాయని వెదకుచుండువాఁడు. ఉత్తమ స్త్రీనగు నాకు దశరథునివంటి చక్రవర్తికి మహాత్మునకుఁ బుత్రుఁడైనవాఁడు. పరాక్రమ వంతులలో గొప్పవాఁడు. గొప్పకీర్తిని సంపాదించినవాఁడు. ఇట్టివాఁడు కాఱడవు లకుఁబోయి యందు నాఁకలి దీర్చుకొనుటకుఁగాను నివ్వరిగడ్డిగింజల నొక్కొక్క దానినే, యదియైనఁదెచ్చియిచ్చువారులేక తానే, సిలోంఛ వృత్తులవలంబించి యెట్లుతినఁగలఁడు? కష్టములెట్లు సహింపఁగలఁడు? వనవాసమందుఁగల కష్టము లను శ్రీరాముఁడు సీతకు వివరించెను. ౬౯౨ మొదలు ౭౧౨ వఱకు.

కం॥ ఎవ్వనిభృత్యులు దాసులు, మవ్వముగ భుజింప నిష్ట•మంజుల భోజ్యం
బవ్విభుఁడు మూలఫలముల,నెవ్విధి నములుచును గడుపు•నెరగలి నార్చున్.

మువ్వముగ = మృదువుగ-నెమ్మదిగ నేవిచారములేక, ఇష్ట మంజుల భోజ్యంబు=ఇష్టమైమనోహరమై రుచిగల భోజన పదార్థములు, కడుపు నెరగలి= జఠరాగ్నిని - కడుపుచిచ్చును.

తాత్పర్యము

తనపరిచారకులు దాసులు నింటనుండి కడుపారఁ దమకిష్టమైన రుచిమం తములైన వ్యంజనములు పిండివంటలు అన్నములు హాయిగాఁ దినుచుండ స్వామియగు తాను నడవులలోఁ గందమూలములు కాయగసురులు దిని కడుపు చిచ్చెట్లార్పఁగలఁడు ?

కం॥ కరుణాపాత్రుని సుగుణా, భరణుని శ్రీరాము నడవి • పాల్పేసినయా
ధరణీపుచరితము విన్నను,
నరుఁ డెవ్వఁడు నమ్ము వెఱపు•నం బడకుండున్. ౬౯౪

కరుణాపాత్రునిన్ = దయకు స్థానమైనవానిని- ఒకరియందు దయనే చూపించువాఁడు- కరుణచూపించుటచే యోగ్యుఁడగువానిని,అదియేలయనఁగా సుగుణాభరణుని = సద్గుణములే యలంకారముగాఁ గలవానిని, శ్రీరామున్ = శ్రీరామశబ్దము సార్థకముగఁ గలవానిని.

తాత్పర్యము

దయకుస్థానమై యెట్టివారియందును దయయేచూపించుటచే నితరులకు దయనీయుఁడై సుగుణములే యాభరణములుగాఁ గలవాఁడై సంపదచే రమించువాఁడై త్రిలోకైకసుందరుఁడై, కాంతిసంపన్నుఁడై యుండు శ్రీరాముని నడవులపాలు చేసిన రాజు చరిత్రము వినిన నరుడెవ్వఁడు "మనయందు దోషము లేకున్న మనకు రాజువలని భయములేదు" అని భయపడకుండును. నిష్కారణముగ నిరపరాధిని కన్నకొడుకును దేశము వెడలఁగొట్టి యడవులపాలుచేసిన వాఁడు మనల నేవేళ కేమి చేయునో యని జనులు భయపడుచుందురనిభావము నరులగతి యిట్లుండ నారులకతి జెప్పవలసినదేలేదు.

కం॥ లోకాభిరామ! రామా! యీకరణిని నిన్ను నడవి•కేగించుటచే
లోకమున దైవ మొక్కండే కడుఁ బ్రబలంబు దేని•నేని ఘటింపన్. ౬౯౮

తాత్పర్యము

రామా లోకాభిరాముఁడవగు నిన్నే యీవిధముగ నడవికి సాగించుటచే లోకమున దైవమే దేనినైన ఘటించు ప్రబలశక్తిగలదని తోఁచెడిని.

రామాయణమున సీతారామలక్ష్మణుల చరిత్రమున వారి మాటలచేవారి బోధములు పౌరుషమునకంటె దైవమే ప్రబలము కావున దైవమే సేవ్యమను విషయము పలుతావులఁ జెప్పఁబడెను. భారతము నేర్పునదియు నిదియే. దుర్యోధనుఁడు మరణకాలమున "దైవమేవ పరంమన్యే పౌరుషంతు నిరర్థక" మ్మనియేకదా చెప్పెను. కావున మనుష్యులు దైవమును ధిక్కరించి పౌరుషమునే యాశ్రయింపక దైవము నాశ్రయించి యథాశక్తి యథాశాస్త్రము నిష్కాములై స్వకర్మములు చేయుచుండవలెను. రామాయణమువలన మనము నేర్చుకొనవలసిన ముఖ్యవిషయమిదియే. భగవద్గీతోపదేశ మిదియే. సన్యాసులై పరపిండ నిరతులు కమ్మని కాదు.

సీ॥ నాయనా! శోకాగ్ని•నాయుదరంబున, జనియించి భవదద•ర్శనసమీర
మున రేఁగి దుఃఖేధ్మ•ములచేత వర్ధిల్లి, నశ్రుహుతాహుతి•వ్యాప్తమగుచుఁ
జింతోష్మధూమసం•చిత మయి నిశ్వాస,నాయాస సంకలి•తాభ్యుదయత
నీవు లేకుండుట•నెఱిహిమాత్యయమున, నెండుకొదరుగుమి•నేర్చుకారు
తే॥ చిచ్చునా నన్ను నీఱుగాఁ•జేయ కున్నె,యట్లగుట లేఁగ వెనుకొను•నావునట్లు
వత్తునను దోడికొనిపొమ్ము•వత్స! యనుచు,
శోకహతయైనతల్లికి•సుతుఁడుపలుకు. ౬౯౯

శ్రీరాముఁడు వనవాసము నిశ్చయించుకొనుట తెలిసి యింకఁ బోవలదనుట వ్యర్థమనితలఁచి యడవికిఁ దన్నుఁగూడఁ బిలుచుకొని పొమ్మని కౌసల్య యడుగుచున్నది.

భవదదర్శనసమీరము=నిన్నుఁజూడకపోవుట యనుగాలి, దుఃఖైధ్మముల చేత=దుఃఖములను కట్టెలచేత, అశ్రుహుతాహుతి=కన్నీళ్ళను హోమము చేయఁబడిన యాహుతిగలది, చింతోష్మధూమసంచితము = వ్యసనమను వేఁడిమిచే నెగరిన పొగచేఁ బ్రోగుచేయఁబడినది, నిశ్వసన = నిట్టూర్పులను, ఆయాస= పురుషప్రయత్నముచేత, సంకలిత=కూడిన? అభ్యుదయుతన్=అభివృద్ధి కలిగి యుండుటచేత, కట్టెలలోనుండి పుట్టు పురుషప్రయత్నముచేతనే కలుగును గాన నిశ్వాసమును నాయాసముగా నిరూపించుట,నీవు=నిప్పునకు నీళ్ళట్లో యట్టివాఁడ వగునీవు, హిమాత్యయమునన్= మంచుకాలముపోఁగా వచ్చువసంత గ్రీష్మ ఋతువులు, చైత్రవైశాఖ మాసములందుఁ గొండ లడవులు కాలును. హిమశబ్ద ముచే=హేమంత శిశిరఋతువులు రెండును గ్రాహ్యములు, ఏర్పు=కాల్పు,కారు చిచ్చు=దావాగ్ని, నీఱుగా=భస్మముగ, శోకహత=శోకముచేఁ గొట్టఁబడిన,

### తాత్పర్యము

నాయనా! శోకమనెడి యగ్ని, నాయుదరమను వెదురునందుఁ బుట్టి, నీవు కానరామి యను గాలిచే విజృంభించి, దుఃఖమను కట్టెలచే వృద్ధినొంది, కన్నీళ్ళను ఆజ్యాహుతులచే వ్యాపించి, వ్యసనమను పొగతోఁగూడి, నిట్టూర్పులను పురుషప్రయత్నముచేత నభ్యుదయమునొంది, నిప్పును నీళ్ళవలె నాయీ శోకాగ్నిని జల్లార్పఁ గల నీవు లేనికారణమున నెండకాలమందు నెండిన పొదల గుంపులను గాల్చుకారుచిచ్చువలె నన్ను భస్మము గావింపకుండునా? కావున దూడవెంటఁ బోవుగోవువలె నాయున నీవెంటవత్తును. తండ్రీ! నన్నుఁ దోడుకొని పొమ్మని శోకముచే గొట్టఁబడిన తల్లికిఁ గుమారుఁడిట్లనియె.

—•భార్యలు భర్తలవిడిచి పోఁగూడ దని శ్రీరాముఁడు కౌసల్యతోఁ జెప్పుట•—

ఆ॥ కైక మోసగించెఁ•గాకుత్స్థతిలకుని, నరుగుచున్న వాఁడ•నడవి కేను,
నమ్మ! నీవొకర్తు•వైన నొద్దను నిల్వ,కున్నఁ దండ్రి యెట్టు•లుండు బ్రదికి?

కౌసల్య దనవెంటవచ్చుట సరిగాదని శ్రీరాముఁడు నిరూపించుచున్నాఁడు.

### తాత్పర్యము

తల్లీ నీవు నావెంట వచ్చెద ననెదవే, దశరథుని గతియేమి? ఆయనను గైక మోసగించి యింత దుఃఖపెట్టుచున్నది. ఇంకను నేమిచేయఁగలదో తెలి యదు. ఆయనకు ముఖ్యసహాయులము నేను నీవు, మన యిరువురిలో నేనేమో యడవికిఁ బోవుచున్నాను. ఇక నీవొక్కతెవైన సమీపమునలేకున్న, దండ్రి యెట్లు జీవింపఁగలఁడు, ఆయన నాదరించువా రెవరు?

కం॥ పతిని విడనాడుచెలువలు, పతితలె గద యగుదు, రట్టి•వర్తనమును నీ
మతినైనఁ దలఁపవచ్చునె? సతి వగు నీకిదియుఁ దగునె•జననీ! చెపుమా?

పతితలు=భ్రష్టలు,

తాత్పర్యము

నే నొకత లేకున్ననేమి యాయనకుఁ గొఱఁత. నూర్లకొలఁది భార్యలు న్నారు గదా, వా రాదరింపక యుందురా? యనెదవేమో. ఆదరించువారుండనీ లేకపోనీ నీకర్తవ్యము నీవుచేయవలదా? భర్తను వదలిపోవు స్త్రీలు భ్రష్టలేకదా యగుదురు. దుష్టస్త్రీల నడవడి పతివ్రతయగు నీవు మనసునందైనఁ దలఁప వచ్చునా. తలఁపనేరానిదానిని చేయుట యెట్లుతగును? నాకు నీవు తల్లివై యట్లుచేయుటతగదు. నీవలన నాకును నపకీర్తివచ్చును.

కం॥ ఎందాఁక బ్రతుకు జనకుం, డందాఁకను నీకు నతని•నర్హసపర్యా
స్పందగతిఁ గొలువుమీ యా,నందమున సనాతనంపు•న్యాయం బిదియా.

అర్హసపర్యాస్పందగతి=తగిన శుశ్రూషయందుఁ జలింపని మార్గమున,

తాత్పర్యము

మాతండ్రి యెందాఁక జీవించియుండునో యంతదనుక నీవు నాయనకుఁ దగిన శుశ్రూషలందు లోపముచేయక సేవింపవలయును. ఇతరులుచేయువారున్నను నీభారము నీకుఁదప్పదు. ఇది సనాతన ధర్మము.

కం॥ అపుణ్యశీల శుభచ, ర్యాపరుఁ డౌనిజతనూజుఁ•డాడెడిధర్మా
లాపమ్ముల విని ప్రీతిని, నాపట్టిని జూచి యట్ల•యౌఁ గాక సుతా. ౨౦౩

పుణ్యశీల=పుణ్యకార్యములఁజేయు స్వభావముగలది, శుభచర్యాపరుఁడు=శుభకార్యములు చేయుటయందే యాసక్తిగలవాఁడు, నిజతనూజుఁడు=తన కొడుకు, ధర్మాలాపములు, ధర్మయుక్తములైన మాటలు, పట్టిని=కుమారుని, బిడ్డను.

తాత్పర్యము

పుణ్యకార్యము స్వభావముగఁజేయు కౌసల్య తాను చెప్పినది సరిగాదని శుభకార్యములందే యాసక్తుఁడైన తనకొడుకు చెప్పెడి ధర్మపుమాటలచే నెఱిఁగి యాయన ధర్మబుద్ధికి సంతోషపడి నాయనా యట్లులే యగుఁగాక.

కం॥ అని మఱి వగకూరెడినిజ, జననిం గని దుఃఖశాంతి•సంపాదింపన్
జనకసుతావిభుఁ డిట్లను, వినయంబు నయంబు దోఁప•విశదోక్తులతోన్. ౨౦౪

వగకూరెడి=వ్యసనపడు.

తాత్పర్యము

ఈప్రకారము చెప్పియును దుఃఖమాఁపలేక వ్యసనపడు తల్లికిదుఃఖము శాంతింపఁ జేయుకొఱకు వినయముతోను నయముగను శ్రీరామచంద్రమూర్తి ముందు చెప్పినదానినే విశదముగాఁ జెప్పుచున్నాఁడు.

చం॥ గురుఁడును, భర్త, రాజు, జన•కోటుల కెల్ల నధీశుఁ,డౌఁ గదా
యరయఁగఁ దండ్రి? యట్టిప్రభు•నాజ్ఞఁ జరింపఁగ నాకు నీకునున్

దరమగు గాదె? నే నిదిగొ దండకలోఁ బదునాలువర్షముల్
పరువడిఁ దీర్చి వచ్చి పిదపన్ భవదాజ్ఞ మెలంగుచుండెదన్. ౨౦౩

తాత్పర్యము

అమ్మా మాతండ్రి జనులకెల్ల గురుఁడును భర్త, యధిపతియగునుగదా. అట్టి వానియాజ్ఞ ప్రకారము వర్తింపఁగ నీకును నర్హమేకదా. కావున నేనిదిగోఁ బోయి దండకలోఁ బదునాలుగు సంవత్సరములుండివచ్చి పిదప నీయాజ్ఞ ప్రకారము వర్తించెదను.

శ్లో॥ స్త్రీభిర్భర్తృవచః కార్యమేష ధర్మస్సనాతనః॥ విజ్ఞా-
భర్తురప్యవలిప్తస్య, కార్యాకార్య మజానతః
పత్న్యైథకార్యాతస్యాజ్ఞా, పతిస్తస్యాశ్చ సర్వదా. ఆశ్వలా

గర్వముచే నిదిచేయఁదగును. ఇదిచేయరాదను జ్ఞానములేక, యాజ్ఞాపించినను బత్నియగునది భర్తయాజ్ఞ నెఱవేర్పవలయును.

శ్లో॥ పరిత్యాజ్యచయాభార్యా, భర్తుర్వచనలంఘనీ
తత్రదోషానచాస్తీతి త్వంహివేత్థ యథా తథా,

పెనిమిటిమాట నుల్లంఘించు భార్యను వదలవలయును. అందుదోషము లేదని తెలిసికొనుము.

కం॥ అనిన విని యశ్రుపూర్ణా,నన యయి కౌసల్య ముద్దునందను మోహ
మ్మున ననియె శోక గద్గది,కను బలుకులు తడఁబడంగఁ గడుదైన్యమునన్

అశ్రుపూర్ణానన=కన్నీళ్ళతో నిండిన ముఖముగలది, శోకగద్గదికను=శోకముచేఁ గలిగిన డగ్గుత్తికతో.

తాత్పర్యము

అని చెప్పఁగా విని కన్నీళ్ళు ముఖమునంతయు వ్యాపింపఁ దనముద్దు కుమారునిఁజూచి పుత్రమోహముచే శోకమువలన డగ్గుత్తికపడి మాటలు తడబడ మిగుల దీనయై యిట్లనెను.

చం॥ జనకునిమాటఁ బట్టి వనచారివిగా మది నీయకొంటివే
నిని సవతాండ్రమధ్యమున నే నిలువం గల నెట్లు పుత్రకా!
వనముల నాఁడుజింక యనవర్తిలు చుండెద సంతసంబునన్
జనసుతశీల! నీ బడిని జయ్యనఁ దోడ్కొని పొమ్ము నన్ దయన్. ౨౦౪

తాత్పర్యము

తండ్రిమాటప్రకారము నీ వడవుల సంచరింప నంగీకరించితివేని కుమారా సవతాండ్రనడుమఁ దలా యొకమాట యనుచుండ నెట్లు నిలువఁగలను. కావున నన్ను నీవు దయచేసి నీవెంటఁ దోడికొనిపొమ్ము జనులులేని యడవులయందు హాయిగా నాఁడుజింకవలె సంచరించుచుందును.

తే॥ తల్లి వగలను బొగులువి•ధంబుఁగాంచి,
యుల్లమెరియంగ నశ్రువు•లొలుకనిట్లు
సానునయముగ నను రామ•చంద్రుఁడపుడు,
కన్నతల్లికి ధర్మంబు•కడమపడక. ౨౦౮

ఉల్లము మనస్సు, ఎరియఁగన్=మండఁగా, అశ్రువులు=కన్నీళ్ళు, సాను నయముగన్=ఊరటతోఁగూడినట్లుగ, కడమ పడక=కొఱఁతలేక.

తాత్పర్యము

మగనిని విడిచిపోవుట సంగాదని తెలిసియుఁ బుత్రమోహముచే మరల నట్లే చెప్పుచు వ్యసనపడుచుండు తల్లినిజూచి తనవలన నామెకుఁ గలిగిన దుఃఖమునకై మనస్సు తపింపఁ గన్నీరుగార నూరార్పుమాటలతోఁ గన్న తల్లికి ధర్మము పూర్ణముగాఁ జెప్పఁ గోరి యిట్లనెను.

వ్యసనంబులు జనములకును బొసఁగిన దా నధికదుఃఖమును బొందును. (అయో. ౬౬వ.) అన్నట్లు వారువారు చేసికొనిన పాపములచే వారువారుదుఃఖింప వారికై వ్యసనపడినవాఁడు తననిమిత్తమై పరులకు వ్యసనముగలిగిన మఱెంత దుఃఖింపఁడు? ఇంతవఱకుఁ దానును దుఃఖించినఁ దన వ్రతభంగమగును. కావున నిబ్బరించుకొని యుండెను. తన వనవాసము తల్లి యంగీకరించెను. కావున నామెదుఃఖమును జూచి తాను దుఃఖించెను. శ్రీరాముని శోకమునకుఁ గరుణ కారణము, కౌసల్య శోకమునకు మోహముకారణము. రూపమున నొక్క టయ్యు భావమున భేదము.

ఉ॥ జీవము గల్గునంతకును•జెడెలకుం బతియే ప్రభుండునున్
దైవము, గాన శాసకుఁడు•ధారిణినాథుఁడె చుమ్ము నీకు నా
కోపరశీల! నీకు నతఁ•డుండ ననాథత యెట్లు గల్గెడిన్?
గావునఁ జిత్తశాంతిఁ గను•కాతరభావముఁ బొంద నేటికిన్? ౨౦౯

శాసకుఁడు=శాసించువాఁడు. తప్పొప్పులు నేర్పి శిక్షించువాఁడు, అనాథత= దిక్కులేనిదానితనము, కాతరభావము=భీతి.

తాత్పర్యము

స్త్రీలకుఁ బ్రాణముండువఱకు భర్తయే ప్రభువు. భర్తయేదైవము గావున నిన్ను నన్నుశాసించువాఁడు రాజే. ఆయన జీవించియుండ నీ వెట్లనాథవయ్యె దవుకావున నీభయమువదలి శాంతివహింపుము.

బాల్యే పితృవశే తిష్ఠే, త్పాణిగ్రాహస్య యౌవనే
పుత్రాణాం భర్తరి ప్రేతే, నభజేత స్వతంత్రతామ్॥ ॥మను॥

బాల్యమునఁ దండ్రివశమున, యౌవనమునఁ బెండ్లిచేసికొనినవాని వశ మున నతఁడు మరణించెనా పుత్రునివశమున స్త్రీ యుండవలెను. స్వతంత్రగా నెప్పుడు నుండరాదు.

కం. భరతుండును ధర్మాత్ముఁడు, కరుణామతి కీడు పలుకఁ•గానం డెవరిన్
గురుభక్తిని భవదుక్త్యను, సరణము మానండు వలదు•సందియపడఁగన్.
భవదుక్త్యనుసరణము=నీమాట ననుసరించి వర్తించుటను. ౨౧౦

తాత్పర్యము

కైక వగదాయెను. ఆమెకొడుకు రాజై నిన్నేమిబాధించునో యనికదా నీభయము. నీభయమునకుఁ గారణములేదు. ఏలన భరతుఁడు ధర్మాత్ముఁడు. దయగలవాఁడు. ఎవరిని జెడ్డమాట పలికెడువాఁడుగాఁడు. ఇఁక నిన్నుఁ బలుకునా? కావున నీవు తల్లివను గొప్పభక్తిచే గురువాక్యము మీఱరానిదని నీ వాక్యము చలుపక మానఁడు. నీకు సందేహపడఁ గారణములేదు.

చం॥ అడవికి నేను బోఁ గడుపు•నారటపాటున ఱేఁడు వృద్ధుఁడున్
బడుగును గాన దుఃఖపడి•ప్రాణముఁ గోల్పడు నొక్కొ యంచు నే
జడిసెదఁ, దండ్రికి న్మదికి•సంకటపా టొదవంగనీక యె
వ్వడువున నప్రమత్త వయి•వర్ణితశీల! భజింపు ప్రేముడిన్. ౨౧౧

కడుపునారటపాటునన్=పుత్రశోకముచే, బడుగు=మిక్కిలి బలహీనుఁడు, కోల్పడున్=కోలుపోవును, పోఁగొట్టుకొనును, జడిసెదన్=భయపడెదను,ఎవ్వడువునన్=ఏవిధముగనైన, అప్రమత్తవు=ప్రమాదములేనిదానవు, ప్రేముడిన్=ప్రేమచేత, వర్ణితశీల=స్తోత్రము చేయఁబడిన యాచారముగలదానా.

తాత్పర్యము

నీవు సదాచారసంపన్నవని లోకులందఱు నిన్ను స్తోత్రముచేయుచున్నవారు దానికి నీవు భంగము రానీయరాదు. ఏలన నేనడవికిఁ బోఁగానే పుత్రశోకముచే రాజు ముసలివాఁడు బలములేనివాఁడు కావున, శోకించి ప్రాణములు పోఁగొట్టుకొనునో యని భయపడుచున్నాను. కావునఁ దండ్రిమనస్సునకు సంకటము తోఁపకుండునట్లు ప్రమాదపడక యేవిధముననైనఁ బ్రేమచే సేవింపుము. నన్ను నడవులకుఁ బంపెనని కోపంబున నుపేక్షింపకుము. ప్రమాదము పడకుము.

చం॥ హితమతిఁ బెద్దవారలకు•నెప్పుఁడు మ్రొక్కక యున్నఁగాని, దే
వతల యజింప మానినను•వారిజనేత్రకు భర్తృసేవ స
ద్గతి సమకూర్చుఁ దల్లి! నియ•తవ్రత యై సతతోపవాస యై
సతి పతిభక్తిఁ గొల్వమిని•సత్యముగా నిరయంబునం బడున్. ౨౧౨

నియతవ్రతయై=నియమములతోఁగూడిన వ్రతములుగలదై, సతతోపవాసయై=ఎల్లప్పుడు నుపవాసవ్రతముచేయునదై, నిరయంబునన్=నరకంబున

తాత్పర్యము

కాముకుఁడై నానపతిమాటలకు లోనై నన్ను దుఃఖపెట్టుటయేకాక నాయొంటికొడుకును అడవులపాలుచేసినవానిని వాఁడు మగఁడైన నగునుగాక యేమని ప్రేమతో సేవింతునందువా. అట్లుఅనరాదు. హితబుద్ధితోఁ బెద్దవారల నెప్పుడు

గాని నమస్కరింపక యున్న నుండునుగాక దేవతలఁ బూజింపవమానినవమానము గాక స్త్రీకిఁ బతిసేవ యొక్కటే సద్గతులు గలిగించును. నియమముతో వ్రతము లాచరించుచు నిరశనవ్రతముఁ బూనినదై పతిని గొలువనిభార్య సత్యముగా నరకములఁ గూలును. పతిసేవతోడ దేవపూజాదులుండిన నుండవచ్చునుగాని అవి నిషిద్ధములు గావు. అదిలేక యుండిన నవి నిష్ప్రయోజనము లగుటయే కాక నరకకారణము లగును. అట్టిదాని నేపెద్దలు నేదేవతలు కాపాడఁజాలరు.

ఈపద్యము స్త్రీలు జపములు తపములు ఉపవాసములు చేయనేరాదని నిషేధింపదు. భర్త యాజ్ఞఁబొంది యవి చేయవచ్చును. భర్తయాజ్ఞలేక చేయరాదు. అవి చేయుచున్నానని పతి నుపేక్షింపరాదు అవి యేవిచేయక పతిసేవ యొకటిచేయుచున్నను బుణ్యలోకములుగలవు. భారతములోని యీపద్య మీ యర్థమును స్పష్టపఱుచుచున్నది. అనుశాస. ౨౭౨-౨౭౬-౨౭౩-౨౭౭ ప. చూడుఁడు.

"అతనిమతమునఁ దేవతా పితృసమర్చ, నములు నతిథి పూజనములు సన్మతి సమాచ। రించుచును బతిహితము పాటించి నడపు। నతి పతివ్రత యిహ పరసౌఖ్య మహిత।

వ. ఏతద్విషయంబయిన యొక్క నిదర్శనం బవధరింపుము.

సీ॥ బ్రాహ్మణుఁ డొకనికి భార్య లిద్దఱుగల, రందొక భామిని యతనిహితము
నడపెడు నవధానమెడలి యాతఁడుపంప, కయుఁదాన సురపితృకార్యపరత
నడచుఁదక్కటియింతి నాథుఁబాటించుచుఁ, దన్మతంబునఁజేయు ధర్మవిధులు
వారు మువ్వురు విధివశమున నొక్కట, మృతిఁబొంది రాపతివ్రతవరుండు
చనిన సుగతికిఁ జనెఁ బెఱ వనిత జముఁడు, నీకుఁ బోరాదు మరలుము నీశరీర
మునకయని యాఁగెనది శోకమున సబాష్ప,

గీ. యైనఁగన్గొని యతడు దయార్ద్రుడగుచు

కం॥ పతి మతము గొనక ధర్మము, నతివ నడప దొప్పదింకనైనను నతికిన్
హిత ములగువానిఁ జేసిన,
నతనిఁ గలయు దనినఁ జనియెనదియును మరలన్

సతులకుఁ బతిసేవయుఁ, బతియాజ్ఞచే దేవసేవయు రెండు జేయుటవిశేష శ్రేయస్కరము. రెండును జేయుటకు సాధ్యముగానప్పుడు దేవసేవవదలి భర్త సేవచేయవలయును. పతిలేని స్త్రీకి దేవసేవ, బ్రహ్మచర్యము, వ్రతనిష్ఠ యని వార్యములు.

కం॥ శ్రుతులందుఁను స్మృతులందును,
హితగతి క్షితిఁ బూర్వదృష్ట•దృష్టాంతములన్
సతి పతిహితరత యయి సమ్మతి సేవించుటయె ధర్మ•మార్గము దల్లీ.

శ్రుతులందును=వేదములందును, స్మృతులందును=వేదముల కుపబృంహణములైన స్మృతులందును,క్షితిన్=భూమియందు,పూర్వదృష్టదృష్టాంతములన్=

పూర్వులయందుఁ గానవచ్చు దృష్టాంతములచేతను, పతిహితరత=భర్త యొక్కహితమునందును నానక్తిగలది.

తాత్పర్యము

స్త్రీలసమాచారము నీకేమి తెలియునందువా ఇది నాకల్పితముగాదు. వేదములందును వేదార్థము విశదీకరించు స్మృతులందును, పూర్వులయందుఁ గానవచ్చు నాచారములచేతను, భార్యభర్తకు హితమైన నడవడిగలదై యాయనను సేవించుటయే ధర్మమార్గమని తెలియవచ్చెడిని.

కం॥ కావింపుము హోమములన్, భావింపుము దేవతలను॰ బ్రాహ్మణపూజల్
వావిరి నాకొఱకై, యో, దేవీ! గావింప వమ్మ॰తెరలనిభక్తిన్. ౨౧౪

తాత్పర్యము

భర్తపోయి సవతియింటిలోఁ గూర్చుండెను. నీవుపోయి యడవిలోఁ గూర్చుండుదునంటివి నేనిక్కడనుండి యెవరికేమి చేసినట్టు లనెదవా? పతిసేవ లభింపలేదని యాయనను వదలి దేశముమీఁదఁ బోరాదు.

పతి దేశాంతరగతుఁడైనను, లోకాంతరగతుఁడైనను సతి తన ధర్మమును విడువరాదు. ఆయన దేశముమీఁదఁ బోయెనని తాను బోరాదు. ఇంటియందుండి యాయనకు యశస్కరము శ్రేయస్కరమునైన కార్యములే చేయుచుండవలెను.

కావున నీ విచటనే యుండి నామేలుగోరి భక్తితో హోమములు చేయింపుము. దేవతల ధ్యానింపుము. బ్రాహ్మణపూజలు చేయుము. దానివలననాకును శ్రేయస్సు గలదు.

ఉ॥ ఇక్కరణిన్ మదాగమన॰మెంతయు వేచి చరింప వమ్మ, పే
రక్కఱ నేమముల్ జరుప॰వమ్మ, భజింపుము నీత మాగతిన్,
మక్కువఁ బ్రాణనాథు బహు॰మానయుతం బగుసేవఁ దన్పుమీ,
తక్కుమి చింత సాధుచరి॰తా! హృదయంబున నాయెడాటమై. ౨౧౫

ఇక్కరణిన్=ఈవిధముగ, మదాగమనము = నారాక, వేచి=ఎదురుచూచుచు, పేరక్కఱన్=మిక్కిలిశ్రద్ధతో, బహుమానయుతము = గౌరవముతోఁ గూడినది, తన్పుమీ=తృప్తిపడఁజేయుము, తక్కుమి=వదలుము, నాయెడాటమై=నావిషయంబున.

కం॥ వనవాసం బే నొనరిచి, చనుదెంచెడి యంతదాఁక॰జనకుఁడు సుఖియై
మనవేనియు నీమదికిన్, ఘనతరసంతోష మొదవఁ॰గల్గును దల్లీ. ౨౧౬

ఘనతర సంతోషము=మిక్కిలి హెచ్చైన సంతోషము.

తాత్పర్యము

నేను వనవాసము పూర్తిచేసి మరల వచ్చువఱకుఁ దండ్రి సుఖముగా బ్రతికియుండినయెడల నీమనస్సునకు ఇప్పుడు నాకుఁ బట్టాభిషేకమైనచోఁ గలుగు సంతోషముకంటె మిక్కిలి సంతోషము గలుగఁగలదు.

కౌసల్యతోఁ జెప్పునప్పుడెల్ల మరలివచ్చి నినుఁజూచెదనని శ్రీరాముఁడు చెప్పుచుండును. దశరథునితో నినుఁజూచెదననిన వాఁడుకాఁడు. దశరథుఁడు అంతదాఁక బ్రదుకఁడని రామునకు నిశ్చయమే.

సాధారణముగ బిడ్డలయందుఁ దండ్రికంటెఁ దల్లికిఁ బ్రేమమెండుగదా. అట్లుండఁ బుత్రశోకమున దశరథుఁడు చావనేల? కౌసల్య సహించి యెట్లుండ గలిగెను? ఇది సామాన్యవిషయమైనను పుత్రశోకమును దల్లులు సహించియుండ వెఱపట్టిన తండ్రులుగలరు. దశరథుని మృతికిఁ బ్రబలకారణము వానప్రస్థ శాపము.

—• శ్రీరాముని వనవాసంబునకుఁ గౌసల్య యీయకొనుట •—

కం॥ ఈలీలఁ బలుకుతనయుని, నాలోకించుచును గౌ•సలాత్మజ యను నేఁ
జాలను నీమదిఁ ద్రిప్పఁగఁ, గాలంబు నతిక్రమింపఁ•గా మనవశమే? ౨౫

ఈలీలన్=ఈవిధముగ, తాత్పర్యము

ఈవిధముగఁ జెప్పుచుండు కొడుకునుజూచి కౌసల్య నాయనా నీ మనస్సును ద్రిప్పఁజాలకున్నాను. కాలము నతిక్రమింప నెవరివశము.

ముందుచెప్పిన దైవము, ఇచ్చటికాలము రెండుపర్యాయపదములు గ్రహింపవలెను. ఈయర్థమునందే విధియను శబ్దముగూడ రామాయణమందుఁ బ్రయోగింపఁబడినది.

కం॥ చనుమీర యేకాగ్రత నీ, కనయము శుభ మగుతఁ దండ్రి•యన్నిదశల, నీ
పునరాగమనంబును గని, వనటల నేఁ బాయుదాన•వారిజనయనా. ౨౬

ఏకాగ్రతన్=హెచ్చరికతో, అనయము=సర్వదా, పునరాగమనంబును=మరలిరాకను, వనటలన్=దుఃఖములను.

తాత్పర్యము

తండ్రీ! నీమనస్సు నేను ద్రిప్పలేనైతిని. కావున హెచ్చరిగాఁబోయిరమ్ము. నీకు సర్వవేళల సర్వదశల శుభమగుఁగాత, నీవు మరలివచ్చినపుడు నిన్నుఁ జూచి నాదుఃఖములఁ బాయుదును. అంతవఱకు నిట్లేదుఃఖ మందవలసినదాననే.

ఆ॥ జనకుఋణముఁ దీర్చి•సలిపి నీవ్రతముఁ గృ,
తార్థుఁడ వయి మరలి•యరుగుదేర
నోమహాసుభావ•యుండెద సుఖమంత, దాఁక నుగ్గఁబట్టి•దాన నసువు

జనకుఋణము=కైకేయికి దశరథుఁడు చేసినవరమనునప్పు, తీర్చి=చెల్లించి నీవ్రతము, దండకారణ్యమున మునివలెఁ బదునాలుగేండ్లుందునని నీవుపూనిన

వ్రతము నెఱవేర్చి కృతార్థుఁడవు=భూమిమీఁద నవతరించి చేయవలసిన కార్యములు చేసినవాఁడవై రెండు ఋణములుదీర్చి జన్మము సఫలము చేసికొనినవాఁడవు. ఉగ్గఁబట్టుదాననన్=బిగఁబట్టుదానను, ఉసుఱు=ప్రాణము.

తాత్పర్యము

తండ్రిని ఋణవిముక్తునిఁజేసి పూనినవ్రతము సాంతముచేసి కృతకృత్యుఁడవై మరలి నీవురాఁగాఁజూచి మహానుభావా! సుఖపడెదను. అంతదాఁక నెట్లో యొకయట్లు ప్రాణములుపోకుండ బిగఁపట్టియుండెదను.

కం॥ నామాటలు పెడచెవి నిడ, నీమాడ్కిని నీమనంబు•దృఢపఱచెఁ గదే
యామాయదైవ మకటా, యేమనుజుఁడు దైవచిత్ర•మెఱుఁగఁగ నేర్చున్.

పెడచెవినిడన్=ఉపేక్షింప, ఎడమచెవిలోఁబెట్టి, శ్రద్ధతో వినువారు కుడిచెవితో విందురు. అశ్రద్ధతో వినువారు ఎడమచెవితో విందురు.

తాత్పర్యము

నాయందు నీవెంతో భక్తి విశ్వాసములుకలవాఁడవు. ఎన్నఁడేవిషయమందును నామాట నతిక్రమింపనివాఁడవు. అట్టి నీవు నామాట యుపేక్షించునట్లు ఆమాయలమారి దైవము నీమనస్సును గట్టిచేసెఁగదా. దైవముయొక్క యద్భుతశక్తి యెవఁడెఱుఁగఁగలఁడు.

కం॥ పొమ్మీ తనయా! యిప్పుడ, రమ్మీ సౌఖ్యముగ మరల•రాజితశుభవా
క్యమ్ములఁ దియ్యఁదనమునన్, సమ్మతి నను దేర్ప నన్న•నారామన్నా.

ఇప్పుడ=ఇపుడే, అంత శీఘ్రముగనని యర్థము, రాజితశుభవాక్యమ్ములన్ సంతోషముచే నొప్పు మంచిమాటలచేత, తేర్పుము=తేలఁజేయుము.

తాత్పర్యము

కుమారా! పొమ్ము, ఇటుపోయి యిటువచ్చునంతలోఁ బదునాలుగేండ్లు శీఘ్రముగఁ గడచిపోవునట్లు సుఖముగరమ్ము, వచ్చి నీవుపోయి యుండివచ్చిన శుభవార్తలెల్ల మంచి తియ్యనిమాటలచేఁ జెప్పి నన్ను సంతోషమునఁ దేలింపవన్నా రామన్నా,

కం॥ జటలం దాలిచి నారలు, కటితలమునఁ గట్టినీవు•గ్రమ్మఱఁగ వనీ
తటినుండి వేళ యిదెయై, ఘటియిల్లునె? యంతశుభము•గలదే యనుచున్

వనీతటినుండి=వనప్రదేశమునుండి. ౨౯

తాత్పర్యము

జడలుధరించి నారచీరలు నడుమునందుఁగట్టి వనిప్రదేశమునుండి నీవు వచ్చెడి వేళయిదే యగునా. అయ్యో! అంత శుభముగూడఁగలదా.

కం॥ అడవులకరుగఁగ నెంచిన, కొడుకునునిశ్చిత మెఱింగి•కోసలసుత దాఁ
గడునాదరమున నిట్లని,తదయుక దీవింప నెంచి•తద్దయుఁ గరుణన్.౩౦

తాత్పర్యము

అడవులకుఁబోవఁదలఁచిన కొడుకు నిశ్చయమెఱిఁగి కౌసల్య మిగులనాదరముతో దయతో దీవింపఁదలఁచినదియై.

—• ౨౫-వ సర్గము కౌసల్య శ్రీరాము నాశీర్వదించుట. •—

ఉ॥ గాసి తొలంచి మంచియుద•కంబుల వారిచి సాధ్వి మంగళా
శాసనముల్ వచించు, నిను•సాధ్యముగా దిఁక నాఁగ నాయనా!
వాసిగఁ బోయి రమ్ము రఘు•వంశమణీ! యిపు డీవు వైళ మా
యాసములేక క్రమ్మఱుము•హాళిఁ జరింపుము సత్క్రియంబునన్. ౮-౨౪

వారిచి=ఆచమనముచేసి, మంగళశాసనముల్=శుభకరములైన దీవనలు ఆఁగన్=అడ్డగింప, వైళము=శీఘ్రము, హాళిన్=సుఖముతో.

తాత్పర్యము

కన్నీళ్ళుకార్చుటగాని వానిని తాఁకుటగాని యపరిశుద్ధహేతువు గావున నింతకాలము శోకమునఁ గన్నీళ్ళు కార్చియుండుటచేఁ బారిశుద్ధ్యము నిమిత్తము ఆచమించి యాపతివ్రత శుభకరములైన దీవన లీయసాగి యిట్లనెను. నాయనా నిన్ను నరణ్యమునకుఁ బోకుండ నిలుప సాధ్యముగాదు, రఘువంశ రత్నమా పోయి కీర్తిగలుగ సంతోషముతోఁ జరింపుము.

కం॥ ఏధర్మము నీచేత మ,హాధైర్యస్థైర్యనియతి•నవితం బయ్యెన్
సాధితశాత్రవజన! ని,న్నాధర్మమె కాచుఁగాక•యనవరతంబున్. ౮-౨౫

అవితంబు=రక్షింపఁబడినది, సాధితశాత్రవజన, సాధింపఁబడిన శాత్రవులు గలవాఁడా, అనవరతము=ఎల్లప్పుడు.

తాత్పర్యము

నీవు మహాధైర్యముతోను స్థిరబుద్ధితోను నియమముతోను నేధర్మమును రక్షించుచున్నావో ధర్మోరక్షతి రక్షిత యని యుండుటచేత నాధర్మమే నిన్ను నెల్లప్పుడు రక్షించునుగాక.

మత్తకోకిలము. దేవతాయతనంబులన్ రుచి•దేఱుచైత్యములందు నీ
చే వరం బగుఁ బ్రెుక్కు లందుచుఁ•జెన్నుమీఱినయామహా
దేవతల్ ఋషియుక్తులై వనిఁ•ద్రిమ్మరం జనుచుండు ని
న్వేవిధంబులఁ గాచుచుందురు•నిర్మలం బగుసత్కృపన్. ౮-౨౬

తాత్పర్యము

దేవాలయములందును నాలుగుబాటలు కలియుచోటులందును నీచే మ్రొక్కులు గొనుచున్న యామహాదేవతలు ఋషులతోడ నడవియందు సంచరింపఁ బోవు నిన్ను వేయివిధంబుల రక్షించుచుందురుగాక.

దీనివలన దేవాలయములందుండు దేవతలకేగాక వీథులయందుండు భజనమందిరములవంటి వానియందును స్థాపింపఁబడిన దేవతలకుఁగూడ శ్రీరాముఁడు నమస్కరించుచుండెనని యేర్పడుచున్నది.

కం॥ ప్రీతుండై గాధితనూ, జాతుఁడు నీకొసఁగినట్టి•శస్త్రాస్త్రంబుల్
నీతంబుగ నిను సద్గుణ, పూతుని రక్షించుఁగాక•పుణ్యచరిత్రా! ౭-౩

ప్రీతుఁడై=సంతోషించినవాఁడై, గాధితనూజుఁడు = విశ్వామిత్రుఁడు, నీతంబుగన్=నియతితో, సద్గుణపూతునిన్=మంచిగుణములచేఁ బవిత్రుని, అస్త్రములు=మంత్రములచేఁ బ్రయోగింపఁబడునవి, శస్త్రములు=చేతిబలముచేఁ బ్రయోగింపఁబడుకత్తి శూలములోనైనవి.

తాత్పర్యము

నీభక్తిబలములకు సంతోషించినవాఁడై విశ్వామిత్రుఁడు నీకొసఁగిన యస్త్రశస్త్రములు మంచిగుణములచేఁ బవిత్రుడవైన నిన్ను రక్షించునుగాక. నీవు పుణ్యచరిత్రుఁడవు గావున నవి నిన్నుఁ బ్రయాసములేక సంతోషముతో రక్షించును.

కం॥ జనకునిఁ గొలిచిన ఫలమును, జననీశుశ్రూష ఫలము•సత్యఫలంబున్
వనవాసాయాసము నీ, కొనరక యుండంగఁ బ్రోచు•చుండుఁ గుమారా! ౭-౪

తాత్పర్యము

జనకునిఁసేవచేఁ గలిగినఫలము మాతృసేవచేలభించినఫలము సత్యమును రక్షించుటచే నగు ఫలముకుమారా వనవాసమున నాయాసము కలుగనీయక నిన్ను రక్షించునుగాక.

చం॥ సమిధలు, దర్భలున్, జగతి•చాలును, నాయతనాళి, వింతలై
కొమరగు స్థండిలంబులును•గొండలుఁ, జెట్టులు, గుజ్జుచెట్లు, సిం
హములుఁ బతంగకోటి, పవ•నాశనమండలముల్, మడుంగులున్,
విమలదయన్ నినున్ సకల•వేళలఁ బ్రోచుచునుండు నాత్మజా! ౭-౫

జగతిచాలును=యజ్ఞవేదులును, అగ్నిస్థానములును, ఆయతనములు=దేవళములు, వింతలై=నానాకారముగలిగి కొమరగు=వినోదకరములై, స్థండిలంబులును=దేవపూజాస్థలములు, గుజ్జుచెట్లు=పొట్టిచెట్లు,గున్నమామిడిలోనైనవి పతంగకోటి=పక్షుల సమూహములు, పవనాశన మండలముల్ = పాముల గుంపులు.

తాత్పర్యము

హోమమున కుపయోగించు కట్టెపుల్లలు, దర్భలు, అగ్నిహోత్రస్థానములు, దేవాలయములు, నానావర్ణములుగల పూజాస్థలములు, కొండలు చెట్లు గున్నమామిడి లోనగు పొట్టిచెట్లు సింహములు పక్షులు, పాములు మడుఁగులు వీని యధిష్ఠాన దేవతలు నిన్ను నిర్మలమైన దయతో సర్వకాలములందును రక్షించుచుండునుగాక.

ఉ॥ స్వస్తి ఘటింత్రు నీకు ఋషి•సాధ్యమరుత్తులు, విశ్వు, లాస్థమై
స్వస్తి విధాతృధాతలును•స్వస్తి ఘటింత్రు భగార్యమార్కులున్
స్వస్తి దిశాధినాయకులు•శక్రముఖుల్ ఋతుపక్షమాసముల్
స్వస్తి క్షపాబ్దఘస్రములు•స్వస్తిఘటించుత సన్ముహూర్తముల్. ౭౩౦

స్వస్తి=శుభము, ఆస్థమై=ప్రీతితో, స్వస్తి = యత్సుఖంత్రిషులోకేషు। వ్యాధివ్యసనవర్జితమ్, యస్మిన్సర్వేస్థితాః కామా, స్తత్స్వస్తీత్యభిసంజ్ఞితః॥ యమ॥ మూఁడు లోకములందువ్యాధి వ్యసనములేని సుఖమేదిగలదో యెందు సమస్తమైన కోరికలు ఫలించియుండునో దానికి స్వస్తియనిపేరు.

తా త్ప ర్య ము

నీకుఁ బ్రీతితో ఋషులు, సాధ్యులు, మరుద్గణములు, విశ్వదేవతలువిధాత ధాత యమదేవతలు, భగుఁడు, అర్యముఁడు అర్కుఁడు అనుసూర్యులుదిక్పాలకులు. (ఇంద్రుఁడు మొదలయినవారు) ఋతువులు పక్షములు, మాసములు, (వీని యధిష్ఠానదేవతలు) రాత్రి, సంవత్సరము, పగలు వీనిదేవతలు మంచి ముహూర్తములు నీకు శుభము కలిగించునుగాక.

కం॥ స్మృతియును ధృతియునుధర్మము,
సుతరత్నము!నిన్నుఁ బ్రోచు•సుఖదములగుచున్
సితకరగురుగుహకమలజ, సుతసప్తర్షులు సతంబు•సఖముల నిడుతన్.

స్మృతి=ధ్యానము, ధృతి=నిశ్చలమైన బుద్ధి, ధర్మము=మీఁదఁజెప్పిన ధర్మములుగాక యితరమైనది, సుఖదములు = సుఖమునిచ్చునవి, సితకర= చంద్రుఁడు, గురు=బృహస్పతి, గుహ,కుమారస్వామి,కమలజసుత=నారదుఁడు సప్తర్షులు, భరద్వాజాదు లేడుగురు ఋషులు, సతంబు=ఎల్లప్పుడు.

తా త్ప ర్య ము

స్మృతిధృతి ధర్మము నీకు సుఖకరములై రక్షించునుగాక. చంద్రబృహస్పతి కుమారస్వామి నారద సప్తర్షులు నీకు నెల్లప్పుడు సుఖము లిడుదురుగాక.

కం॥ దిక్కులు దిక్పతులును నా,మ్రొక్కుల నంగీకరించి•మునుకొని యెపుడున్
దిక్కగుత నీకుఁ దండ్రీ, దిక్కఱి వనవీథులందుఁ•ద్రిమ్మరువేళన్. ౭౩౨

దిక్పతులు=ఇంద్రాదులు, దిక్కఱి=దిక్కులేక.

తా త్ప ర్య ము

దిక్పాలురతోడి దిక్కులు నామ్రొక్కుల నంగీకరించినవారై దిక్కులేక నీవు వనములందుఁ దిరుగువేళ నీకు నాయనా దిక్కగుదురుగాక.

కం॥ గిరిసింధువరుణగగనాం,తరిక్షవసుధానదులును•దారాగ్రహేశ
ర్వరులు దినంబులు సంధ్యలు,
గురురక్ష యొనర్చు నడవిఁ•గ్రుమ్మరు నీకున్. ౭౩౩

గిరి=కులపర్వతములు, సింధు=సింధునది, వరుణ=వరుణుఁడు, గగన=స్వర్గము, అంతరిక్షము=ఆకాశము, వసుధా=భూమి, నదులును=దక్కిన నదులును తారా=అశ్వనీమొదలగు ౨౭ నక్షత్రములు, గ్రహ=సూర్యాదిగ్రహములు శర్వరులు=రాత్రులు, దినంబులు=పగళ్ళు, సంధ్యలు=ప్రాతస్సంధ్య సాయంసంధ్య, గురురక్ష=గొప్పరక్షణము.

తా త్ప ర్య ము

కులగిరులు, సింధునది, నదుల కధిపతియైన వరుణుఁడు, స్వర్గము, ఆకాశము, భూమి, తక్కిననదులు, ఇరువదియేడు నక్షత్రములు, నవగ్రహములు, రాత్రులు, పగళ్ళు, రెండు సంధ్యలు, అడవియందుఁ దిరుగు నిన్ను మిక్కిలి రక్షింతురుగాక.

కం॥ ఋతుషట్కము మాససమల్, హితగతిఁ గాష్ఠలును గలలు♦బృందారకులున్
దితిసుతులుఁ బ్రోచుతన్ సుత,
ధృతముని వేషమునఁ గానఁ♦దిరిగెడి నిన్నున్. ౨౩౪

ఋతుషట్కము=వసంతము మొదలగు నారు ఋతువులు, మాససమల్=నెలలు సంవత్సరములు, కాష్ఠలు=కలలు, ఇవి కాలమునందలి యల్పభాగములు, బృందారకులు=దేవతలును, దితిసుతులు=దైత్యులు, ధృతమునివేషమునన్=ధరింపఁబడిన మునివేషముతో, కానన్=అడవియందు, ఇందు ముందు జెప్పఁబడినవారే మరలఁ జెప్పఁబడిరి. భూయోభూయో నమామ్యహమ్మన్నట్టిది యాదరాతిశయమున నని యెఱుంగునది.

తా త్ప ర్య ము

ఆఱుఋతులు, నెలలు, సంవత్సరములు, కాష్ఠలు కలలు దేవతలు, దైత్యులు కుమారా యడవియందు మునివేషము ధరించి తిరుగుచుండు నిన్ను రక్షింతురుగాక.

ఆ॥ క్రూరకర్మనిరత♦ఘోరపిశాచాది, రాక్షసాళివలన♦రూక్షవన్య
మృగచయంబువలన♦నేభయంబును నీకుఁ,
గలుగకుండుఁ గాత♦కాననముల. ౨౩౫

క్రూరకర్మనిరత=దయలేక కార్యములు చేయుటయందు మిక్కిలి యాసక్తిగల, ఘోరపిశాచాది=భయంకరములైన పిశాచములు మొదలయిన వానివలనను, రాక్షసులవలనను, రూక్ష=క్రూరములగు, వన్యమృగ చయంబు వలనన్=అడవియందలి మృగముల సమూహమువలన, కాననములన్=అడవుల యందు.

తా త్ప ర్య ము

హింసాది క్రూరకార్యములు చేయుటయందు విశేషాసక్తిగల భయంకర పిశాచాదులవలనను రాక్షసాళివలనను క్రూరములైన సింహ వ్యాఘ్రాదులవలనను నీకేభయము కలుగకుండునుగాక.

అ॥ వానరంబు తేలు•వనమక్షికంబును, నీఁగ పాము పురుగు•నెవ్వ దైన
నోఁకకుండుఁ గాక•సుందరాకార! నీ, వడవులందుఁ దిరుగు•నపుడు పుత్ర ౩౩౬

వానరంబు=క్రోఁతి, వనమక్షికంబులు=అడవి యీఁగెలు.

తాత్పర్యము

క్రోఁతి, తేలు, అడవియీఁగలు, ఉత్తయీఁగలు, పాములు, విషపుఁబురుగులునెవ్వడైన నిన్ను నీవడవులఁ దిరుగుకాలమందుఁ దాఁకకుండునుగాక.

కం॥ సింగంబులు నెలుఁగులు నే,నుంగులుఁ గోఱమృగములు ని•న వ్వనవీథిన్
శృంగులుఁ జెనకవు, మఱి నీ, చెంగటఁ జేరంగ లేవు•చెన్నఁటిమృగముల్

సింగంబులు=సింహంబులు, ఎలుఁగులు=ఎలుఁగుబంట్లు, కోఱమృగములు=కోఱలుగల జంతువులు, వనవీథిన్=అడవిమార్గములందు, శృంగులు=కొమ్ములుగల జంతువులు, చెంగటన్ = సమీపమందు, చెన్నఁటిమృగముల్=చెడ్డమృగములు

తాత్పర్యము

సింహములు, ఎలుఁగుబంట్లు, ఏనుఁగులు, కోఱలుగల మృగములు, కొమ్ములుగల మృగములు నిన్నుఁ జెనఁకఁజాలవు. దుష్టమృగములు నీ సమీపమునకైన రావు.

కం॥ నరమాంసభోజనంబు లొ, నరిచెడి మృగసంఘములు న•నారతమును నా
పరమప్రార్థనచే నీ,దరిఁ జేరఁగ నైన రావు•తనయా! యడవిన్. ౩౩౭

నరమాంసభోజనము లోనరిచెడి=మనుష్యులమాంసము తినియెడి, అనారతము=ఎల్లప్పుడు, దరిన్=సమీపమందు.

తాత్పర్యము

కుమారా మనుష్యమాంసములు దిను మృగసమూహములు ఎల్లప్పుడు నేను జేయు శ్రద్ధాభక్తులతోడి ప్రార్థనముచే నీ సమీపమునకైన రావు.

తే॥ అడవిత్రోవల నీ విట్లు•నరుగుచోట, బహుళసౌఖ్యప్రదంబులౌ•బాటలెల్ల,
రహిని ఫలియించునీదుప•రాక్రమంబు,
నాయనా రామ శుభ మగుఁ•బోయిరమ్ము. ౩౩౮

తాత్పర్యము

అటవిత్రోవలందు నీ వీ ప్రకారము పోవునపుడు దారులన్నియు నీకుసుఖమునే యిచ్చును. కంటకపాషాణాదులు నీకాలికడ్డమురాక, వచ్చినను బాధింపక, యుండును. నీపరాక్రమము విశేషముగ ఫలించును. నాయనా రామచంద్రా నీకు మేలగుఁగాక పోయిరమ్ము.

ఉ॥ మాటికి మాటికిన్ శుభము•మానక కూర్చుత మిన్ను, దేవతా
కోటులు, నీదుశాత్రవులు•కూరిమి సోమగురుల్, కుబేరుఁడున్,
వాటిగ సూర్యుఁ, డగ్నియును•వాయువు ధూమము మంత్రపాళి ఘో
రాటవులందు నీరఘుల•నాడఁగ నీకు శుభం బొసంగుతన్. ౪౦

మిన్ను=ఆకాశము.

## తాత్పర్యము

ఆకాశము, దేవతల సమూహములు, నీ విరోధులయినను విరోధమువాని వారును, చంద్ర బృహస్పతులు కుబేరుఁడు సూర్యుఁడు నీకు మీఁద మీఁద శుభమును గలిగింతురుగాక, అగ్ని వాయువు హోమ ధూమము నీవునేర్చిన మంత్ర సమూహములు భయంకరములైన యడవులందు స్నానముచేయు నపుడు నీకు మేలు కలిగించునుగాక.

తే॥ సర్వలోకవిభుండును•సర్వసాక్షి, బ్రహ్మభూతైకభర్తయు•బ్రహ్మఋషులుఁ
దక్కు దేవతలును వనీ•తలమునందుఁ,
దిరుగునినుఁ బ్రోచుచుందురు•దివ్యతేజ. ౪౧

సర్వలోకవిదుండును=సమస్తలోకములను దెలిసినవాఁడును, సర్వసాక్షి=తటస్థుఁడై యుండి సర్వమును జూచువాఁడును భూతములకెల్ల నొక్కఁడే భరించువాఁడును, తక్కు=మిగిలిన, దివ్యతేజ=దేవతేజస్సు గలవాఁడా! వనీతలము=అటవిప్రదేశము.

## తాత్పర్యము

సమస్తలోకుల వృత్తములఁ దెలిసినవాఁడును, దటస్థుఁడై సర్వమును జూచువాఁడును బ్రహ్మమును భూతములకెల్ల దానొక్కఁడేయై భరించువాఁడును, నగు విష్ణువు బ్రహ్మఋషులు దక్కినదేవతలు నడవులయందుఁ దిరుగు నిన్ను దివ్యతేజా రక్షించుచుందురు.

అనుచు వేల్పులనెల్ల•నాపుణ్యసాధ్వి•యమలమాల్యంబుల•నతులగంధముల
ననురూపవినతుల•నర్చించి మఱియు•ననఘవిప్రునిచేత•నగ్నుల వేల్మి
తనయునకును శుభ•దం బగురీతి•ధవళమాల్యముల ఘృ•తంబుల సమిధ
లను దెల్లయావల•లలనలమిన్న•లలితంబుగాఁగఁ జ•ల్పఁగ ఘటియించె.

వేల్పులన్=దేవతలను. అమలమాల్యంబులన్=నిర్మలమైన పూలదండల చేతను, అతులగంధములను=అసమానమైన చందనాది పరిమళ పదార్థముల చేతను అనురూప వినతులన్ = తగినవిధములగు నమస్కారములచేతను, అర్చించి=పూజించి అనఘవిప్రునిచేత=దోషరహితుఁడైన బ్రాహ్మణునిచే, వేల్మి=హోమము, శుభదము=మేలిచ్చునది, ధవళమాల్యంబులన్ = తెల్లనిపూవులచే (నల్లనివి, యెఱ్ఱనివి విష్ణుపూజకుఁ బనికిరావు) ఘృతంబులన్=నేతులచే.

ప్రాసముమాఱుగ యతిగూర్చినద్విపద తరువోజ యగును. మూఁడింద్ర గణములు- నొక సూర్యగణము-మరల మూఁడింద్రగణములు నొకసూర్యగణము మూఁడవ మూఁడవ గణాదిని ౪ యతులు కూర్చినఁ దరువోజ పాదమగును.

తా త్ప ర్య ము

ఈప్రకారము దేవతలనెల్ల నా పుణ్యురాలగు పతివ్రత నిర్మలములై దోష రహితములైన పూలదండలచేతను, అసమానమైన చందనాదులచేతను దగిన నమస్కారములచేఁ బూజించి తనకు హోమాధికారములేమిని బ్రాహ్మణునిచే నగ్నులయందుఁ దనకుమారునకు క్షేమముగలుగఁ దెల్లని పూలదండలు నేతులు సమిధలు దెల్లయావలు వీనితో నాస్త్రీరత్నము చక్కఁగా హోమముచేయించెను.

తే॥ ఒజ్జలు నిరామయముగ శా॥స్త్రోక్తసరణి,
శాంతికై వేల్చి వెలుపలి॥స్థానములను
బలిని గల్పింప మధుదధి॥పటలి నేత,నక్షతల స్వస్తివాచంబు॥లనిరి బుధులు.

ఒజ్జలు=గురువు- ఉపాధ్యాయ శబ్దభవము ఒజ్జ, నిరామయము=విబాధ లేనట్లుగ, మధు=తేనె, నేత=నెయ్యిచేత.

తా త్ప ర్య ము

ఉపాధ్యాయుఁడు రోగబాధలేకుండ శాస్త్రమునఁ జెప్పినట్లు శాంతికై హోమముచేసి హోమప్రదేశమునకు వెలుపలి ప్రదేశములందుఁ దేనె పెరుఁగు నేయి వీనిచేత బలిని గల్పింపఁగాఁ బండితులు స్వస్తివాచనము శ్రీరామునకు నడవులందు మేలు గలుగుటకై కావించిరి.

తే॥ ఆద్విజేంద్రుల కెల్లర॥కర్హరీతిఁ, దృప్తి వెలయుంగ దానంబు॥లిచ్చి రామ
మాతసత్కీర్తిపూతప్రే॥మమున రామ,
చంద్రుఁ గనుఁగొని దీవించు॥సారమతిని. ౭౪౪

తా త్ప ర్య ము.

ఆ బ్రాహ్మణశ్రేష్ఠుల కెల్లవారికి వారివారి యోగ్యతకుఁ దగినట్లు దానము లిచ్చి సత్కీర్తిచేఁ బవిత్రురాలగు శ్రీరాముతల్లి ప్రేమచే నింతవఱకుఁ జేసిన మంత్రాశీర్వచనముగాక తాను స్వయముగ దీవించుచున్నది.

—॥ కౌసల్య శ్రీరామునకు మంగళాశాసన మొనర్చి రక్ష గట్టుట ॥—

కం॥ ఏమంగళ మొదవెనొ నా నామరపూజ్యునకు దశశ॥తాక్షునకును సం
గ్రామమున వృత్రుఁ జంపఁగ, నామంగళ మొనరుఁగాక॥యన్నా! నీకున్.

నానామరపూజ్యునకు=అనేక దేవతలచేఁ బూజింపఁబడు వానికి,దశశతాక్షునకు = నూఱు గన్నులుగల యింద్రునకు-

## తాత్పర్యము

అహల్యను జెఱచిన కారణమునఁ గోపించి గౌతముఁడు నీకు స్త్రీలయోనులం దింత యాశగలవాఁడవు కావున నీదేహమంతయు యోనులగునుగాక యని శపించి మరల వేఁడుకోఁగాఁ జూచువారికవి కన్నులవలెఁ గానవచ్చునని యనుగ్రహించెను. పార్వతి శాపముచేఁ జిత్రకేతుఁడను గొప్పవిష్ణుభక్తుఁడు వృత్రాసురుఁడై పుట్టెను. ఇంద్రునిఁ జంపు కుమారునిఁగోరి కశ్యపుఁడు హోమము చేయఁగా స్వరభేదమున నింద్రునిచేఁ జచ్చువీఁడుపుట్టెను. వీని నింద్రుఁడు దధీచి వెన్నెముకచేఁ జేయఁబడిన వజ్రాయుధముచేఁ జంపెను. ఇందు రావణవధాది శత్రుసంహారము సూచితము.

కం॥ ఏమంగళము సుపర్ణున, కామాత ఘటించె వినత•యమృతముఁ దేరం
బో మదిఁ బూనినవేళను, నామంగళ మొసరుఁగాక•యన్నా! నీకున్. ౨౪౬

సుపర్ణునకు=గరుత్మంతునకు, వినత=గరుత్మంతుని తల్లి, తేరన్=తెచ్చుటకు కద్రువవినతలు కశ్యపునిభార్యలు-వీరిరువురు నొకనాఁడు సాయంకాలమున వెలుపల సంచరించునపుడు ఇంద్రునిగుఱ్ఱమగు నుచ్చైశ్శ్రవమును జూచి వినత యాగుఱ్ఱమునందు నలుపునది లేదనెను. కద్రువ యున్నదనెను. ఇట్లు వాదించి యెవరోడిపోదురో వారు గెలిచినవారికి దాసియైయుండఁ బందెములు గట్టిరి. వారు నేఁడు సాయంకాలమైనది రేపు చూతమని యింటికిఁ బోయిరి. అందుఁ గద్రువ న్యాయమున గెలువలేమిని దనపుత్రులనుబిలిచి మీలో నెవ్వరైన నొకరు ఉచ్చైశ్శ్రవమున నలుపు కనఁబడునట్లు చేయవలయు ననెను. ఈ మోసకృత్యమును శేషుఁడుసహింపక యిదుష్ట సహవాసము సరిగాదని తపస్సునకు వెడలిపోయెను. తక్కినవారును దిరస్కరించిరి. ఈ తిరస్కరించినవారినెల్ల మీరు జనమేజయుని సర్పయాగమున నాశముకండని కద్రువ శపించె. ఒక ముద్దుకొడుకుమాత్రము నేను జేసెదనని పోయి గుఱ్ఱపుఁదోఁకయందలి వెండ్రుకలలో నొక వెండ్రుకగా వ్రేలుచుండెను. మఱునాటి దినము సవతు లిరువురు గుఱ్ఱమును బరీక్షించిరి. కద్రువ చేసిన మోసము వినత తెలిసికొనలేక తానే యోడిపోయితినని సవతికి దాసియై యుండెను. ఆవల నామెకు సనూరుఁడనువాఁడు తొడలులేక పుట్టి సూర్యుని సారథియయ్యెను. రెండవపుత్రుఁడు గరుత్మంతుఁడు. జరిగిన మోసమంతయు తల్లివలన విని గరుడుఁడు కద్రువతో నీకేమి యిచ్చిన నాతల్లిని దాస్యమునుండి విడిచెదవనెను. అమృతము దెచ్చియిచ్చిన మీరు దాస్యము చేయవలసిన పని లేదనఁగా గరుత్మంతుఁడు స్వర్గమునకుఁ బోయి యింద్రుని జయించి యమృత భాండమును దెచ్చి కద్రువకిచ్చి తల్లిని దాస్యమునుండి విముక్తురాలినిజేసెను. ఆభాండమును గద్రువ దర్భలపైనుంచి స్నానముచేసి యుపయోగింతమని బిడ్డలతో స్నానమునకుఁ బోయెను. ఇంతలో నింద్రుఁడు వచ్చి యాభాండము

నెత్తికొని పోయెను. ఆభాండము నుంచిన దర్భలు నాకుటచే పాముల నాలుకలు రెండుగాఁ జీలెను, అది మొదలు పాములు రెండునాలుకలు గలవయ్యె.

తాత్పర్యము

అన్నా రామచంద్రా తల్లికష్టమును బాపుటకై గరుత్మంతుఁడు అమృతమును దెచ్చుటకుఁ బోవునపుడాయనతల్లి యేమంగళాశాసనములు గావించెనో యామంగళ వాక్యములచేఁ గలిగినమేలే నీకును గలుగునుగాక. శ్రీరాముఁడు కష్టకార్యము సాధించి మరలఁ దల్లిని సంతోషపెట్టుట సూచితము.

కం॥ ఏమంగళ మదితియు సు, త్రామునకు ఘటించె మును సు॰ధాలబ్ధి నరి
స్తోమము నిర్మూలింపఁగ, నామంగళ మమరుఁగాక॰యన్నా! నీకున్. ౫౪౩

సుధాలబ్ధిన్=అమృతము సంపాదించుటయందు, అరిస్తోమము =శత్రువుల సమూహము, నిర్మూలింపఁగన్=నాశము చేయఁగా.

తాత్పర్యము

అమృతము నిమిత్తమై పాలసముద్రమును దేవతలు రాక్షసులు మథించినపుడు ఇంద్రునకు నమృతము లభించునట్లు శత్రువులు నాశమగునట్లు అదితి యేమనిదీవించెనో యా దీవనవలనఁ గలిగిన శుభమే నీకును గలుగునుగాక.

సుధాశబ్దస్త్రీలింగ సారస్యముచే సీతయు, నిర్మూలించు శబ్దముచే రాక్షసవంశ నాశము ఇంద్రునకు సుధవలె శ్రీరామునకు సీత లభించుటయు సూచితము.

కం॥ వామనుఁడై మూఁడడుగుల,చే మహిఁ గొలువంగ వృద్ధిఁ॰జెందెడు వేళన్
శ్రీమధుహరి కేమంగళ, మామంగళ మమరుఁగాక ॰ యన్నా! నీకున్. ౫౪౮

శ్రీమధుహరికి = విష్ణువునకు.

తాత్పర్యము

విష్ణువు వామనావతారమున బలిని మూఁడడుగుల నేలవేఁడి యాయన యీయఁగా మూఁడడుగులతో లోకమునంతయుఁ గొలిచి యాక్రమించినపుడే శుభము కలిగెనో యాశుభమే నీకుఁ గలుగునుగాక.

దీనివలన శ్రీరాముఁడువచ్చి సార్వభౌముఁడవుట సూచితము.

కం॥ ఋతుజలధిద్వీపంబులు, శ్రుతులును లోకములు దిశలు॰శుభమంగళముల్
సతతము నిను సన్మంగళ,యుతుఁగాఁగావింపుఁగాత ॰ మెప్పుగఁ బుత్రా.

ఋతుజలధి ద్వీపంబులు = ఋతువులు- సముద్రములు ద్వీపములు, శ్రుతులు=వేదములు, దిశలు=దిక్కులు, శుభమంగళములు=మంగళమునందు మంగళములు.

తాత్పర్యము

ఋతువులు సముద్రములు ద్వీపములు వేదములు లోకములు దిక్కులు మఱి శుభకరములై నవన్నియు నిన్ను శుభవంతునిఁగా జేయునుగాక.

సీ॥ అని తనూజునకు శే • షాక్షతల్ శిరమునఁ, గదియించి మిగిలిన • గంధ మలఁది
దృష్టఫలంబు లై • యెసఁగుమూలికల వి, శల్యకరణిని ర • క్షగను గట్టి
జపియించి మంత్రముల్ • సాధ్వి దుఃఖితయయ్యుఁ,
బరితుష్టవోలె వె • ల్పలికిఁ దోఁప
శిరముమూర్కొని ప్రేమ • పరతఁ గౌఁగిటఁ గ్రుచ్చి, గద్గదవాణివా • ఙ్మాత్రఁ బలుకుఁ

తే॥ బోయిరా పుత్ర! సిద్ధార్థ • పూతుఁ డవుగ
సౌఖ్యముగ నీవు కార్యముల్ • చక్కఁ జేసి
మరలి యీయయోధ్యను రాజ • మార్గవర్తి
వైననినుఁ గాంతుఁ గాక నా • యనుఁగుఁగుఱ్ఱ. ౭౨౦

శేషాక్షతల్ = మిగిలిన యక్షతములను, అలఁది = పూసి, దృష్టఫలంబులై = కానవచ్చు ఫలముగలవి, విశల్యకరణిని = దేహమునందు నాటిన ములుకలులోనైనవి బయటకులాగుమూలిక, పరితుష్ట = సంతోషించినది, సిద్ధార్థపూతుఁడవు = కార్యముసాధించుటచేఁ బవిత్రుఁడవు, అనుఁగుఁగుఱ్ఱ = ముద్దుగలబిడ్డా, మూర్కొని = వాసనచూచి.

లక్ష్మణుని మూర్ఛకాలమున హనుమంతుఁడు హిమవంతమునకుఁ బోయి విశల్యకరణి సంధానకరణి సంజీవనిలోనైనవి తెచ్చెనే ఇచ్చట నిది యీమె కెట్లు లభించెనని సందేహింపవలసిన పనిలేదు. సంజీవని నెఱిఁగినవారు లేరన వచ్చును. గాని విశల్యకరణి సంధానకరణి తెలిసినవారు నేటికిని గలరు. ఇవి యడవులందు దొరకును.

వాఙ్మాత్రన్ = వాక్కుతోమాత్రము. పోయిరమ్మనుమాట నోటితోఁ జెప్పెను గాని పోవుటకు నిష్టములేక మనఃపూర్తిగాఁ జెప్పలేదు.

తాత్పర్యము

ఈప్రకారము దీవించి మిగిలిన యక్షతలను శ్రీరాముని శిరముపైనుంచి మిగిలిన గంధముపూసి వెంటనే ఫలమునిచ్చు మూలికలచే విశల్యకరణిచే రక్షగాఁ గట్టి మంత్రములు జపించి యా పతివ్రత లోపల దుఃఖముగలిగియు దానివెలుపలికి రానీయక సంతోషముగల దానివలెనే శ్రీరాముని శిరసు వాసన చూచి ప్రేమతోఁ గౌఁగిలించుకొని మాట తడఁబడుచుండఁ గుమారా పోయి రమ్ము. వనవాసకార్యము సాధించి ఋణవిముక్తుఁడవై చేయవలసిన కార్యములుచేసి (రావణవధాదికము) మరలి యీ యయోధ్యను రాజమార్గమందు వర్తించు నిన్నుఁ గన్నులారఁ జూతునుగాక.

కం॥ నష్టంబులుగా దుఃఖము, లిష్టాప్తికి నలర మోహ ము • హీనముగ వనీ
కష్టమతి వచ్చునిన్ను, న్శిష్టనుతా! యుదయదిందు • నింబలెఁ గాంతున్.

ఇష్టాప్తికిన్ = ఇష్టములభించిన కారణముచే, అహీనముగన్ = మిక్కిలి గొప్పగ, కష్టమతి = కష్టము + అతి = క్షయించి, శిష్టనుతా = పెద్దలచే స్తోత్రము

చేయఁబడువాఁడా, ఉదయదిందునింబలెన్ = ఉదయత్ = పుట్టుచున్న, ఇందు నింబలెన్ = చంద్రునివలె.

తాత్పర్యము

దుఃఖములు నాశముకాఁగా నిష్టము ప్రాప్తించుటచే ముఖము మిక్కిలి వికాసమునొందఁగా నడవులయందలి కష్టముతొలఁగివచ్చు నిన్ను నుదయించుచున్న చంద్రునిఁ జూచినట్లు చూతును.

మ॥ వనవాసంబుఁ దరించి, యాయవనిప • వ్యాహారముం దీర్చి, వ
చ్చి నమద్ద్వేషణః భద్రపీఠమున నా • సీనుండవై యుండ నిన్
గనుదుం గావుత నావధూమణియు నేఁ • గాంక్షించు నర్థంబులున్
ఘనసంవర్ధిత మాచరింపు చిరముం • గల్యాణయుక్తుండ వై. ౨౯.

తరించి=దాఁటి, అవనిపవ్యాహారము=రాజువాక్యము, తీర్చి=చక్కచేసి, నమత్=నమస్కరించుచున్న, ద్వేషణ=శత్రువులుగలవాఁడా, భద్రపీఠమునన్= సింహాసనమందు, నావధూమణియు=నాకోడలు సీత, కాంక్షించు నర్థంబులన్= కోరిన కోరికలను, ఘనసంవర్ధితము = గొప్పగా వృద్ధిపొందునవి. సీతయర ణ్యమునకుఁ బోవునని కౌసల్య తలంచినదికాదు, చిరమున్ = స్థిరముగ, కల్యాణ యుక్తుండవై=శుభముతోఁగూడినవాఁడవై.

తాత్పర్యము

వనవాసము గడుపుదాఁటి రాజువాక్యమును నెఱవేర్చివచ్చి శత్రువులను నమస్కరించుచుండఁగా సింహాసనమునఁ గూర్చుండియుండఁగా, నిన్ను నేను జూచెదనుగాక. నీవట్లువచ్చి శుభకరుఁడవై నాయొక్కయు నాకోడలియొక్కయుఁ గోరికలనెల్లఁ బూర్ణముగ స్థిరముగఁ బూర్ణముచేయుము.

కం॥ (నాయర్చించెడిసురమును,లాయీశుఁడు భూతములు మ • హాసురఫణులున్
నీయేగెడువనముల న,త్యాయతకృపఁ బ్రోచుచుండు • రన్నా నిన్నున్.)

ఈ సమాప్త పునరాత్తపద్యమునకు మూలశ్లోకము ప్రక్షిప్తమని తోఁచుచున్నది. పూర్వవ్యాఖ్యాత లెవ్వరు దీనికి వ్యాఖ్యానమును వ్రాయలేదు.

ఈశుఁడు=శివుఁడు, మహాసురఫణులున్=గొప్ప యసురులు సర్పములు, అత్యాయతకృపన్ = విస్తారమైన దయచే.

తాత్పర్యము

నేను బూజచేయు దేవమునులును నారదాదులు శివుఁడు భూతములు గొప్ప యసురులు సర్పములు నీవు పోవు నడవులందు నిన్ను మిక్కిలి కృపతో రక్షింతురుగాక.

మ॥ అని యశ్రుప్రతిపూర్ణనేత్ర యయి తా • నాశాసనంబుల్ సమా
పనముం జేసి యథావిధిన్ సుతునిసా • భాగ్యార్థమై ప్రేమపె

మ్పునఁదా మంత్రితరక్షఁ గట్టి వలగొం • చుం బుత్రునా శ్లేషణం
బున సాధ్వీమణి దీల్పెఁ బ్రీతుఁడయి రా • ముం డుత్తమశ్రద్ధమై. ౩౨౪

అశ్రుప్రతిపూర్ణనేత్ర=కన్నీళ్ళతోనిండిన కన్నులుగలది, ఆశాసనంబుల్= దీవనలు, సమాపనము=ముగింపు, యథావిధిన్ = శాస్త్రప్రకారము, సౌభాగ్యార్థమై=ఐశ్వర్యనిమిత్తము, ప్రేమపెన్పునన్=ప్రేమాతిశయముచే, మంత్రితరక్ష = మంత్రింపఁబడిన మూలిక రక్షగా, కట్టి=చేతికిఁగట్టి, వలగొంచున్ = ప్రదక్షిణముచేయుచు - ఇది రక్షార్థము, ఆశ్లేషణంబునన్=కౌఁగిలింతచేత.

### తాత్పర్యము

ఈప్రకారముచెప్పి కన్నులు నీటిచేనిండ నాశీర్వచనములు ముగించి శాస్త్రప్రకారము కొడుకునకు మేలుకలుగఁగోరి ప్రేమాతిశయముచే మంత్రింపఁబడిన మూలికను జేతికి రక్షగాఁగట్టి యష్టదిగ్బంధనముచేసినట్లు రక్షార్థమై చుట్టుదిరిగి కొడుకును గౌఁగిలించుకొని సంతోషింపఁజేయఁగా శ్రీరాముఁడుసు శ్రద్ధాతిశయముచే.

కం॥ జననికి వలగొని పదముల, వినయంబున వ్రాలి వెండి • వెండియు సీతా
వనజాక్షినిలయమునకుఁ,జన నెంచె మహాయశుండు • స్వశ్రీ వెలుఁగన్. ౩౨౫

వలగొని=ప్రదక్షిణించి, వెండి వెండియు=పలుమారు, నిలయమునకున్= గృహమునకు, మహాయశుండు=పితృవాక్యపరిపాలన దీక్షాదక్షుఁడను గొప్పకీర్తి, స్వశ్రీ=తన సహజకాంతి, తల్లివ్యసనము చూచుటచేఁ గలిగిన వికారముపోయినవాఁడై యని భావము.

### తాత్పర్యము

తల్లికిఁ బ్రదక్షిణించి యామె పాదములమీదవ్రాలి మఱిమఱి అధ్యాత్మిక-అధిభౌతిక అధిదైవికములను మూఁడు తాపములు పోవుటకై మున్మారు నమస్కరించి లేచి సీతాగృహమునకుఁ బితృవాక్య రక్షాదీక్షాదక్షుఁడను కీర్తిగల శ్రీరాముఁడు తన సహజకాంతితో వెలుఁగుచుఁ బోవనెంచెను.

—• ౨౬వ సర్గము. శ్రీరాముఁడు సీతను జూడఁ బోవుట. •—

తే॥ తల్లి దీవింప వలగొని • తరలి యచటఁ,దనదుకల్యాణగుణముల • పెనుపుఁ జేసి
భృశ మాకృష్టచిత్తులై • యెల్లజనులు,దన్ను వీక్షింపఁజనియె సీ • తను గనంగ.

వలగొని = శ్రీరాముఁడు అను పదము అధ్యాహారము, ప్రదక్షిణించి, తరలి=ప్రయాణమై, తనదు=తనయొక్క, దుస్సంబంధార్థే-యనిసూ, కల్యాణగుణముల పెనుపుఁజేసి = శుభగుణముల యాధిక్యమువలన, భృశసమాకృష్టచిత్తులై=మిక్కిలి యాకర్షింపఁబడిన మనస్సులుగలవారై.

### తాత్పర్యము

మీఁదఁజెప్పిన ప్రకారము తల్లి దీవింపఁగా నామెకుఁ బ్రదక్షిణముచేసి యచటనుండి బయలుదేఱిపోయి ప్రియవాదిత్వము- పూర్వభాషిత్వము మొదలగు తన కల్యాణగుణాతిశయముల గొప్పతనమువలన మిక్కిలి యాకర్షింపఁబడిన మనస్సులుగలవారై యెల్లజనులు దన్నుఁ జూచుచుండఁ దాను సీతను జూడఁబోయెను.కల్యాణగుణాధిక్యమువలన లోకులు తన్నుఁజూడఁ దాను సీతను జూడఁబోయె ననుటచే శ్రీరామునియందలి కల్యాణగుణములకంటె సీతయందుఁ గల్యాణగుణములు మెండనియు వానిచే శ్రీరాముఁ డాకర్షింపఁబడెననియు భావము.

ఉ॥ అక్కడ భూమిపుత్రి యొకఁ • డైన నెఱుంగమి నీయుదంతమున్,
బ్రొక్కుచు యౌవరాజ్యపద • మున్ వహియించుత భర్త యంచుఁ, బె
న్మక్కువ దైవపూజల స•మంజసరీతిని దాన తీర్చి, జో
కెక్కి కృతజ్ఞ గంధతతు • లెల్లను గూరిచి భర్తృపూజకై. ౭౨౪

అక్కడ=సీతాదేవి యంతఃపురంబున యందు, భూమిపుత్రి=సీత, ఉదంతము=వృత్తాంతము, సమంజసరీతిని=చక్కఁగాఁ గొఱఁతలేకుండ, తాన=స్వయముగ- అనఁగా నితరులచేఁ జేయింపలేదనుట, బ్రొక్కుచు = ఇష్టదేవతలకు నమస్కరించుచు, జోక + ఎక్కి=ఉత్సాహమతిశయించి, కృతజ్ఞ = భర్తలకుఁ బట్టాభిషేకము కాఁగానే పట్టపురాణులు చేయవలసిన కార్యములు తెలిసినది- కావున, భర్తృపూజకై కావలసిన, గంధతతులు=గంధము పూలు లోనగు పూజాద్రవ్యములుచేర్చి కైకకుఁ బట్టాభిషేకవార్త తెలిసినపిమ్మట నామెయొద్దకుఁ బోయి కార్యము పాడుచేసికొనిన దశరథునివలెఁగాక శ్రీరాముఁడీ పట్టాభిషేకవిఘ్నవృత్తాంతము సీతకుఁ దెలియకముందే యామెయొద్దకుఁ బోయెను.

### తాత్పర్యము

అంతఃపురమందున్న సీతాదేవి శ్రీరాముని యీవనవాసవార్త యెఱుఁగనిది కావునఁ దనభర్త యౌవరాజ్యపదవి నలంకరించునుగాక యని యిష్టదేవతకు నమస్కరించుచు నితర దేవపూజలనన్నిటిని మిగులఁ బ్రేమముతోఁ దానేనెఱవేర్చి యుత్సాహపూరితయై పట్టాభిషేకముచేసికొని భర్తరాఁగాఁ దానుజేయవలసిన కార్యములన్నియుఁదెలిసినది కావున భర్తను బూజించుటకై పూలు గంధము లోనైనవి సేకరించి యుంచుకొన్నదై.

కం॥ నృపనీతివిదుషి యగునా,విపులాయతచారునేత్ర • శ్వేతచ్ఛత్రా
దిపరివృతుం డగునాథుం, డెపు డెప్పుడు వచ్చు ననుచు•నెదురుం జూడన్.

నృపనీతివిదుషి=పట్టాభిషేకము చేసికొని రాజకుమారుఁ డింటికి వచ్చునప్డే వేషముతో నెట్లురావలయునో యది తెలిసినది కావున, విపులాయతచారునేత్ర = విశాలములై, దీర్ఘములై మనోహరములైన కన్నులుగలది- ఇట్లనుటచే

సహజముగనే విశాలాక్షియగు సీత తనభర్త పట్టాభిషిక్తుఁడై యెపుడెపుడు వచ్చునాయని కన్నులువిచ్చి సంతోషాతిశయముచే స్రోవచూచుచుండెనని యూహ్యము; శ్వేతచ్ఛత్రాది పరివృతుండగువాఁడు=తెల్లని గొడుగు, తెల్లచామరము, ఏనుఁగులు లోనగువానిచేఁ జుట్టఁబడినవాఁడై.

తాత్పర్యము

పట్టాభిషిక్తుడైన రాజకుమారుఁ డింటి కేవేషముతో నేచిహ్నముతో నేపరివారముతో వచ్చునో యారాజనీతియంతయు నెఱిఁగినది కావున నావిపులాయతచారులోచన తనపతి తెల్లనిగొడుగు వింజామరములు భటవర్గపరివారముతో నెప్పు డెప్పుడు వచ్చునా యని యాయనవచ్చుత్రోవ నెదురుచూచుచుండెను.

ఉ॥ చారువిభూషితంబు ఘన•సమ్మదహృష్టజనాకులంబు స్వా
గారముఁ జొచ్చి సిగ్గుపడి • క్రిన్న నవాఙ్ముఖుఁ డైననాథునా
కారముఁ జూచి మేను వణఁ•కన్ సతి దిగ్గన లేచ, శోకదు
ర్వారత సైఁపలేక రఘు•వర్యుఁడు దూపిలె బాహిరంబుగన్. ౭౨౮

చారు విభూషితంబు=మనోహరముగా నలంకరింపఁబడినది, ఘనసమ్మద=మిక్కిలి సంతోషముచే, హృష్టజనాకులంబు=గగురుపాటుగల జనులచేఁ గలఁతచెందియుండునది, స్వాగారము=తనయిల్లు, సిగ్గుపడి=తనయింటికిఁ జేసియున్న యలంకారములేమి తానుండుస్థితియేమి యనికాని యాకష్టవార్త సీత కెట్లుచెప్పుదునా యనికాని లజ్జవహించి, అవాఙ్ముఖుఁడు=తలవంచుకొన్నవాఁడై, ఇంగితజ్ఞయగు సీత తనముఖముచూచి యేదోకీడు కలిగినదని యూహించి శత్రుజాలాడునేమో యని ముఖమావైకుఁజూప జంకి, మేను=దేహము, దిగ్గన=తటాలున, శోకదుర్వారత=నివారింపరాని శోకముచేత, బాహిరంబుగన్=అందఱకుఁదెలియునట్లు, దూపిలెన్= శోకించెను.

అయోనిజయై కావుననే దేవతాస్త్రీయై, జనకమహారాజువంటివాఁడు పెంపఁగా బెరిఁగి మిగుల సుకుమారియై తనమగఁడు పట్టాభిషిక్తుఁడగును దాను పట్టపురాణి నగుదునని కొండంతయాశతో నువ్విళ్ళూరుచుండు నిటువంటి సీత యాశ్రుతుమధ్యమున నిందియుంతునా, నాతోడఁ బిలుచుకొనిపోదునా అకష్టము లీకోమలాంగి పడఁగలదా పుట్టినింటికిఁ బంపుదునా అదియెంత యవమానకరము. అయ్యో నానిమిత్తమై యాచిన్నవయసు కోమలాంగి కింత దుఃఖము గలిగెఁగదా యని, కౌసల్య దుఃఖించి నపుడును దుఃఖింపని శ్రీరాముఁడు, సీతను జూడఁగానే బాహిరముగానే యేడ్చెను. హృష్టజనాకులమనుటచే శ్రీరామునింటనెవరికి నీవార్త తెలియదని యేర్పడుచున్నది.

తాత్పర్యము

మనోహరముగా నలంకరింపఁబడినదియు మిగుల సంతోషముగల జనులచే గూడినదియునగు తనయింటిలోఁ బ్రవేశించి సీతముఖము చూచ సిగ్గుపడి తల

పంచుకొనిన తనయాకారముఁజూచి సీత భయమున దేహము వణఁకఁగాఁ గూర్చుండిన యాసనమునుండి, తటాలున లేవఁగా దుఃఖము నణఁపలేక శ్రీరాముఁడు స్పష్టముగానే శోకించెను.

కౌసల్యయంత దుఃఖించినను గన్నీరుకార్పని రామచంద్రమూర్తి సీతాదేవినిజూడఁగానే యేలయేడ్చెను ? మాతృవియోగదుఃఖమునకంటె భార్యావియోగదుఃఖముతీవ్రతరమా?

ఉత్తరము:- మాతృవియోగ దుఃఖమునకంటె భార్యావియోగ దుఃఖము తీవ్రతరమగుటచే కామముచే శ్రీరామచంద్రమూర్తి దుఃఖింపలేదు. తనవలనఁ దల్లికిఁ బుత్రవియోగదుఃఖము గలిగెఁగదా యనియు సీతాదేవికి భర్తృవియోగ దుఃఖము కలిగెఁగదాయనియు సంతాపించెను. తల్లియొద్ద బాహిరముగ నేడ్చినఁ దన వనవాసాయాసమునకై దుఃఖించుచున్నాఁడనియు, నిష్టములేక తండ్రియాజ్ఞ నిర్వహింపఁబూనెననియుఁ గౌసల్య గ్రహించి యడవికిఁ బోవల దని మఱింత గట్టిపట్టు పట్టును. తనవియోగమువలనఁ దల్లికి స్థితిహానిగాని గౌరవహానిగానిలేదు. కౌసల్యయే కువలయాక్షికి నూర్గురు కొడుకులున్నఁ బ్రాణ పతిలేమి సౌఖ్యంబుఁ బడయరాదని చెప్పెను. భర్తృవియోగమువలన భార్యకు వియోగదుఃఖమేగాక స్థితిహాని గౌరవహానియు గలుగును. పుట్టినింటనున్నను అత్తగారింటనున్నను భర్తలేనిది బానిసగా నెంచఁబడును. తన్ను భర్తగాఁ గొనుటచే మహారాజపుత్రికకు బాలికకు నటువంటి నీచస్థితి నిష్కారణముగా వచ్చుట యెక్కువ దుఃఖకరము గదా.

చం॥ వెలవెలఁ బాఱునెమ్మొగము ♦ స్వేదజలార్ద్రితమైన దేహమున్
బలితపుదుఃఖభారమును ♦ పద్మవిలోచన గాంచి శోకవి
హ్వల యయి ప్రాణనాథః చెపు ♦ మా యిటు లీసమయంబునందు నీ
వెలమిఁ దొఱంగి యుండుటకు ♦ హేతు వదెయ్యది కల్గె వల్లభా? ౭౬౦

స్వేదజలార్ద్రితము=చెమట నీటఁదడిసినది, శోకవిహ్వల=శోకముచేఁ జెదరిన మనస్సుగలదై, ఎలమి=సంతోషము, తొఱంగి=తొలఁగి.

తాత్పర్యము

సుందరమైన ముఖారవిందము తెల్లఁబాఱియుండుటయు దేహము చెమటచేఁ దడిసియుండుటయు బలమైన దుఃఖాతిశయమును నాకమలాక్షి సీత చూచి శోకముచే గుండెచెదరి తెల్లఁబోయి ప్రాణేశ్వరా చెపుము. ఎంతో సంతోషముతోనే యుండవలసిన యీసమయమందు సంతోషమువిడిచి యిట్లు దుఃఖించుటకుఁ గారణమేమి కలిగెను. వల్లభా- నాయందు నీకుఁ బ్రేమగలదేని చెప్పుము.

చం॥ అలగురు దేవతాకము శు ♦ భాకరపుష్యము నేఁడ యంచు వి
ప్రులు వచియించి, రేమిటికిఁ ♦ బొల్పుతి తీగతి దుర్మనుండ వై?
లలితవిశాలమున్ శతశ ♦ లాకము పుష్కరఫేనతుల్యమౌ
వెలినుసుగొడ్గునీడఁ బృథి ♦ వీవరః యేటికి రావు చెప్పుమా? ౭౬౧

అలగురుదేవతాకము=శుభకరుఁడని ప్రసిద్ధినొందిన బృహస్పతిని దేవతగాఁ గలది, శుభాకరము = రెండవతార కావున సంపత్కరమైనదియగు పుష్యము, పొల్పఱితివి = పొలుపుచెడినవాఁడవై తివి, దుర్మనుండవై =దుఃఖముతోఁగూడిన మనస్సుగలవాఁడవై, లలితవిశాలము=మనోహరమైన వెడల్పుగలది, శతశలాకము=నూఱుకమ్ములు గలది, పుష్కరఫేనతుల్యము = నీటియందలి నురుగుతో సమానమయినది_ నురుగు నేలమీఁదఁబడిన మురికియగును గావున నట్టి మురికి లేనిదని తెలుప పుష్కరపేన మనఁబడెను. 'పుష్కరమంబుని ఖేఖే' యని నానా, వెలి=తెల్లని, నును=మృదువైన గొడ్గునీడ,పుష్యము=పుష్యమి యనుటసరిగాదు.

తాత్పర్యము

పట్టాభిషిక్తుని చిహ్నము లెఱిఁగినది కావున సీత యవియేల లేవని ప్రశ్నించుచున్నది. నాథా ప్రసిద్ధశుభగ్రహము గురుని దేవతగాఁగలిగి సంపత్కరమైన పుష్యనక్షత్రము నేఁడేయని బ్రాహ్మణులు చెప్పిరి. అట్లు శుభమైనకాలమందు నీవిపుడు కాంతిహీనుఁడవై శోకముతోఁగూడిన మనస్సుగలవాఁడవై తివి. ఏల? అందమై వెడలుపుగలదై నూఱుకమ్ములుగలదై నీటియందుండు బుగ్గవలె నిర్మలమై శ్వేతచ్ఛత్రము నీడను నీవేల రావై తివి చెపుము.

సీ॥ చంద్రహంసప్రకా•శంబు లౌచామరల్, విసర రేల ముఖార•విందమునను?
వాగ్మిలు వందులు • పరమసమ్మదమునఁ, బొగడ నేటికి రారు • పుణ్యశీల?
సూతమాగధు లేల • శుభమంగళంబుల, నీవెంట రారైరి • నీరజాక్ష ?
వేదపారగు లైన • విప్రులు నభిషిక్త,శిరమున నుంచరే•పెరుగుఁ దేనె?

తే॥ మంత్రు లేటికి నీతోడ•మలయ? రేల, పౌరజానపదుల్ వెంట•రా? రదేల
స్వర్ణభూషితనిస్తుల•జవనహయచ,
తుష్కయుతపుష్యరథముముం•దుగనుబోదు? ౬-౭

చంద్రహంస ప్రకాశంబులు, చంద్రునివలె హంసవలెఁ దెల్లగాఁ బ్రకాశించునవి, వాగ్మిలు=చమత్కారముగ మాటలాడువారు, వందులు=స్తోత్రముచేయువారు, వేదపారగులు=వేదాధ్యయనము సాంతముగఁ జేసినవారు, అభిషిక్తశిరమునన్=జలముచే నభిషేకింపఁబడిన శిరమునందు, మలయరు=నడచిరారు, పౌరులు=పురజనులు, జానపదుల్=పల్లెటూళ్ళవారు, స్వర్ణభూషిత = బంగారు సొమ్ములచే నలంకరింపఁబడిన, నిస్తుల = సమానములేని, జవన=వేగముతోఁ గూడిన, హయచతుష్కము = నాలుగు గుఱ్ఱములతో, యుత = కూడిన, పుష్యరథము = యుద్ధార్థమైగాక వినోదార్థమై చేసినతేరు.

తాత్పర్యము.

చంద్రమండలమువలె గుండ్రముగను దెల్లగను హంసవలె స్వచ్ఛముగఁ బ్రకాశించు చామరములు నీ ముఖకమలమున నేల విసరరు?వాగ్మిలు వందులు

సంతోషముతో జయజయధ్వనులతో నిన్నుఁ బొగడుచుఁ బుణ్యచరిత్రా యేలరారు? సూతమాగధులు శుభములైన మంగళములు పాడుచు నీవెంట రారేల? వేదాధ్యయన సంపన్నులైన బ్రాహ్మణు లభిషేకజలముచేఁదడిసిన నీ శిరమునందుఁ బెరుగుఁ దేనె యేల యుంచలేదు. నీతోడ నీమంత్రులు రాని కారణమేమి? పౌరులు పల్లెటూళ్ళవారు వేడుకచూచుటకై నీ వెనుకరాని హేతు వేమి? ఏల నీకుముందుగ బంగారుసొమ్ములచే నలంకరింపఁబడి యసమాన వేగముగల నాలుగుగుఱ్ఱములచేఁ గట్టిన పుష్యరథముపోదు.

చం॥ అరుగ దదేల కృష్ణజల ♦ దాద్రినిభంబు సులక్షణంబు నా
కరిపతి నీదుముంగలను? ♦ గాంచనచిత్రము భద్రపీఠ మో
సురచిరరూప! మున్నుచనఁ ♦ జొప్పడ దేల? యపూర్వవర్ణమై
యరుసముఁ బాసె మోము చెపు ♦ మా యభిషేకమువేళ దాసియున్? ౫౬౩

కృష్ణజలదాద్రినిభంబు=నల్లనిమేఘము కొండతో సమానమై, సులక్షణంబునై=శాస్త్రప్రకారము మంచిసుళ్ళుగలదగు, కరిపతి=పెద్దయేనుఁగు, కాంచనచిత్రము=బంగారుజేకులచేఁ జిత్రముగాఁ జేయఁబడిన, భద్రపీఠము=సింహాసనము, సురుచిరరూప=అందమైన యాకారముగలవాఁడా, అపూర్వవర్ణము = ముందెన్నఁడులేని రంగుగలది, అరుసము=సంతోషము- హర్షశబ్దభవము.

తాత్పర్యము

నల్లనిమబ్బువలె నీలవర్ణమై కొండవలెనెత్తై మంచిసుళ్ళుగల యేనుఁగు నీముందు పోదేల? బంగారు కమ్ములచేతను రేకులచేతను జిత్రపుఁబనిచేసిన సింహాసనము నీకంటె ముందేలపోదు? ఇవి యిట్లుండఁగా నెన్నఁడులేని వన్నె గలదై నీముఖము సంతోషము చెడియున్నది. అభిషేకసమయము సమీపించెనే మీరిట్లుండ నేమి కారణము ?

—♦ శ్రీరాముఁడు సీతతోఁ దా నరణ్యమునకుఁ బోవువార్తఁ దెలుపుట. ♦—

కం॥ అని కరుణంబుగ విలపించినసతిఁ గని రాముఁ డనియె ♦ సీతా! నన్నున్
వనములకుఁ బొమ్మటంచును, బనిచిరి సుమి తండ్రిగారు ♦ పద్మదళాక్షీ. ౫౬౪

కరుణంబుగన్=శోకముతో, విలపించిన=ఏడ్చిన, పనిచిరి=ఆజ్ఞాపించిరి- తండ్రిగారు, తఱచుగా స్త్రీసమంబుల కడపలఁ గొన్నింటికే కవచనంబునఁ బూజ్యతయందు గారు శబ్దంబగు- సు-వ్యా. ౧౨ సూ. తండ్రియందుఁగల భక్తి గౌరవము దెలుప నిట్లు చెప్పెను.

తాత్పర్యము

అని శోకముతో సీత యేడువఁగా శ్రీరాముఁడామెతో నిట్లనియె- సీతా! నన్ను నడవులకుఁబొమ్మని తండ్రిగా రాజ్ఞాపించిరి సుమీ.

నన్ను = నిన్నుఁగాదు, నీతోడనుగాదు.

వనములకు=పూలతోఁటలకు నుద్యానవనములకుఁగాదు. అడవులకు.

పొమ్ము = పొమ్మనిరేరాని మరల రమ్మనలేదు.

పనిచిరి = వేడుకమాటగాదు ఆజ్ఞ.

తండ్రి = ఎవరో కా దాజ్ఞాపించినది కన్నతండ్రి.

తండ్రిగారు = తండ్రి పూజ్యుఁడు కావున నాయనమాట ధిక్కరింపఁ దగినదికాదు. గౌరవింపవలసినదే.

ఇది నాస్థితి. ఇఁక నీవో

కం॥ గొప్పకులంబునఁ బుట్టితి, వొప్పఁగ ధర్మముల నేర్చి • తోసతి! ధర్మం
బెప్పుడుఁ దప్పవు జానకి! చెప్పెద విను నిబ్బరముగఁ•జెల్లినతెఱఁగుల్.

తాత్పర్యము ౭౬౫

కులముకొలఁది బుద్ధి. గొప్పకులమునఁ బుట్టితివి గావున నీవు గొప్పబుద్ధి గలదానవు. గొప్పకులమునఁ బుట్టుటచే వచ్చినది గౌరవము తెలివియేకాదు. చక్కఁగ ధర్మముల నేర్చితివి.

సతి=నీవు పతివ్రతవు. భర్తయాజ్ఞమీఱరాదని యెఱిఁగినదానవు. ధర్మములు నేర్చుకొనుట మాత్రమేకాదు. అనుష్ఠానమందును ధర్మము తప్పవు. కావునఁ దొందరపడక నిబ్బరముగ స్థిరచిత్తముతో నేను జెప్పునది వినుము. జరగిన వార్త చెప్పెదను. నేనుగూడ వచ్చెదననకుండుటకై యీ యుపోద్ఘాతము.

చం॥ జనకుఁడు సత్యవాదియును • క్ష్మాతలనాథుఁడు నైనయాజి నా
జననికిఁ గైకకున్ మును • సమ్మత రెండువరంబు లిచ్చె, నా
వనితయు వాని నాత్మ నిడి • వర్తిల నేఁ డభిషేకయత్నముల్
గని, యవి ధర్మమార్గమున • క్ష్మావిభుఁ దీర్పఁగఁ గోరె జానకి. ౭౬౬

కౌసల్యవలె సీత సులభసాధ్యగాదు. ఆమె అమ్మా! నేనడవికిఁబోయెద ననఁగానే గుండెచెదరి పుత్రశోకమున నేడువసాగెను గాని నిబ్బరమున నాలోచించు శక్తిగలది గాదాయెను. ఆకారణమున నామెను రాముఁడు సులభముగ నంగీకరింపఁజేసెను. సీతయొద్ద నాయాటలు సాగవు. అది తెలిసి శ్రీరాముఁడు మాటల తోనే ముందరికాళ్ళకు బంధాలు వేయుచున్నాఁడు.

జనకుఁడు=కన్నతండ్రి, సత్యవాది=అసత్యమెన్నఁడు నాడనివాఁడు, క్ష్మాతలనాథుఁడు=భూమికంతయు నధిపతి, ఆజి=దశరథుఁడు, జననికి = కన్నతల్లితో సమానురాలైన కైకకు.

జనకుఁడు - నన్నాజ్ఞాపించువాఁ డెవఁడోకాఁడు కన్నతండ్రి. ఆకారణము చేతనే యాయనయాజ్ఞ మీఱరాదు. సత్యవాది. ఎన్నఁడు నాడితప్పనివాఁడు. అట్టివాఁ డిప్పుడుమాత్రము నానిమిత్త మసత్యమాడునా? ఇచ్చిలేదనిచెప్పునా కావున నాయనమాట యథార్థపడవలసినదే. అది తప్పదు.

క్ష్మాతలనాథుఁడు- రాజు కావున రాజాజ్ఞ వేదశాసనమువలె మీఱరానిది- ఆక్షేపింపరానిది- కావున నేనేల యడవులకుఁ బోవలయునని యడుగు నధికారము నాకులేదు.

అజి=అజమహారాజునకు దేవతాస్త్రీయందు జనించినవాఁడు కావున మనుష్యులకంటె గొప్పతరగతిలోఁ జేరినవాఁడు. జానకి=నీవు జనకరాజు కూఁతురవు- రాజధర్మము నీ వెఱుఁగనిదికాదు.

## తాత్పర్యము

జానకీ! కన్నతండ్రియు సత్యవాదియు రాజునగు దశరథుఁడు నాతల్లికైకకుఁ బూర్వము రెండువరములు సంతోషముతో మంచిమనస్సుతో నిచ్చెను. ఆకైక వానిని మనస్సులోనుంచుకొని నేఁడు నా కభిషేకప్రయత్నములు జరగఁగాఁజూచి యా వరములను ధర్మమార్గమున నెఱవేర్పఁగోరెను, అవి యేవందువా?

శా॥ ఈరే డేఁడులు దండకాటవులలో • నేఁ గ్రుమ్మరం బోవ, భూ
భారం బెల్ల వహింపఁగా భరతుఁ డీ • భంగి న్వరంబుల్ గొనెన్,
సారారణ్యవిహారకేళిఁ జిలుపం • జంద్రాస్య! నేఁ బోవుచున్
జేరన్ వచ్చితి నిన్నుఁ జూచుటకునై • సీతా! సతీరత్నమా! ౪౬౪

ఈరేడేఁడులు=పదునాలుగు సంవత్సరములు, ఇరు+ఏడు=ఈరేడు, రెండేళ్ళు పదునాలుగు.ఈరు వృత్తియం దచ్చుపరంబగుచో రెంటి కాదేశమని శబ్దరత్నా. ఈరాఱు- ఈరేడు, సారారణ్య విహారకేళిన్ = పుష్ప ఫలవృక్షములతో నిండి సారవంతములైన యరణ్యములందు నాటలయందు నాడుకొనుటవలె సంచరించుటకు,చంద్రాస్య=చంద్రబింబమువలె నెప్పుడు నిర్మలమైన ముఖము గలదానా, నీవప్పుడే ముఖకాంతి మార్చుచున్నదానవు- అది నీకుఁ దగదు, నీ సహజకాంతి వదలకుము. సతీరత్నమా=పతివ్రతాశిరోమణీ = నీవు పతివ్రతవు గావున నీవు మంచిమనస్సుతో ననుమతించి పంపిన నాకు శ్రేయస్కరమని నిన్నుఁజూచి చెప్పిపోవ వచ్చితిని. నేను నిర్విచారముగా నేజంజాటములేక హాయిగాఁ దిరుగుచుండఁగా నీ భూమిభారమంతయు భరతుఁడు మోయవలయునని వరములు. వీనియందు నా తల్లిదండ్రులు నాయందే యెక్కువ దయ చూపినవారైరి.

ముందటి కాళ్ళకు బందాలువేయుటయందు శ్రీరామచంద్రమూర్తి కగ్ర తాంబూలమియ్యవలెను.

సీత తన వెంట వచ్చెదనని చెప్పునని తెలియును. దానికై ముందుగానే విఱుపులు చెప్పుట. సీతా = నీజన్మము స్మరింపుము, సతీరత్నమా = నీ శీలము స్మరింపుము.

ఈ చమత్కారము మున్ముందు లక్ష్మణ భరతాదులతో మాటలాడునపుడు నుగమింపవలెను.

ఈయన చమత్కారములు నిశ్చయ మనస్కులైన వారియెదుట బనికి రాలేదు.

తాత్పర్యము

అవరము లేవి యంటివా? ఒకటి నేను రెండేళ్ళసంవత్సరములు దండకాటవులలోఁ దిరుగఁబోవుట. రెండవది భరతుఁడే రాజై భూభారము వహించుట. ఈ రెండువరములు కైక కోరెను. నాతల్లికిఁ దనకొడుకునందుకంటె నాయందెంత ప్రేమయో చూచితివా. నేను భారముమోయ భరతుఁడు సుఖసంచారము చేయవలసియుండఁగా నాభారము వానిపై వేసి నన్ను హాయిగా నిశ్చింతముగా నేజంజాటములేక తిరుగఁ బొమ్మనిరి.

కావున నేనును ఫలవృక్షములు-పూలతీఁగలు వింతపక్షులుగల సారవంతమైన యరణ్యములందు సుఖముగా నాటవలె విహారముసేయఁబోవుచుఁ జంద్రవదనా నీవు పతివ్రతవుగావున నీకుఁ జెప్పి నీసమ్మతిమీఁదఁ బోయిన క్షేమమని తలఁచి నిన్నుఁ జూడవచ్చితిని.

—• శ్రీరాముఁడు సీతకు నీతులు చెప్పుట. •—

చం॥ భరతునిమ్రోల నన్బొగడి • పల్కకు మెన్నఁడు, వృద్ధియుక్తులౌ
పురుషులు సైఁతురే యితర • పూరుషసంస్తవ, మట్లుగావునన్
భరతుఁడు నీకు మ్రొక్కనిట • వచ్చిన వేళల వానితోడ నో
తరుణీ! ప్రశంస సేయుమి హి • తం బగు మద్గుణజాతవర్ణనల్. ౩౬౮

వృద్ధియుక్తులు=ఐశ్వర్యము- అధికారము వీనిచే వృద్ధినొందియుండువారు, సంస్తవము=స్తోత్రము, మద్గుణజాతవర్ణనల్=నాగుణసమూహములస్తోత్రములు, తరుణీ= వయోగర్వముచేఁదాఁకు తప్పులు మఱపురావచ్చును- అట్టివి రానీయకుము.

తాత్పర్యము

నీకుఁ గొన్నివిషయములు చెప్పవలసియున్నవి. చెప్పెద వినుము. భరతునియెదుట నెప్పుడేకాని నన్నుఁ బొగడి మాటలాడవలదు. ఏలందువా? ఐశ్వర్యముచే అధికారముచే వృద్ధినొందియుండువారితరులఁ బొగడినఁ దమ్ముదూషించినట్లుగా నెంచి కోపింతురు. కావున భరతుఁడు నీకు నమస్కరించుటకై యిచ్చటికి వచ్చిన సమయమందు వానితోడ వయోగర్వముచేఁ దాఁకు తప్పులు మఱచి నాగుణములను నీవు ప్రశంసింపవలదు.

ఉ॥ లోకము పొగడి నీవు పది • లోఁ బదునొక్కటిగాఁగ నుండు, మ
స్తోకతరానుకూలతన • త్రోయుట మే లగు నీకుఁ గాలమున్,
గైక తనూజు నింక మన • క్ష్మాపతి పూన్చుట యౌవరాజ్యమున్
నీకుఁ బ్రసాద్యుఁ డాతఁ డవ • నీపతియే కద చక్కఁ జూడుమా. ౩౬౯

పదిలోఁ బదునొక్కటి=ఇదిలోకోక్తి- పదుగురిలోఁ దానొక్కతెగా వారితో పాటుండవలయునుగాని ప్రాముఖ్యము వహింపరాదు. అస్తోకతర = మిక్కిలి అధికమైన, అనుకూలతన = అనుకూలభావముచేతనే, ప్రసాద్యుఁడు = అనుగ్ర హింపఁదగినవాఁడు, పాడి=న్యాయము-ధర్మము.

తాత్పర్యము

లోకన్యాయము ననుసరించి పదిమందిలో నీవు పదునొకండవ దానవుగా నుండు మంతియేకాని నేనీయింటికిఁ బెద్దకోడలనని, జనకరాజు పుత్రికనని, న్యాయముగా రాజ్యము మాదే, యని యిటువంటి యభిప్రాయములు పెట్టు కొని విఱ్ఱవీఁగకుము. నీ వందఱకు మిక్కిలి యనుకూలవై తిరుగుచుండుమం తియేకాని యెవరితోనైనఁ బ్రతికూలింపకుము. మనరాజు భరతుని యువరాజు చేయుటచే నీకతఁ డనుగ్రహింపఁ దగినవాఁడేకాని నిగ్రహింపఁదగినవాఁడు కాఁడు. కావున వానిపైఁ గోపింపకుము. వాస్తవమున నతఁడేకదా రాజు. చక్కఁగా నాలోచింపుము.

కం॥ జనకుని ప్రతిజ్ఞ దీర్పఁగఁ, జనియెదఁ గానలకు నిపుడ • స్థైర్యముఁ గొనుమీ,
వనముల నే నుండఁగ నిటఁ,జను నీకు వ్రతోపవాస • సంగతి యనఘా. ౨౨౦

వ్రతోపవాససంగతి=భర్తసమీపమున లేనపుడు పతివ్రతలగు స్త్రీలు సొగ సులు చేసికొనరాదు. పూవులు, మంచి వస్త్రములు, కాటుక, గంధమాల్యాదులు ధరింపరాదు. సుఖశయ్యలఁ బరుండరాదు. ఇష్టమృష్టాన్నముల భుజింపరాదు. ఏకాదసులం దుపవసింపవలెను. పొరుగిండ్లకుఁ దిరుగఁబోరాదు. పరిహాసము కారాదు. వ్రతము లాచరింపవలెను. ఇట్టి నియమములన్నియు పతివ్రతవు నీవెఱిఁగినవేకదా.

తాత్పర్యము

నేను స్థిరబుద్ధితో మాతండ్రియాజ్ఞ దీర్పఁగఁ బోయెదను. నీవును దిగులు పడక స్థిరబుద్ధివై యుండుము. వనములందు నేనున్నప్పుడు నీవిచటనుండి ప్రోషితభర్తృకయగు పతివ్రత యేయే నియమములు వహించియుండ వలయునని శాస్త్రములు చెప్పుచున్నవో యట్లుండుము.

ఉ॥ ప్రొద్దున లేచి వేల్పులకు • మ్రొక్కి, యథావిధిఁ బూజఁ దీర్చి, యో
ముద్దియ! నాదుతండ్రికిని • మ్రొక్కుము, ధర్మ మొకండ యూఁతగాఁ
దద్దయు వృద్ధదుఃఖభర • తప్తయునైనమదీయమాత నీ
వొద్దిక భక్తిమైఁ గొలుచు • చుండుము, పూజలఁ దన్పుచుండుమీ. ౨౨౧

వృద్ధ=ముసలిది, దుఃఖభరతప్త=దుఃఖభారముచేఁ దపించునది, ఒద్దికమై= అనుకూలభావముతో.

తాత్పర్యము

శాస్త్రప్రకారము నీవు చేయవలసినది నీ వెఱుఁగుదువు. నేను జెప్పఁ బనిలేదు. కాని నేను జెప్పవలసినవి కొన్నిగలవు- చెప్పెదను- విను. ఉదయము

ననేలేచి దేవతలకు నమస్కరించి శాస్త్రప్రకారము పూజచేసి యావల నాతండ్రికి నమస్కరింపుము. నా తల్లి కౌసల్య ముసలిది. దుఃఖాతిశయముచేఁ దపించునది- ఆమెకు నామెధర్మము తప్ప నాలంబన మేదియులేదు. నీవును ధర్మమునే యాధారము చేసికొని యనుకూలవై యామెను భక్తితో సేవించి పూజింపుము.

ఉ॥ ఖ్యాతచరిత్ర! తక్కుగల • యంబలు నీకును వంద్య లెప్పుడున్
మాతలు నాకు నందఱు స • మానలు ప్రీతిని సౌహృదంబునన్
భ్రాతలరీతిఁ బుత్రకుల • భంగిని మిక్కిలి చూడు కైకయీ
జాతుని లక్ష్మణానుజుని • సమ్మతి వారలు నాదుప్రాణముల్. ౨౨౨

ఖ్యాతచరిత్ర=ప్రసిద్ధమైన సదాచారముగలదానా, వంద్యలు=నమస్కార యోగ్యులు.

తాత్పర్యము

నీవు సదాచారసంపన్నవని ప్రసిద్ధికెక్కినదానవు. కావున నా తల్లివలెఁ దక్కిన తల్లులందఱుకూడ నీ నమస్కారమునకు యోగ్యురాండ్రే. వారందఱితో నాకేమి పని యనవలదు- ఏలయందువా. నాకుఁ దల్లులందఱు ప్రీతిచేతను స్నేహభావముచేతను సమానలు. నాకుఁ గన్నతల్లియని యెక్కువ, యటుగాదని తక్కువ ప్రేమలేదు. కావున నీవును నావలె వారనందఱ నొంతయుత్తలవలె గౌరవింపుము. కైకకొడుకగు భరతుని నీ సోదరునివలెఁ జూడుము- పిన్నవాఁడగు శత్రుఘ్నుని గొడుకువలెఁ జూడుము. ఏలన వారు నాకుఁ బ్రాణములు.

ఇందు లక్ష్మణుని పేరు చెప్పకుండుటకుఁ గారణము తానాయనను వెంటఁ దీసికొనిపోవ నభిప్రాయముండుటయే.

కం॥ కులమునకు దేశమునకున్, వల నొప్పఁగ రాజు ప్రభువు•భరతుఁడు కావన్
జలజాక్షి! యెప్పుడేనియు, వల దప్రియముల్ ఘటింప•వానికిఁ గినుకన్.

తాత్పర్యము ౨౨౩

మనవంశమునకు దేశమునకు రాజు ప్రభువు భరతుఁడే కావున నీవు వానిపైఁ గోపించి వాని కప్రియములయిన మాటలు పలుకవలదు.

కం॥ భూపతు లారాధితులై, భూపుత్రి! శీలయత్న • ముల లోకులచేఁ
బ్రాపింతురు సమ్మదముం, గోపింతురు తద్విరుద్ధ•గుణములఁ గనినన్. ౨౨౪

శీలయత్నములన్ = మంచియణఁకువతోడి నడవడిచే, ఆరాధితులై = ప్రేమచేఁ బూజింపఁబడినవారై, సమ్మదమున్=సంతోషమును, తద్విరుద్ధగుణములు = అణఁకువ దప్పినను, నడవడి తమకనుకూలముగ లేకున్నను.

తాత్పర్యము

రాజులు లోకులచే ననుకూలమైన నడవడిచే నారాధింపఁబడినవారై సంతోషింతురు. వారు సంతోషించిన సౌఖ్యసంతోషములు గలవు. అటుగాక విరుద్ధ

గుణములు గలవారిపైఁ గోపింతురు. కోపమువచ్చినా కీడుచేయుదురు.

కం॥ కడుపునఁ బుట్టినబిడ్డలు, దుడుకున నహితంబు సేయఁ•దొడఁగిర యేనిన్
విడుతురు భూపతు, లన్యుల గడియింతురు కార్యసాధ•కతఁ గ్రాలినచోన్.

తా త్ప ర్య ము ౭౭౫

నేను వదినెను, తల్లితో సమానురాలను, నాపైఁగూడ భరతుఁడు గోపిం చునా యందువేమో రాజధర్మము నీ వెఱుఁగవా. తమకు హితముగానిదానిని జేయువారు కడుపునఁబుట్టిన బిడ్డలేయైనను వారిని రాజులుదూరమున వదలు దురు. తమకార్యము చేయుసామర్థ్యముగలవారిని నితరులనైనను దగ్గఱ చేర్చి కొందురు.

ఉ॥ కావున నింద యుండుము సు•ఖంబుగ, రాజమతానుకూలస
ద్భావమునన్ స్వధర్మచరి•తంబును సత్యపరాయణత్వముం
బ్రోవకు, ప్రేయసి, పరుల•నొవ్వఁగఁ జేయకు మేరినైన, సం
భావన సేయు నావలుకు•భామిని! నేఁ జనువాఁడఁ గానకున్. ౭౭౬

రాజమతానుకూల సద్భావమునన్ =రాజునభిప్రాయమునకు ననుకూల మైన మంచి మనస్సుతో, స్వధర్మచరితంబును=స్త్రీకి. నింటికోడలికిఁ, ప్రోషిత పతికకు (పరదేశములనుండు భర్తగలదానికి )పరాధీనురాలికి నేది స్వధర్మమో యట్టి ధర్మచరితంబును, సత్యపరాయణత్వమున్=ఇవన్నియుఁ జేయుచున్నా నని గర్వింపక సత్యమునందుఁబ్రీతిని, ప్రోవకు=వదలకు, ప్రేయసీ=ఇట్లు వర్తించిననే నీవు నాకుఁ బ్రియురాలవు, భామిని=కోపము గలది.

శాస్త్రీయమైన మన స్వధర్మమందు మన ముంటిమేని భగవంతుఁడు తనం తటఁ దానే సంతోషించును. భక్తులమని స్వధర్మముల విడనాడువారి విషయ మున భగవంతుఁడు సంతోషింపఁడు. తనయాజ్ఞమీఱి వర్తించు స్వజనుల విషయమునఁ బ్రభువు సంతోషించునా? అను విషయము దీనివలన గ్రహింపనగు.

శ్రుతిస్మృతి ర్మమైవాజ్ఞా, యస్తాముల్లంఘ్య వర్తతే
ఆజ్ఞాచ్ఛేదీ మమద్రోహీ, మద్భక్తోపిన వైష్ణవః॥ అని ప్రమాణము.

తా త్ప ర్య ము

కాబట్టి యిందే నీవుండుము. రాజునభిప్రాయమున కనుకూలమైన మంచి తలంపే కలదానవగుము. నీ స్వధర్మ మేదియో దానిని వదలకుము. సత్య మును విడనాడకుము. నీవునాకుఁ బ్రేయసివి కావున నాకుఁ బ్రియమైన కార్య ములే మీఁదఁ జెప్పినట్లు చేయుచుండుము. ఇతరులు మనసు నొచ్చుకొను పని చేయకుము. నామాటయం దాదరముంచి గౌరవింపుము. కోపపడకుము. నే నడవులకుఁ బోవుచున్నాను.

-•౨౭-వ సర్గము. సీత శ్రీరామునితో నరణ్యమునకుఁ దానువచ్చెదనని చెప్పుట•-

కం॥ అణుమధ్య ప్రియార్హాయు స ద్గుణవతి ప్రియవాదిని సతి•గురువిప్రియభా
షణములు దనుఁ బతి పల్కిన, ప్రణయామర్షమున సీత•పలికెన్ విభునిన్.

అణుమధ్య=సూక్ష్మమైన నడుముగలది, నడుము సూక్ష్మము కావున భారమగు నూర్ధ్వకాయమును భరింపలేక జవజవలాడుచుండును, ఇప్పు డా భారము చాలదని మగఁడడవికిఁ బోవుచున్న శోకభారము, తన్నుఁబిలుచుకొనిపోఁడన్న కోపభారము తోడయ్యెను. కావున నామె నిలువలేక కూలఁబడు స్థితియందుండెను. ప్రియార్హా=ఈమె యప్రియములు పలికినను బదు లీమెనుగూర్చి ప్రియములే పలుకఁదగినది. అటుల యనిన నప్రియములాడినను నామె నిష్కారణముగ నాడదు. ఏలన నామె సద్గుణవతి = నిత్యముగ సద్గుణములే కలది, అంతియేకాదు. ప్రియవాదిని=ప్రియములైన మాటలనే మాటలాడునది, సతి= పతివ్రత యగు సీత, గురు విప్రియభాషణములు = ప్రియమునకు మిక్కిలి విరుద్ధములైన పలుకులు. ఈ పలికినవారెవరో యన్యులుకారు, పతి=కట్టుకొన్నవాఁడే, తన్నుఁ బాలింపవలసినది విధిగాఁగలవాఁడే, ప్రణయామర్షమునన్= ప్రణయకోపముచే=ప్రేమవలనఁ గలిగిన కోపముచే, విభునిన్=భర్తను, ప్ర+నయ- ప్రణయ- ఇచ్చట న కారము వ్యాకరణ సూత్రప్రకారము ణ కారమయ్యెను గానఁ దక్కిన కారణములతోఁ బ్రాసముచెల్లెను. ప్రణయకోపమనుటచేఁ గైక మగనిమీఁదఁ గోపించినట్లుకాదని తెలియవలెను.

## తాత్పర్యము

సన్నని నడుముగలదియుఁ బ్రియమువినుటకే యోగ్యురాలును మంచి గుణములే కలదియుఁ బ్రియములే మాటలాడునదియుఁ బతివ్రతయునగు సీత శ్రీరాముఁడు పలికిన మిక్కిలి విరుద్ధములై యప్రియములైన మాటలనువిని చనవువలనఁ గలిగిన కోపముచేఁ దనపతితో నిట్లనెను.

కం॥ ఏ మిది!! యిటు పల్కెద వో, రామా! యీ పేదపలుకు•రాజకుమారా!
నీ మాటలు విని నంతన, నామాత్రకు నాఁపరాని•న వ్వుదయించెన్. ౨౭౧

శ్రీరాము డెట్లు పురుషులకు స్వధర్మనిర్వహణమే పరమసాధనమని స్థాపింప నవతరించెనో యట్లులే స్త్రీలకును స్వధర్మనిర్వహణమే పరమసాధనమని స్థాపింప సీత యవతరించెను. ఇంతవఱకు శ్రీరాముని పుత్రధర్మ నిర్వహణవిధము చెప్పఁబడెను. ఇఁక సీతాదేవియొక్క స్వధర్మనిర్వహణవిధము చెప్పఁబడుచున్నది. శ్రీరాముఁడు చెప్పిన మాటలు స్వధర్మనిర్వహణమునకు విరోధించునవి కావున నామెకోపించెను. ఈకోపము స్నేహకారణముచేనైనది కాని కోపముచేనైనదికాదు.

ఇది మొదలు సీతా వైశిష్ట్యమును బాఠకులు గమనింతురు గాక.

కౌసల్యవలె నీ వడవికిఁబోవలదని సీతాదేవి ప్రారంభింపలేదు. అది న్యాయమా అన్యాయమాయనియు విచారింపలేదు? ఇవన్నియుఁ దన ధర్మములు కావనియామె యభిప్రాయము. కావునఁ దనకు సంబంధించినదైన తన స్వధర్మ మేదియో దానినే స్థాపింప సర్వవిధములఁ బ్రయత్నించెను.

శ్లో॥ శాశ్వతోయం ధర్మపథః, సద్భి రాచరిత స్సదా
యద్భార్యాం పరిరక్షంతి, భర్తారోల్పబలా అపి॥ భార. ౩-౧౨-౬౮

ఎంతటి బలహీనుఁడైనను భార్యను రక్షింపవలసినది శాశ్వత సనాతన ధర్మమై సజ్జనా చరితమై యుండఁగా నిదియేమి మతిపోయినవానివలె మాటలాడుచున్నావని భావము.

ఇదియేమి=ఇదియేమి యాశ్చర్యము, ఇటుపల్కెదవు, ఎన్నఁడిట్లు పలికిన వాఁడవుకావే.

రామా=(1) బచ్చెన బొమ్మవలెఁ జూచుటకు సందమైయుండువాఁడా. (2) ఇతరులను స్వభావముచేతనే రమింపఁజేయువాఁడా. (3) ఆఁడుదానా.

రాజకుమారా=రాజవంశమున రాజగువానికిఁ బుట్టినకారణముచే రాజకుమారుఁడని యనవలసియున్నది గాని నీ ధైర్యస్థైర్యములచేఁ గాదు. ఇది పండితపుత్ర శబ్దమువలె గ్రహింపనగు. పండితపుత్రుఁడనఁగా శుంఠయని యర్థము.

తాత్పర్యము

ఇది యేమి యాశ్చర్యము!! నీ వెన్నఁడిట్లు పలికినవాఁడవు కావే. ఈ పిఱికిపంద మాట లిపుడేలవచ్చెను. నీవు స్వభావముచేతనే యెట్టివారినైన నెవరినైన సంతోషింపఁజేయుదునని రాముఁడని పేరు పెట్టుకొన్నవాఁడవు. ఇట్టి నీవాఁడుదానివలె మాటలాడితివి. నీవు లోపల సారములేని పైపై వన్నెలచేఁ బ్రకాశించు పేఁడబొమ్మవలె పై సౌందర్యము గలవాఁడవు గానున్నావేకాని లోపల సారమున్నట్లు కానరాలేదు. అట్లులనెదవేమి నేను రాజకుమారుఁడను గానాయందువేమో. నీవు రాజుకొడుకగుటచేఁ బండితపుత్రుఁడన్నట్లు రాజకుమారుఁడవైతివేకాని రాజకుమారునియం దుండవలసిన స్థైర్య ధైర్య శౌర్య సాహసాదిగుణములుండుటచేఁ గాదు. అవిగల నిక్కపు రాజకుమారుఁడవైన నీవిట్లు మాటలాడియుండవు. నామాటలలో నీవేమి లోపము కనుఁగొని నన్నిట్లులనెద వందువా చెప్పెదనుగాని నీ పేదపలుకు వినఁగానే నావంటి యాఁడుదానికి నందు బాలికకు నిలుపరాని నవ్వుదయించెను. ఇఁక మగవారు రావవారు విన్న నేమందురోకదా.

చం॥ తన తన పుణ్యపాపములు•తాను భుజించుచు నాత్మభాగ్య మా
పనులు ఘటించు చుండెడిని•భ్రాతయుఁ దల్లియుఁ గోడలున్
దనయుఁడు, భర్తృభాగ్యమును•దప్పక భార్య యొకర్తె పొందుఁ, గా
వున నినుఁ గాన కేగు మనఁ•బొమ్మనినట్టులే నన్ను వెంబడిన్. ౬౬౯

భాగ్యము=శుభాశుభకర్మము, భాగ్యం కర్మశుభా శుభమ్మని యమరుఁడు

తాత్పర్యము

నేనేమి యంత తెలివితక్కువగా మాటలాడితినని నీవు నవ్వెదవందువా వినుము.

తోడఁబుట్టినవాఁడు తల్లి, తండ్రి, కోడలు, కొడుకు వీరందఱు తాము తాముచేసిన పుణ్యపాపముల ఫలమే తామే యనుభవింతురు గాని యొకరు చేసిన పుణ్యముగాని పాపముగాని యితరులకు సంక్రమింపదు. పురుషుని భాగ్యమును పుణ్యమును వానితో సమానాధికారముగల వాని భార్యయొక తెయే పంచుకొనును. కావున రాజునిన్నడవికిఁ బొమ్మన నన్నుఁ బొమ్మనిచెప్పినట్లే. అర్ధోవైఏష ఆత్మనో యత్పత్నీ యను శ్రుతివలన నీసగముకదా నేను. నీసగము దేహము నింటఁబెట్టి సగము దేహముతో నడవికిఁబొమ్మని రాజు చెప్పెనా. నన్ను నీ వింటవిడిచిపోయిన జనకునాజ్ఞ రాజాజ్ఞపూర్ణముగా నెఱవేర్చినవాఁడవు కావు. అఱగొఱగాఁ జేసినవాఁడవగుదువు.

నీవు గొప్పధర్మము చేయఁబోయెదవుకదా. అట్టి ధర్మము నన్నువిడిచి నీవెట్లు చేయఁదలఁతివి? వివాహమునాఁటి వాగ్దానమును మఱచితివా? నీవు చేయు ధర్మమందు సగము నాకు భాగముకలదు కదా. అది నేనుగూడ నుండి మీ శుశ్రూష చేసిన వచ్చునా? నే నింటనుండిన వచ్చునా?

సీ॥ శాస్త్రనిర్దిష్ట ప్రశస్తకర్మములను, రాగవిద్వేషవర్జనముగాఁగఁ। దన శక్తి కొలఁది శ్రద్ధాపురస్కృతిగాఁగఁ ప్రతిదిన మాచరింపంగవలయు। విను నరుల్ నిజజాతి విహితలోకములఁ బ్రాజాపత్యముఖములఁ జాలఁగ్లేశ। ములఁ బొందుదురు శ్రమంబున నిట్లు పురుషుల, చేతఁ గష్టమున నార్జింపఁబడిన॥ తే_గీ_సకలపుణ్యంబులందును సగము వనితలొందుదురు పతిశుశ్రూషయొప్పఁ జేసి, శ్రాద్ధముపవాసములు వేఱజన్నములను, లేక వసియింతురీప్సిత లోకము లను॥ కం॥ సురలకుఁ బిత్రాదులకున్, బురుషుండొనరించునట్టి పూజాదులలో, వరశుశ్రూషన్ సతిత, త్పరతననన్యాత్మయైనఁదా సగముఁగొనున్. భార_అను లాగ అధ్యా. ౧౩ శ్లో॥ భర్తాకరోతియాన్ సాధ్వీ, యత్కించిత్కురుతే శుభమ్, తస్య పుణ్యస్య సంపూర్ణ, మర్ధం ప్రాప్నో త్యసంశయః॥ గారు॥ భర్తయే కొంచెము పుణ్యముచేసినను నా పుణ్యములో సగము పతివ్రతయగు నతని భార్యను జెందును. సందేహములేదు.

ఇట్లు నాకు న్యాయముగా ధర్మశాస్త్రప్రకారము రావలసిన పుణ్యము రాకుండ మీరెట్లు చేయఁగలరు. అట్టి యధికారము మీకుఁగలదా.

భారతపద్యంబున ననన్యాత్మయనఁగా మగఁడు వేఱు తాను వేఱనుభావము లేక శక్తునకు శక్తి, సముద్రమునకు నల. చంద్రునకు వెన్నెల, సూర్యునకు నెండ, యెట్లో యట్లని భావించియుండుట, ఉభయలోకంబుల భార్యాభర్తలకవి నాభావసంబంధముగలదు.

కం॥ జనకుండు గాఁడు,గానిద జననియు,నాత్మ సుతుఁడు గాఁడు•సఖియులుగా రిం
దును నందు నెల్లకాలము, ఘనవేణికి, భర్త యొకఁడె•గతి ప్రాణేశా. ౭౦
ఘనవేణికి=మేఘమువలె నల్లనైన జడగలదానికి=స్త్రీకి.

తాత్పర్యము

ప్రాణేశ్వరా! వినుము. స్త్రీకి నీలోకమందుఁగాని పరలోకమందుఁగాని యొకరాలోకమందు నొక రీలోకమందున్నఁగాని యెల్లకాలము శాశ్వతముగా భర్తయొక్కఁడె గతికాని తండ్రికాఁడు. తల్లిగాదు. కన్నకొడుకుగాఁడు. స్నేహితు రాండ్రుగారు. ఏల? సతిప్రాణమునకు నీశుఁడు భర్తగాని యితరులుగారు. కావు ననే యాయనకు ప్రాణేశ్వరుఁడు జీవితేశ్వరుఁడనియుఁ బేరు.

ఉ॥ కానల కేగెదేనియును•గాంతుఁడ! నీకును మున్నె పోవు చేఁ
గానసమార్గసీమఁ గుశ•కంటకముల్ దొలఁగించి మార్దవం
బూనఁగఁ జేయుచుండెదను,•నొద్దులు ద్రావఁగఁ దక్కు నీరమున్
మానినరీతి నావయుని•మానుము రోసము నీవుఁ బ్రీతిమై. ౭౧

తాత్పర్యము

నేనేమి పెండ్లికిఁ బోవుచున్నాఁడనా? ఉద్యానవనక్రీడకుఁ బోవుచున్నాఁడనా. అడవికి నీవు వచ్చియేమి చేసెదవు? అందువేమో. ఇక్కడ నేనుజేయు పనియే యక్కడఁజేసెదను, ఇక్కడ నీవు కూర్చుండు నాసనమునఁ గసవు లేకుండఁ జిమ్మిమృదువుగా నాసనమేర్పాటుచేయునట్లే నీకుముందుగాఁబోవుచు నడవిత్రోవలయందు దర్భలు ముండ్లు దొలఁగఁ ద్రోచి మెత్తగానుండఁజేసెదను. ఇది నాకు వాడుకపడిన పనియే. కావునఁ గష్టకార్యముగాదు. కావునఁ బరులు ద్రావిన నీళ్ళను వదలినట్లు నే నింటనుండు మనిన నుండనని తిరస్కరించి మాటలాడుచున్న దానని కోపము, నాతోడ నడవికి వచ్చియచట నేను జేయు పుణ్యములో సగము దాను బంచుకొనుట కాలోచించుచున్నదనియీర్ష్యను, ప్రేమచే వదలిపెట్టుము. ఉచ్ఛిష్టజలము గ్రాహ్యముగా నట్టిగుణములు గ్రాహ్యములుగావు ఉచ్ఛిష్టమనఁగా భుక్తశేషము "పీతావశేషితం పీత్వా, పానీయం బ్రాహ్మణః క్వచిత్। త్రిరాత్రంతు వ్రతంకుర్యా, ద్వామహస్తేన వాసునః॥ శంఖ॥ త్రావఁగా మిగిలిన నీరు బ్రాహ్మణుఁడు త్రాగినను, ఎడమ చేతితోఁ (భోజనవేళఁదప్ప) ద్రాగినను,మూఁడురాత్రులు వ్రతమాచరింపవలెను

ఉ॥ మానధనాఢ్య! వీరవర!•మానుము బాలిక నొంటిదానినేఁ
గానకుఁ దోడుకొంచరుగఁ•గా నెటులౌ ననుసందియంబు, స
న్మానక తోడుకొంచరుగు•మా, నిను, బాసియు జీవయుక్తనై
యే నిట నుండునంతయుఘ•మేమి యొనర్పను గాదె వల్లభా. ౭౨

మానధనాఢ్య=మానమను ధనముచే గొప్పవాఁడా, నీవు అవమానధనాఢ్యుఁడవు కాకుండుమని భావము. నీవు మానధనుఁడ వెట్లైతివో యెఱుఁగుదువా.

వీరవరుఁడవగుటచేత. ఒక్క యాఁడుపిల్లను గాపాడ భయపడువాఁడవు వీర వరుఁడ వెట్లగుదువు కావున నీవు వీరవరుఁడవు మానధనాఢ్యుఁడవు సత్యముగ నైనచో నన్ను వదలిపోకుము. నీ సందేహము నే నెఱుఁగుదునులే. ఇది యాఁడుది. అందులో బాలిక అందు నొంటరిది. ఎట్లు నేనడవులకుఁ బిలుచుకొని పోదును. అని సందేహించుచున్నావు. అట్టి సందేహము వలదు. అది నీ వీర వర్యత్వమును మానధనాఢ్యత్వమును నాశముచేయును. కావున నన్నుఁదప్పక తోడుకొనిపొమ్ము.నిన్నుఁబాసి యావజ్జీవము ప్రాణములతో నుండునంతటి పాపము నేనేమియుఁ జేయలేదు గదా. వల్లభా=ప్రియుఁడా, నీవు నాకు వల్లభుఁడవు? నేను నీకు వల్లభను. ఈ పరస్పర సంబంధమును నెట్లు త్రెంపఁగలవు.

తాత్పర్యము

మానధనాఢ్య! వీరవర్యా! యిది యాఁడుపిల్ల దీని నెట్లు నే నడవులకుఁ బిలుచుకొని పోదును. అను సందేహము వదలిపెట్టుము. అది నీకుఁ గీర్తికరము కాదు. కావునఁ దప్పక తోడుకొని పొమ్ము వల్లభుఁడవైన నిన్ను నెడఁబాసియుఁ ప్రాణములతోనుండునంత పాపము నేనేమియుఁ జేయలేదు. పాపాత్మురాలికిఁ గాని భర్తృవియోగము సంభవింపదు.

చం॥ అతులితసౌధవీథులను హాయిగఁ గ్రుమ్మరుకంటె, దేవతా
తతులవిమానసీమల సదా విహరించుటకంటె వ్యోమప
ద్ధతులఁ జరించుకంటెను, వెతల్ పడుచున్నను నేయవస్థలన్
సతికిని భర్తృపాదపరిచర్యయె యుత్తమ మార్యసత్తమా. ౭౮౩

అతులిత=అసమానమైన, సౌధవీథులను=మేడలవరుసలయందు-విమాన సీమల=దేవతావిమానములపై, వ్యోమపద్ధతులను=ఆకాశమార్గములందు,వెతల్ =దుఃఖములు, భర్తృపాద పరిచర్యయె=మగని పాదములకు సేవచేయుటయె, ఉత్తమము=శ్రేష్ఠము.

తాత్పర్యము

సీతా! నీవింతవఱకు వివేకముగలదాన వనుకొంటిని. అది పొరపాటని తోఁచుచున్నది. ఏలయందువా. ఇటువంటి సార్వభౌమవాస యోగ్యములైన యిండ్లయందలి సుఖావాసము వదలి నీవు వివేకముగలదానవై అవేని యడవికి వచ్చెదనందువా. అనెదవా? అటయినఁ బతివ్రతల స్వధర్మము నీ వెఱుఁగ వనియే చెప్పుదును వారిధర్మమెట్టిదన. అసమానమై సార్వభౌములగువారికి యోగ్యమైన మేడలయందుండి భూలోకసుఖమనుభవించుటకంటెను, ఇచ్చి దేవతల విమానములపైఁగూర్చుండి సుఖవిహారములు చేయుటకంటెను, లేక యణిమాది యోగసిద్ధుల సాధించి యాకాశగమనము చేయుటకంటెను, పతివ్రత యగు స్త్రీకి నేగుడిసెలోనుండినను నేలోకమున నుండినను, ఏశక్తియు లేక యుండినను, ఎంతటికష్టదశయందుండినను, భ[illegible]యొక్క పాదసేవచేయుచు

నతని వెంటనుండుటయే శ్రేష్ఠము. ఇది యాధ్యులయందు, సందుఁ బండితు లందు, నట్టివారిలో గొప్పవాఁడవగు నీవు నెఱుఁగవా?

దీనివలన భర్త యెట్టి కష్టదశయందుండినను భార్య యాయనను వదలి యుండరాదని సూచితము.

ఈ విషయమున దమయంతి వాక్యములు చూడుఁడు.

గీ॥ అఖిలదుఃఖరోగార్తున కౌషధంబు।సురుచిరంబుగ భార్య యని చూపె యెందు।
నౌనర భార్యాసమేతుఁడై యున్నవాని।కెంత లావదలయ్యును నెఱుకపడవు

కం॥ అలయుసెడ, డయ్యునెడ, నాఁ।
కలియుఁ దృషయునైన యెడలఁ గడుకొనిధరణీ।
తలనాథ పురుషునకు నిఃమ్మల భార్యయ పాపఁ జిత్తమునదుఃఖంబుల్॥

పతివ్రత లందఱీవిషయమున నేకాభిప్రాయముగలవారే, ఇట్టివారు ద్రౌపది, చంద్రమతి, దమయంతి, సీతాదేవి లోనగువా రనేకులు గలరు.

ఉ॥ అంబయుఁ దండ్రి మున్న వివిధాశ్రయముల్ వతిఁ గొల్చుభంగి స
ర్వంబును నేర్పి, రియ్యెడ నవంబుగ నేర్చెడునద్ది లేదు, నే
నింబుగ వచ్చెదాన, హృదయేశ్వర! మానవవర్జితంబు దు
ర్గంబు వృదాకుభల్లుకతరక్షువికీర్ణము నైనకానకున్. ౭౮౪

వివిధాశ్రయముల్ = పెక్కుతీరులు, నవంబుగన్=క్రొత్తగా, మానవవర్జితంబు=మనుష్యులచే విడువఁబడినది, దుర్గంబు=పోవఁ ద్రోవలేనిది, వృదాకు=సర్పములు, భల్లుక=ఎలుఁగులు, తరక్షు=చిఱుతపులులు, వీనిచే వికీర్ణము=వ్యాపించినది యగు, కానకున్=అడవికి.

తాత్పర్యము

నీవు చిన్నదానవు. నీధర్మములు నీ వింకను పెద్దలచాటుననుండి నేర్చు కొమ్మనెదవా. నే నేయే దశలయందు భర్తృసేవ యెట్లట్లు చేయవలయునో యా పద్ధతులన్నియుఁ జిన్ననాఁడే నాతల్లి దండ్రులు నాకు నేర్పిరి. ఇప్పుడు నేను క్రొత్తగా నేర్చుకొనవలసినదేదియు లేదు.కాఁబట్టి నాకృత్యము నాకుఁ దెలియును. కనుకనే సంతోషముతో వచ్చెదను. అడవికిఁ బోవలసి వచ్చెనేయని యేడ్చుచుఁ గాదు. అడవులయం దేమియుండునది నాకుఁదెలియకకాదు.కావునఁ బ్రాణనాథా! మనుష్యులు లేనట్టియుఁ, బాములు, ఎలుఁగులు, చిఱుతపులులు వీనిచే వ్యాపింపఁ బడియుండునట్టియుఁ బోవఁ ద్రోవలేనట్టియు నడవులకు వచ్చెదను.

కం॥ పుట్టినయింటను బలె నే, నట్టడవుల హాయి నుందు నాథా, చింతల్
దొట్టవు మది ముల్లోకము, లెట్టినఁ, బతివ్రతంబ యెంచుచు నుందున్.

### తాత్పర్యము

నాథా! అత్తల కొడుకుబిడ్డలకు భయపడుచు నేమి చేసినఁ దప్పో-ఏమి చేయకుండినఁ దప్పో-పలికిన నేమి తప్పో-పలుకకుండిన నేమి తప్పోయని భయపడుచు నత్తగారింట నుండునట్లుగాదు వారి మనస్సు నాకుఁదెలిసి నా మనస్సువారికిఁ దెలిసియేమి చెప్పిన నేమిచేసినను నాక్షేపింపరు కోపింపరను భయములేక పుట్టినింటఁ దల్లిదండ్రుల చాటున సుఖముగానుండునట్లు నడవులలో నొకరియంగెన పంగెనలేక సుఖముగా నుండును. ఈమూఁడు లోకములు తలక్రిందులైనను మఱి ప్రలయము వచ్చి రూపనాశమైపోయినను ముక్తుఁడై భగవత్ప్రాప్తి లభించిన వానివలె నేచింతలేకయుండును. నేను నాభర్తకు సేవ చేయుదునను తలఁపు తప్ప నాకితర విచారములేదు. పరిపూర్ణ బ్రహ్మాను భవాత్మకాముక్తియని ముక్తిలక్షణము.

ఉ॥ ఘుమ్మనిపువ్వుఁ దేనియల • కమ్మనితావులు గ్రమ్మ నాయర
ణ్యమ్ముల నేమ మొప్ప నన • యమ్మును దాలిచి బ్రహ్మచర్యము
న్నమ్మతి నీపదాబ్జభజ • న మ్మొనరించుచు నిన్నుఁ గూడి నే
నమ్మదకేళిఁ దేలెదను • శౌర్యధనా! యిది సమ్మతింపవే. ౪౮౯

తావులు=వాసనలు-నేమము=నియమము-అనయము=అడవులందున్నంత కాలము-శౌర్యధనా=శౌర్యముధనముగాఁగలవాఁడా.

### తాత్పర్యము

అడవులందుఁ బులులు సింహములుండునని తెలిసి తెలిసి వచ్చెదనందువే. అది యేమిపిచ్చియనెదవా. అవి యడవులయం దెందో యుండును. సర్వత్ర యుండునవికావు. పువ్వు దేనియల కమ్మని వాసనసర్వత్రవ్యాపింపగా నాయరణ్యములందుండువఱకు సంతోషముతో బ్రహ్మచర్యవ్రతమవలంబించి నిండు మనస్సుతో, నీపాదకమలముల సేవచేయుచు నీతోడ సంతోషసముద్రములందుఁ గ్రీడలాడెదను. ఈమాత్రమునకు సమ్మతింపఁగూడదా? నేనేమి యాభరణములు దెమ్మంటినా? వస్త్రములు దెమ్మంటినా! సంతోషకరములైన పదార్థములు తెమ్మంటినా? నాకు రథములు కావలెనంటినా? నిన్ను మోసికొనిపొమ్మంటినా? నీతోడ నడచి వచ్చెదననిన నేలవలదనెదవు.

కం॥ ఏమనుజులనైన వని, భీములు రక్షింపఁ గలవు • పొరపడ కింకన్.
నామాటఁ జెప్ప నేటికి, నోమానద! పూర్ణకరుణ • యుంపుము నాపై. ౪౮౪

### తాత్పర్యము

నీవు శూరుఁడవు నీకు శౌర్యమే ధనము. భర్తద్రవ్యము భార్యయు ననుభవింపవలసినదే కదా. దానినే నేను కోరుచున్నాను ఏ మనుష్యులనైనను నీవు శౌర్యముచే నడవులయం దేపొరపాటులేక కాపాడఁగలవు. ఇఁకనన్నుఁ గాపాడఁగలవనుట చెప్పనేల? నిండారుదయ నాయందుంపుము. నేను గోరునది

యది యొక్కటియే. భగవదనుగ్రహ మొకటియుండిన నెందున్నను భయము లేదు. సర్వభూతరక్షకుఁడు తన్నాశనిని రక్షింపఁడాయను మహావిశ్వాసముండ వలయును. ఈవిశ్వాసము లేనివారిని భగవంతుఁడు చేరఁదీయఁడు అది కలదా లేదా యనియే యింతపరీక్ష.

ఉ॥ సందియ మింతలేదు, నృప•చంద్రమ! వచ్చెద నీదు వెంట, నా
డెందపు నిశ్చయం బిది, క•డింది సుమీ మరలింప నీకు, నీ
కెందును గష్ట మీయను, బ•తీ! ఫలమూలము లారగించి లోఁ
గుందక నిన్నుఁ గూడి మది•గూర్చెద మోదము, నన్ను నమ్ముమీ. ౨౮౮

కడింది=మిగులఁగష్టము, అసాధ్యము.

తాత్పర్యము

రాజశ్రేష్ఠా! నీవెంట నేను వచ్చెదను. ఇందు సందేహములేదు. ఇది నా మనోనిశ్చయము. దీనిని మరలింప నీకు సాధ్యపడదు. నేను నీ కెట్టి కష్ట మీయను. ఆహార మేమనెదవా కందమూలములు ఫలములు తినెదను. లోపల నొచ్చుకొనను, నీతోడనుండుటే నాకు సంతోషము అపారవస్త్రాభరణాదులుచేఁ గలుగుసంతోషము సంతోషముగాదు. అది క్షుద్రస్త్రీలు గోరుసంతోషము.

ఉ॥ కోరెదఁ బ్రాణనాథ! నినుఁ•గూడి చరింప వనీధునీఝరీ
తీరగుహాళులన్ విబుధ•ధీరజనాగ్రణి! జల్లు లాడఁగా
గోరెద హంససారసని•నాజిత రాజిత పద్మనీర్ధరా
సారములన్ మనోజ్ఞరుచి•సారములన్ మనసార నీళులన్. ౨౮౯

వనీ=అడవులయందు, ధునీ=మహానదుల యొక్కయు, ఝరీ=కొండవంకలయొక్కయు, తీర=ఒడ్డులందుఁ గల, గుహాళులన్=గుహలపంక్తులయందు, విబుధ=సర్వము తెలిసినవాఁడా, ధీరజనాగ్రణీ = ధైర్యవంతులలో మొదటివాఁడా, జల్లులాడఁగాన్=జలక్రీడలాడఁగా హంస, సారసములన్ = హంసల యొక్కయు, బెగ్గురు పక్షులయు ధ్వనులచేఁ బ్రకాశించునవియై తామర పువ్వులచేఁ బ్రకాశించుకొలఁకులయందు,మనోజ్ఞ రుచిసారములన్=మనసున కింపైన రుచిగల జలములు, మనసారన్=మనస్సునకుఁ దృప్తికలుగునట్లు.

తాత్పర్యము

ప్రాణేశ్వరా! యడవులయందు, నదులయుఁ గొండవంకలయుఁ దీరము లందుండు గుహలయందు నిన్నుఁగూడి సంచారము చేయఁగోరెదను. మఱియు హంసములయు బెగ్గురుపక్షులయుఁ కలకలనాదముతో నిండి తామరలచేఁ బ్రకాశించు కొలఁకులందుఁ దియ్యని యింపైన నీళ్లుగల యేఱులందు జలక్రీడలాడఁ గోరెదను. ఇది నాకోరిక, ఈమాత్రము నెఱవేర్పరాదా.

చం॥ అలరుచు నీదుసంగతి శ-తాయుతవర్షము లైనఁ గానలో
నలజడి లేక యుందు, ధవ-నాకమ యైనను నాకు మోదమున్
గొలుపదు, నిశ్చయంబు నినుఁ-గూడఁగఁ గల్గక యున్నఁ, గావునన్
బలిముఖసింహవారణవి-భాసము కానకు వెంట వచ్చెదన్. ౭౯౦

అలరుచు=సంతోషించుచు, నీదు సంగతి=నిన్నుఁగూడి యుండుటచే, శతాయుతవర్షములు=లక్షసంవత్సరములు, అలజడి=బాధ-రూ. అడజడి, ధవ=నాథా, నాకమయ్యెనను=వైకుంఠమేయైనను, బలిముఖ=క్రోఁతులచేతను రూ. వలిముఖము, వలీముఖము, వబలకభేదము, సింహ = సింహములచేతను, వారణ=ఏనుఁగులచేతను, విభాసము=ప్రకాశించునది.

తాత్పర్యము

నీతోడ సంతోషముగా లక్షసంవత్సరము లైనను నేబాధలేక యడవిలో నుందును. పదునాలుగు సంవత్సరము లేమిలెక్క? నీతోడ నే నుండకపోయి తినా వైకుంఠమందున్నను నాకు సంతోషములేదు. కావునఁ గ్రోఁతులు సింహములు, నేనుఁగులు వీనిచేఁ బ్రకాశించు కానలకు నేను వచ్చెదను.

చం॥ జనకగృహంబుచందమున-సౌఖ్యముగా నివసింతు, నీకు నా
య్యనఁ బరిచర్య సేయుదు, న-నన్యమనస్క, దృఢానురక్తచి
త్తను, నను వీడితేని మెయి-దాల్ప నిజంబుగఁ, దోడుకొంచుఁబొ
మ్మనఘ! ఘటింపు కోర్కి, నిను-నంతటివానికి నిద్ధిభారమే? ౭౯౧

అనన్య మనస్కను=వేఱగు మనస్సులేనిదానను, సాధారణమునకు, పోషణమునకు, నునికికి, గతికి, నీవే యాధారమైనవాఁడవను మనస్సుగలదానను, నిన్నుఁగూడియుండుటతప్ప, నీసేవతప్ప వేఱుఫలముఁ గోరనిదానను, దృఢానురక్తచిత్తను=చలింపని యనురాగముగల మనస్సుగలదానను, మెయి=దేహము రూ. మై.

తాత్పర్యము

నాతండ్రియింటియందున్నట్లు సుఖముగా నడవులందు నుందును, నీకు సేవ సేయుదును. నీమనస్సే నామనస్సు. నామనస్సే నీమనస్సు. కావున నిన్నుఁదప్ప వేఱొక లాభమునుగోరను. ఈ ప్రాప్తికి నిన్నుఁదప్ప వేఱొక సాధనమునుగోరను. భయముతో గూడిన మనస్సుగాదు. నిశ్చలభక్తితోఁ గూడినమనస్సు. నీవు నన్నువదలితివా నేను దేహమును వదలెదను. ఇది సత్యము. తోడుకొనిపొమ్ము, ఈనాకోరిక నెఱవేర్పుము. నీయంతటివానికి సర్వవిధముల సమర్థున కిదియొక బరువా.

ఇదియే పరమభక్తిలక్షణము. "పునర్విశ్లేష భీరుత్వం పరమాభక్తి రుచ్యతే" యని పరమభక్తి లక్షణము.

—• ౨౮-వ సర్గము. శ్రీరాముఁడు సీత కరణ్యమందలి కష్టంబులఁ జెప్పుట. •—

కం॥ అనుచు వచించిన సీతను, గని ధర్మరతుండు మదిని•గై కొనఁ డయ్యెన్
వనితను గొనిచన, మఱియును, వనజాక్షికి నిట్టులనియె•వనదుఃఖములన్.

తా త్ప ర్య ము ౬౯౨

అని చెప్పు సీతను శ్రీరాముఁ డడవులయందలి కష్టములఁ దలఁచి (నామెధర్మమందామె యుండుటకు సంతోషించినవాఁ డయ్యును) నామెను బిలుచుకొనిపోవ నంగీకరింపలేదు. మఱియును నామెకు వనములయందలి కష్టముల నిట్లు చెప్పఁదొడగెను వనవాసమందలి కష్టములు తెలియక చెప్పుచున్నది తెలిసినఁ జాలించుకొనునేమో చూతమని యామె పరీక్షార్థము వనదుఃఖములఁ జెప్పుచున్నాఁడు.

కం॥ వనవాసక్లేశంబుల ఘనుఁ డాలోచించి బాష్ప•కలితేక్షణఁ దాఁ
జనవున నాశ్వాసించుచు,వనవాసోద్యమము మాన•వనితకు ననియెన్. ౬౯౩

వనవాసక్లేశంబున్=అడవులలో వాసము చేయుటయందుఁ గలకష్టములను, ఘనుఁడు=గొప్పవాఁడు, బాష్పకలితేక్షణ= కన్నీటితోఁగూడిన కన్నులు గలది, ఆశ్వాసించుచున్=ఊరడించుచు, వనవాసోద్యమము = వనవాసవిషయమైన ప్రయత్నము.

తా త్ప ర్య ము

గొప్పబుద్ధిగల శ్రీరాముఁడు సీతను దోడ్కొనిపోవ నిష్టము గలవాఁడయ్యును వనవాసమునందలి కష్టము లాలోచించి ఆమె యాకష్టములను సహింపలేదని తలఁచి కన్నీరుగార్చుచున్న యామెను జనవున నూరడించుచు వనవాసప్రయత్నము మానుకొనుటకై యిట్లుచెప్పెను.

ఉ॥ పుట్టితి గొప్పవంశమునఁ•బూని చరించెదు ధర్మనిష్ఠ, లోఁ
దట్టిన దెల్లఁ ద్రోవగ యథా•సుఖవృత్తిఁ జరింపఁబోకుమీ,
పట్టుగ నింద యుండుము, శు•భం బగు ధర్మము నాచరింపు, మే
నెట్టు వచింతు నవ్విధి•నీ వొనరించుట కార్యమౌఁ జుమీ. ౬౯౪

తా త్ప ర్య ము

సీతా! నీవు గొప్పవంశమునఁ బుట్టినదానవు, నీవు ధర్మము నిష్ఠగలిగి చరించెదవు. కావున వానికి రెంటికి నపకీర్తివచ్చునట్లు మనసునకుఁ దోఁచినదెల్లఁ ద్రోవఁగా సుఖమునితోఁచినట్లెల్ల స్వచ్ఛందవృత్తిఁ జరింపకుమా. కావున నేను జెప్పినట్టు లిందే నీవుండుము. ఇచ్చటనే ధర్మమాచరింపుము. నేను నీకుభర్తను. నాయాజ్ఞ నీ మీఱరాదు కనుక నేను జెప్పినట్లు నీవు చేయుటయే తగినకార్యము కాని నిన్ను తిరస్కరించి నామాటవినకనీయిష్టప్రకారము సంచరించుట నీకుఁదగదు

కం॥ అడవులకుఁ జనఁగఁ గోరకి, విడువుము, బహుదుఃఖకరము•విపినం, బే నీ
యెడఁ బ్రేమకలిమిఁ జెప్పెదఁ, బడఁతీ!సుఖ మన నెఱుంగ•వనవాసమునన్
విపినము=అడవి. ౭౯౩

## తాత్పర్యము

అడవులకుఁ బోవలయునను కోరికవదలుము, నీవెఱుఁగవు.అడవి మిక్కిలి దుఃఖము కలిగించునది. నీయందలి ప్రేమచే నీవు కష్టపడఁ జూడలేక చెప్పుచున్నాను వనవాసమందు సుఖమన నెట్టిదో యెఱుఁగను.

కం॥ విను మబలా! కాంతారము, ఘనతరదుఃఖముల కునికి•గావునఁ బిమ్మ
వన మని చెప్పం బడియెడి, వనమున సౌఖ్యంబు గలదె•వరరుహనయనా!
కాంతారము=అడవి. ౭౯౪

## తాత్పర్యము

అబలా! అడవియనిన నేమని తలఁచితివో- నేను వచ్చెదననెదవు,మిక్కిలి గొప్పకష్టములకు స్థానము కావుననే దానికి వనమనిపేరు, వనములలో సుఖము కూడ నున్నదా.

కం॥ మానిత చరిత్ర, శైలగు, హానివసద్భూరిశరభ•హరిరవము ఝరీ
ధ్వానము కర్ణకఠోరము, కాన నరణ్యంబు దుఃఖ•కరము లతాంగి! ౭౯౫

శైలగుహా=కొండగుహలయందు, నివసత్=వసించు, భూరి=గొప్పదగు, శరభ=శరభములయు, హరి=సింహములయు, రవము=ధ్వని, ఝరీధ్వానము= కొండవంకలచప్పుడులు, ఇవి కర్ణకఠోరము = చెవులకు భయంకరముగా నుండును. కాబట్టి లతాంగి=తీఁగవంటి దేహముగలదానా! గాలిగొట్టిన వణఁకి నేలఁబడు కోమలదేహపు-దీనినెట్లు సహించెదవు.

## తాత్పర్యము

కొండగుహలయందుండు పెద్ద పెద్ద శరభములు సింహములుచేయు ధ్వనులును, సెలయేళ్ళ చప్పుడులును, నీవు విన వాడుకపడిన వీణానాదములు గావు. చెవులు పగిలిపోవునట్లు దిగులగునట్లుండును. కావున నరణ్యము దుఃఖకరము.

లతాంగి=అన్నప్పుడు లత లడవులలో నుండునవి చెట్టునాశ్రయించుకొనియుండునవి. కావున నాకును నడవి పుట్టినిల్లువంటిదే అందు నీప్రాపుండ నాకేమి భయమురాఁగలదని సీతాపక్షమున నర్థము.

కం॥ మానవవర్జిత తలకే,శినిశ్చలనిరతమదమ•తేమనమృగనం
తానము పయిఁ బఱ తెంచును, గాన నరణ్యంబు దుఃఖకరము లతాంగి!

మానవవర్జిత తల=మనుష్యులచే విడువఁబడిన స్థలమునందు, కేళీనిశ్చల నిరత=ఆటలయందు స్థిరమైన ప్రీతిగలిగి, మదమలీమస=మదముచే మలినమైన మృగసంతానము=అడవిమృగములగుంపు.

తాత్పర్యము

మనుష్యులులేని స్థలమందు నిర్భయముగా నిశ్చలముగా నాటలాడుట యందుఁ బ్రీతిగల మృగములు మనుష్యులను జూడఁగానే మీఁదికిఁ బరువెత్తి వచ్చును. కావున నరణ్యము దుఃఖకరము భార్యాభర్తలకు, నేకాంతవాసమే కదా విహారమందుఁ బ్రియమగునది. అని సీతాదేవి పక్షమున నర్థము.

కం॥ మానిని: పంకయుతంబు మ, హానక్రవిభీషణము మఁదానేకపసం
స్థానము సరిద్వితానము, కాన నరణ్యంబు దుఃఖకరము లతాంగీ! ౮౯

పంకయుతంబు = బురదతోఁగూడినది, మహానక్రవిభీషణంబు=పెద్ద మొసళ్ళచే భయంకరమయినది, మద=మదించిన, అనేకప=ఏనుఁగుల, సంస్థానము= క్రీడించు నెలవు, సరిద్వితానము=నదుల సమూహము.

తాత్పర్యము

నేను హాయిగా నీళ్ళలో జలక్రీడ లాడెదనంటివి. వానియందేమియుం డునో తెలియునా? కాలు పెట్టితివా బురదలో దిగఁ బడెదవు. అట్లై నను స్నానము చేసెదమని నీళ్ళలోనికిఁ బోయినఁ బెద్ద పెద్ద మొసళ్ళు పట్టుకొనవచ్చును. వానిని జూడఁగానే భయమగును. మదించిన యేనుఁగులు నీళ్ళలో దిగి యాఁడు చుండును. ఆడుటకుఁ దటాలునవచ్చును. ఏటిస్నాన మనిన నిన్నిగండములు గలవు.

కం॥ ఓనవలా! కంటకశాఖానిచితము తామ్రచూడఖరరణితము ని
ష్పానీయము దుర్గము వని, కాన నరణ్యంబు దుఃఖకరము లతాంగీ!

కంటక శాఖానిచితము=ముండ్లకొమ్మలచేనిండినది, తామ్రచూడ ఖరరణితము=అడవికోళ్ళ కఠినధ్వనులుగలది, నిష్పానీయము=నీళ్లులేనిది, దుర్గము= చొరమార్గములేనిది.

తాత్పర్యము

నీళ్ళలోఁబడిపోకున్న మెట్టమార్గమునఁ బోరాదా చెట్లయందలి పూలు గుమగుమ పరిమళించుచుండునే యందువా విను; అడవియును నది యుద్యాన వనముగాదు. ముండ్లకొమ్మలుగల చెట్లచే నిండియుండును. అందు నీకొమ్మలు అల్లిన శిఖ అల్లుకున్నఁ గాళ్ళన్నట్లు తలయెత్తిపోయితివా ఎత్తుకొమ్మలు వెండ్రుకలను బట్టుకొనును నేలకొమ్మలు కాళ్ళకుఁ జుట్టుకొనును. అడవికోళ్ళు చెవులువగిలిపోవఁబరుషముగాఁ గూయుచుండును. నీళ్ళుండవు. ప్రవేశించుటకు మార్గముండదు.

కం॥ తానుగఁ బడునాకులగుమి, పై నగచాల్గొన్నా పగబుపడి నరుఁడునిశన్
మేను పడ వైన వలయును, గాన నరణ్యంబు దుఃఖకరము లతాంగీ!

అగచాట్లు=కష్టములు.

తాత్పర్యము

హాయిగా నెచ్చటనైన రాత్రులందైనఁ బండుకొందమా యనినఁ జగలంతయు నెన్నియో కష్టములుపడి మనమై యాకులు గోయరాదు. కావున వాని యంతట నవియే రాలిన యాకులమీఁద రాత్రులందు దేహమును బడనేయవలయును. కావున వనవాసము దుఃఖకరము. ఆకులు కోయుటయు హింస యనియే శాస్త్రాభిప్రాయము.

కం॥ తానుగ రాలినఫలసం,తానమ్మును రాత్రులన్ దినమ్ముల నియతిన్
దాను దిని ముదముఁ గొనఁదగుఁ,గాన నరణ్యంబు దుఃఖకరము లతాంగి!

తాత్పర్యము ౧౦౨

చెట్లయందు ఫలములు దండిగానుండును. ఇచ్చవచ్చినట్లు దినవచ్చును గదా యనుకొంటివేమో.

వానప్రస్థాశ్రమమందుండువారును సన్న్యాసులును జీవహింసయగునను కారణముచేఁ జెట్లయందలి పండ్లను గోయక తొడిమ యూడివానంతట నవియే నేలపై పడిన పండ్లను రేయిగాని పగలుగాని తిని వానితో సంతోష పడవలయును. కావున వనవాసము దుఃఖకరము.

శ్లో॥ పుష్పమూల ఫలై ర్వాపి, కేవలై ర్వర్తయేత్సదా,
కాలపక్వై స్స్వయంశీర్ణైః వైఖానసమతే స్థితః॥ మను. ౬-౨౧.

వానప్రస్థాశ్రమమందుండువాఁడు చెట్లనుండి తమంతఁబండి తమంత రాలిన పండ్లచేతను, పుష్పములచేతను దానుగానెండిన దుంపలచేతను, నెల్లప్పుడుఁగాలముపుచ్చవలయును. వైఖానస శబ్దవిషయము అరణ్యకాండమున వ్రాయఁబడును.

చం॥ జడలు ధరింపఁగావలయు•జానకి! నారలచీర లెప్పుడున్
విడువక కట్టఁగా వలయు•వెండియు నోపినయంత వస్త్రులం
దడజడి పొందఁగా వలయు•నాగత మౌనతిథివ్రజంబు నె
ప్పుడుఁ బరిచర్యఁ దన్పు, విధి•పూర్వకదైవతపూజ, లొప్పగున్. ౧౦౩

తాత్పర్యము

వానప్రస్థులైనవారు జడలు ధరింపవలయును. ఎల్లప్పుడు నారచీరలే కట్టవలయును. శక్తియున్నంతవఱకుఁ బస్తులచే బాధపడవలయును. ఇట్లుండియు వచ్చిన యతిథుల సమూహమును సేవచేఁ దృప్తి పఱుపవలయును. శాస్త్ర ప్రకారము దేవపూజలు చేయవలయును.

శ్లో॥ జటాశ్చ బిభృయాన్నిత్యం శ్మశ్రులోమ నఖాని చ
ఔపాసనాగ్నిహోత్రంచ, పంచయజ్ఞా సమాచరేత్

వన్యాం తైర్వి విధైర్మేధ్యై, శ్శాకమూలఫలైర్వసేత్
చీరవాసా భవేన్నిత్యం, స్నాత్వాత్రిషవణంశుచిః॥ హరీ

జడలు ధరింపవలయును. మీసములు, వెంట్రుకలు, గోళ్ళు తీసివేయరాదు. ఔపాసనాగ్నిహోత్రపంచయజ్ఞములు చేయవలయును. అడవులందలి పవిత్రశాకములు ఫలములు దిని జీవింపవలెను. ఎప్పుడు నారచీరలే కట్టవలెను. దినమునకు మూఁడుమార్లు స్నానము చేయవలయును.

కం॥ మానవతి! మూఁడుప్రొద్దుల,
దైనందినమును మునుంగఁ◆దగు, నేమములన్
బూనఁగ వలయును గావునఁ, గానవాసంబు దుఃఖ◆కరము లతాంగీ!

తాత్పర్యము ౮౦౪

ప్రియురాలా! దిన దిన ముదయము మొదలు సూర్యాస్తమానము లోపల మూఁడుమార్లు స్నానముచేయవలయును. నియమవ్రతములను జరుపవలయును. కావున వనవాసము దుఃఖకరము.

ముప్పూఁటస్నానమునకే త్రిషవణస్నానమనిపేరు. త్రి+సవన=త్రిషవణ.

కం॥ మానితవిధియుక్తంబుగఁ, దామగఁ బూవుల గడించి◆తగ వేదిని శ్ర
ద్ధానతి బలి కిడ వలయుం, గాన నరణ్యంబు దుఃఖ◆కరము లతాంగీ!

తాత్పర్యము ౮౦౫

సర్వసమ్మతమైన శాస్త్రరీతిని దానే పూవులను సంపాదించి తెచ్చివేదిని శ్రద్ధతోడి నమస్కారముతో బలికిగానియ్యవలయును. కావున వనవాసము దుఃఖకరము పరులు దెచ్చినపూలు పత్రితోఁబూజచేసిన నగముఫల మవి తెచ్చి యిచ్చినవారికిఁబోవును. శాస్త్రరీతిఁ బూవులు గడించుట యనఁగాఁ దటాలునఁ గోయక వానికిఁ జెప్పవలసినమంత్రములు చెప్పియావలఁ గోయవలయును.

కం॥ ఏనాఁటికి నేమాత్రం, బోనలినాక్షీ! లభించు◆నుదరము నింపన్
దానంత తృప్తి గొనఁ దగుఁ, గాన నరణ్యంబు దుఃఖ◆కరము లతాంగీ!

తాత్పర్యము ౮౦౬

ఏదినమునకు నెంతమాత్రము లభించునో దానితోఁ గడుపునించి తృప్తి పడవలయునుగాని లభింపలేదే యనికాని కొంచెమే లభించెనే యనికాని తలంపరాదు. హెచ్చుగాదొరికిన రేపటికని యెత్తియుంచరాదు. ఇట్టివారికి సద్యః ప్రక్షాలకులని పేరు.

కం॥ మాననియాఁకలి హోరని, మానని గాలియును నిరులు◆మావెఱపు సదా
మానక యుండెడిఁ గానలఁ, గాన నరణ్యంబు దుఃఖ◆కరము లతాంగీ! ౮౦౭

యా వెఱపు=మహాభయము, మహాశబ్దభవము మా, ఇరులు=చీఁకటి, ఇది నిత్యబహువచనాంతము. దీనికేకవచనములేదు. కురులు ఇట్టిదే.

తాత్పర్యము

అడవులలోనుండువారి కెల్లప్పుడాఁకలియే. ఒక నాఁడైనఁ గడుపునిండ నాహారము దొరకదు. పిడుగక హోరని వీచుగాలి, చీఁకటి, ఏరాక్షసుఁడు వచ్చి చంపునో, ఏమృగమువచ్చి వాతవేసికొనునో యని మహాభయము. ఇది విడువక యెప్పుడునుండును. కావున వనవాసము దుఃఖకరము.

కం॥ నానారూపంబులు గల, నానాగిరిఫణులు ఘూని•నాదముల నర
ణ్యానుల నిచ్చగఁ దిరుగును, గాన నరణ్యంబు దుఃఖ•కరము లతాంగి!

గిరిఫణులు=కొండపాములు, అరణ్యానులన్=అడవుల వరుసలయందు.

తాత్పర్యము

అనేకరూపములుగల యనేకములైన కొండపాములు ఘూఘూయని బుసలు కొట్టుచు నిచ్చ వచ్చినట్టు లరణ్యములఁ దిరుగుచుండును. కావున వనవాసము దుఃఖకరము.

కం॥ చాన! నదీవక్రంబు ల, హీనధునీనిలయఫణులు•నెపు డడ్డం బై
కానఁబడు మార్గములలోఁ, గాన నరణ్యంబు దుఃఖ•కరము లతాంగి!౧౮

చాన=స్త్రీ, సీత, నదీవక్రంబులు=ఏళ్ళవలె వంకరగా నడచునవి, అహీన ధునీ నిలయఫణులు=పెద్దనదులయందు వాసము చేయుసర్పములు.

తాత్పర్యము

సీతా! నదులవలె వంకరగాఁబోవు పెద్దనదులయందు వాసముచేయు పాములు మనము నడచుచున్నపుడు మనకడ్డముగా నెన్నియో పోవుచుఁ గాన వచ్చును. కావున వనవాసము దుఃఖకరము.

కం॥ జానకీ! యీఁగలు దోమలు, గానఁగ భయమిచ్చువృశ్చి•కంబులు పురుగుల్
మేన నెల్ల ముసిరి కఱచును, గానరణ్యంబు దుఃఖ•కరము లతాంగి!౧౯

తాత్పర్యము

ఈఁగలు దోమలు చూచిననే భయము గలిగించు తేళ్ళు మండ్రగబ్బలు, పురుగులు దేహముమీఁద ముసరికొని కఱచును కావున వనవాసము దుఃఖకరము

కం॥ ఓ నెలఁత! ముండ్లచెట్టు ల, నూనం బగు దర్భ జెల్లు•నోగి వ్రేలెడి శా
ఖానికరము కొన లాడెడిఁ, గాన నరణ్యంబు దుఃఖ•కరము లతాంగి!౨౦

అనూనము=అధికము, శాఖానికరము=కొమ్మల సమూహముల, కొనలు=కొనలయందు.

తాత్పర్యము

అడవి నందంతయు నెందుచూచినను ముండ్లచెట్లునిండి యుండును, వీనిలోఁ జేరిన దర్భజెల్లు, వ్రేలాడుచున్న కొమ్మల కొనలు కదలుచుండును. మనము వానికిఁ దొలఁగిపోవుచున్నను గాలికిఁ గదలి మనకు బాధకలిగించును. కావున వనవాసము దుఃఖకరము.

కం॥ కాననవాసుల కెందును, నానాతను కష్టములు న•నంతవ్యథలున్
మానసభీతియుఁ గాయువు, గాన నరణ్యంబు దుః•ఖకరము లతాంగి! ౮౧౨

కానన వాసులకు = అరణ్యములందు వాసముచేయువారికి, నానాతను కష్టములు=అనేకవిధములైన దేహకష్టములు, అనంతవ్యథలున్=అంతములేని వెతలు, మానస భీతియు = మనస్సున భయము.

తాత్పర్యము

అడవులందు వసించువారికిఁ బలువిధములైన దేహకష్టములు, మితము లేని వెతలు, మనోబాధలు వదలకయుండును. కావున వనవాసము దుఃఖకరము.

కం॥ మానసముఁ గ్రోధలోభ, స్థానముఁ జలుపంగ రాదు•తప మును వగు, నె
ద్దానికి భయపడఁ జెల్లదు, కాన నరణ్యంబు దుః•ఖకరము లతాంగి! ౮౧౩

మానసము = మనస్సును, క్రోధలోభస్థానము=కోపమునకు, లోభమున కును స్థానము చేయరాదు.

తాత్పర్యము

మనస్సును గ్రోధమునకు లోభమునకు నునికిపట్టుగఁ జేయరాదు. తపము చేయుట తగును. దేనికిని భయపడరాదు. కావున వనవాసము దుఃఖకరము.

ఆ॥ వలవ దుడుగు మబల•వనవాసగమనంబు,
పడఁగఁ జాల వచటి•యిడుమ లెల్ల,
నింతపట్టు చూడ•నెన్ని యో దోషముల్, గాన వచ్చెఁ గాదె•కాన ననిన.

తాత్పర్యము ౮౧౪

కాఁబట్టి నీవు దుర్బల వగుటచే వనవాసదుఃఖము సహింపఁజాలవు గనుకఁ బ్రయాణము మానుకొనుము. ఇప్పుడు నేను జెప్పినవే చూచినను అడవియం దెన్నో దోషములు కానవచ్చెనుగదా. నేను జెప్పనివి యింకనెన్నియో యున్నవి. మీఁదఁ జెప్పినవన్నియు వానప్రస్థధర్మములు. కలియుగమున వానప్రస్థము నిషిద్ధము.

—• { ౨౯-వ సర్గము. సీత శ్రీరామునితోఁ దా నడవికి వచ్చుటకుఁ గారణములు చెప్పుట. } •—

ఉ॥ రాముఁడు దన్నుఁ దోడ్కొని యు•రణ్యతలంబున కేగ నిష్టమున్
లేమి నెఱింగి శోకమున•లేమ ప్రసక్తతరాశ్రుధార యై
యోమహనీయ తేజ ! భవ•దుక్తవనాంతరవాస దుఃఖముల్
నామదిఁ దోఁచె నమ్ముము గు•ణమ్ములె నీ దగు ప్రీతి పెంపునన్. ౮౧౫

ప్రసక్తత రాశ్రుధారయై = కొంచెముగాఁ గాఱుచున్న కన్నీటి ధారలు గలదై, భవదుక్తవనాంతర వాసదుఃఖముల్ = నీచేఁ జెప్పఁబడిన యడవిలో వాసముచేయుటయందుండు కష్టములు.

తాత్పర్యము

శ్రీరాముఁడు తన్ను నడవులకుఁ బిలుచుకొనిపోవుట కిష్టములేక యుద్ధములు చెప్పుచున్నాఁడని తలఁచి కొంచెముగాఁ గన్నీళ్ళు ధారగాఁ గాఱఁగా నూఱక యేడ్చిన మూర్ఖత్వ మనుపించుకొనునేకాని యుక్తియుక్తముగ నుండదని తలఁచి సమాధానము చెప్పుచున్నది. గొప్ప తేజస్సుగలవాఁడా వనవాసము నందలి దుఃఖములని నీవు చెప్పినవన్నియు నాకు గుణములుగాఁ గనఁబడు చున్నవి. కాని నీవు తలఁచినట్లు దోషములుగాఁ గానవచ్చుటలేదు. అది యేల యందువా నీ ప్రీత్యతిశయముచేత- నామీఁద నీకుఁ బ్రీతియుండెనా యవ న్నియు గుణములే. నీకుఁ బ్రీతిలేదాయెనా యిక్కడి సుఖములని నీవు చెప్పిన వన్నియు నాకుదుఃఖములే.

త్వయి ప్రసన్నే మమకిం గుణేన । త్వయ్యప్రసన్నే మమకిం గుణేన
రక్తే విరక్తేచ వధూవరాణాం । నిరర్థకః కుంకుమపత్రభంగః
అనునది యను సంధించునది.

కం॥ మృగశరభసింహవారణ,ఖగస్వమరము లెవ్వి దేని ♦ కానినిరూపున్
దగ నిమఁ గని మార్మొగ మై, బెగడునఁ బరువెత్తు; వెఱవ♦ వే భయ మైనన్. ౮౧౬

తాత్పర్యము

అడవి మృగములు భయంకరములని చెప్పితివి. నీవు చెప్పిన జింకలు శరభములు ఇవన్నియు నెప్పుడు తత్పూర్వము చూడని నీరూపుచూడఁగానే భయపడి ముఖము త్రిప్పుకొని పరువెత్తునుగాని మనమీఁది కెట్లు రాఁగలవు? భయకారణము కలిగినప్పుడు భయపడవాయేమి?

కం॥ గురుజనులయాజ్ఞ చొప్పున, గరుణాత్మక! వచ్చు దొండెఁ♦గానకు నీతోఁ
బొరి నెడఁబాసిన నిప్పుడ, మరణించుట యొండె నొండు♦మార్గము గలదే. ౮౧౭

తాత్పర్యము

ఈ మాటలతో నాకుఁ బనిలేదు, నాకు రెండే త్రోవలు. కరుణాశీలా! పెద్ద వారి యాజ్ఞచొప్పున నీతో నరణ్యమునకు వచ్చెదను. నావెంటరాఁగూడదు. అంటివా నీ యెదుటనే మరణించెదను, ఈ రెండు త్రోవలుగాక నాకు వేఱు త్రోవలేదు. ఈ రెంటిలో నేమి చేయుమనెదవో చెప్పుము.

కం॥ నీకడ నే నుండఁగ సు,శ్లోకా! కన్నెత్తి తేఱి ♦ చూడం గలఁడా
నాకేశుఁడైన నాదెస? నాకింతయుఁ దెలియదాయె♦నా జితవైరీ? ౮౧౮

తాత్పర్యము

సత్కీర్తిగలవాఁడా? పిల్లలను బూచి యని బెదిరించినట్లు మృగములు మృగములని నన్ను బెదరించెదవే- మృగములమాట యటుండనిమ్ము. నీయొద్ద నేనుండఁగా నింద్రుఁడైన నాప్రక్కకన్నెత్తిచూడఁగలఁడా- ఈమాత్రముకూడ

నాకుఁదెలియదని తలఁచితివా. ఏశత్రువైనను నీచే జితుఁడేకాని నిన్ను గెలుచువాఁడెవఁడు ?

కం॥ పతియెడఁ బాసినసాధ్వియు, క్షితి బ్రదుకం జాల దనుచుఁ•జెప్పరె మీరే
మతి నాకుఁ బార్వ? మిపు డా,హితగతికిని నన్యథాత్వ•మేగతిఁ గలిగెన్? ౮౧౯

తాత్పర్యము

నేను నీ వెంటవచ్చుట యధర్మకార్యమని నీనోరరాలేదు. నన్ను భయపఱచి నానోరనే నేను రానని యనిపింపఁ జూచెదవు.అది కానిపని. ఏలనఁ బతిని విడిచి యుండుపతివ్రత బ్రదుకఁ జాలదని మీరే చెప్పితిరి. నన్నుఁ బతివ్రతయంటిరి గదా. అటయిన నేను జీవించియుండరాదను తలంపుతో నన్ను విడిచిపోయెదవా? అటుగాకున్న నా హితమార్గమునకు నేఁడేల వైపరీత్యము వచ్చెను.

ఉ॥ ఇంతియకాక నే జనకు•నింట వసించినయప్డు ప్రాజ్ఞ సి
ద్ధాంతులు చెప్ప వింటి, గహ•నాంతరవాసము గల్గు నా కటం
చంతటిలక్షణజ్ఞులును•నాడిరి మున్న భవిష్యదర్థ, మ
ట్లంతయుఁ దప్పు నెట్లు? వృథ•లా మహనీయులయాడువాక్యముల్ ? ౮౨౦

తాత్పర్యము

నేను వనవాసము చేయవలసియున్నదని యిపుడు నీవు బెదరింపఁబనిలేదు. అది నా కిపుడె తెలియును. నేను దండ్రియింటనుండు కాలమున బుద్ధిమంతుఁడౌ కొందఱు సిద్ధాంతులు నా జాతకముఁజూచి నాకు వనవాసము గలదని చెప్పిరి. అట్టి జ్యోతిశ్శాస్త్ర లక్షణములు తెలిసినవారు ఈరాఁగలవిషయములు మున్నే చెప్పిరి. అదియంతయు నెట్లు దప్పును. పూజ్యులాడు వాక్యములు వ్యర్థములగునా ?

కం॥ సాముద్రికశాస్త్రజ్ఞులు, రామా! నే వనులఁ గ్రుమ్మ•రం జనుదు ననం
గా మది నువ్విళులూరుదు, నామెయి నే నెన్నఁడొక్కొ•యరుగుదు ననుచున్. ౮౨౧

తాత్పర్యము

జ్యోతిశ్శాస్త్రజ్ఞులు మాత్రమేకాదు సాముద్రిక శాస్త్రజ్ఞులును నాచేయి చూచి యీమె యడవులలో సంచరింపఁబోవును అని చెప్పఁగానే నెప్పుడడవికిఁ బోదునా యని విశేష మాశగలదాననై యుందును.

శా॥ వారల్ చెప్పిన యట్ల కల్గె గహనా•వాసంబు, నే బ్రాహ్మణా
జ్ఞారీతిం జరియించు టర్హమె కదా•సత్యంబుగా వారివ్యా
హారం బూనియు వెంట వచ్చెదను, లే•దన్యంబు కాలం బిదే,
ధీరా! యాదురు గాక విప్రులు యథా•ర్థీభూతసద్భాషణల్. ౮౨౨

తాత్పర్యము

వారు చెప్పినట్లే వనవాసము నాకు లభించెను. బ్రాహ్మణుల యాజ్ఞప్రకారము నేను వర్తించుట తగినదేకదా. నిజముగా వారి మాట యాధారము చేసికొని

నీవెంటవచ్చెదను. మఱియొక విధములేదు. దానికిదే కాలము, ధీరుఁడా! బ్రాహ్మణులు సత్యమాడినవా రగుదురుగాక.

కం॥ అకృతాత్ములై నవారికి, వికటంబులు గాక బహుళ•విపినశ్రమముల్
వికటంబులె మనబోంట్లకు, సుకరంబులు గాక నిజము•చూడుము వీరా!

తాత్పర్యము

అకృతాత్ములు=మనస్సు చక్కఁగా శిక్షింపఁబడనివారు, వికటంబులు = భయము కలిగించునవి, బహుళవిపినశ్రమముల్=అనేకములైన యడవియందలి కష్టములు, సుకరంబులు=సులభముగాఁ జేయఁదగినవి, వీరా=వీరుఁడా- నీవు వీరుఁడవయ్యు నిట్లేల పిఱికి పందవలె భయపడెదవు.

ఉ॥ పిన్నటనాఁట నే జనని•వీట వసింపఁగఁ గన్య నౌచు మున్
సన్నుతశీల యైనయొక•సంయమినీమణి భావిఁ బల్కె నీ
చిన్నది భర్తతోడఁ దమి•సీయు నరణ్యనివాసలీలకున్
బన్నుగఁ దోడికొం చరుగు•భర్తయు నంచని యోహృదీశ్వరా! ౮-౧౪

సంయమినీమణి=తపస్సుచేయు స్త్రీలలో శ్రేష్ఠురాలు, భావి=జరుగఁబోవునది, పిన్నటనాఁటన్=చిన్నవయస్సున, పిన్నటనాఁటనుండి నను(బెద్దగఁజూచిన వంశవృద్ధులను" జై. భా. ౧ అ అని ప్రయోగము.

తాత్పర్యము

చిన్ననాఁట నేను తల్లియింటఁ బెండ్లికాక కన్యగానే యున్నప్పుడు సదాచార సంపన్నయగు నొక తపస్విని భవిష్యత్తు నీప్రకారము చెప్పెను.ఈ చిన్నది భర్తతోడ నరణ్యమునకుఁ బోవ నాశపడును. ఈమెభర్తయుఁ దనతోడఁ గొనిపోవును. అని.

కం॥ ఇచ్చటనే యుత్సుకనై, సచ్చరితా! నిన్ను నెన్ని•సారులొ యెట్లి
ట్లిచ్చమెయి వేఁడ లేదే, మచ్చిక నీతోడ వనుల•మలయఁగ నాథా! ౮-౧౫

ఉత్సుకనై = ఆశగలదాననై.

వారు వీరు చెప్పినారన్నమాట పోనిమ్ము- నేనెంతోయాశపడి యడవులలో సంచారము చేయఁ బోదము రండని యెన్నిమారులో ప్రార్థింపలేదా.

కం॥ ఓడక యడవులకును నీ,తోడన చనుదెంచి శౌర్యధుర్యా! నీకున్
వీడక సేవలు సేయఁగ, వేడుక పడియెడి మనంబు•వినవే మనవిన్. ౮-౧౬

ఓడక=భయపడక, మృగములకు రాక్షసులకు వెఱవక, శౌర్యధుర్యా= ఇది విరాధఖరాది సంహారము సూచించును. దీనివలన నవతారకార్య నిర్వహణమందు సీత యుత్కంఠగలదని సూచితము.

తాత్పర్యము

అడవులకు నీతోడవచ్చిన నేదో ధనలాభమువచ్చునని నే నాశపడలేదు. నేను గోరెడు లాభము నీ సేవయే. అది యిచ్చటనున్నపుడు నీవు కార్యాంతరాసక్తుఁడవై యిందు నందుఁ బోవుచుండుటచేతను మంత్రులు మొదలగు పురుషులతో మాట్లాడుచుండుటచేతను- నే నొకమేడయందు నీవొక మేడయందుండుటచేతను- నిర్విఘ్నముగ నీ సేవసేయు నాకు లభించినదికాదు. వనములందున్నప్పు డిట్టి విఘ్నములులేవు. సర్వకాలముల సర్వవిధముల సేవచేయుచుండు పుణ్యము లభించును. నా మనవి నాలకించి యింతమాత్రము నా ప్రార్థన చెల్లింపరాదా (భక్తుఁడుకోరునది యిట్టి యేకాంతసేవయే.)

కం॥ శుద్ధచరిత్రా! కరుణా,బద్ధుని నిను భర్తఁగొలిచి॰పావని నగుదున్
సిద్ధము వేయేటికి నా,బుద్ధిని దైవంబు నాదు॰పురుషుఁడ చుమ్మీ. ౨౪
కరుణాబద్ధునిన్=దయచేఁ గట్టఁబడినవానిని, పావనిన్=పవిత్రురాలను.

శ్లో॥ పతిర్హి దేవో నారీణాం, పతిర్బంధుః పతిర్గతిః
పత్యాసమగతి ర్నాస్తి, దైవతంవా యథాపతిః.

స్త్రీలకుఁ బతియే దైవము. పతియే బంధువు- పతియే గతి- పతితో సమానమైన గతిగాని దైవముగాని లేఁడు.

వ్రతై ర్నోపవాసైశ్చ, ధర్మేణ వివిధేన చ,
నారీ స్వర్గమవాప్నోతి, ప్రాప్నోతి పతిపూజనాత్.

వ్రతములచే, నుపవాసములచే- నానాధర్మములచే స్త్రీలకు స్వర్గము కలుగదు, పతిపూజలవలననే యది కలుగును.

తాత్పర్యము

నిర్మలచరిత్రా! కరుణచేఁ గట్టఁబడిన నిన్ను భర్తనుగొలిచిన నేను బవిత్రురాలనగుదును. ఇది సత్యము. వేయుమాటలేలగాని నా యభిప్రాయమున దైవమనఁగా నా పురుషుఁడే. ఆయననువిడిచి నాకు వేఱొక దైవములేదు. కావునఁ బ్రతిదినము దైవపూజలేక నే నేదియైన నెట్లు భుజింతును? (కావుననే సీత లంకలో నుపవాసముండినది.)

కం॥ ఈలోకము మా టేటికి, నాలోకమునందు నైన॰ననఘాత్మక? నీ
తో లీలాగతి నుండుట, యే లాభము నెల్లశుభ మిఁ॰కేలా మాటల్. ౨౮

తాత్పర్యము

రామా! వేయుమాటలేల? ఒక్కటి చెప్పెద వినుము. ఈ లోకమందైనను- ఆ లోకమందైనను నీతో విలాసముగానుండుటయే నాకు సమస్తశుభములు.

కం॥ సతి జనకునిచే ధారా,యుతముగ నెవ్వనికి దత్త॰యోగ్యచరిత యా
సతి కాపతి పరమున నగు, శ్రుతు లిట్టని మొఱలు వెట్టు॰సుమతీ వినవే.

ధారాయుతముగన్=జలధారాపూర్వకముగఁజేయు వివాహమే ప్రశస్తమైనదని సూచితము.

పురుషునితోడి సాలోక్యము పతివ్రతయగు భార్యకే కాని తక్కినవారికెవ్వరికిలేదు. ఏల_ పురుషుని యాత్మయే భార్య. కావున నా యిరువుర యాత్మలు వేఱుపడవు. తాత్పర్యము

సుమతీ! తండ్రి తాతలు మొదలగువారిచే నీటిధారతోడ నెవతె యెవనికి దానముచేయఁబడినదో పరలోకమందుఁగూడ నా భార్య యా భర్తదే. ఇట్లని వేదములు మొఱలుపెట్టుచుండలేదా. ఇవన్నియు నీ వెఱుఁగనివి కావు. నీకుఁ దెలియనిది బోధింప నేను యత్నించుటయులేదు. నీ యిప్పటి చర్య శాస్త్రసమ్మతమైనది కాదు. నీయంతఃకరణ మంగీకరించినది కాదని తెలుపుచున్నాను.

శా॥ ఈలా గుండఁ బ్రమాణపద్ధతులు నీ యిల్లాలి, సద్వృత్త, స
చ్ఛీలాత్మం బతిదేవతన్, వినయసుశ్రీయుక్త, నీభక్తఁ, జిం
తాలోలన్, వరసౌఖ్యదుఃఖములఁ దుల్యన్, నాదు ప్రాణేశ! నీ
వేలా తోడ్కొనిపోవ వొల్లవు? హితం బే యిద్ది నీకోఁటికిన్? ౭౩౦

ఇల్లాలిన్=భార్యను, గృహిణిని_ నీ కింటిస్వరూపముగానుండుదానను. నగృహం గృహమిత్యాహుః, గృహిణీ గృహముచ్యతే. ఇల్లిల్లు గాదు. ఇల్లాలే ఇల్లు. నీ వెందున్నను నేనుగూడ నుంటినా నీ వింటియందుండినట్లు సుఖముగా నుండువాఁడ వగుదువు. సద్వృత్తన్=సాధువుల నడవడిగలదానను, నేను చెడు నడవడిగలదాననైన నయెడ నీవు నన్నుఁద్యజింప వచ్చునుగాని మంచినడవడి గల నన్ను నీవేమని విడనాడెదవు? సచ్ఛీలాత్మన్= మంచి స్వభావముగల మనస్సుగలదానిని, నా సద్వృత్తము కాలోచితముగ గ్రహించినదికాదు. స్వభావముచేతనే లభించినది. తక్కిన యన్నివిషయంబుల సరిగానుండి నిన్ను నుపేక్షించితినా? నాభర్తయే నాదైవము. నాకు వేఱొండు దైవముతోఁబనిలేదు అని యున్నదాననే. వినయ సుశ్రీయుక్తన్=అణఁకువయనెడు మంచి సంపదతోఁ గూడినదానను_ నేనెన్నఁడు నీ కవిధేయురాలనై వర్తింపలేదు. ఇఁక వర్తింపుటయు లేదు. వినయమే నాకు శ్రీ. అది లేకపోయిన నేను నిర్భాగ్యురాలనే, నీభక్త=నీయందు భక్తిగలదానను_ ప్రేమతో నీ సేవను నీవలని ఫలము లేనియుఁ గోరకచేయుదానను_నాది నిష్కామప్రేమ. చింతాలోలన్=దీనురాలిని, వరసౌఖ్యదుఃఖములఁ దుల్యన్=మంచిసుఖమందుఁగాని చెడ్డ దుఃఖమందుఁగాని నీకు సమానురాలను నీ దుఃఖమే నాకు దుఃఖము, నీ సుఖమే నాకు సుఖము. నాకు వేఱుగ సుఖములేదు_ దుఃఖకరములేదు. నాదు ప్రాణేశ్వరుఁడవు = నా ప్రాణములు నీ స్వాధీనములు కావున నీవు నన్ను విడుచుట నా ప్రాణములతో నీకుఁ బనిలేదనియే కదా యర్థము.

తాత్పర్యము

ప్రబలమైన వేదప్రమాణ మిట్లుండఁగా నీ గృహిణిని మంచి నడవడిగల దానను- స్వభావముగనే సదాచారసంపన్నను- భర్తదప్ప వేఱొకదైవము నెఱుఁగనిదానను, వినయసంపద గలదానను, నీ భక్తురాలను- నిన్ను విడువలేక దీనురాలనై యున్నదానను. సుఖదుఃఖములయందు నీతో సమానురాలను. ఇట్టి నన్ను నా ప్రాణేశ్వరుఁడవై యేల తోడుకొనిపోవ నిష్టపడవు? నీవంటివాని కిది తగినకార్యమా?

తే॥ రామ నన్నిందు దుఃఖవా॰రాశిఁ ద్రోచి, కానలకు నీవ పోవంగఁ॰గడఁగెదేని
యగ్నిచేనైన విషముల॰నైన నీళ్ళ,నైన మేను త్యజింతు స॰త్యంబు సుమ్ము.

తాత్పర్యము ౭౩౧

రామా! నన్నిచ్చట దుఃఖసముద్రములోఁ బడవైచి నీవు కానలకుఁబోవ యత్నించితివా నేనగ్నిలోనైన దుముకుదును. విషములనైనఁ దిందును. నీళ్ళలోనైనఁ బడుదును. నీకుఁ బనికిరాకవిడిచిన యీ దేహము ప్రాణము నాకుమాత్ర మేల? నేనును వదలెదను.

ఇట్టి బలాత్కారమరణము పాపముగాదా ? ఇట్టివారు సూర్యకాంతి లేని యంధతామిస్ర నరకమునఁ గూలుదురని శ్రుతి కలదుగదా యందువేమో. ఇది పతివ్రతల విషయముగాదు. పతివ్రతల దేహము పతిసేవనిమిత్తమే కాని స్వప్రయోజనార్థముకాదు. భర్తృఁడు పతివ్రత సమానధర్ములు. ఇతరుల సేవకు దానిని వినియోగింపరాదు. సతికి భర్తసేవ కుపయోగపడని దేహముండియు ప్రయోజనము లేదు. కావున నట్టి దేహము వదలవలయును. ఇది పతిభక్తిచేతనేకాని కామక్రోధములచేఁ గాదు. మఱుజన్మంబుననైన భర్త కుపయోగపడఁగల దేహము కలుగునుగాక యన భావన. కావుననే సీతాదేవి లంకలోఁ దను రామచంద్రమూర్తి స్వీకరింప నిరాకరించినపుడు-

కం॥ నుతగుణతతులన్ మెచ్చని,పతిచేఁ బేరోలగమునఁ బరిహృతయగునా
సతికిన్ యోగ్యంబగునా, గతిఁజేరెద వహ్నిఁజొచ్చి కాకుత్స్థవరా.

యుద్ధ. ౨౬౭౩

అని చెప్పెను.

పతిమరణానంతరము సతులుచేయు సహగమనము బలాత్కారమరణముగాఁజాలదు. దానికి భక్తి కారణము. మగఁడు దుఃఖించిన దుఃఖించునది, యతఁడు సంతోషించిన సంతోషించునది మరణించిన మరణించునది పతివ్రత యనఁబడును.

భర్తరి ప్రేతే బ్రహ్మచర్యం తదన్వారోహణం వేతి॥ విష్ణు.

మగఁడు మరణించెనా బ్రహ్మచారిణిగానైన నుండవలె సహగమనమైనఁ జేయవలెను.

పతివియోగమును బతివ్రత సహింపదు. ఇది ప్రోషితభర్తృక విషయము గాదు. భగవత్ప్రీతికై భక్తుఁడు ప్రాణమువిడుచుట యెట్టిదో భర్తనిమిత్తమై స్త్రీ ప్రాణమువిడుచుట యట్టిది. భరతుఁడు శ్రీరామచంద్రమూర్తి పదునాలుగవ సంవత్సరము మొదటిదినము మరలి రాకుండిన నగ్నిప్రవేశము చేసియుండును గదా. ఇచ్చట భక్తి ప్రధానము కావున దోషములేదు.

కం॥ ఇంతయుఁ దాఁ జెప్పినఁ దన, కాంతారనివాస మతఁడు॰కాదన సీతా
కాంత కనునీటఁ దోఁగిన, సంతాపముఁ బాపె రామచంద్రుఁడు కూర్మిన్. ౮౩౨

తోఁగినన్ = స్నానముచేయఁగా.

తా త్ప ర్య ము.

ఇన్నివిషయములు దాఁజెప్పినను తన వనవాసమునకు శ్రీరాముఁ డంగీకరింపకుండుటచే సీతాదేవి కన్నీటివఱదచే స్నానముచేయఁగా రామచంద్రుఁడు కూర్మిచే నామె సంతాపము నణఁచెను.

—॰ ౩౦-వ సర్గము. సీత శ్రీరాము నిష్ఠురంబు లాడుట. ॰—

ఉ॥ ఊఱడఁ దన్నుఁ బల్కుపురు॰షోత్తముఁ గన్గొని వెండి సీత దాఁ
గాఱడవిం జరించుమతి॰గల్గుట యిట్లను నిండునెయ్యపుం
గోఱడముల్ మనంబు వెఱఁ॰గొట్టుకొనం బరికంపమానయై
మీఱినకింకఁచే బతి న॰మేయపరాక్రము నట్టి చూచుచున్. ౮౩౩

ఊఱడన్ = సమాధానపడునట్లు, నిండునెయ్యపుం గోఱడముల్ = పూర్ణస్నేహముచేనైన పరుషవాక్యములు, పరికంపమానయై=వణఁకుచున్నదై, కింకచేన్=కోపముచేత, అమేయపరాక్రమున్=కొలఁత చెప్పరాని పరాక్రమముగలవానిని-ఇట్టి శక్తిగలవాఁడయ్యుఁ బిలుచుకొనిపోఁడే యని కోపము. ఇది ప్రణయకోపమే కాని కైక కోపమువంటిదికాదు. ప్రణయకోపము పానకములో మిరియపుఁ బొడివంటిది.

తా త్ప ర్య ము

కార్యభాగము సున్నచేసి శుష్కోపచారములు చెప్పుచున్న పురుషశ్రేష్ఠుఁడగు శ్రీరామునిఁజూచి తాను వనములయందు సంచారముచేయవలెనను మనస్సు గలదగుటచే మెత్తనిమాటలఁ గార్యముకాదని స్నేహభావముచేతనే పరుషవాక్యములను, దన్నువిడిచిపోవునేమో యనుభయముచే గుండెలు తటతట కొట్టుకొనఁగా గడగడ వణఁకుచు మిక్కిలి కోపంబునఁ దనభర్త నమితపరాక్రమవంతుని జెప్పవాల్పక చూచుచు నిట్లనియెను.

తే॥ నాదుజనకుండు మిథిలాధి॰నాథుఁ డిప్పు
డిది వినంగనై దేహుఁ డే॰మెంచు నిన్ను
రామ! జామాత పురుషవి॰గ్రహముఁ గొన్న
స్త్రీ యటంచును దలఁపఁడే॰చిత్తమునను. ౮౩౪

రామా! ఇప్పు డిటులు నీవు నన్నడవికిఁ దోడుకొనిపోక యింటనే విడిచి పోయిన వార్త విదేహనగరరాజు మిథిలదేశాధిపతియగు నాతండ్రి వినెనా నిన్ను నేమని తలంచును. తన యల్లుఁడు స్త్రీ. ఎవతెయో మగవేషము వేసికొనివచ్చి తన పుత్రికను బెండ్లాడికొనిపోయెనని తలఁపఁడా? అవశ్యకము తలఁచును. రామ =చూపుగుజ్జమువలె నందముచే నందఱను భ్రమింపఁజేయువాఁడా! నీ యంత స్సారమెఱుఁగక నీసౌందర్యముచూచి యందఱు మోసపోవుచున్నారు.

నాదు=నాయొక్క, నేను నీవలె స్త్రీగర్భమునఁబుట్టినదాననుగాను అయో నిజను- అట్టి నాయొక్క జనకుండు=తండ్రి- పెంపుడుతండ్రియయినను గన్న తండ్రికంటె శ్రేష్ఠుఁడు, భూమిలో దొరికిన పిల్లను రక్షించు భారము తనయందు లేకున్నను గన్నతండ్రివలె రక్షించెను. నీవు అగ్నిసాక్షిగాఁ బెద్దల యెదుట ధర్మేచ అర్థేచ కామేచ నాతిచరామి యని ప్రమాణముచేసి కట్టుకొన్న భార్యను, భర్తయగు నీవు, శాస్త్ర దృష్టిని లోకదృష్టిని భరింపవలసిన నీవు, విడిచిపోయెద ననుచున్నావు. నీవంటివాఁడుకాఁడు నా తండ్రి.

నాతండ్రి జనకుఁడు=తండ్రివలె నందఱఁ బోషించును గావునఁ దన నగరవాసులచేతనేకాక జానపదులచేతను జనకుఁడు జనకుఁడని సార్థక బిరుదము నొందినవాఁడు నీవలె నేతిబీరకాయ యన్నట్లు రాముఁడని పేరుపెట్టుకొని కట్టు కొన్న భార్యనే దుఃఖింపఁజేయువాఁడుకాఁడు.

జనకుఁడు=కర్మణైవహిసంసిద్ధి మాస్థితా జనకాదయ యన్నట్లు వైదిక కర్మనిష్ఠుఁడగుటచే భార్యాసహితుఁడై కర్మములన్నియుఁ జేయువాఁడు. నీవు కర్మహీనుఁడవు. వైదికకర్మయందు నీకు శ్రద్ధలేదు. చేయునిచ్ఛయులేదు. కనుక నీకు భార్యతోఁబనిలేదు. మిథిలాధినాథుఁడు=మిథిలానగరాధిపతి- నీవొక్క యాఁడుపిల్లను భరింపలేక యున్నావు. నాతండ్రి మిథిలానగరము పల్లెటూళ్ళ తోడ భరించుచున్నాఁడు. వైదేహుఁడు=విదేహుని వంశమునఁ బుట్టినవాఁడు. నీవో సదేహు వంశమునఁ బుట్టినవాఁడవు. కావుననే యాయనయందు జ్ఞానము నీయందుఁ బామరత్వము నెలకొనియున్నది.

ఇప్పుడు = ఈసమయమున, ఇది = నీవు నన్నునింట విడిచిపోవుటను, వినంగ = వినఁగానే, నిన్ను = ఒక్కభార్యను జిన్నపిల్లను భరింపలేని నిన్ను- ఆకార పుష్టిగల నిన్ను.

ఏ మెంచున్=ఏమని తలఁచును. నిన్నెవరిలోఁజేరిన వానిఁగా గణించునో నీకుఁ దెలియునా.

రామ=ఓ అఁడుదానా! అఁడుదియని యెంచును. స్త్రీలను లెక్కించు నపు నిన్ను వారిలో గణించును. అట్లైన రాముఁడని నన్నుఁబుంలింగ శబ్దవా

చ్యునిఁగాఁ జెప్పుచున్నారుగదా యందువేమో. దానికేమి వనమొక్కఁడు పులి యొక్కఁడు బనవఁడని చెప్పుటలేదా. అట్టులే నిన్ను.

జామాత = తన యల్లుఁడు.

పురుషవిగ్రహము గొన్నస్త్రీ = మగవేషము వేసికొనినస్త్రీ- వాస్తవ పురుషత్వము లేదని భావము.

చిత్తమునఁ దలఁపఁడే=ఒకస్త్రీ నాటకములందువలెఁ బురుషవేషము వేసికొని నాపుత్రిని వివాహమాడెనని చెప్పిన సిగ్గులచేతని మనస్సులోనే యెంచుకొనును. ఒకరిదోషము లెంచువాఁడుగాఁడు గనుక మనస్సులోనే యనుకొనును.

ఒక వ్యాఖ్యాత దీని మూలశ్లోకమునకు మఱియొకటి రెండర్థములు వ్రాసెను. గాని యవి ప్రకరణానుసారములుగావు గనుక వదలి పెట్టఁబడెను.

తే॥ అధిప! ఖరకరుఁ డగునర్కు•నందుఁబోలెఁ,
　　　　　　　　బరమతేజంబు శ్రీరామ•భద్రునందు
　లేద యని పల్క జ్ఞానంబు•లేని లోక,
　　　　　　　　మన్నృత మది యెట్లుసైరింతు•నక్కటకట. ౭౩॥

ఖరకరుఁడు=తీక్ష్ణకిరణములుగలవాఁడు, అర్కునందుఁబోలెన్=సూర్యుని యందువలెనే, పరమతేజంబు = i మిక్కిలికాంతి, ii మిక్కిలిపరాక్రమము, అన్నృతము=అదియసత్యము, సైరింతున్=ఓర్చుకొందును.

## తాత్పర్యము

(1) తీక్ష్ణ కిరణుఁడైన సూర్యునియందువలెఁ బరమతేజంబు శ్రీరామచంద్రునందు లేదు అని జ్ఞానములేని లోకులుపల్కఁగా నట్టి యన్నృతము నేనెట్లు విని యథ్యోర్వ సైరింతును. ఇచ్చట సూర్యుఁడు వ్యతిరేక దృష్టాంతము.

(2) తీక్ష్ణ కిరణుఁడైన సూర్యుని యందువలెఁ బరమతేజము శ్రీరామచంద్రునందులేదా? అనఁగాఁగలదు అని లోకు లసత్యమాడ విని యయోధ్యా! యెట్లుసైరింతును.

లేద - ఇచట కాకువు.

(3) తెలివిలేని లోకము పరమతేజంబు శ్రీ రామభద్రునందుఁ బోలె ఖరకరుఁడగు నర్కునందులేదు. అని యసత్యము పలుకఁగా వినియును అయోధ్యా యెట్లు సైరింతును.

వాక్యంబునఁ బూర్వపరనియమంబు కొన్ని శబ్దంబులకుఁ దక్కఁగాన రాదు. సు.వ్యా. కారకసూ. ౨౩ అను సూత్రము శరణము.

ఇంతమాట శ్రీరామునందుఁ దానై చెప్పినట్లు చెప్పనొల్లక పాపము నివారింపఁ దానన్నమాట లోకులన్నట్లు సీతాదేవి చెప్పెను.

ఉ॥ ఏమిటికై విషాదము వహించితి వీగతి ? భీతికారణం
బేమి ఘటిల్లె నీకు? ననునేటి కనన్య పరాయణన్ సతిన్
బ్రేమ దొలంగి పాయ మదిఁ బెట్టితి? వొక్కని నిన్నుఁ దక్క నే
నామనమందు నేనియుఁ గనం గులపాంసనివోలె నన్యునిన్. ౭౩౬

తాత్పర్యము

'ప్రళయాగ్నిసముఁడు కోపంబు గదుర' నని పేరొందిన నీవు నన్నుఁ బిలుచుకొని పోవలయుననిన నేమోచేయరాని దుష్కార్యము చేయవలసినట్టు లేద్చెదవేల? నేను భార్యను భర్తవ్యను. నీవు భర్తవు కావునఁ జేయవలసిన కార్యము చేయుటకు నింతదుఃఖమా "వృద్ధౌ చమాతాపితరౌ, సాధ్వీభార్యాస్సుత శ్శిశుః । అప్యకార్య శతం కృత్వా, భర్తవ్యా మనురబ్రవీ"త్తని మనువు చెప్ప లేదా. అటని నిన్ను నే నేమైనం జేయరానిపని చేయుమంటినా? "భర్తవ్యారక్ష ణీయాచ పత్నీహి పతినాసదా" భార. ౩. ౬౯. ౪౧. భర్త భార్యను భరింప వలెను. నీవేమి కారణముచే భయపడుచున్నావు (రావణుఁడు నన్నెత్తుకొని పోవు నని నీకు భయమా) నీవు తప్ప వేఱుగతిలేనిదానను. పతివ్రతను గావున వానికి వశపడనని నీ వెఱుఁగవా) నిన్నొక్కనిఁదక్కఱంకుటాలివలె నే నితరుని మనసు నందైనఁ దలంపను- నమ్ముము- (రావణువలన నేను జెడుదు నను భయము నీ కక్కఱలేదు.) ఇది వ్యతిరేక దృష్టాంతము.

కం॥ నీవశవర్తిని నగుట, న్నోవరసుతశీల! మది సమూహింపుము మున్
సావిత్రి సత్యవంతున, కేవిధ మావిధ మటంచుఁ బృథ్వీశసుతా! ౭౩౭

వశవర్తిని = నీకు స్వాధీనురాలనై వర్తించుదానను.

తాత్పర్యము

నీకు స్వాధీనపడి నీకు మేలగుమార్గమున నడచు నన్ను సత్యవంతునకు సావిత్రి యెట్టిదో నీకు నేనట్టులని యూహింపుము. సత్యవంతునివెంట సావిత్రి యరణ్యమునకుఁ బోవుట యామె సుఖసంతోషములకై కాదు. ఆయనను రక్షించుటకే. అట్టులే నేను నీతోడ నరణ్యమునకు వచ్చుట నీ నిమిత్తమై నీక్షేమమునకై నీ సౌఖ్యమునకై నీ కార్యమందుఁ దోడుపడుటకై. నేను లేక నీవు మాత్రము పోయి చేయు కార్యమేదియని భావము. రావణు నెట్లు నేను లేక చంపఁగలవు సావిత్రిదేవి మరణించినపతిని యమునితోఁ గలహించి మరల బ్రతికించుకొనెను.

శ్లో॥ నచభార్యాసమంకించి, న్నరస్యార్తస్య భేషజమ్ నిత్యంహి సర్వదుఃఖేషు, సత్యమేతద్బ్రవీమితే, నాస్తి భార్యాసమం మిత్రంనరస్యార్తస్య భేషజమ్॥ భార-వనవ. (సర్వదుఃఖమందు సర్వదా) ఆర్తుఁడగు వానికి భార్యతో సమాన మగు నౌషధము లేదు. నేను సత్యము చెప్పుచున్నాను. ఆర్తునకు భార్యవంటి మిత్రముగాని మందుగానిలేదు.

కం॥ నీయిల్లాలను గోమరుం, బ్రాయపుసుందరిని సతిని • మఱి నధ్యుషితన్
జాయాజీవుని పోలికి, మాయురె యన్యుల కొసంగ • మదిఁ దలఁచెదవే?

తాత్పర్యము ౭౩౭

నీగృహిణిని. కనుకనే నన్ను విడిచి నీధర్మముచేయఁబోరాదు. అందు లేఁత వయస్సుగలిగి యౌవనారంభ దశయందున్న సందరకత్తెను, ముట్లుడిగిన ముసలి దానను గాను కురూపినిగాను, (ఇప్పటికి సీతకు ౧ల సంవత్సరములు.) అంతియు కాక పతివ్రతను. నాతండ్రి నన్ను నీకు దానము చేయునపుడు సహధర్మచరి యని చెప్పలేదా? నీతోడ నేను ధర్మము చేయవలసిన దాననే కదా? నీతండ్రి నీకెట్లో నాతండ్రి నాకట్లేగదా. నీవు పితృవాక్య పరిపాలనము చేయఁబూనినట్లు నేను తండ్రి సత్యమును గాపాడుదాననేకదా ? నా స్వధర్మమునకు నీవేల యడ్డము వచ్చెదవు, రాజులు తాము స్వధర్మమందు నిలుచుటయేకాక తక్కిన వారు వారివారి స్వధర్మమందుఁ బ్రవర్తింపఁజేయవలసినదివిధి. బోయవాఁడు కూడఁ దన స్వధర్మమందుఁ దానుండకుండిన నాతండ్రి దండించునని భయ పడుచుండును. నీవో నీకంటియెదురనుండు నన్నే నాస్వధర్మమైన పాతి వ్రత్యమునందు నుండనీయకున్నావు. అధ్యుషితన్=చిరకాలముగ నీయొద్దనే యున్నదానను. కావున నన్ను విడిచిన నాశ్రితత్యాగదోషము వచ్చును. ఇట్టి నన్ను భార్యలను బరుల కప్పగింపఁజూచు నట్టువవానివలె నౌరా! పరుల కప్ప గింపఁ జూచెదవా.

కం॥ ఏరికి హితముం జలుపఁగ, వారించెదు నన్ను నట్టి • వారికి నీవే
కూరిమి వశ్యుఁడ వగుచున్, దీరత! చరియింపుమీ వి • ధేయుఁడ వగుచున్.

ఓయి! బుద్ధిమంతుఁడా! నీవెవరికి హితముచేయఁగోరి నన్ను నివారించు చున్నవాఁడవో యట్టివారికి నీవే వశపడి దాసుఁడవై ప్రేమతో వర్తింపుము. నేను నీకు దాసురాలినేగాని యితరులెవ్వరికినిగాను. కావున నీకు సమ్మతమేని విధే యుఁడవై యితరుల దాస్యము నీవుచేయుము నీదాస్యము నేను జేసెదను.

నీవెవరి హితముఁగోరి నన్ను వారించుచున్నాఁడవు నాహితముఁగోరియే కదా. అట్లైనఁ బ్రేమతో నాకు విధేయుఁడవై నేను జెప్పినట్లు చేయుము. నాకేది మేలు అది నాకుఁ దెలియునుగాని నీకేమి తెలియును. కావున నామేలు కోరిన వాఁడవైతివా నేను జెప్పినట్లు వినుము.

'భరతుని మ్రోల నవ్వొగడి పల్కకు మెన్నఁడు'నని నీవు భరతుని మేలు గోరిగదా నన్ను వారించుచున్నావు. అట్టి భరతునకు నీవు దాసుఁడవై వర్తింపుము. వానితో నాకేమిపని. నీప్రధానులు నీమంత్రులు లోనగువారు నీకు దాసులు. వారి భార్యలుకూడ నీకు దాసురాండ్రా!

మ॥ నను వెంటం గొనిపోక పోఁదగదు కాం • తారాళికిన్ నీవు కా
నన మైనం, దప మైన, స్వర్గ మయినన్ • నా కెప్డు నీతోడిదే
యనఘా! లోకము, బాట నే నలయఁ జుమ్మా, నిన్ను వెన్నంటి వ
త్తును, నుద్యానవిహారమందువలెఁ గూ • ర్తుం బ్రీతి నత్యంతమున్. ౮౪౦

తాత్పర్యము

ఈ కారణములచే నడవులకు నన్ను విడిచి నీవు పోవుట మర్యాదగాదు. నీవడవులయందుండినను దపస్సుచేసినను స్వర్గలోకమందుండినను నాకు నదే లోకము. భార్యకుఁ బతిసాలోక్యమనుట యెఱుఁగవా. నీ వొకచోనుండిన నేను వేఱొకచోట నెట్లుండఁగలను? త్రోవనడచుటయందు నేను బడలను జుమ్మీ (నీ సాలోక్యము సాధించు మార్గమందు నే నలయను. శ్రమ మనక జేయవలసిన వన్నియుఁ జేసెదను.) నీ వెన్నువెంట=నీ వెన్నునీతోడ నెట్లువచ్చునో యట్టులే నేను వచ్చెదను. ఉద్యాన వన విహారమందువలె నే నెంతో సంతోషపడుదును. (ఉద్యాన విహారము దేవతా విమానములందు సంచరించినట్లు మిక్కిలి సంతోషపడుదును.) భర్తవ్యా, రక్షణీయాచ పత్నీహి పతినా సదా. భార. ౩-౬౯-౪౧. భార్యను భర్త యెల్లకాలము భరింపవలెను, రక్షింపవలెను.

భార్యాహి పరమోహ్యర్థః పురుషస్యేహ పఠ్యతే! అసహాయస్య లోకేస్మిన్ లోకయాత్రాసహాయినీ॥ పురుషునకు భార్యయే పరమప్రయోజనము అసహాయుఁడగు వానికి నీ లోకయాత్రయందు సహాయురాలు భార్యయే.

కం॥ నీ వెంట నేను జనునో, వావిరి కుశకాశములును • బల్లెరుగాయల్
భావింతు జింకచర్మము, లై వడిఁ దూలికలఁబోల్కిఁ • గష్టం బేదీ? ౮౪౧

తాత్పర్యము

నీవు మార్గమందు దర్భలు రెల్లు పల్లెరుగాయ లుండుననిచెప్పితివి. అవి యన్నియు నేను జింకచర్మములని దూదేకులని తలఁచెదను. అవల నేదీకష్టము? సుఖదుఃఖములు మనోగతములుగాని వస్తుగతములు గావు. కావునఁ బూర్ణానందమనుభవించు నన్ను నవి బాధింపఁజాలవు. కష్టములేక యేకార్యము సాధ్యము ? అట్లని యెవరే కార్యము చాలించినారు? నీకుఁ బల్లేరుగాయలుగానుండునవి నాకు దూదేకులు.

పల్లెరుగాయల్-ఆరాటాదులం బ్రథమేతర దీర్ఘంబునకు హ్రస్వంబు విభాషనగు పల్లేరు - పల్లెరు - నేరేడు - నేరెడు లోనైనవి. సు. వ్యా. సూ. ప్రకీ.

కం॥ కందుగఁ గాంతారంబుల, యందలిసుడిగాలి ధూళి • యులమిన యేనిన్
డెందంబున వల్లభః నును,గందంపుంబొళ్ళభంగి • గ్రహియింతుఁ జుమీ.

తాత్పర్యము ౮౪౨

అడవియందు హోరని గాలిగొట్టుచుండు నంటివి. అడవియందలి సుడి
గాలి ... రే ... మన్ను దట్టముగ నాదేహమునందుఁ గ్రమ్ముకొనెనేని ... నా

మనస్సులో నే నదియే గంధపుఁబొడ పూసికొన్నట్లు తలఁతును. నీకది సుడిగాలి దుమ్మగునుగాక. నాకది గంధపుఁబొడి పల్లేరుగాయలు సుడిగాలిధూళి యను భావముగల నీవే కష్టమని తెలిసి సహింతమని సంచరింపఁ బోవుచున్నావే. ఇఁక నవి దూదేకులుగాను గంధపుఁ బొడిగాను భావించు నేను సంచరింతు ననుట వింతయా.

కం॥ లేఁబచ్చికపట్టుల నీఁతోఁ బవళింపంగ సుఖము•దొరకొన నేలా
లోఁ బుట్టుఁ గంబళంబుల,పైఁ బండఁగ నాశ? యెక్కు•వలె తత్సుఖముల్?

లేఁబచ్చికపట్టులన్=లేఁత పచ్చికయుండు స్థలములందు, దొరకొనన్ = లభింపఁగా, లోన్ = మనస్సులో, పండఁగన్=పండుకొనన్.

తాత్పర్యము

లే నునుఁ బచ్చిక పట్టులందు నీతోడఁ బండుకొను సుఖము లభించెనేని రత్నకంబళములమీఁదఁ బండుకొను నాశయేల కలుగును. నునుఁ బచ్చికకంటెఁ గంబళి నునుపుగా మెత్తగా నుండునా చల్లగానుండునా.

ఉ॥ ఆకులొ యలములొ పండులొ? నాకుం గొంచెంబొ గొప్పొ•నయముగ నీవే
చేకూర్చి చేతులారఁగఁ, బ్రాకటముగ నిడిన నమృత•పానము సమమౌ. ౧౪౪

తాత్పర్యము

చెట్లయందలి యాకులు పండ్లుగోయరాదని యంటివి సంతోషమే.వానితో నాకేమిపని? ఆకులో యలములో పండ్లోకాయలో కొంచెమో గొప్పో నీవు సంపాదించి సీతా యిది తినుమని ప్రీతితో నాచేతిలోఁబెట్టినఁ దిందును. పెట్టకున్న నూరకుందును. నీవేది పెట్టెదవో నాకదియే యమృతము, ఆహారపదార్థములు సేకరించుట నాపనిగాదు. నీవు తెచ్చిన దానిని భుజింపయోగ్యముగునట్లమర్చుట నాకార్యము. నీవు తినఁగా మిగిలినది నాకమృతము.

చం॥ తలఁపను దల్లినిం, దలఁపఁ • దండ్రి, స్మరింపను దోడఁబుట్టులన్
దలఁపను నిల్లు వాకిలి, యథామతి నీవయి నాదుచేతిలో
వలఁ దమి నుంచు కాయలనొ•పండునొ మెక్కెద, నొక్కకష్టమేన్
గలుగఁగ నీను నీకు, నొక•కాఁతియు గల్గదు నమ్ము రాఘవా. ౧౪౫

తాత్పర్యము

అక్కడనొంటిగానుండవలె నంటివి. నేనుగోరునది యదియే. నేను తల్లిని గాని తండ్రినిగాని తోడఁ బుట్టినవారినిగాని చూడను గోరను. వారిని స్మరింపనైన స్మరింపను? ఇల్లేమయి పోయెనో వాకిలేమయిపోయెనో యని తలఁపను. నీకు సమ్మతమైన ప్రకారము నాచేతిలో నీవై ప్రేమతోఁ గాయలే యుంచెదవో యొక్కపండే యుంచెదవో దానినే నేను దినెదను నీకుభుజింపయోగ్యమైనది నాకుఁగాదా. నేనేవిషయమందును దెలిసి నీకుఁ గష్టముగలుగనీయను. తెలియకయైన నీకు నొకబాధ నావలనఁగలుగదు. నమ్ముము.

కం॥ నీతోడ నున్న స్వర్గము, నీతోడు రహింపకున్న • నిరయం బదియే,
నాతలఁ పిది మది నెఱుఁగుమ, యేతెంచెద మాన్పకుండు•మీప్రాణేశా!

తా త్ప ర్య ము ౭౪౬

నీతోడ నెందుండునో యదియే నాకు వైకుంఠము. నీతోడులేక యుండ వలసివచ్చినా యదియే నాకు నరకము. ఇది నానిశ్చయము. తెలిసికొనుము. కావున నిటనుండి నరకబాధపడలేక నీతోవచ్చి సుఖింపఁగోరెదను. ప్రాణేశ్వరా యడ్డగింపకుము.

కం॥ తగునని తోడ్కొని పోవక, వగఁ గుందఁగ నన్ను నిచటఁ•బాసెద వేనిన్
డెగి విషముఁ గ్రోలుదానను, బగతురచేఁ జిక్కి కష్ట•పడ నోపుదునే?

తా త్ప ర్య ము ౭౪౭

ఇది తగిన కార్యమే. దీనిని విలుచుకొని పోదమని తలఁచి తోడుకొని పోవక నీవిందే యేడుచుచుండుమని వదలి పోయితివా నేను తెగఁబడి విషము ద్రావెదనుగాని విరోధులచేతిలోఁజిక్కి నేను గష్టపడఁగలనా ?

ఉ॥ ఒంటిమి నన్ను వీడి చన•నోర్చెద వేని వియోగబాధ నీ
వెంటనె వచ్చుఁ బ్రాణములు•విన్ము పరోక్షపుఁజావుకంటె నీ
కంటికిముంద నీచరణ•కంజములం బడి చచ్చు టుత్తమం
బొంటరమింటరంబు లను•నొవ్వనివారలఁ గొల్చుచుందునే? ౭౪౮

ఒంటిమి = ఒంటిరిగా- ఇంటనిండ నూరినిండ మనుష్యు లుండినను నాపాలికిది నిర్మానుష్యమే.

తా త్ప ర్య ము

అటుగాక నన్నువదలి నీవొంటరిగాఁబోవ సహించెదవేని నన్ను విడిచి నీవు బ్రదుకఁ గలవు. గాని నిన్నువిడిచి నేను బ్రతుకలేను. చేఁపను విడిచి నీళ్ళుండఁగలదు. నీళ్ళను విడిచి చేఁపయుండలేదు కాఁబట్టి నాదేహమిందున్నను వియోగబాధచేఁ బ్రాణములు నీతోడఁ దమంతటఁ తామే వచ్చును. కావున నీవెదుట లేనపుడు చచ్చుటకంటె నీపాదకమలములమీఁదఁబడి నీకంటికెదుర మర ణించుటే యుత్తమము. కాని పరుషవాక్యములు పలుకు పగవారిని నేను సేవించు చుందునా. ఇక్కడఁ బగవారెవ్వరందువా. నీవియోగమే నాకు శత్రువు.

చం॥ పదియును మూఁడు నొండు నఁట•వర్షము లొక్కట దుఃఖవార్ధిలో
గొదకొని యుండ నేర్తునె? యు•కుంఠితరీతిని నొక్క మూర్తమేన్
మది ధృతి నిల్పఁ జాలఁ గను•మాటయినన్ విను నాథ! నీవటం
చదవద రాముఁ గట్టుకొని•హా యనుచుం బలవించె నార్తయై. ౭౪౯

గొదగొని=అతిశయించి, అదవదన్=దుఃఖముతో, పలవించెన్=గొంతెత్తి యేడ్చెను.